గురువారం 23-11-2023


'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 242


SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

✻ సందర్భం

గతంలో ఎం.ఎల్.ఏ అయిన ఒక పెద్ద హీరో స్త్రీల గురించి
అసభ్యంగా మాట్లాడి అసెంబ్లీలో సంజాయిషీ ఇచ్చాడు.
డెబ్బయి ఏళ్లు దాటిన ఒక సీనియర్ నటుడు
నోరు పారేసుకుని పరువు పోగొట్టుకున్నాడు.
పార్లమెంట్ సభ్యుడుగా ఉన్న మరో నటుడు
స్త్రీల దుస్తుల గురించి సుద్దులు చెప్పి నిరసన ఎదుర్కొన్నాడు.
ఇప్పుడు తమిళ నటుడు మన్సూర్ అలీఖాన్.
సెలబ్రిటీలుగా ఉన్నవారు ఎంతో బాధ్యతగా
ఉండి యువతకు మార్గం చూపేలా ఉండాలి.
వారు ఇలా తగలడితే స్త్రీలతో ఎలా వ్యవహరించాలో
ఇంటినే బడిగా మార్చి తల్లిదండ్రులు నేర్పించాల్సి ఉంటుంది.
అయితే ఇంటి ఆడవారికి తండ్రి, భర్త గౌరవం ఇచ్చి
మాట్లాడుతున్నారా అనేది ప్రశ్న.

మగవారూ... భాష జాగ్రత్త


త్రిష


మన్సూర్ అలీఖాన్

అతడో ప్రసిద్ధ నటుడు. 'మా బ్లడ్డు వేరు మా బ్రీడు వేరు' అంటుంటాడు. కాని ఒక సభలో అభిమానులను చూసి పూనకం వచ్చి స్త్రీల గురించి అశ్లీలమైన వ్యాఖ్యలు చేశాడు. వందల సినిమాల్లో తండ్రిగానో బాబాయిగానో వేసిన ఒక నటుడు 'స్త్రీల మీద మీ అభిప్రాయం ఏమిటి?' అని సభలో యాంకర్ అడిగితే పరమ రోతగా సమాధానం ఇచ్చాడు. ఇక నటుడుగా, రియల్టర్‌గా గుర్తింపు పొందిన మరో పెద్ద మనిషి పార్లమెంట్ మెంబర్ అయ్యాక పార్లమెంట్‌లో నిలబడి మరీ 'స్త్రీల దుస్తుల వల్లే వారికి సమస్యలు వస్తున్నాయి' అన్నాడు.

స్త్రీలను ఏదో ఒకటి అనేయొచ్చు. అంటే వాళ్లు పడతారు. అనడానికే మేము పుట్టాము అనే చులకనభావం పురుష సమాజంలో నరనరాన జీర్ణించుకుని పోబట్టే ఈ ప్రతిఫలాలు. అదృష్టవశాత్తు ఇలాంటి వ్యాఖ్యలకు వెంటనే నిరసన పెల్లుబుకుతున్నా పురుషుల నోటి దురుసు తగ్గడం లేదు. తాజాగా తమిళ నటుడు మన్సూర్ అలీఖాన్ ఇటీవల త్రిషతో 'లియో' సినిమాలో నటించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ 'ఆమె హీరోయిన్ అని తెలిశాక (గత సినిమాల్లో తాను చేసిన) బెడ్‌రూమ్ సీన్ ఉంటుందని ఆశపడ్డాను' అని వ్యాఖ్యానించాడు. 'ఇది సినిమా లాంగ్వేజ్' అని మన్సూర్ అనుకుని ఉండొచ్చుగాని దానిలోని అశ్లీల ధ్వనికి త్రిష రియాక్ట్ అయ్యింది. 'ఇతనితో ఇంకెప్పుడూ సినిమాల్లో నటించను' అని చెప్పింది. ఆ తర్వాత చినికి చినికి గాలివానై ఇప్పుడు మన్సూర్ మీద కేసు బుక్ అయ్యేంతగా వెళ్లింది. మగవాళ్లు 'సరదాగా మాట్లాడుతున్నామని' అనుకుంటూ కూడా స్త్రీలను కించపరిచే వ్యాఖ్యలు చేస్తారు. సరదాగా కించపరచడం ఏమిటో... కించపరచడం ఎలాంటి సరదానో వీరే చెప్పాలి.

■ ప్రసిద్ధులే దారి తప్పితే

రాజకీయ నేతలు, సినిమా నటులు, క్రీడాకారులు, వ్యాపారవేత్తలు... ఇలా సమాజంలో గుర్తింపు పొందినవారు స్త్రీల పట్ల మరింత గౌరవంతో మెలగుతూ ఆదర్శంగా నిలవాలి. కాని చాలాసార్లు రాజకీయ నాయకుల దగ్గరి నుంచి అన్ని రకాల ప్రముఖులు ఏదో ఒక సందర్భంలో చులకన మాటలు మాట్లాడుతూ కుసంస్కారాన్ని ప్రదర్శిస్తున్నారు. ఉత్తరాదిలో మంత్రులు 'మేం వేసిన రోడ్లు ఫలానా హీరోయిన్ బుగ్గల్లా ఉంటాయి' అంటూ వదరుతుంటారు. సల్మాన్ ఖాన్ 'సుల్తాన్' సినిమాలో కుస్తీ వీరుడిగా నటించి 'ఈ సినిమాలో కుస్తీలు చేస్తే రేప్ జరిగినంత పనయ్యింది నాకు' అని వ్యాఖ్యానించి మొట్టికాయలు తిన్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ఒక మాజీ మంత్రి ప్రస్తుత మంత్రిగా ఉన్న నటిపై దారుణమైన వ్యాఖ్యలు చేసి కోర్టు కేసును ఎదుర్కొనబోతున్నాడు.

■ బాల్యం నుంచి భావజాల ప్రభావం

'కుటుంబంలో తండ్రి (మగాడు) ముఖ్యం' అనే భావన బాల్యం నుంచి పిల్లల్లో ఎక్కించడం ద్వారా పురుష సమాజం తన ఆధిక్యతను స్త్రీలపై ఆధిపత్యాన్ని కొనసాగించేలా చేస్తుంది. తండ్రిని 'మీరు' అని, తల్లిని 'నువ్వు' అని అనడంలో ప్రేమ, గౌరవం, దగ్గరితనం ఉన్నా 'నువ్వు' అనడం వల్ల 'లెక్క చేయవలసిన పని లేదు' అనే భావన కలిగితే కష్టం. తిట్లు, బూతులు అన్నీ స్త్రీలను అవమానించేవే. వాటిని విని, పలికి స్త్రీల పట్ల అలా మాట్లాడవచ్చు అనుకుంటారు మగవారు. ఇంట్లో చెల్లెని, అక్కని, తల్లిని తండ్రి అదుపు చేసే తీరు చూసి, తామూ బయట స్త్రీలను అలాగే అదుపు చేయవచ్చనుకుంటారు. ఫైటర్ జెట్స్‌ను స్త్రీలు నడుపుతున్న ఈ కాలంలో కూడా 'మేమేమీ గాజులు తొడుక్కోలేదు', 'మూతి మీద మీసముంటే రా'లాంటి పౌరుష వచనాలను పురుషులు ఇంకా పలికేటంత వెనుకబాటుతనంలో ఉండటం విషాదకరం. శారీరక పరిమితులు ఉన్నంత మాత్రాన స్త్రీలు బలహీనులు, పురుషులు బలవంతులు కాబోరు.

■ తల్లిదండ్రులూ జాగ్రత్త

అబ్బాయిలను ఆడపిల్లలను గౌరవించేలా పెంచడం, టీనేజ్‌లో ఉన్న అబ్బాయిలకు సరైన కౌన్సెలింగ్ ఇవ్వడం ఇప్పటి తల్లిదండ్రుల తక్షణ కర్తవ్యం. చట్టాలు పకడ్బందీగా ఉన్న ప్రస్తుత రోజుల్లో తెలిసో తెలియకో అహంకారంతోనో పరుష వ్యాఖ్య, అసభ్య చేష్ట నేరుగా కాని సోషల్ మీడియాలోగాని చేస్తే వారు ప్రమాదంలో పడతారని హెచ్చరించాలి. చైతన్యం పెరిగింది. అబ్బాయిలూ భాష జాగ్రత్త. ●

న్యూస్ మేకర్

ఫైనల్ మ్యాచ్‌లో మన జట్టు ఓటమి చెందిన బాధలో ఆమె పెద్దగా ఎవరికంటా పడలేదుగానీ...
ఆ తరువాత మాత్రం 'ఎవరీ అమ్మాయి?' అనుకున్నారు చాలామంది.
గెలుపు తరువాత ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు పక్కన ప్రముఖంగా కనిపించిన ఆ అమ్మాయి పేరు...
ఊర్మిళా రోసారియో. ఎవరీ ఊర్మిళ?

అవును... మన అమ్మాయే!



ఊర్మిళా రోసారియో ఆస్ట్రేలియన్ క్రికెట్ టీమ్ మేనేజర్. ఆమె తల్లిదండ్రులు ఐవీ, వాలెంటైన్ రోసారియోలది కర్ణాటకలోని మంగళూరుకు సమీపంలోని కిన్నిగోలి ప్రాంతం. ఐవీ, వాలంటైన్‌లు ఖతార్‌లోని దోహాలో ఉద్యోగం చేస్తున్న కాలంలో ఊర్మిళ జన్మించింది.

ఊర్మిళకు చిన్నప్పటి నుంచి ఆటలు అంటే చాలా ఇష్టం. స్కూలు రోజుల్లో క్రికెట్ కంటే బాస్కెట్‌బాల్, టెన్నిస్ బాగా ఆడేది. బంగీ జంపింగ్ అంటే ఇష్టం. ఖతార్ టెన్నిస్ ఫెడరేషన్‌లో మూడు సంవత్సరాలు పనిచేసింది.

కార్నెగీ మెలన్ యూనివర్శిటీలో బీబీఏ చేసిన ఊర్మిళ ఆ తరువాత ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టుకు మేనేజర్‌గా పనిచేసింది. ఒక నాన్-ఆస్ట్రేలియన్‌కు టీమ్ మేనేజర్ బాధ్యతలు అప్పగించడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది. ఫుట్‌బాల్ ప్రపంచకప్ నేపథ్యంలో క్రికెట్ నుంచి కొన్ని నెలల పాటు విరామం తీసుకొని ఖతార్‌లో ఫుట్‌బాల్ స్టేడియం నిర్వాహణ బాధ్యతలు చూసుకుంది.

ఆ తరువాత మళ్లీ ఆస్ట్రేలియాకు వచ్చింది.

ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టు మేనేజర్‌గా ఊర్మిళ పనితీరు, హిందీ, కన్నడ, కొంకణి... మొదలైన భారతీయ భాషలలో నైపుణ్యం వరల్డ్‌కప్ టూర్‌లో ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు మేనేజర్‌గా ఎంపిక చేయడానికి కారణం అయింది.

ఏడు సంవత్సరాల క్రితం ఊర్మిళ తల్లిదండ్రులు దోహా నుంచి మన దేశానికి వచ్చారు. కాఫీ ఎస్టేట్ కొనుగోలు చేసి కర్ణాటకలోని సకలేష్‌పూర్‌లో స్థిరపడ్డారు.

'క్రికెట్‌తో ఒకప్పుడు నాకు పెద్దగా పరిచయం లేదు. అలాంటి నాకు క్రికెట్‌తో ఇంత అనుబంధం ఏర్పడడం ఆశ్చర్యంగా ఉంది' అని నవ్వుతూ అంటుంది ఊర్మిల.

నవ్వడం సరే,
క్రికెట్ టీమ్ మేనేజర్ అంటే మాటలా?


తల్లిదండ్రులతో ఊర్మిళ


వన్స్ అపాన్ ఏ టైమ్... కుటుంబ సభ్యులతో... (కింది వరసలో మధ్యలో)

ఒక్కమాటలో చెప్పాలంటే...
'రెస్పాన్సిబుల్ ఫర్ ఎవ్రీథింగ్'
దీనిలో వందకు వంద మార్కులు కొట్టేసింది ఊర్మిళ.

ఊర్మిళ గత మార్చిలో తల్లిదండ్రులను చూడడానికి మనదేశానికి వచ్చింది. ఊర్మిళ ఇక్కడ ఉంటే కాఫీ ఎస్టేట్‌లో చిన్న చిన్న పనులు కూడా చేస్తుంది. ఆమె పక్కన ఉంటే తల్లిదండ్రులకు పండగే. కూతురి ఉన్నతి గురించి పెద్దగా మాట్లాడకపోయినా 'ఫైనల్ మ్యాచ్ చూడడానికి అహ్మదాబాద్‌కు వెళ్లాలనుకున్నాం. దురదృష్టవశాత్తు మా ఎస్టేట్ దాటి వెళ్లలేకపోయాం' అంటున్నారు ఊర్మిళ తల్లిదండ్రులు.

ఫైనల్ మ్యాచ్ మిస్ అయితే ఏమిటి?
ఏదో ఒకరోజు కాఫీ ఎస్టేట్‌కు ఊర్మిళ వస్తుంది కదా!
ఆ మ్యాచ్‌ను కళ్లకు కడుతుంది కదా! ఇక దిగులెందుకు!! ●

ఈ వెడ్డూరం చూశారా!

వెడ్డింగ్ విత్ టికెట్!

కొంతమంది ఎంతోఘనంగా జరుపుకునే తమ పెళ్లి వేడుకల వీడియోలను అమ్ముకుంటూ డబ్బులు సంపాదించడం ఇప్పటి ట్రెండ్‌గా మారింది. ఈ మధ్యకాలంలో సెలబ్రిటీలు తమ పెళ్లి వీడియోలను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీరిలానే సెలబ్రిటీ హోదాలేని వారు సైతం విదేశీయులకు పెళ్లి టికెట్లు అమ్మి వెడ్డింగ్ పర్యాటకానికి తలుపులు తెరుస్తున్నారు.

భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. అందుకే చాలా మంది విదేశీయులు ఇక్కడి సంస్కృతిని తెలుసుకునేందుకు ఆసక్తి కనబరుస్తుంటారు. విదేశాలతో పోలిస్తే ఇండియాలో ఎంతో శాస్త్రోక్తంగా పెళ్లిళ్లు జరుగుతాయి. ఈ పెళ్లిళ్లను చూసేందుకు విదేశీయులు చాలా ఉత్సాహం చూపుతారు. పెళ్లి సంప్రదాయాలు, రకరకాల రుచికరమైన వంటకాలను టేస్ట్ చేసేందుకు తహ తహలాడుతుంటారు. అందుకే ఏ మాత్రం అవకాశం చిక్కినా వెంటనే వచ్చి ఇండియాలో వాలిపోతుంటారు. ఇందుకు ఎంత డబ్బు ఖర్చు పెట్టడానికైనా వెనుకాడరు. ఈ అభిరుచినే మన భారతీయ జంటలు, వెడ్డింగ్ ప్లానర్స్ సొమ్ము చేసుకుంటున్నారు. దీనికోసం ప్రత్యేకంగా వెబ్ సైట్లు నడుపుతున్నారు. వెడ్డింగ్ ఇన్విటేషన్‌ను టికెట్‌గా చూపిస్తూ నిశ్చితార్థం నుంచి, మెహందీ, సంగీత్, హల్దీ ఇలా ఒక్కో వేడుకకి ఒక్కో రేటుని చెబుతూ పర్యాటకులను ఆకర్షిస్తున్నారని వెడ్డింగ్ ప్లానర్స్ చెబుతున్నారు.

జాయిన్ మై వెడ్డింగ్...

పెళ్లి చేసుకునే జంట సొంతంగా జాయిన్ మై వెడ్డింగ్ పేరుతో అకౌంట్‌ను క్రియేట్ చేస్తారు. ఈ వెబ్‌సైట్‌లో పెళ్లికొడుకు, పెళ్లికూతురు ఇద్దరి ఫోటోలు, పెళ్లి తేదీ, ఎన్నిరోజులు వేడుకలు జరుగుతాయి.. ఏ రోజు ఏ కార్యక్రమాలు నిర్వహిస్తారు... వంటి వివరాలను అప్‌లోడ్ చేస్తారు. పెళ్లిలో పెట్టే భోజనం వెజ్, నాన్‌వెజ్, మందు, చిందు ఉంటే అదీ చెబుతారు. ఇవేగాక డ్రెస్ కోడ్, అక్కడ మాట్లాడే భాష, వేడుక జరిగే ప్రదేశం అడ్రెస్‌తోపాటు ఫోన్ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్‌ను ఇస్తారు. విదేశీ పర్యటనలో ఉన్న వారికి ఈ పెళ్లి తేదీలు జత కుదిరితే టికెట్స్ బుక్ చేసుకుని వచ్చేసి మరీ పెళ్లి బ్యాండ్ బాజా, బారాత్‌లను ఎంజాయ్ చేస్తున్నారు.



ఒక్కరోజుకి పన్నెండు వేలపైనే...

ఎంతో ఆడంబరంగా జరిగే మన వివాహ వేడుకలను చూడడానికి పర్యాటకులు రోజు కోసం 150 డాలర్ల టికెట్‌ను సంతోషంగా కొనేస్తున్నారు. మన రూపాయలలో పన్నెండు వేలకు పైనే. ఇక పెళ్లి పూర్తి తతంగం మొత్తం అంటే రెండు రోజులు చూడాలంటే 250 డాలర్లు చెల్లించాలి (రూ.20 వేలకుపైన). ఒకటీ, రెండూ కాదు ఐదు రోజుల పెళ్లి చూడాలంటే ప్రత్యేక వెడ్డింగ్ ప్యాకేజీ టికెట్ కొనాల్సిందే. ఇలా పదిమంది విదేశీ అతిథులు పెళ్లికి వచ్చారంటే పెళ్లిలో కొన్ని ఖర్చులకు సరిపడా డబ్బు సమకూడినట్లే! అందుకే ఎక్కువ మంది వెడ్డింగ్ టూరిజంపైన ఆసక్తి కనబరుస్తున్నారు.

తొలిసారి...

హంగేరియన్- ఆస్ట్రేలియన్ సంతతికి చెందిన ఒర్సి పర్కాణి తొలిసారి 2016లో 'జాయిన్ మై వెడ్డింగ్' పేరిట వెబ్‌సైట్‌ను క్రియేట్ చేసింది. అప్పుడు ఇది ఒక చిన్న స్టార్టప్. కానీ ఇప్పుడు ఇది ట్రెండ్‌గా మారింది. ఈ ఏడాది ఆగస్టు 19న పర్యాటక మంత్రిత్వ శాఖ వెడ్డింగ్ టూరిజంను ప్రారంభించింది. వెడ్డింగ్ టూరిజం ద్వారా భారతీయులేగాక, విదేశీయులు సైతం ఇక్కడికి వచ్చి ఇక్కడి సంప్రదాయాలకు తగ్గట్టుగా పెళ్లి వేడుకలు జరుపుకోవచ్చని చెబుతూ వెడ్డింగ్ టూరిజాన్ని ప్రోత్సహిస్తోంది. బీచ్ వెడ్డింగ్, నేచర్ వెడ్డింగ్, రాయల్ వెడ్డింగ్, హిమాలయన్ వెడ్డింగ్ థీమ్‌ల పేరిట ప్రచారం నిర్వహిస్తోంది. ఈ ట్రెండ్‌కు మంత్రిత్వ శాఖ ప్రోత్సాహం బూస్టర్‌గా పనిచేసి ఇండియాలో వెడ్డింగ్ వ్యాపారం వృద్ధిలోకి రాబోతుంది. ఇంకెందుకాలస్యం... మీ ఇంట్లో జరిగే పెళ్లివేడుకలకు వెడ్డింగ్ టూరిజంను జోడించి మరింత కలర్‌ఫుల్‌గా జరుపుకోండి. ●

సెర్మనీ గైడ్...

విదేశీయులను పెళ్లికి పిలవడమేగాక, వారికి అతిథి మర్యాదల్లో లోటు లేకుండా చూసుకోవడం ఈ వెడ్డింగ్ టూరిజం ప్రత్యేకత. వేడుక లో జరిగే ప్రతి విషయం, పర్యాటకులకు వచ్చే సందేహాలు నివృత్తి చేసేందుకు సెర్మనీ గైడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు." ప్రస్తుతం రాజస్థాన్, ఢిల్లీ, ముంబైలలో ఈ వెడ్డింగ్ టూరిజం పెరుగుతోంది. రాజస్థాన్‌లోని చిన్నటౌన్లలో జరిగే వేడుకలకు విదేశీయులు ఆసక్తి చూపుతున్నారు. జోధ్‌పూర్, జైపూర్, జైసల్మేర్, ఉదయ్‌పూర్‌లలో జరిగే రాయల్ ఇండియన్ వెడ్డింగ్స్‌కు డిమాండ్ ఇంకా ఎక్కువగా ఉంది" అని వెడ్డింగ్ ప్లానర్స్ చెబుతున్నారు.

బ్యూటిప్స్

ముడతలు మచ్చలు పోవాల్సిందే...



కళ్లకింద ఏర్పడిన నల్లటి వలయాలు, ముడతలు, మచ్చలు అందమైన ముఖారవిందాన్ని పాడుచేస్తాయి. ఈ చిట్కాలు పాటిస్తే మీ సమస్యకు పరిష్కారం దొరికినట్లే...

- రాత్రి పడుకునేముందు కొద్దిగా అలోవెరా జెల్‌ను తీసుకుని కళ్ల కింద రాసి మర్దన చేసి పడుకోవాలి. ఉదయాన్నే నీటితో కడిగేయాలి.



- విటమిన్ ఇ ఆయిల్ కొల్లాజెన్ బూస్టర్‌గా పనిచేసి కళ్లకింద రక్తప్రసరణ చక్కగా జరిగేందుకు తోడ్పడుతుంది. రాత్రి పడుకునే ముందు విటమిన్ ఇ ఆయిల్‌ను కళ్లకింద రాసి మర్దన చేయాలి.



- పై రెండూ అందుబాటులో లేని వారు కనీసం కొబ్బరి నూనెను అయినా



కళ్లకింద రాసుకుని మర్దన చేసుకోవాలి. ఉదయాన్నే కడిగేయాలి. ఈ మూడింటిలో ఏ ఒక్క చిట్కానైనా క్రమం తప్పకుండా పాటిస్తే కొద్దిరోజుల్లోనే ముడతలు, మచ్చలు పోయి ముఖారవిందం బాగుంటుంది.

గెలుపు దారి

వ్యాపారానికి సంబంధించిన ఐడియాలు
ఏకాంతంగా కూర్చొని ఆలోచిస్తేనే వస్తాయి... అనే గ్యారెంటీ లేదు.
వ్యాపార విజయాలు ఫలానా వయసుకు మాత్రమే పరిమితం...
అనే నియమాలేవీ లేవు.
నగలు అంటే బంగారమే... అనే శాసనం ఏదీ లేదు.
ఇందుకు ఉదాహరణ ముంబైకి చెందిన హేమా సర్దా...

వెదురు నగల వెలుగుల్లో...

కొన్ని సంవత్సరాల క్రితం... దిల్లీలో జరిగిన హస్తకళల ప్రదర్శనకు హాజరైంది హేమా సర్దా. వినూత్నంగా కనిపించిన అస్సామీ బ్యాంబూ జ్యువెలరీని కొనుగోలు చేసింది. ఈ వెదురు నగలు తనకు ఎంతగా నచ్చాయంటే 65 సంవత్సరాల వయసులో 'బ్యాంబు అండ్ బంచ్' రూపంలో డైరెక్ట్-టు-కన్స్యూమర్(డీ2సీ) బ్రాండ్‌కు శ్రీకారం చుట్టేంతగా.

అస్సాంలోని గిరిజనులు తయారు చేసిన అందమైన వెదురు నగలను తన బ్రాండ్ ద్వారా విక్రయిస్తుంది హేమ. మన దేశంలో జువెలరీ అంటే బంగారం, వెండి... అనే అభిప్రాయాన్ని తన బ్రాండ్ ద్వారా మార్చే ప్రయత్నం చేస్తోంది. బయటి ప్రపంచానికి అంతగా తెలియని వెదురు నగలను ప్రాచుర్యంలోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది.

రకరకాల ప్రాంతాలలో తమ ప్రాడక్ట్స్‌కు సంబంధించి ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేసింది. మౌఖిక ప్రచారం ద్వారా వెదురు నగల అమ్మకాలు ఊపందుకున్నాయి.

పదిహేను వేలతో వ్యాపారం ప్రారంభించి తన బ్రాండ్‌ను లాభాల బాట పట్టించింది హేమ. వ్యాపార వృద్ధికి సోషల్ మీడియాను ప్రధాన వేదికగా మలుచుకుంది. తమ బ్రాండ్‌కు చెందిన వెదురు నగల చిత్రాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసేది. దీంతో ఎక్కడెక్కడి నుంచో ఆర్డర్లు రావడం మొదలైంది.

సంప్రదాయ వెదురు ఆభరణాలకు మోడ్రన్ ట్విస్ట్ ఇచ్చి కొనుగోలుదారులను ఆకట్టుకునేలా చేయడంలో హేమ విజయం సాధించింది. నాణ్యమైన వెదురును కొనుగోలు చేసి అస్సాంలోని ట్రైబల్ ఆర్టిస్ట్‌ల దగ్గరికి పంపుతుంది.

'అరవై అయిదు సంవత్సరాల వయసులో మార్కెట్ తీరుతెన్నులను గురించి తెలుసుకోవడం కష్టమే కావచ్చు. ఈ వయసులో అవసరమా అని కూడా అనిపించవచ్చు. అయితే నేను ఎప్పుడూ అలా అనుకోలేదు. కొన్నిసార్లు ప్రయాణమే పాఠాలు నేర్పుతుంది. నా విషయంలోనూ ఇదే జరిగింది. మొదట్లో మా బ్రాండ్ పెద్దగా సక్సెస్ కాలేదు. జరిగిన తప్పులను సవరించుకొని ముందుకు వెళ్లాను' అంటుంది హేమ.

కోడలు తాన్య సహాయంతో మార్కెట్ ప్లేస్‌లను లొకేట్ చేయడం నుంచి సోషల్ మీడియా మార్కెటింగ్, ఫొటోగ్రఫీ వరకు ఎన్నో విషయాలు నేర్చుకుంది హేమ.

'నాణ్యమైన నగల అలంకరణకు బంగారమే అక్కర్లేదు అని చెప్పడానికి బ్యాంబూ జువెలరీ ఉదాహరణ. డబ్బు సంపాదన కోసం ఈ వ్యాపారం ప్రారంభించలేదు. వినూత్నమైన కళను ప్రజలకు చేరువ చేయాలనేది నా ప్రయత్నం' అంటుంది హేమా సర్దా. ●


హేమా సర్దా




'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 242

గురువారం 23-11-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నిజం మాట్లాడితే అంతే..

కాంగ్రెస్‌లో నేతలెవరైనా నిజం మాట్లాడితే పార్టీ నుంచి బహిష్కరిస్తారన్న మోదీ -6లో



మళ్లీ కొత్తగా మొదలు...

నేటి నుంచి భారత్, ఆసీస్ టి20 సిరీస్. విశాఖలో తొలి పోరు -12లో

న్యూస్‌రీల్

హంగ్ కోసం బీజేపీ యత్నం



'రాష్ట్రంలో హంగ్ అసెంబ్లీ కోసం బీజేపీ ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడాలని చూస్తోంది. ప్రజలు మజ్లిస్‌కు 9, బీఆర్‌ఎస్‌కు 110 సీట్లలో సంపూర్ణ మద్దతు ఇచ్చి.. కేసీఆర్ మామకు అధికారం కట్టబెట్టాలి' అని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెప్పారు.

- వివరాలు 8లో ▶

కన్నడ నాట అరాచక సర్కార్



కన్నడ నాట కాంగ్రెస్ ఆధ్వర్యంలో అరాచక సర్కార్ రాజ్యమేలుతోందని కర్ణాటక మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికార దాహంతో ఇచ్చిన ఉచిత పథకాల దుష్పరిణామాలు ఇప్పటికే కర్ణాటకపై కనిపిస్తున్నాయన్నారు.

- వివరాలు 3లో ▶

పరిగి ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్





నమ్మితే ఆగమే!

కొడంగల్, మహబూబ్‌నగర్, తాండూరు, పరిగి ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

- కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ గోసపడతాం
- నాడు తెలంగాణను ఆంధ్రాలో కలిపి 58 ఏళ్లు బాధపెట్టారు
- కాంగ్రెస్ అంటేనే దళారులు, పైరవీకారుల రాజ్యం
- వాళ్లది భూమాత కాదు.. భూమేత స్కీం
- 24 గంటల కరెంట్ కావాలా.. 3 గంటలే కావాలా?
- కొడంగల్‌లోనే దిక్కులేని రేవంత్ కామారెడ్డిలో ఏం చేస్తడు?
- 30 రోజులు మురిపించేవాళ్లను చూసి ఓటేస్తే ప్రమాదం
- హిందువులు, ముస్లింలు తనకు రెండు కళ్లు వంటివారని వ్యాఖ్య

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/వికారాబాద్: ఎన్నికలు వచ్చాయంటే రకరకాలుగా ఆగం చేసే పనులు జరుగుతాయని.. ఒక్కసారి కాంగ్రెస్‌ను నమ్మి మోసపోతే ఐదేళ్లపాటు బాధపడాల్సి వస్తుందని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులతోపాటు వారి వెనుక ఉన్న పార్టీల చరిత్ర, నడవడికను చూసి ఓటు వేయాలని సూచించారు. రాయి ఏదో, రత్నమేదో గుర్తించాలన్నారు. నాడు ఉన్న తెలంగాణను ఆంధ్రాలో కలిపి 58 ఏళ్ల గోసపెట్టిన కాంగ్రెస్.. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వస్తే గోసపడతామని చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని కోస్గి, మహబూబ్‌నగర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని తాండూరు, పరిగి నియోజకవర్గాల్లో బుధవారం

మిగతా 2వ పేజీలో ▶

ఆ వంద లేఖలు

బయటపెట్టాలి

కేసీఆర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సవాల్



- మెడికల్ కాలేజీల కోసం దరఖాస్తు చేయకపోగా సీఎం అబద్ధాలు ఆడుతున్నారని విమర్శ
- దళిత సీఎం హామీని ఇప్పుడైనా అమలుచేస్తారా?
- బీసీని సీఎం చేసే దమ్ము, ధైర్యం కాంగ్రెస్‌కు ఉందా?
- డిసెంబర్ 3 తర్వాత బీసీ నేత పేరును సీఎంగా తాము ప్రతిపాదిస్తామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రానందునే వివిధ పథకాలు ఆలస్యం అయ్యాయని సీఎం కేసీఆర్ చెబుతున్న మాటలు అర్థరహితమని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. మెడికల్ కాలేజీల కోసం వంద లేఖలు రాశానంటున్న కేసీఆర్ దమ్ముంటే వాటిని బయటపెట్టాలని సవాల్ విసిరారు. 'మేమే మెడికల్ కాలేజీ ఇస్తామని లేఖ రాస్తే కేసీఆర్ స్పందించలేదు... అన్ని రాష్ట్రాలకు రాసినట్లే.. తెలంగాణకు కూడా లేఖ రాశాం. ఫార్మాట్‌లో దరఖాస్తు పెట్టుకోండి వెంటనే మంజూరు చేస్తామంటే.. స్పందనేది?' అని ప్రశ్నించారు. అప్పటి కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ స్వయంగా లేఖ రాసినా దానికి సీఎం నుంచి సమాధానం రాలేదన్నారు. మెడికల్ కాలేజీల ఏర్పాటుకు సంబంధించి రాష్ట్రం దరఖాస్తు చేసుకోకపోగా సీఎం కేసీఆర్ సిగ్గు లేకుండా అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. బుధవారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ...కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు ఫ్యామిలీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు.. అవినీతి , బంధుప్రీతి

మిగతా 3వ పేజీలో ▶

గట్టిపోటీ.. అధిక సీట్లు

- ఆ దిశగా కమలం కసరత్తు
- 25 నుంచి 3 రోజులు.. 6 సభలు.. హైదరాబాద్‌లో రోడ్‌షోకు ప్రధాని మోదీ

- వివరాలు 3లో

వీలైనంత దగ్గరగా జేఈఈ పరీక్ష కేంద్రం



సాధ్యమైనంత వరకూ అభ్యర్థి నివాసానికి సమీపంలో ఉండేలా జేఈఈ మెయిన్స్ పరీక్ష కేంద్రాలను కేటాయించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్ణయించింది. దరఖాస్తులో పేర్కొన్న స్థానికతను ఇందుకు కొలమానంగా తీసుకుంటోంది.

- వివరాలు 14లో

ఇదంజగత్



తనకే ఓటేస్తానని ఎంత చెప్పినా వినట్లేదు! ఒట్టేయించుకుంటున్నాడు!!



మూడోసారీ మా ప్రభుత్వమే

70 నుంచి 82 సీట్లు ఖాయం.. మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్

- కాంగ్రెస్ హడావుడి పాలపొంగు వంటిదే..
- రేవంత్‌రెడ్డికి రెండు చోట్లా ఓటమి తప్పదు
- కాంగ్రెస్ సీనియర్లు చాలామంది ఓడిపోబోతున్నారు
- ప్రాజెక్టులపై దొంగ రిపోర్టులతో బదనాం చేసేందుకు బీజేపీ ప్రయత్నం
- క్షేత్రస్థాయిలో పరిస్థితి బీఆర్‌ఎస్‌కే అనుకూలంగా ఉంది
- తెలంగాణకు ఏకైక గొంతు కేసీఆర్ మాత్రమే..
- కాపాడుకోవాలా, వద్దా అన్నది ప్రజలు ఆలోచించాలని వ్యాఖ్య

వాళ్లొస్తే అంధకారమే..

- గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఎన్నో కష్టాలు పడ్డాం: మంత్రి కేటీఆర్
- ముల్కనూర్, చౌటుప్పల్, కోదాడలలో రోడ్ షోలలో ప్రచారం

- వివరాలు 2లో

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ తర్వాత మూడు వేర్వేరు సంస్థల ద్వారా లోతుగా సర్వే చేశామని.. బీఆర్‌ఎస్‌కు 72 నుంచి 82 సీట్లు వస్తాయని స్పష్టంగా తేలిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారకరామారావు చెప్పారు. రాష్ట్రంలో మూడోసారి కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుందనడంలో ఎలాంటి అనుమానం లేదని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం కేటీఆర్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. వివరాలు ఆయన మాటల్లోనే.. ''మాపై వ్యతిరేకత ఉన్నట్టు సోషల్ మీడియాలో హడావుడి జరగడం, అక్కడక్కడా మౌఖిక ప్రచారమే (మౌత్ టాక్) తప్ప క్షేత్రస్థాయిలో ఓటరుకు ఎలాంటి గందరగోళం లేదు. అదిగో పులి అంటే

మిగతా 2వ పేజీలో ▶

దేశంలో మీకు గౌరవం పెరుగుతుంది

తెలంగాణలో కాంగ్రెస్ వస్తే దేశంలో కూడా గెలుస్తుంది: ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే

మీ తీర్పు మీ ప్రతిష్ట పెంచుతుంది

- బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం మూడూ ఒక్కటే.. ఒంటరి పోరు చేస్తున్న కాంగ్రెస్‌పై అవి కుట్రలు చేస్తున్నాయి
- కేసీఆర్, నరేంద్ర మోదీ పేదల పక్షాన లేరు.. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం తేవాల్సిన అవసరం ఉంది
- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ



నల్లగొండ సభలో ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి అభివాదం చేస్తున్న ఖర్గే

సాక్షి ప్రతినిధులు, మహబూబ్‌నగర్/నల్లగొండ: 'తెలంగాణలో మీరు అనుకున్న అభివృద్ధి జరగలేదు. ఇక్కడి సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌లో కూర్చుని నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రజలను కలవని ఆయనకు ఓట్లు వేయకూడదు. బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎంలు స్నేహితులు. మూడూ ఒక్కటే. ఏ టీమ్, బీ టీమ్, సీ టీమ్‌గా ఉన్నాయి. కేసీఆర్ ఆర్‌ఎస్‌ఎస్ హెడ్‌క్వార్టర్ నాగపూర్‌కు వెళ్లినప్పుడు మోదీ తన మిత్రుడని చెబుతుంటాడు. అదే ఒవైసీ కేసీఆర్ తనకు మంచి స్నేహితుడని చెబుతాడు. ఈ ముగ్గురు కలిసి తెలంగాణలో కాంగ్రెస్ గెలవకూడదని కుట్రలు చేస్తున్నారు. దళిత, మైనార్టీ, నిరుపేదలంతా కాంగ్రెస్ వైపే ఉండడంతో ఆ మూడు పార్టీలకు కళ్లు మండుతున్నాయి. కేసీఆర్ పాలనలో అంతులేని అవినీతి జరిగింది. ల్యాండ్, సాండ్, మైన్, వైన్ కుంభకోణాల మయంగా మారింది. అందులో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు భాగస్వాములే. ఈ ఎన్నికలు

మిగతా 3వ పేజీలో ▶

బోగస్ సంస్థతో వివేక్ రూ.100 కోట్ల లావాదేవీలు!



- విశాక ఇండస్ట్రీస్, విజిలెన్స్ సంస్థ మధ్య అనుమానాస్పద లావాదేవీలు
- వాస్తవ వ్యాపార ఉద్దేశం లేకుండా నగదు బదిలీకే విజిలెన్స్ బ్యాంకు ఖాతా వాడకం
- ఆ సంస్థ పరోక్షంగా వివేక్ నియంత్రణలో ఉంది.. ఫెమా ఉల్లంఘనలూ గుర్తించాం
- వివేక్ ఇల్లు, కార్యాలయాల్లో సోదాలపై ఈడీ ప్రకటన

- వివరాలు 14లో



తుది దశకు రెస్క్యూ ఆపరేషన్

- 57 మీటర్ల శిథిలాల గుండా 45 మీటర్ల డ్రిల్లింగ్ పూర్తి
- మరో 12 మీటర్లు పూర్తయితే కార్మికులు బయటపడే అవకాశం! నేడో, రేపో తీసుకొచ్చేందుకు ప్రయత్నం
- ముమ్మరంగా 'ఉత్తర కాశీ' ఆపరేషన్ -6లో



కాల్పులకు 4 రోజుల విరామం

- ఇజ్రాయెల్–హమాస్ ఒప్పందం.. నేటి నుంచి అమలు
- ఫలించిన ఖతార్, ఈజిప్ట్, యూఎస్ మధ్యవర్తిత్వం
- హమాస్ చెర నుంచి 50 మందికి విముక్తి.. బదులుగా 150 మంది పాలస్తీనా ఖైదీల విడుదల! -6లో

“ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్.. అన్నీ సంపన్న వర్గాల కోసం నడుస్తున్న పార్టీలే. బీఎస్పీ ఒక్కటే బహుజన వర్గాల కోసం ప్రజల విరాళాలతో పనిచేస్తోంది. తెలంగాణలో ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో బీఎస్పీ అధికారంలోకి వస్తుంది ”



తెలంగాణలో అధికారంలోకి వస్తాం

బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి

- వివరాలు 5లో

రేవంత్‌రెడ్డి బెదిరింపులకు భయపడేవాళ్లు లేరు


- రౌడీయిజం, గూండాయిజాన్ని ప్రోత్సహించే వాళ్లకు పట్టం కట్టవద్దు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నిజామాబాద్ నాగారం: బీఆర్‌ఎస్ అభివృద్ధికి, కాంగ్రెస్ అరాచకానికి మధ్య ఈ ఎన్నికలు జరుగుతున్నాయని.. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బెదిరింపులకు భయపడేవారు ఎవరూ లేరని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. రౌడీయిజం, గూండాయిజాన్ని ప్రోత్సహించే వాళ్లకు పట్టం కట్టవద్దని ఆమె ప్రజలను కోరారు. బుధవారం రాత్రి కవిత నిజామాబాద్ నగరంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ, అధికారులు నిష్పక్షపాతంగా పనిచేస్తున్నారని చెప్పారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడితే కాంగ్రెస్ పార్టీకి మనుగడ ఉండదని హెచ్చరించారు. బోధన్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్, కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు ఆమె చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఏ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా రెండు మూడు నెలలకే ప్రభుత్వం అస్థిరమవుతుందని అన్నారు. ఇటీవల కర్ణాటకలో అధికారంలోకి వచ్చి మూడు నెలలు కాకముందే ఆ పార్టీ ప్రభుత్వంలో కుమ్ములాటలు మొదలయ్యాయని చెప్పారు. రాజస్తాన్‌లో అశోక్ గెహ్లోత్, సచిన్ పైలట్ ఎప్పుడూ కొట్లాడుకుంటూనే ఉంటారని, మధ్యప్రదేశ్‌లో ప్రజలు అధికారం ఇస్తే కమల్‌నాథ్, జ్యోతిరాదిత్య సింధియా కొట్లాడుకొని ఏడాదిలోనే ప్రభుత్వాన్ని కూల్చేశారని గుర్తు చేశారు. రాజకీయ సుస్థిరత, శాంతి భద్రతల వల్లనే హైదరాబాద్‌కు పరిశ్రమలు వస్తున్నాయని, ప్రశాంతంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని కవిత అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థి నామినేషన్‌పై జోక్యానికి విముఖత

- అలంపూర్ స్వతంత్ర అభ్యర్థి పిటిషన్‌పై హైకోర్టు నిర్ణయం
- ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేయకుండా అలంపూర్ నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఓ అభ్యర్థి నామినేషన్ తిరస్కృతికి ఆదేశాలివ్వాలని దాఖలైన పిటిషన్‌లో జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. నోటిఫికేషన్ వచ్చి ఎన్నికల ప్రక్రియ సాగుతున్న దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేస్తూ పిటిషన్‌పై వాదనలను ముగించింది. జోగుళాంబ గద్వాల్ జిల్లా ఉండవల్లి మండలం పుల్లూర్ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ విజయుడు రాజీనామా చేయకుండానే అలంపూర్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారని, దాన్ని తిరస్కరించేలా రిటర్నింగ్ అధికారికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ప్రసన్నకుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టి.. జోక్యం చేసుకోలేమని వాదనలు ముగించింది.

వాగ్దానాలు విస్మరించిన కాంగ్రెస్

- కర్ణాటక రైతు సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆరోపణ



ధర్నాలో పాల్గొన్న కర్ణాటక రైతులు

కవాడిగూడ (హైదరాబాద్): కర్ణాటక ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను అధికారంలోకి వచ్చాక విస్మరించిందని కర్ణాటక రైతు సంఘం అధ్యక్షుడు కోడిహళ్లీ చంద్రశేఖర్ ఆరోపించారు. 24గంటల పాటు విద్యుత్ ఇస్తామని చెప్పి 5గంటలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు తప్పుడు హామీలిచ్చి ప్రచారం చేయడాన్ని నిరసిస్తూ బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం, గ్రీన్‌ఆర్మీ నేతల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కర్ణాటక రాష్ట్రంలో గ్యారంటీల పేరిట రైతులను మోసం చేసిందని ఆరోపించారు. తెలంగాణ రైతులు కాంగ్రెస్ గ్యారంటీలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రైతు బీమా అనే హామీ ఇచ్చిన కాంగ్రెస్ మాట తప్పిందని పేర్కొన్నారు. కర్ణాటకలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఇతర రాష్ట్రాల రైతులు ఎదుర్కొనకూడదని అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. తాము ఏ పార్టీకి మద్దతుగా లేదా వ్యతిరేకంగా కానీ చేయడం లేదని స్పష్టం చేశారు. దక్షిణ భారత రైతు సమాఖ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ చేసిన రైతు చట్టాలను అమలు చేస్తోందని ఆరోపించారు. కాగా, ఇందిరాపార్కులో ధర్నా చేయడానికి వచ్చిన కర్ణాటక రైతులను కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. ఎవరి ప్రోద్బలంతో ఇక్కడికి వచ్చి ధర్నా చేస్తున్నారని వారు నిలదీశారు.



బుధవారం మహబూబ్‌నగర్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నమ్మితే ఆగమే!

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహించిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''కాంగ్రెస్ పార్టీ ఉన్న తెలంగాణను ఊడగొట్టి ఆంధ్రాలో కలిపితే 58 ఏళ్లు అరిగోసపడ్డాం. అదే బీఆర్‌ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం. హోరాహోరీ పోరాటం చేసి, కష్టపడి రాష్ట్రాన్ని సాధించుకున్నాం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన ఈ పదేళ్లలో చేసిన అభివృద్ధి కళ్ల ముందే కనబడుతోంది. మేం పేదల గురించి ఆలోచించినం. పింఛన్లను రూ.2వేలకు పెంచుకున్నం. రైతులకు 24 గంటలు ఉచిత కరెంట్, రైతుబంధు ఇస్తున్నం. రైతుల పంట మొత్తాన్ని ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తోంది. ఎవరైనా రైతు చనిపోతే వారం రోజుల్లో రూ.5 లక్షలు వస్తున్నాయి. కంటి వెలుగుతో రాష్ట్రంలో మూడు కోట్ల మందికి కంటి పరీక్షలు చేయించినం. గర్భిణులు, బాలింతల కోసం అమ్మ ఒడి వాహనాలు పెట్టాం.

వారివి బాధ్యతలేని మాటలు

టీపీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధు వేస్ట్, దుబారా అంటున్నారు. రైతుబంధు దుబారానా? పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రైతులకు 24 గంటలు కరెంటు వృథా, 3 గంటల కరెంట్ చాలంటున్నారు. వారివి బాధ్యతలేని మాటలు. 3 గంటల కరెంటు కావాలా? 24 గంటలు కావాలా? రైతులు ఆలోచించాలి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి ఎత్తివేస్తామంటున్నారు. ధరణి లేకుంటే రైతుబంధు పంపిణీ ఎట్లా? ధరణి స్థానంలో భూమాత తెస్తరంట.. అది భూమాత కాదు.. భూమేత. ధరణిని తీసేయడం రైతులకు జీవన్మరణ సమస్య. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ దళారులు, పైరవీకారుల రాజ్యం వస్తది.

గొడవల్లేకుండా పాలన సాగించాం

గత కాంగ్రెస్ హయాంలో అన్ని ఘర్షణలే. ఎన్నో అల్లర్లు, కర్ఫ్యూలు చూసినం. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఎక్కడా ఒక్క లొల్లి కూడా లేకుండా ప్రశాంతంగా పాలన సాగింది. హైదరాబాద్‌లో ఒక్క గొడవ జరిగిందా? కర్ఫ్యూ అనే మాటే రాలేదు. ముస్లింలు, హిందువులు నాకు రెండు కళ్లలాంటి వారు. కేసీఆర్ బతికున్నంత కాలం తెలంగాణలో సెక్యులరిజం ఉంటుంది.

కాంగ్రెస్‌కు దిక్కుదివాణం లేదు

కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు.. ఆ పార్టీకి దిక్కుదివాణం లేదు. 20 సీట్లు కూడా రావు. అందులోనూ 15 మంది సీఎం అభ్యర్థులే. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం. అది నియోజకవర్గంతోపాటు రాష్ట్ర భవిష్యత్, తలరాతను మార్చుతుంది. అందుకే బాగా ఆలోచించి ఓటు వేయండి. కాంగ్రెస్ వాళ్ల మాటలు నమ్మి ఓటు వేస్తే తెలంగాణ ఆగమైతది'' అని కేసీఆర్ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ సభ సందర్భంగా కేసీఆర్ కాసేపు ఉర్దూలో ప్రసంగించారు. ఉమ్మడి పాలమూరు సభల్లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ జనరల్ సెక్రెటరీ కేశవరావు, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డి, కొప్పుల మహేశ్‌రెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు.

రేవంత్‌వి చిల్లర మాటలు

రేవంత్‌రెడ్డి పెద్ద భూకబ్జాదారు. మహబూబ్‌నగర్ జిల్లాలో భూములు కబ్జా చేశారు. ఆయనవి ఉత్త ఫాల్తు, చిల్లర మాటలు. సీఎంను పట్టుకుని పిండం పెడతానంటూ మాట్లాడుతడు. రూ.50 లక్షలతో ఎమ్మెల్యేను కొనేందుకు పోయి అడ్డంగా దొరికిండు. నాడు తెలంగాణ రాష్ట్రం కోసం ప్రతిబిడ్డ ప్రాణాలకు తెగించి పోరాడుతుంటే.. నీతి నిజాయితీ లేని సన్నాసి రేవంత్‌రెడ్డి ఆంధ్రోళ్ల చంకలో చేరి ఉద్యమకారులను కాలుస్తానంటూ తుపాకీతో బయలు దేరలేదా? ఆయనకు కొడంగల్‌లోనే దిక్కులేదు. పైగా కామారెడ్డికి వచ్చిండు. అక్కడ జనాలు అంగీలు ఊడదీస్తున్నరు. మీరు ఇక్కడ లాగులు ఊడదీసి పంపియ్యండి. 30 రోజులు మురిపించేవాళ్లను చూసి ఓటేస్తే చాలా ప్రమాదం.

777కు చేరిన ఎంసీసీ ఉల్లంఘన కేసులు

- ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ఈసీ కేసుల కొరడా
- రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి సహా పలువురిపై కేసులు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసీసీ) ఉల్లంఘనలపై రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 10 నుంచి బుధవారం వరకు మొత్తం 777 కేసులు నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఎంసీసీ ఉల్లంఘనలపై స్థానిక పోలీసులతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనలు అతిక్రమించే వారిపై కేసుల నమోదు చేస్తున్నాయి. ముందస్తు అనుమతి లేకుండా ప్రచారం చేసినందుకు గాను సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గం బీఎస్పీ అభ్యర్థి వట్టె జంగయ్యపై ఈనెల 22న ఆత్మకూరు ఎస్ పోలీస్ స్టేషన్ పరిధిలో, హన్మకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తాళ్లపల్లి జనార్దన్‌గౌడ్‌పై ఈ నెల 21న ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై కేసులు నమోదయ్యాయి. బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డిపై అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహించడంపై బోధన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఈనెల 21న కేసు నమోదు చేశారు. ఈనెల 19న నిబంధనలకు విరుద్ధంగా డీజే సౌండ్ బాక్స్‌లను వినియోగించినందుకు చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో బీఆర్‌ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ డి.రాజేందర్‌పై కేసు నమోదు చేశారు. రాత్రి 10 గంటల తర్వాత బెజ్జూరు మండలం, ముంజంపల్లిలో డోర్ టూ డోర్ ప్రచారం నిర్వహించినందుకు బీఎస్పీ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై బెజ్జూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేశారు. ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండానే వరంగల్‌లోని ఉర్సు దర్గా వద్ద ముస్లిం జమ్మాత్‌లో పాల్గొన్నందుకు వరంగల్ వెస్ట్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి కొండా సురేఖపై మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 18న కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

తెలంగాణలో ముస్లిం రిజర్వేషన్లు తొలగిస్తాం

అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ



సైదాబాద్ (హైదరాబాద్) : తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని ముస్లిం రిజర్వేషన్లను తొలగిస్తామని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ స్పష్టం చేశారు. ఆ నాలుగు శాతం రిజర్వేషన్లను బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు జోడిస్తామని ఆయన తెలిపారు. సైదాబాద్ డివిజన్ వీకే ధాగేనగర్‌లో మలక్‌పేట నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి, యాకుత్‌పురా నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఎస్.వీరేంద్రబాబుయాదవ్‌లకు మద్దతుగా బుధవారం రాత్రి నిర్వహించిన సకల జనుల విజయ సంకల్ప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాతబస్తీలో ఒక పోలీస్ అధికారిని అక్బరుద్దీన్ ఒవైసీ బహిరంగంగా దూషిస్తూ దుర్భాషలాడటం చూస్తే హైదరాబాద్‌లో వారి అరాచకాలు అర్థమవుతున్నాయన్నారు. ఇలాంటి ఘటన అసోం, గోవా సహా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరిగితే అక్కడి పోలీస్ అధికారులే ఐదు నిమిషాల్లో చర్యలు తీసుకుంటారని తెలిపారు. దేశాభివృద్ధి కోసం కాంగ్రెస్ ఎన్నడూ సరైన నిర్ణయాలు తీసుకోలేదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. తెలంగాణలో ఈసారి ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సభలో బీజేపీ గోవా రాష్ట్ర అధ్యక్షుడు ఎంపీ సదానంద శేట్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అక్బరుద్దీన్‌పై కేసు

- ఇన్‌స్పెక్టర్‌పై దురుసుగా వ్యవహరించారని ఫిర్యాదు

సంతోష్‌నగర్: విధి నిర్వహణలో ఉన్న పోలీసులను బెదిరించిన కేసులో చాంద్రాయణగుట్ట మజ్లిస్ పార్టీ అభ్యర్థి అక్బరుద్దీన్ ఒవైసీపై సంతోష్‌నగర్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పూసపాటి శివచంద్ర తెలిపిన వివరాల ప్రకారం... ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 21 రాత్రి ఈదిబజార్ యూనిక్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అక్బరుద్దీన్ ప్రసంగిస్తుండగా. .సమయం మించిపోతున్నందున ప్రసంగాన్ని ఆపాలని సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శివచంద్ర కోరడంతో అక్బరుద్దీన్ పోలీసులను బెదిరించారు. తన మద్దతుదారునికి సిగ్నల్ ఇస్తే ఇన్‌స్పెక్టర్ ఆ స్థలం నుంచి పరుగెత్తాల్సి వస్తుందని సూచిస్తూ అక్కడి నుంచి వెళ్లిపో అని గద్దించారు. ''కత్తులు, బుల్లెట్లను ఎదుర్కొన్న తరువాత నేను బలహీన పడ్డానని మీరు అనుకుంటున్నారేమో... ఇప్పటికీ నాలో చాలా ధైర్యముంది. ఇంకా ఐదు నిమిషాలు మిగిలే ఉంది. నీ వద్ద గడియారం లేకపోతే నేను ఇస్తాను''అని అక్బరుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించారు. దీనిపై సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సుమోటోగా అక్బరుద్దీన్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా అక్బరుద్దీన్ ఒవైసీ బహిరంగ సభ ప్రసంగానికి ఇబ్బంది కలిగించిన ఇన్‌స్పెక్టర్ శివచంద్రపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం సామాజిక కార్యకర్త మహమ్మద్ ఇమాద్ హుస్సేన్ సంతోష్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు

వాళ్లు వస్తే అంధకారమే..

- గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఎన్నో కష్టాలు పడ్డాం: మంత్రి కేటీఆర్
- ఇందిరమ్మ రాజ్యమంటే ఆకలి చావులే..
- ఎన్టీఆర్ స్ఫూర్తితో కాంగ్రెస్‌ను తరిమికొడదాం
- బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తేనే అభివృద్ధి, సంక్షేమం
- ముల్కనూర్, చౌటుప్పల్, కోదాడలలో రోడ్ షోలలో ప్రచారం



కోదాడలో జరిగిన రోడ్‌షోలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షిప్రతినిధి, వరంగల్/చౌటుప్పల్/కోదాడ: ''కరువు కాటకాలు, దరిద్రానికి నేస్తమైన హస్తం పార్టీ మనకొద్దు.. కాంగ్రెస్ హయాంలో కరెంటు ఉండేది కాదు. కాలిపోయే మోటార్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయం నడవలేదు, పరిశ్రమలు మూతపడ్డాయి. పల్లెల్లో కరువు కరాళ నృత్యం చేసింది..''అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారకరామారావు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ సర్కారు వచ్చాక 24 గంటల కరెంటు ఇస్తున్నామని, మెట్టప్రాంతాలు సస్యశ్యామలం అయ్యాయని చెప్పారు. తెలంగాణను నిండా ముంచిన కాంగ్రెస్‌కు ఓట్లేసి మళ్లీ ఆగం కావద్దని.. బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ముల్కనూర్, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్, సూర్యాపేట జిల్లా కోదాడలలో నిర్వహించిన రోడ్‌షోలలో కేటీఆర్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''కాంగ్రెస్ పార్టీకి గతంలో 11 చాన్స్‌లు ఇచ్చినా ఏం చేశారు? టీపీసీసీ అధ్యక్షుడు పొలాలకు మూడు గంటల కరెంట్ చాలని అంటున్నారు. రైతుబంధు పేరిట కేసీఆర్ డబ్బులు వేస్ట్ చేస్తున్నారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ధరణి వద్దు మళ్లీ పట్వారీ వ్యవస్థ తెస్తామని సీఎల్పీ లీడర్ భట్టి విక్రమార్క అంటున్నారు. ఇలాంటి వాళ్లకు అధికారమిస్తే ఏమవుతుందో ప్రజలు ఒక్కసారి ఆలోచించాలి. తెలంగాణలో మళ్లీ బీఆర్‌ఎస్ హవానే కొనసాగుతుంది. కాంగ్రెస్‌కు 20 సీట్లు కూడా రావు.

కాంగ్రెస్ వస్తే అంధకారమే..

తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తెస్తామని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. ఇందిరమ్మ రాజ్యమంటే ఆకలి చావులు, ఎండిన డొక్కలే. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ అరాచక పాలనకు తెరదించడానికి నాడు ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించి ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని కాంగ్రెస్ పార్టీని మరోసారి చిత్తుచిత్తుగా ఓడించాలి. ఒకవేళ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే అంధకారమే. వారు ఉచిత కరెంట్, రైతు బీమాను ఎత్తేస్తారు. నల్లధనాన్ని వెలికితీసి, ప్రజలందరికీ పంచుతానన్న ప్రధాని మోదీ.. అది చేయకపోగా, ఉప్పు, పప్పులు, నిత్యావసరాల ధరలు పెంచి ప్రజల నడ్డివిరిచారు. బీజేపీలో చేరి మునుగోడులో ఉప ఎన్నిక తీసుకువచ్చిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. ఇప్పుడు కాంగ్రెస్‌లో ఎందుకు చేరారో ఎవరికీ అర్థం కావడం లేదు. పచ్చి రాజకీయ అవకాశవాది అయిన రాజగోపాల్‌రెడ్డి డబ్బు అహంకారానికి ప్రజలు చెక్‌పెట్టాలి.

కొత్త రేషన్‌కార్డులిస్తాం

బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే.. పింఛన్లను రూ.5వేలకు పెంచుతాం. మహిళలకు నెలకు రూ.3వేలు ఇస్తాం. రూ.400కే గ్యాస్ సిలిండర్ అందిస్తాం. రైతుబంధును రూ.16 వేలకు పెంచుతాం. కొత్త రేషన్‌కార్డులు ఇస్తాం. అసైన్డ్ భూములపై పూర్తి యాజమాన్య హక్కులు కల్పిస్తాం..''అని కేటీఆర్ హామీ ఇచ్చారు.

కాంగ్రెస్, బీజేపీలు రైతుల పాలిట శత్రువులు

మంత్రి హరీశ్‌రావు

- రాష్ట్ర రైతుల మేలు కోసమే వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టలేదు
- కరెంట్ మీటర్లపై ఎక్కడైనా చర్చకు సిద్ధం
- కేంద్ర విధానాల వల్లే ఉద్యోగుల జీతాలు కొంత ఆలస్యం

సాక్షి, సిద్దిపేట/మిరుదొడ్డి(దుబ్బాక): 'కాంగ్రెస్, బీజేపీలు.. రైతుల పాలిట శత్రువులు, ఈ విషయం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వ్యాఖ్యలతో తెలిపోయింది'అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. వ్యవసాయ బావుల వద్ద మీటర్లు పెట్టకపోవడం వల్లే రాష్ట్రానికి రావాల్సిన అదనపు నిధులు అపేశామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారని ఆయన పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు విలేకరులతో మాట్లాడుతూ, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ ఇచ్చిన నివేదికలు అమలు చేస్తామని కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గద్దెనెక్కి.. ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఈ నివేదికలను అమలు చేయకపోవడంతో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ఉంటే ఇప్పటికే వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేసేవారని, రైతుల ఇంటికి బిల్లులు వచ్చేవని చెప్పారు. అయితే ఇక్కడ సీఎం కేసీఆర్ ఆ ప్రయత్నాలను అడ్డుకున్నారు కాబట్టే రైతులు సురక్షితంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో 69 లక్షల మంది రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మోటార్లకు మీటర్లు పెట్టవద్దని నిర్ణయం తీసుకున్నామన్నారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి రావాల్సిన రూ.25 వేల కోట్లను వదులుకుందని చెప్పారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ లేకుండా కేంద్రం కుట్ర పన్నుతోందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే మీటర్లు పెట్టారని, ఈ విషయంపై చర్చకు ఎక్కడకు రావడానికైనా సిద్ధమని మంత్రి సవాల్ విసిరారు. కాగా, రిజర్వ్‌బ్యాంక్ విడుదల చేసిన నివేదిక ప్రకారం తక్కువ అప్పులు తీసుకున్న రాష్ట్రాల్లో కింది నుంచి ఆరో స్థానంలో తెలంగాణ ఉందన్నారు. ఇలా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మారిందని నిర్మలా సీతారామన్ ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. కాంగ్రెస్ వస్తే రైతులకు కరెంట్ విషయంలో ఇబ్బందులు ఉంటాయని, తమ రాష్ట్రంలో 5 గంటల కరెంటు ఇస్తున్నామని ఇటీవల కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ చెప్పడమే ఇందుకు నిదర్శనమని హరీశ్‌రావు అన్నారు.

పెరిగిన తలసరి ఆదాయం..

2014లో తెలంగాణలో తలసరి ఆదాయం రూ 1,24,104 ఉండగా 2023లో రూ. 3,17,117కు పెరిగిందని హరీశ్‌రావు వివరించారు. దేశంలో రోజు రోజుకూ రూపాయి విలువ పడిపోవడానికి బీజేపీ ప్రభుత్వమే కారణమని అన్నారు. పాల ప్యాకెట్లు, బీడీ కట్టలపై జీఎస్టీ విధించింది.., గ్యాస్ సిలిండర్ రూ 400 నుంచి రూ.1,100లకు పెంచింది బీజేపీ సర్కార్ కాదా అని ప్రశ్నించారు.

కేంద్ర విధానాలవల్లే ఉద్యోగుల జీతాలు ఆలస్యం

కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగానే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కొంత ఆలస్యంగా చెల్లిస్తున్నామని, రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ పాత్రతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడుతుంది కనుక 1వ తేదీనే జీతాలు చెల్లిస్తామని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఎంప్లాయిస్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని, సస్పెన్షన్లు, వేధింపులు, సర్‌ప్రైజ్ విజిట్‌లు లేవని.. ఈ విషయాన్ని ప్రభుత్వ ఉద్యోగులు గమనించాలని కోరారు.

అసైన్డ్ భూములకు పట్టాలు

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములకు అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టాలిచ్చి, వారినే హక్కుదారులను చేస్తామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రాల్లో దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలసి బుధవారం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి రాగానే జనవరిలో కొత్త రేషన్ కార్డులతో పాటు పింఛన్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

ముస్లిం మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నాయకత్వంలో బీఆర్‌ఎస్ పార్టీ తొమ్మిదిన్నర సంవత్సరాలుగా లౌకిక ప్రభుత్వాన్ని నడుపుతోందని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. జమాతుల్-ఉలేమా సంస్థ ప్రతినిధులు బుధవారం మంత్రి హరీశ్‌రావును కలసి బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, సర్వజనహితమే లక్ష్యంగా ప్రభుత్వాన్ని నడిపిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, దేశంలో ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, రాజస్తాన్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులను తెలంగాణ కేటాయింపులు, ఖర్చులను పోల్చిచూడాలని అన్నారు. ముస్లిం మైనారిటీలు బీఆర్‌ఎస్‌తో లేరని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విషప్రచారాన్ని తిప్పికొట్టాలని కోరారు.



దుబ్బాక సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

మూడోసారీ మా ప్రభుత్వమే

▶ మొదటి పేజీ తరువాయి

ఇదిగో తోక అన్నట్టుగా ప్రచారం చేస్తున్నారు. మొదట్లో మేం కూడా కొంత గందరగోళపడినా క్షేత్రస్థాయి నుంచి మాకు మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చింది. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో మూడో స్థానంలో, కొడంగల్‌లో రెండో స్థానంలో నిలిచే పరిస్థితి ఉన్నప్పుడు కాంగ్రెస్ గెలిచే అవకాశం ఎక్కడుంది? కాంగ్రెస్ దిగ్గజాలైన కోమటిరెడ్డి సోదరులు, జానారెడ్డి కుమారుడు, జగ్గారెడ్డి వంటివారు కూడా ఓడిపోతున్నారు. బీజేపీ రెండు, మూడు సీట్లకే పరిమితం అవుతుంది. మేం ఖమ్మంలో ఆరు స్థానాల్లో, నల్లగొండలో 7 నుంచి 9 సీట్లలో కచ్చితంగా గెలుస్తాం. మిగతా నియోజకవర్గాల్లో గట్టి పోటీ ఉన్నా మా పార్టీ పరిస్థితి నిక్షేపంగా ఉంది.

వాపు చూసి బలుపు అనుకుంటున్నారు

రాష్ట్రంలో బీజేపీ గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయి ఆరంభంలో కొంత కాంగ్రెస్ వైపు మళ్లడంతో ఆ వాపును చూసి బలుపు అనుకుంటున్నారు. అది పాలపొంగు వంటి హడావుడి మాత్రమే. క్షేత్రస్థాయిలో బలంగా ఉన్న బీఆర్‌ఎస్ కేడర్ కసిగా పనిచేస్తున్నారు. హుజూరాబాద్, గోషామహల్, కరీంనగర్, కోరుట్లలోనూ గెలుస్తున్నాం. మాకు 15 నుంచి 18 చోట్ల బీజేపీ నుంచి, మిగతా చోట్ల కాంగ్రెస్ నుంచి పోటీ ఉండగా.. మేం మాత్రం అన్నిచోట్లా పోటీలో ఉన్నాం. ముదిరాజ్‌లకు టికెట్ల సర్దుబాటులో అవకాశం ఇవ్వలేకపోయాం. కాసాని జ్ఞానేశ్వర్, ఎర్ర శేఖర్ తదితరుల చేరికతో ఈ విషయాన్ని ఆ సామాజికవర్గం అర్థం చేసుకుంది.

బీజేపీతో ఎన్నడూ అంటకాగలేదు

కేసీఆర్ 50ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ బీజేపీతో అంటకాగలేదు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్‌లలో కాంగ్రెస్ పార్టీ బీజేపీకి అనుకూలంగా వ్యవహరించింది. ప్రస్తుత ఎన్నికల్లో ముస్లిం పట్ల బద్ధ వ్యతిరేకత కలిగిన బండి సంజయ్, అర్వింద్, రాజాసింగ్‌లపై కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను నిలబెట్టింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బీజేపీ ఏజెంట్‌గా పనిచేస్తూ మోదీని ఒక్కసారి కూడా విమర్శించలేదు. విపక్ష నేతల ఇళ్లపై జరుగుతున్న ఈడీ, ఐటీ దాడులను మాకు అంటగట్టడం సరికాదు. రైతుబంధు దుబారా, ధరణి రద్దు అంటూ కాంగ్రెస్.. ఇరిగేషన్ ప్రాజెక్టుల మీద దొంగ రిపోర్టులతో బదనాం చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నాయి. తెలంగాణను అప్పుల పాలు చేశామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఆరోపణలు చేయడం విడ్డూరం. మోదీ ప్రతీ కుటుంబంపై రూ.5లక్షల అప్పు మోపారు. ఆయన ప్రియమైన ప్రధాని కాదు.. పిరమైన ప్రధాని.

కేసీఆర్ అంటే భయంతోనే..

తెలంగాణకు ఉన్న ఏకైక గొంతు కేసీఆర్. ఆయన జాతీయ పార్టీలకు కొరుకుడు పడని కొయ్య. మూడోసారి అధికారంలోకి వస్తే ఏకు మేకు అవుతాడనేది కాంగ్రెస్, బీజేపీల భయం. కర్ణాటక, గుజరాత్‌ల నుంచి రాష్ట్రంలోని ఆ పార్టీ నేతలకు వస్తున్న డబ్బుకు అడ్డూ అదుపు లేదు. ఆ రెండు జాతీయ పార్టీలకు 28 రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. కానీ మాకు మాత్రం తెలంగాణే కేంద్రం. వాళ్లు తెలంగాణను గెలవాలనుకుంటున్నారు. మేం తెలంగాణను గెలిపించాలని అనుకుంటున్నాం. తెలంగాణ ఏకైక గొంతు కేసీఆర్‌ను కాపాడుకోవాలా వద్దా అని ప్రజలు తేల్చుకోవాల్సిన సందర్భం ఇది.

కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు ఇస్తాం

జనవరి నుంచి కొత్త రేషన్ కార్డులు, కొత్త ఆసరా పింఛన్లు ఇవ్వడం ప్రారంభిస్తాం. బీడీ కార్మికులకు 2023 వరకు కటాఫ్ పెంచి కొత్తగా లక్షన్నర మందికి పింఛన్లు ఇస్తాం. భర్తను కోల్పోయిన భార్యల పేరిట పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకుంటాం. గల్ఫ్ కార్మికులకు ఉచిత బీమా కల్పిస్తాం. ఆటో డ్రైవర్లకు రూ.వంద కోట్ల మేర వాహన ఫిట్‌నెస్ చార్జీలు రద్దు చేస్తాం. జాబ్ క్యాలెండర్, టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన, ఉద్యోగ నియామకాలు సక్రమంగా నిర్వహించడం వంటి అంశాలపై ఇప్పటికే యువతకు స్పష్టత ఇవ్వడంతోపాటు దీనిని మరింత బలంగా ప్రచారం చేస్తాం.

ఈసీ అనుమతివ్వగానే రైతుబంధు సొమ్ము

రూ.19,445 కోట్ల పంట రుణాల మాఫీకిగాను ఇప్పటికే రూ.14వేల కోట్ల పైచిలుకు క్లియర్ చేశాం. మిగతా రూ.5వేల కోట్ల మాఫీ ప్రక్రియ ప్రతిపక్షాల ఫిర్యాదు వల్ల ఆగింది. రుణమాఫీ చెల్లింపులకు అనుమతి ఇవ్వాల్సిందిగా ఎన్నికల సంఘాన్ని కోరాం. అనుమతి వస్తే వెంటనే రుణమాఫీ చేస్తాం. రైతుబంధు 12వ దఫా సొమ్ము విడుదల కోసం కూడా ఎన్నికల సంఘాన్ని అనుమతి కోరాం. పీఎం కిసాన్ డబ్బులు వేసే వెసులుబాటు కల్పించి రైతుబంధు విషయంలో ఇబ్బంది పెట్టడం సరికాదు. మా మేనిఫెస్టోను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గడపగడపకు వెళ్తాం..''అని కేటీఆర్ తెలిపారు.

క్లుప్తంగా...

కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సూర్జేవాలా



సాక్షి, హైదరాబాద్: చెదిరిన కలలు, భయంకరమైన ఆత్మహత్యలు, భరించలేని బాధ తెలంగాణ యువతకు నియంత కేసీఆర్ పాలన చేసిన ద్రోహమని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్‌సింగ్ సూర్జేవాలా వ్యాఖ్యానించారు. యువత జీవితాల్లో బీఆర్ఎస్ చీకట్లు నింపిందని ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం గాంధీ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి అజయ్‌కుమార్, టీపీసీసీ మీడియా ఇన్‌చార్జి కుసుమకుమార్, రమణి, షామాలతో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ భవిష్యత్‌ను దోచుకున్న కేసీఆర్ కమీషన్ మాఫియా రాజ్ అని అభివర్ణించారు. పదేళ్లలో లెక్కలేనన్ని అబద్ధపు వాగ్దానాలిచ్చిందని, తెలంగాణ యువత కలలు, ఆకాంక్షలను కేసీఆర్ ప్రభుత్వం అణచివేసిందని రణ్‌దీప్‌సింగ్ మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇచ్చిన ఎన్నో హామీలను బీఆర్ఎస్ విస్మరించిందని, కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు గుణపాఠం నేర్పే విధంగా ఈనెల 30న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మార్పు తెస్తుందని, యువత భవిష్యత్ కోసం బంగారు తెలంగాణకు నాంది పలుకుతామని హామీ ఇచ్చారు.

బెల్టుషాపులు రద్దు చేస్తాం

జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నెట్టా డిసౌజా



సాక్షి, హైదరాబాద్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని బెల్టుషాపులన్నింటినీ రద్దు చేస్తామని మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు నెట్టా డిసౌజా హామీనిచ్చారు. గాంధీభవన్‌లో ఏఐసీసీ అధికార ప్రతినిధి రమణి తదితరులతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడుతూ...తెలంగాణ ప్రజానీకాన్ని బీఆర్ఎస్ పార్టీ తాగుబోతులను చేస్తోందన్నారు. మద్యం ఆదాయం మీదే ఈ రాష్ట్రం నడుస్తోందని వ్యాఖ్యానించారు. 2014 నుంచి 2021 వరకు రాష్ట్రంలో నేరాలు 47 శాతానికి పెరిగాయని, మహిళలపై అత్యధిక దాడులు జరుగుతున్న రాష్ట్రాల్లో దక్షిణ భారతదేశంలో తెలంగాణ నంబర్‌వన్ అయిందని చెప్పారు. రాష్ట్రంలో మద్యం వినియోగం పెరిగిన కారణంగానే మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి మహిళకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 నగదుసాయం చేస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేస్తామని, మహిళలందరికీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని డిసౌజా వెల్లడించారు.

లక్ష్మారెడ్డిని గెలిపించండి: భట్టి



తుక్కుగూడ: కాంగ్రెస్ గుర్తు, తమ పార్టీ కార్యకర్తల శ్రమతో గెలిచి, బీఆర్ఎస్‌లో చేరిన మంత్రి సబితాఇంద్రారెడ్డికి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుతో కలిసి బుధవారం తుక్కుగూడలో నిర్వహించిన రోడ్ షోలో భట్టి మాట్లాడారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని నిరుపేదలకు కాంగ్రెస్ పార్టీ వేలాది ఎకరాల భూములు పంచిపెడితే.. బీఆర్ఎస్ సర్కారు, సబితారెడ్డి వీటిని లాక్కున్నారని భట్టి ఆరోపించారు. ఈసారి తాము అధికారంలోకి రాగానే పేదల భూములను తిరిగి ఇచ్చేస్తామన్నారు. నిజాయితీకి మారుపేరైన లక్ష్మారెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, నాయకులు చిగురింత పారిజాత తదితరులు పాల్గొన్నారు.

ఓట్లు చీలకుండా ఉండేందుకే కాంగ్రెస్‌కు మద్దతు

టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం



తొర్రూరు రూరల్: ఈ ఎన్నికల్లో మరోసారి గెలిచేందుకు కేసీఆర్‌కు ఎలాంటి అస్త్రాలు లేవని, కేవలం డబ్బు, మద్యంతోనే గెలవాలని చూస్తున్నారని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెలికట్ట గ్రామ శివారులో జరిగిన ఓటరు చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాల్లో కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. అందుకే కేసీఆర్‌తో కొట్లాట పెట్టుకున్నామని, అంతేగానీ తనకు.. ఆయనకు ఎలాంటి గట్టు పంచాయితీ లేదన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని తనే తెచ్చానని గొప్పలు చెప్పుకునే కేసీఆర్‌ను వచ్చే ఎన్నికల్లో ఇంటికి పంపించకపోతే రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తారని కోదండరాం హెచ్చరించారు. అందుకే ఓట్లు చీలిపోకుండా ఉండేందుకే ప్రత్యామ్నాయంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నామన్నారు.

గట్టిపోటీ... అధిక సీట్లు...

ఆ దిశగా కసరత్తు చేస్తున్న కమలం

- 25–30 సీట్లలో గట్టిపోటీతో పాటు అధిక సీట్లు గెలుపొందడంపై స్పెషల్ ఫోకస్
- అగ్రనేతల ప్రచారం ఉధృతం.. ముఖ్యనేతల పర్యటనలన్నీ తెలంగాణలోనే
- 25 నుంచి మూడురోజులు 6 సభలు,
- హైదరాబాద్‌లో రోడ్‌షోకు ప్రధాని మోదీ
- ఫలితాలు వెలువడ్డాక రాష్ట్ర రాజకీయాల్లో నిర్ణయాత్మక పాత్ర బీజేపీదేనన్న అంచనాల్లో నేతలు



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల తేదీ దగ్గరపడే కొద్దీ రాష్ట్రంలో కమలదళం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. 25 నుంచి 30 సీట్లలో బీజేపీ నిర్ణయాత్మకంగా వ్యవహరించడంతో పాటు వాటిలో అధిక స్థానాలు గెలుచుకోవడంపై ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోంది. ఆ స్థానాల్లో పార్టీ అగ్రనేతలు విస్తృత ప్రచారం నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఎస్సీ వర్గీకరణ, బీసీ సీఎం నినాదంతోపాటు కీలక స్థానాల్లో ప్రచారం చివరి రోజుల్లో అగ్రనేతల విస్తృత ప్రచారం పార్టీ అభ్యర్థుల విజయానికి కలిసి వస్తుందని రాష్ట్ర నేతలు అంచనా వేస్తున్నారు. త్రిముఖ పోటీ ఉన్న నియోజకవర్గాల్లో ఆయా వర్గాల ఓట్లు చీలితే పలుచోట్ల బీజేపీకి అనుకూల ఫలితాలు వస్తాయని భావిస్తున్నారు. డిసెంబర్ 3న వచ్చే ఫలితాల తరువాత రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందన్న నమ్మకాన్ని పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు.

అగ్రనేతలంతా ఇక్కడే...

ప్రధాని మోదీ సహా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డా, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీ, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు యోగి ఆదిత్యనాథ్, హిమంత బిశ్వశర్మ, ప్రమోద్ సావంత్, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, ఇతర ముఖ్య నేతలు విస్తృత పర్యటనలు నిర్వహిస్తున్నారు. గత మూడు రోజులుగా బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి(సంస్థాగత) బీఎల్ సంతోష్ హైదరాబాద్‌లోనే మకాం వేసి సంస్థాగతంగా పార్టీ యంత్రాంగం ఏ మేరకు ఎన్నికల యాజమాన్య నిర్వహణ చేస్తోందో లోతుగా సమీక్షిస్తున్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాష్ జవదేకర్, జాతీయ ప్రధానకార్యదర్శి తరుణ్‌చుగ్, రాష్ట్ర సహ ఇన్‌చార్జి అర్వింద్ మీనన్‌తో సంతోష్ సమావేశమయ్యారు. రాష్ట్రంలోని ఒక్కొక్క లోక్‌సభ నియోజకవర్గానికి ఒక ముఖ్యనేతను ఇన్‌చార్జిగా నియమించి, పోలింగ్ ముగిసేదాకా అన్ని అంశాలను సమన్వయం చేయాలనే కీలక నిర్ణయం తీసుకున్నట్టు పార్టీవర్గాల సమాచారం.

ప్రధాని సుడిగాలి పర్యటనపై ఆశలు

ప్రచారపర్వం ముగిసేలోగా పీఎం మోదీ వరుసగా మూడురోజులు...ఆరుసభల్లో పాల్గొనడంతో పాటు చివర్లో హైదరాబాద్‌లో రోడ్‌షో నిర్వహించనున్నారు. 25న కామారెడ్డి (కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్స్‌వాడ) నిజామాబాద్ (అర్బన్), నిజామాబాద్ (రూరల్), రంగారెడ్డి జిల్లా(మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, ఎల్‌బీనగర్, రాజేంద్రనగర్, కల్వకుర్తి,), 26న తూప్రాన్ (గజ్వేల్, దుబ్బాక, మేడ్చల్, మెదక్, నరసాపురం), నిర్మల్ (నిర్మల్, ముథోల్, బాల్కొండ, ఖానాపూర్), 27న మహబూబాబాద్ (మహబూబాబాద్, ములుగు, తదితర ఎస్టీ స్థానాలు) కరీంనగర్ (కరీంనగర్, హుజూరాబాద్, మానకొండూరు, వేములవాడ, చొప్పదండి, కోరుట్ల) ఇలా ఆయా ఉమ్మడి జిల్లాలు, నియోజకవర్గాల పరిధిలోని వివిధ వర్గాల ఓటర్లపై ప్రభావం చూపేలా మోదీ ప్రచార కార్యక్రమాలను ఖరారు చేసినట్టు పార్టీ వర్గాల సమాచారం.

బీసీ, ఎస్సీల అండపై అంచనాలు.. ఎస్టీలకు హామీ?

అధికార బీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీలను దీటుగా ఎదుర్కోవడంతో పాటు ఆ పార్టీలకు చెక్ పెట్టేలా బీసీ నేతను సీఎంను చేస్తామన్న ప్రకటన తమకు కలిసి వస్తుందని బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు. కాస్త అలస్యంగా ప్రకటించినా..ఈ నినాదాన్ని బీజేపీ తన ఎన్నికల ప్రధాన ప్రచార అస్త్రంగా మలచుకోగలిగింది. బీసీ సీఎం నినాదంతో పాటు ఎస్సీ ఉపకులాల వారీగా రిజర్వేషన్ల వర్గీకరణపై ప్రధాని మోదీ మద్దతు ప్రకటన మేలు చేస్తుందని భావిస్తున్నారు. రాష్ట్రంలోని ఎస్టీల జనాభాకు అనుగుణంగా 9 నుంచి 10 శాతానికి రిజర్వేషన్లు పెంచుతామనే హామీ కూడా బీజేపీ నేతలు త్వరలోనే ఇవ్వనున్నట్టు విశ్వసనీయ సమాచారం.

ఓ అంచనా ప్రకారం బీజేపీ బలంగా ఉన్న నియోజకవర్గాలు...

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని... ముథోల్, నిర్మల్, బోథ్, ఖానాపూర్, సిర్పూర్
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో... కామారెడ్డి, నిజామాబాద్ (అర్బన్), ఆర్మూరు, జుక్కల్
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో... హుజూరాబాద్, కరీంనగర్, కోరుట్ల, మానకొండూరు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో... వరంగల్ (ఈస్ట్), పరకాల, ములుగు, మహబూబాబాద్
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో... మహేశ్వరం, ఎల్‌బీనగర్, చేవెళ్ల, కుత్బుల్లాపూర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి,
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో... కల్వకుర్తి, మహబూబ్‌నగర్, మక్తల్
- ఉమ్మడి మెదక్ జిల్లాలో... దుబ్బాక, పటాన్‌చెరు, నరసాపూర్,
- నల్లగొండ జిల్లాలో... సూర్యాపేట, మునుగోడు
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో... గోషామహల్, అంబర్‌పేట, ముషీరాబాద్, జూబ్లీహిల్స్, మల్కాజిగిరి

ఆ వంద లేఖలు కేసీఆర్ బయటపెట్టాలి

▶ మొదటి పేజీ తరువాయి

ఆ పార్టీల విధానం.. అని మండిపడ్డారు. 2014లో ఇచ్చిన దళిత సీఎం హామీని కేసీఆర్ ఇప్పుడైనా అమలుచేస్తారా ? దళిత సీఎంని ప్రకటిస్తారా ? బీసీ సీఎంను చేసే దమ్ము ధైర్యం కాంగ్రెస్‌కు ఉందా? అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ వస్తే మరింత విధ్వంసం...

రాష్ట్రంలో అధికారంలో ఉంటూ బీఆర్ఎస్ సర్కార్ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తే...కాంగ్రెస్ అధికారానికి వస్తే మరింత విధ్వంసం చేస్తుందని కిషన్ రెడ్డి హెచ్చరించారు. 'కాంగ్రెస్ రాష్ట్రాన్ని దోచుకుంది. 50 ఏళ్లపాటు పాలించి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది. కాంగ్రెస్ పార్టీకి అవినీతి ఒక వృత్తి, ఒక కళ.. అవినీతిని వ్యవస్థీకృతం చేసిన పార్టీ అది. అవినీతికి పర్యాయపదం ఆ పార్టీ''అని ధ్వజమెత్తారు. ''యూపీఏ హయాంలో రూ.10 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కుంభకోణాల పేరుతో దోపిడీ చేసింది.. కర్ణాటకలో ఇటీవలే అధికారంలోకి వచ్చి.. వందల రూ.కోట్లు తెలంగాణలో ఎన్నికల కోసం ఖర్చుచేస్తోంది.''అని విమర్శించారు. బీసీలను అవమానించే విధంగా రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు.

నిజం మాట్లాడిన నిర్మలను విమర్శిస్తారా?

'వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టమన్నాం తప్ప.. రైతులనుంచి ఒక్క రూపాయి కూడా వసూలుచేయమని చెప్పలేదు. డిస్కంల ద్వారా ఎంత ఉత్పత్తి అవుతోంది. ఎంత పంపిణీ అవుతోంది. కంపెనీలు దొంగతనంగా వాడే కరెంటు ఎక్కడకు పోయిందో చెప్పాలి. రైతుల పేరు చెప్పి.. ఇతరులకు ఇస్తున్న కరెంటు లెక్కలు తెలవాలన్నదే కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఉద్దేశం కాగా... ఒక మహిళా మంత్రిని పట్టుకుని సిగ్గుందా అని మాట్లాడడం పద్ధతేనా..అసలు కేసీఆర్‌కు సిగ్గుందా ?'అని కిషన్‌రెడ్డి నిలదీశారు. నిర్మలా సీతారామన్ వాస్తవాలే మాట్లాడారని అన్నారు.

3న బీజేపీ అధికారంలోకి వస్తుంది... రైతులు వడ్లు అమ్ముకోవద్దు...

బీజేపీకి ప్రజలు బ్రహ్మరథం పట్టనున్నారు.. డిసెంబర్ 3న అధికారంలోకి వస్తుంది.. అప్పటి వరకు రైతులు వడ్లను అమ్ముకోకండి. వరి క్వింటాల్ కనీస ధర రూ.3,100కు కొంటుంది. బీజేపీ అధికారానికి రాగానే రైతులకు ఉచిత కరెంట్ ఇస్తుంది'అని కిషన్ రెడ్డి హామీనిచ్చారు. డిసెంబర్ 3 తర్వాత బీసీ నేత పేరును సీఎంగా తాము ప్రతిపాదిస్తామన్నారు.

మోదీపై నమ్మకంతోనే బీజేపీకి మద్దతు



దుబ్బాకటౌన్: 'రాష్ట్రంలో దళితుడిని సీఎం చేసి తాను వాచ్ డాగ్ (కాపలా కుక్క)లా ఉంటానని చెప్పిన కేసీఆర్.. దళితుడిని సీఎం చేసిండా? ఆయనే కుర్చీలో కూర్చుండి రాజభోగాలు అనుభవిస్తున్నారు'అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ మండిపడ్డారు. బుధవారం దుబ్బాక పట్టణంలో బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావుకు మద్దతుగా రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన సమావేశంలో మందకృష్ణ మాట్లాడారు. దళితులను కేసీఆర్ మోసం చేశారని, ఆయనకు ఈ ఎన్నికల్లో దళిత బిడ్డలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. తాను ఏ పార్టీకి చెందిన వాడిని కాదని అయితే దళిత, బీసీ పక్షపాతి అయిన ప్రధాని నరేంద్రమోదీ మీద నమ్మకంతో బీజేపీకి మద్దతు తెలుపుతున్నానని చెప్పారు.

మీ తీర్పు మీ ప్రతిష్టను పెంచుతుంది

▶ మొదటి పేజీ తరువాయి



బుధవారం నల్లగొండలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా భరోసా సభకు హాజరైన పార్టీ శ్రేణులు, ప్రజలు

ఎంతో ప్రతిష్టాత్మకమైనవి. పేదల భూములు లాక్కున్న వారికి వ్యతిరేకంగా ఈ ఎన్నికల్లో పోరాడుతున్నాం. తెలంగాణలో అవినీతికి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి. మీ తీర్పు మీ కీర్తి ప్రతిష్టను పెంచుతుంది. దేశంలో మీకు గౌరవం లభిస్తుంది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశంలో కూడా గెలుస్తుంది..' అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. బుధవారం నల్లగొండ, ఉమ్మడి పాలమూరులోని అలంపూర్ నియోజకవర్గ పరిధి అయిజల్లో నిర్వ హించిన ప్రజాగర్జన సభల్లో ఆయన మాట్లాడారు.

మేం భయపడతామనుకోవడం వాళ్ల భ్రమ

'కాంగ్రెస్‌కు సంబంధించిన నేషనల్ హెరాల్డ్‌తో పాటు మూడు హిందూ పత్రికలకు సంబంధించి రూ.780 కోట్ల ఆస్తిని మోదీ జప్తు చేసుకున్నారు. స్వాతంత్య్ర ఉద్యమ గొంతుక, ప్రజల్లో చైతన్యం కోసం నెహ్రూ ఈ పేపర్లను తీసుకొచ్చారు. వీటి ఆస్తులను జప్తు చేస్తే.. తెలంగాణ ప్రజలు భయపడి బీజేపీ, కేసీఆర్‌కు ఓట్లు వేస్తారని భావించి రాజకీయ కుట్రకు తెరలేపారు. మా ఆస్తి జప్తు చేస్తే కాంగ్రెస్ పార్టీ భయపడుతుందని కేసీఆర్, బీజేపీ అనుకుంటే అది భ్రమనే. కాంగ్రెస్‌కు పోరాటం కొత్త కాదు. బ్రిటిష్ పాలకులకే భయపడలేదు. బీజేపీకి భయపడతామా? మోదీని ప్రజలు క్షమించరు..తరిమికొడతారు..'అని ఖర్గే అన్నారు.

అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నారు..

'తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారు. కానీ ఇక్కడ అభివృద్ధి జరగలేదు. కేసీఆర్ తన పాలనలో ధనిక రాష్ట్రమైన తెలంగాణను అప్పులపాలు చేసి.. ఒక్కొక్కరిపై రూ.1.40 లక్షల అప్పు పెట్టారు. రాష్ట్రంలో 2 లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా కేసీఆర్ ప్రభుత్వం భర్తీ చేయలేదు. 20 లక్షల మంది నిరుద్యోగుల్లో ఏ ఒక్కరికీ ఇప్పటివరకు నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. మోదీ 2004లో అధికారంలోకి వచ్చినప్పుడు విదేశాల్లోని నల్లధనాన్ని తెప్పిస్తాం.. ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి మరిచిపోయారు. ప్రతి ఏడాదీ 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తాం, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని ఆయన చెప్పినవన్నీ అబద్ధాలే అని రుజువయ్యింది. కేసీఆర్, మోదీలు పేదల పక్షాన లేరు. ఢిల్లీలో ఉండే మోదీ, హైదరాబాద్ ఫాంహౌస్‌లో ఉండే కేసీఆర్ ఇద్దరూ ఒక్కటే. వీరు నిరుపేదలు కష్టాలు పడుతున్నా పట్టించుకోవడం లేదు. అబద్ధాలతో మోసం చేస్తున్నారు..'అని ఆయన ఆరోపించారు.

మీకే 20 సీట్లు.. చాలెంజ్: కోమటిరెడ్డి

తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని భువనగిరి ఎంపీ, నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రజలను కోరారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. 'కాంగ్రెస్‌కు 20 సీట్లు రావని సీఎం కేసీఆర్ అంటున్నారు.. చాలెంజ్ చేస్తున్నా.. మీకు ఈసారి 20 సీట్లు వస్తున్నాయి.. మాకు 90 సీట్లు వస్తున్నాయి..'అని పేర్కొన్నారు. పదేళ్ల కేసీఆర్ పరిపాలనలో అభివృద్ధి జరగలేదని, తెలంగాణ ప్రజలపై దండయాత్ర జరిగిందని కాంగ్రెస్ నేత విజయశాంతి విమర్శించారు. ఈసారి ఎన్నికల్లో కేసీఆర్ గద్దె దిగాల్సిందేనన్నారు. ఈ సభల్లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్, అలంపూర్ కాంగ్రెస్ అభ్యర్థి సంపత్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు పక్కాగా అమలు చేస్తాం..

'రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం తేవాల్సిన అవసరం ఉంది. ఇందిర దేశాన్ని ధాన్యాగారంగా మార్చారు. నల్లగొండలో నాగార్జునసాగర్ ప్రాజెక్టును కట్టింది కాంగ్రెస్ పార్టీయే.. ఆ నీటిని మొదట ఇందిరాగాంధీయే విడుదల చేశారు. పేదరిక నిర్మూలన కోసం 20 సూత్రాల పథకం, అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టారు. అలాంటి ఇందిరాగాంధీని, గాంధీ కుటుంబాన్ని కేసీఆర్ విమర్శించడం ఎంతవరకు సమంజసం? సోనియా, రాహుల్, ప్రియాంక ప్రధాని పదవి కావాలని ఎప్పుడూ ఆశించలేదు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇందిరమ్మ తరహాలో సంక్షేమ కార్యక్రమాలు చేపడతాం. ఆరు గ్యారంటీ పథకాలను కచ్చితంగా అమలు చేసి తీరుతాం. మహిళకు నెలకు రూ.2,500, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేస్తాం. రాష్ట్రంలోని ప్రతి మహిళకు ఉచిత బస్సు సౌకర్యం, రైతులకు, కౌలు రైతులకు ప్రతి ఏడాది ఎకరానికి రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు అందజేస్తాం. పంటలకు మద్దతు ధర, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇస్తాం. ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షలు అందజేస్తాం. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి 250 గజాల స్థలం ఇవ్వడంతోపాటు రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణం చేస్తాం. వృద్ధులకు పింఛన్లను రూ.4 వేలకు పెంచుతాం. విద్యార్థుల కోసం విద్యాభరోసా కార్డు అందజేస్తాం. వాల్మీకుల సమస్యలను పరిష్కరిస్తాం. రైతులకు సాగునీరు అందిస్తాం. పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తాం. బీఆర్ఎస్, బీజేపీకి ఎవరూ భయపడొద్దు. కాంగ్రెస్ పార్టీ అందరికీ అండగా ఉంటుంది..'అని ఖర్గే హామీ ఇచ్చారు.

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా రాక

నేడు ఎన్నికల ప్రచారం



సాక్షి, హైదరాబాద్: పార్టీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొనే నిమిత్తం బీజేపీ జాతీ య అధ్యక్షుడు జేపీ నడ్డా బుధవారం రాత్రి నగరానికి చేరుకున్నారు. ఆయన గురువారం సంగారెడ్డి, నిజామాబాద్ నియోజకవర్గాల పరిధిలో నిర్వహించే బహిరంగ సభల్లో పాల్గొంటారు. సాయంత్రం హైదరాబాద్‌లో నిర్వహించే రోడ్డు షో పాల్గొనే అవకాశాలున్నాయి. మళ్లీ నడ్డా 25, 26, 27 తేదీలలో కూడా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో నిర్వహించే సభలు, రోడ్‌షోలలో పాల్గొంటారని పార్టీ వర్గాల సమాచారం. బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటనల షెడ్యూల్ కూడా త్వరలోనే ఖరారు కానున్నట్టు తెలుస్తోంది. అది ఖరారైతే.. 24, 26, 28 తేదీల్లో రోజు విడిచి రోజూ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనవచ్చునని తెలిసింది.

నేడు కేంద్రమంత్రి పీయూష్ రాక

కాగా, గురువారం రాంకోఠిలోని జైన్ భవన్‌లో నిర్వహించనున్న మేధావుల సమావేశానికి కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ హాజరుకానున్నారు. గురువారం ఉదయం ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో గోవా సీఎం ప్రమోద్ సావంత్ ప్రచారం నిర్వహిస్తారు. గురువారం సిరిసిల్ల అసెంబ్లీ పరిధిలో నిర్వహిస్తున్న బహిరంగసభలో కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతీ ఇరానీ పాల్గొంటారు. సాయంత్రం మల్కాజిగిరి నియోజకవర్గంలోని అనంద్‌నగర్ కాలనీలో మహిళా ఆత్మీయ సమ్మేళనానికి హాజరవుతారు. గురువారం వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల పరిధిలో నిర్వహిస్తున్న బహిరంగసభల్లో కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అర్జున్ ముండా పాల్గొంటారు.

కన్నడ నాట అరాచక సర్కార్

- కాంగ్రెస్ 6 గ్యారంటీలు ఉత్తివే
- వాటిని నమ్మి కర్ణాటక మాదిరిగా తెలంగాణ ప్రజలు మోసపోవద్దు
- కర్ణాటక మాజీ సీఎం యడియూరప్ప వెల్లడి



సాక్షి, హైదరాబాద్: కన్నడ నాట కాంగ్రెస్ ఆధ్వర్యంలో అరాచక సర్కార్ రాజ్యమేలుతోందని కర్ణాటక మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ అధికార దాహంతో ఇచ్చిన ఉచిత పథకాల దుష్పరిణామాలు ఇప్పటికే కర్ణాటకపై కనిపిస్తున్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరునెలల కాలంలోనే దివాళా స్థితికి తెచ్చిన ఘనత కాంగ్రెస్ నేతలదేనని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన బుధవారం పార్టీ మీడియా సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. కర్ణాటకలో ఇచ్చిన ఐదు గ్యారంటీలు ఉత్తుత్తివే అని, ప్రజలకు అవి ఏమాత్రం భరోసాను ఇవ్వలేదని స్పష్టమైందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీలు ఉత్తివేనని.. వాటిని నమ్మి కర్ణాటక మాదిరిగా తెలంగాణ ప్రజలు మోసపోవద్దని చెప్పారు. ఉచిత విద్యుత్, అన్నభాగ్య తదితర పథకాలేవీ సరిగా అమలు కావడం లేదని ఆరోపించారు. ఆయా పథకాల అమలుకు నిధుల కేటాయింపు నామమాత్రంగా చేస్తుండటంతో వాటి మనుగడే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దీంతో మంత్రులు, పార్టీ నేతలు సాంకేతిక కారణాలను సాకుగా చూపి పథకాల అమలు సరిగా జరగడం లేదని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అక్కడి ప్రజలు పథకాల అమలు కోసం నిలదీయడంతోపాటు పెద్ద ఎత్తున ఫిర్యాదు లు చేస్తున్నారని చెప్పారు. అన్న భాగ్య పథకం కింద పేదలకు పదికేజీల బియ్యం ఇస్తామ ని హామీ ఇచ్చినా దానిని ఎక్కడా పూర్తిస్థాయిలో అమలుచేస్తున్న దాఖలాలు లేవన్నారు. అదేవిధంగా 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరాను కూడా అనేక నిబంధనలు పెట్టి అటకెక్కిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు కాంగ్రెస్ హామీలను, ఇంకా బీఆర్ఎస్ వాగ్దానాలను నమ్మి మోసపోవద్దన్నారు.

ప్రజల కోసం పోరాడుతున్నాం.. మద్దతివ్వండి

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ టౌన్: నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, ఇంటికో ఉద్యోగం ఇస్తానని రెండుసార్లు ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేశారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ మండిపడ్డారు. ప్రజల కోసం పోరాడుతున్న బీజేపీకి మద్దతివ్వాలని కోరారు. బుధవారం కరీంనగర్‌లోని రేకుర్తి, మంకమ్మతోటలో నిర్వహించిన కార్నర్ మీటింగుల్లో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ 2,40,000 ఇళ్లు ఇస్తే కేసీఆర్ ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వకుండా కేసీఆర్ మాత్రం 100 గదులతో ప్రగతి భవన్ కట్టుకున్నారని దుయ్యబట్టారు. పదేళ్లలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా 30 లక్షల మంది నిరుద్యోగులను మోసం చేశారన్నారు. కేసీఆర్ ఇంట్లో మాత్రం ఐదుగురికి ఉద్యోగాలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. నిరుద్యోగులు ప్రశ్నించిన పాపానికి కేసీఆర్ కొడుకు కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇటీవల అన్ని పరీక్షల ప్రశ్నపత్రాలను లీక్ చేశారని, పేపర్ లీకేజీలపై తాను కొట్లాడితే... తన ఇంటిపై వందల మంది పోలీసులతో దాడి చేయించి అరెస్ట్ చేయించారని మండిపడ్డారు.



రేకుర్తిలో మాట్లాడుతున్న బండి సంజయ్

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

ములుగు, ఇల్లెందు, మక్తల్‌లో ఈటల ఎన్నికల ప్రచారం



ములుగు/ఇల్లెందు/నారాయణపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ వదలడని, హామీలను నెరవేర్చడని హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ పార్టీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం ములుగు, ఇల్లెందు, మక్తల్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ములుగు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి డాక్టర్ అజ్మీర ప్రహ్లాద్‌కు మద్దతుగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్యపు ప్రచారాలను నమ్మొద్దని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులు పండించిన ప్రతి గింజను తరుగు లేకుండా కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతుబంధు పథకం ఒక్కటి పెట్టి ఇతర పథకాలు బంద్ చేసిన ఘనుడు కేసీఆర్ అని అన్నారు. మిర్చికి గిట్టుబాటు ధర ఇవ్వాలని అడిగిన పాపానికి రైతులకు బేడీలు వేసి, జైలులో పెట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి డి.రవీంద్రనాయక్ విజయాన్ని కాంక్షిస్తూ ఇల్లెందులో చేపట్టిన విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. సింగరేణికి పుట్టినిల్లు అయిన ఇల్లెందులో కార్మికులు ఆదాయ పన్ను మినహాయింపు కావాలని కోరుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే ప్రధానితో చర్చించి ఈ సమస్య పరిష్కరిస్తామని ఈటల హామీ ఇచ్చారు.

గజ్వేల్ గడ్డపై కాషాయ జెండా..

దళితుల భూములను లాక్కొని.. పెద్దలకు అప్పజెప్పుతూ కేసీఆర్ రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా మారిందని ఈటల అన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్‌లో బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డికి మద్దతుగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అబద్ధాలకోరు, అవినీతి, కుటుంబ పాలన సాగిస్తున్న ఈ ముఖ్యమంత్రిని గద్దెదించే దాకా తెలంగాణ ప్రజలు నిద్రపోరని పేర్కొన్నారు.

'కాంగ్రెస్‌కే మా మద్దతు'

సాక్షి, హైదరాబాద్: ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తున్నామని ఈబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి తెలిపారు. పేదలకు విద్యా, వైద్యం అందుబాటులో లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'కేసీఆర్ కో హటావో.. కాంగ్రెస్ కో జీతావో.. తెలంగాణ కో బచావో'పేరుతో తెలంగాణలో జనచైతన్య యాత్ర నిర్వహించనున్నట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు.



ఏ పుస్తకమూ అంత చెడ్డది కాదు...
అందులో ఎంతోకొంతైనా మంచి లేకుండా ఉండదు.
– మిగెల్ డె సెర్వాంటీజ్

సాక్షి
గురువారం, 23 నవంబర్ 2023

పీకల మీదకొచ్చింది!

ముప్పు ముంచుకొచ్చినప్పుడు కాని మేలుకోకపోతే కష్టమే. పరిస్థితి చూస్తే అలానే ఉంది. పర్యావరణ మార్పులపై సంబంధిత పక్షాల సదస్సు తాజా సమావేశం (కాప్–28) ఈ నెలాఖరు నుంచి డిసెంబర్ 12 దాకా దుబాయ్‌లో జరగనుంది. ఏటేటా ఐరాస ఆధ్వర్యంలో ఇది మొక్కుబడి తంతుగా మారిపోతున్న వేళ కొద్దిరోజులుగా వివిధ నివేదికలు ప్రమాదఘంటికలు మోగిస్తున్నాయి. ఇప్పటికే పరిస్థితి విషమించిందని వెల్లడిస్తున్నాయి. రోజువారీ సగటు ప్రపంచ ఉష్ణోగ్రతలు తొలి సారిగా ఈ నవంబర్ 17న పారిశ్రామికీకరణ మునుపటి హద్దు దాటి 2 డిగ్రీల సెల్సియస్ పెరిగాయన్న వార్త ఆందోళన రేపుతోంది. పుడమిపై కర్బన ఉద్గారాలు పెరుగుతూనే ఉన్నాయి. ప్రపంచ దేశాలు తాము పెట్టుకున్న లక్ష్యాల గురి తప్పుతూనే ఉన్నాయని స్పష్టమవుతోంది. ఎప్పటికప్పుడు పర్యావరణ పరిరక్షణకు ప్రతిన చేస్తున్నా, నష్టనివారణకు నిధుల కొరత పీడిస్తూనే ఉంది.

ఆహార అభద్రత మొదలు వ్యాధుల దాకా అనేక రకాలుగా వాతావరణ మార్పులు ప్రతి ఒక్కరిపై ప్రభావం చూపుతున్నాయి. ప్రజారోగ్యంలో దశాబ్దాలుగా సాధించిన ప్రగతిని దెబ్బ తీస్తున్నాయి. ఆ నేపథ్యంలో వాతావరణ మార్పులపై తాజా నివేదికలు అలజడి సృష్టిస్తున్నాయి. పుడమి మీది ఒక శాతం అత్యంత ధనికులే మొత్తం ప్రపంచ జనాభాలోని 66 శాతం మంది కలగజేసేటంత భూతాపానికి కారణమని ఆక్స్‌ఫామ్ తాజా నివేదిక తేల్చింది. ఇక, 'కౌంట్‌డౌన్ ఆన్ హెల్త్ అండ్ క్లైమేట్ ఛేంజ్' అంటూ గత వారం లాన్సెట్ వెలువరించిన 8వ వార్షిక నివేదిక ప్రజారోగ్యం, ఆరోగ్య రక్షణ వ్యవస్థలపై పడే ప్రభావాన్ని కళ్ళకు కట్టింది. పర్యావరణ మార్పుకు ప్రధాన కారణాలైన శిలాజ ఇంధనాల వినియోగం లాంటి వాటికి అడ్డుకట్ట వేయకుంటే, ప్రజల ఆరోగ్యానికే పెను ప్రమాదమని లాన్సెట్ నివేదిక హెచ్చరిస్తోంది.

భారత్‌కు సంబంధించి ఈ నివేదిక చెప్పిన అంశాలు, చేస్తున్న హెచ్చరికలు ఆలోచన రేపుతున్నాయి. మన దేశంలో 1986 – 2005 మధ్య కాలంతో పోలిస్తే, 2018 – 2022 మధ్య కాలంలో సగటు వేసవి ఉష్ణోగ్రతలు 0.5 డిగ్రీల సెల్సియస్ పెరిగాయట. ఇప్పటికే ఈ అధిక ఉష్ణోగ్రత పిల్లల నుంచి పెద్దల వరకు అందరి ఆరోగ్యాన్నీ దెబ్బ తీస్తోంది. ఈ వాతావరణ పరిస్థితులు మలేరియా, డెంగ్యూ కేసుల్ని పెంచుతున్నాయి. అలాగే సముద్రతీర ప్రాంతాల్లో గ్యాస్ట్రో ఎంటరైటిస్, సెప్సిస్, కలరాలకు సానుకూలంగా తయారవుతున్నాయి. అలాగే, 'బ్రోకెన్ రికార్డ్' శీర్షికన ఐరాసా వెల్లడించిన తాజా నివేదిక సైతం పరిమితులు దాటి గ్రీన్‌హౌస్ వాయువుల విడుదల పెరిగిన కథను వివరించింది. వెరసి, ఉష్ణోగ్రతలు పారిశ్రామికీరణకు ముందు స్థాయి కన్నా 2 డిగ్రీలు, వీలుంటే 1.5 డిగ్రీలు మించి పెరగరాదని 2015 నాటి ప్యారిస్ ఒప్పందం (పీఏ)లో చేసుకున్న బాసలు చెరిగిపోయేలా కనిపిస్తున్నాయి. నికరంగా కర్బన ఉద్గారాలు లేని 'నెట్ జీరో'కు కట్టుబడతామని అనేక దేశాలు మాట ఇస్తున్నా, అది 'విశ్వసనీయంగా' లేదని తాజా నివేదిక తేల్చేసింది.

భూతాపం పెంపును 1.5 డిగ్రీల లోపలకు నియంత్రించే అవకాశాలు నూటికి పద్నాలుగు వంతులేనట! 2021తో పోలిస్తే 1.2 శాతం ఎక్కువగా 2022లో ప్రపంచమంతా కలసి 57.4 బిలియన్ల కర్బన ఉద్గారాలను వెలువరించిందని లెక్క. అలాగే, కరోనాలో 4.7 శాతం తగ్గిన ఉద్గారాలు ఈ ఏడాది మళ్ళీ కరోనా ముందు స్థాయికి చేరిపోవచ్చని అంచనా. నిజానికి, పర్యావరణ మార్పు, ధనిక – బీద అసమానతలు విడదీయరాని జంట. ప్రధానంగా ధనిక దేశాల పాపానికి పేద దేశాలు బలి అవుతున్నాయి. పర్యావరణ మార్పు ప్రభావాన్ని మోస్తున్నాయి. ధనిక దేశాలు కర్బన ఉద్గారాలను తగ్గించాలనీ, చేసిన నష్టానికి పరిహారం చెల్లించాలనీ కాప్28 లాంటి చోట్ల పేద దేశాలు ఒత్తిడి తెస్తున్నది అందుకే. కానీ, అతి తక్కువ సంఖ్యలోని ఆ ధనిక దేశాలే ప్రపంచ పర్యావరణ విధానాన్ని నిర్ణయిస్తుండడంతో పరిష్కారం దిశగా అడుగులు పడడం లేదు.

ఈజిప్ట్‌లో నిరుడు కాప్27 సదస్సులో 'నష్ట పరిహార నిధి'ని ఏర్పాటు చేయాలంటూ ఒప్పందం కుదిరింది. స్వీయ కర్బన ఉద్గారాలు తక్కువే అయినా ధనిక దేశాల ఉద్గారాలతో నష్టపోతున్న బీద దేశాలను పర్యావరణ మార్పు ప్రభావాల నుంచి కాపాడేందుకు ఈ నిధిని ఉద్దేశించారు. ఆలోచన మంచిదైనా, ఆచరణకు వచ్చే సరికి ఆ నిధి ద్వారా డబ్బులు ఎవరిస్తారు, ఎవరికి ఇస్తారనేది ఇప్పటికీ తేలనే లేదు. ఇంకా చిత్రమేమిటంటే– పర్యావరణానికి తూట్లు పొడిచే భారీ చమురు ప్రణాళికలు వేస్తున్న దుబాయ్‌లో కాప్28 సమావేశం జరగనుండడం! అలాగే, వాతావరణ సంక్షోభం, ప్రకృతి సంక్షోభం... ఈ రెంటినీ భిన్నమైన సవాళ్ళుగా భావిస్తూ, స్పందిస్తున్నాం. వాటి వల్ల సమాజంలో తలెత్తే సంక్షోభాన్ని అర్థం చేసుకోవడం లేదు. ప్రపంచమంతా చేస్తున్న ప్రమాదకరమైన తప్పు అదే!

తీవ్ర వాతావరణ ఘటనలతో వర్ధమాన దేశాల్లో బాలికలకు నాణ్యమైన విద్య దెబ్బ తింటోందని ప్లాన్ ఇంటర్నేషనల్ నివేదిక మాట. పర్యావరణ బాధిత 30 దేశాల్లో ఏటా కనీసం 1.25 కోట్ల మంది బాలికలు అర్ధంతరంగా చదువుకు గుడ్‌బై చెప్పడానికి వాతావరణ మార్పులు కారణమవుతాయని 'మలాలా ఫండ్' సైతం హెచ్చరిస్తోంది. ఇలాంటి గణాంకాలెన్నో వాస్తవ పరిస్థితికి ప్రతిబింబం. అందుకే, పర్యావరణ మార్పు గురించి మాటల కన్నా చేతలు ముఖ్యం. రానున్న దుబాయ్ సదస్సులోనూ ప్యారిస్ ఒప్పందం తాలుకు అమలు తీరుతెన్నులపై ప్రపంచం మళ్ళీ చర్చిస్తుంది. ఈసారైనా మాటలు తగ్గించి, చేతలపై దృష్టి పెడితే మంచిది. ఎందుకంటే, పర్యావరణంపై ప్రపంచం ఇప్పటికే గాడి తప్పింది. దుష్ఫలితాలూ చూస్తోంది. తాజా హెచ్చరికలు పెడచెవిన పెడితే మరిన్ని కష్టాలు తప్పవు. ప్రపంచానికి పరిష్కారం ఎడారి దేశంలోనూ ఎండమావిగా మారితేనే మానవాళికి నష్టం.

విదేశీ విద్యను ఇక్కడే కల్పించేలా...

భారతదేశంలో విదేశీ ఉన్నత విద్యా సంస్థల (ఎఫ్‌హెచ్‌ఇఐ) క్యాంపస్‌ల ఏర్పాటు, నిర్వహణ కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న క్రమబద్ధీకరణను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కొన్ని రోజుల క్రితం విడుదల చేసింది. ఈ క్రమబద్ధీకరణ ఉదారంగానూ, సమర్థంగానూ ఉందని చెప్పాలి. ఇది నూతన విద్యా విధానపు సిఫార్సులను అనుసరిస్తోంది. అయితే, ఇది ఇప్పటికే ఉన్న దేశంలోని విద్యా వ్యవస్థలను సవాలు చేయడానికి ప్రయత్నించడం అనేది ఒక అవకాశంతోపాటు ఆందోళన కరమైన విషయం కూడా! ఇంకా, విదేశీ ఉన్నత విద్యా సంస్థ తన భారతీయ క్యాంపస్‌లోని విద్యాపరమైన నాణ్యతను తమ దేశంలోని ప్రధాన క్యాంపస్‌తో సమానంగా ఉండేలా చూసుకోవాలి. చాలా గొప్ప ఆలోచనే అయినప్పటికీ, క్రమబద్ధీకరణ యంత్రాంగం దీన్ని ఎలా అనువర్తించగలుగుతుంది?

యూజీసీ క్రమబద్ధీకరణ విదేశీ ఉన్నత విద్యాసంస్థలకు పాలన పరంగా ప్రత్యేక అధికారాలకు అనుమతిస్తోంది. అన్ని విభాగాలలో యూజీ/ పీజీ/ డాక్టోరల్/ పోస్ట్‌డాక్టోరల్ అధ్యయనాలు, డిగ్రీల ప్రదానం, డిప్లొమాలు, సర్టిఫికేట్‌లను ఇచ్చే వీలు కల్పిస్తోంది. ఈ విదేశీ విద్యా సంస్థలు మొత్తం సబ్జెక్ట్‌వారీగా, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 500 లోపు ఉంటే అది నిజంగా గొప్ప అడుగే. కాకపోతే, ప్రపంచంలో కనీసం 20 ప్రముఖ ర్యాంకింగ్ ఏజెన్సీలు ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన అనేక సంస్థలు వివిధ కారణాల వల్ల ఈ ర్యాంకింగ్ సంస్థల చర్యలలో పాల్గొనడం లేదనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఈ ర్యాంకింగ్‌లను ఎలా ప్రామాణీకరిస్తారనేది ప్రశ్న. కాకపోతే భారతీయ, విదేశీ ఉన్నత విద్యాసంస్థల మధ్య సహకారం కోసం 2022లో జరిగిన విద్యా సంబంధ సహకార నియంత్రణ నేపథ్యంలో చూస్తే, ఉమ్మడి డిగ్రీ, ద్వంద్వ డిగ్రీ కార్యక్రమాలకు ఉత్తేజకరమైన కాలం ముందుందని చెప్పొచ్చు.

దేశంలో అడుగుపెట్టే విదేశీ ఉన్నత విద్యా సంస్థలు, ఈ క్రమబద్ధీకరణ ద్వారా, భారతీయ ఉన్నత విద్యా సంస్థలు లేదా భారతీయ కంపెనీలతో జాయింట్ వెంచర్‌లోకి ప్రవేశించవచ్చు. జాయింట్ వెంచర్లు అంటే రెండు లేదా అంతకంటే ఎక్కువ పక్షాలు తమ వనరులతో ఒక నిర్దిష్ట పనిని పూర్తి చేయడానికి అంగీకరించే వ్యాపార పరమైన ఏర్పాటు అని మనం అర్థం చేసుకున్నప్పటికీ – విదేశీ ఉన్నత విద్యా సంస్థ భౌతిక, విద్యా, పరిశోధనా మౌలిక సదుపాయాలతో కూడిన స్వతంత్ర క్యాంపస్‌ను కలిగి ఉండాలని ఈ నిబంధన ఎందుకు నొక్కి చెబుతోంది? దాని విద్యాపరమైన, పరిశోధనా కార్యక్రమాలను సీరియస్‌గా నిర్వహించడానికి ఏ విదేశీ ఉన్నత విద్యా సంస్థ అయినా భారతదేశంలో ఉండటం కోసం భూమిపై, వనరులపై పెట్టుబడి పెడుతుందా? దీనికి సంబంధించి ఇప్పటికే ఉన్న భారతీయ క్యాంపస్‌లతో వనరులను పంచుకునే సహకార క్యాంపస్ నమూనా మరింత ఆచరణీయంగా ఉంటుంది.

ఇప్పుడు 'కంపెనీ' పాత్రను చూద్దాం. నిర్దేశిత లక్ష్యాల కోసం, సెక్షన్ 8 కింద నమోదు అయిన కంపెనీ, లాభాలు ఏవైనా ఉంటే, వాటిని ఆ నిర్దేశిత లక్ష్యాల కోసమే ఉపయోగించాలి. లాభాలను దాని సభ్యులకు చెల్లించకూడదు. ఇంకా, ఇండియన్ ట్రస్ట్ చట్టంలోని సెక్షన్ 10 ప్రకారం, ఒక విదేశీయుడు లేదా ఎన్నారై, భారతీయ ట్రస్ట్‌కు ట్రస్టీగా ఉండకూడదు. అయితే ఫెమా చట్టం, 1999 నిబంధనలకు అనుగుణంగా ఉండే పక్షంలో నిధులను సరిహద్దులు దాటించడానికీ, విదేశీ కరెన్సీ ఖాతాల నిర్వహణకూ, చెల్లింపులకూ, అమ్మకాలకూ అనుమతిస్తోందని తెలుస్తున్నప్పుడు ఇక్కడ ఏదో లోపం ఉందని గమనించాలి. నిధులను స్వదేశానికి పంపగలిగే వీలు ఉన్నట్లయితే, సంబంధిత విదేశీ ఉన్నత విద్యా సంస్థ లాభాలను పొందగలదని దీని అర్థమా? అంటే ఇప్పుడు విద్య 'లాభార్జన' కోసమా?



భవిష్యత్తులో భారతదేశం ఆకర్షణీయమైన ప్రపంచ అధ్యయన గమ్యస్థానంగా మారుతుందని ఈ క్రమబద్ధీకరణ ఆశిస్తోంది. ఏ విదేశీ ఉన్నత విద్యాసంస్థలు, ఏయే కార్యక్రమాలతో తమ క్యాంపస్‌లను మన దేశంలో ఏర్పరుస్తాయి; వారు స్థానిక అధ్యాపకులను తీసుకుంటారా, అంతర్జాతీయంగానా; విద్యార్థుల ప్రవేశం కోసం వారు ఉపయోగించే కొలమానాలు ఏవి అనే అంశాలపై ఇది ఆధారపడి ఉంటుంది. సాంప్రదాయకంగా, అక్రిడిటేషన్ అనేది భారతదేశంతో పాటు చాలా దేశాలలో నాణ్యతా తనిఖీ విధానం. విదేశీ ఉన్నత విద్యా సంస్థ నాణ్యతాపరమైన హామీ, ఆడిట్‌కు లోనవుతుందనీ, యూజీసీకి తన నివేదికను సమర్పించాలనీ ఈ క్రమబద్ధీకరణ నిర్దేశిస్తోంది. ఏదైనా నెరవేరదగిన హామీ నెరవేర్చని పక్షంలో వినియోగదారు న్యాయస్థానంలో పరిష్కారాన్ని కోరవచ్చు.

ఒక విదేశీ ఉన్నత విద్యా సంస్థ తన రుసుముల చట్రాన్ని నిర్ణయించుకోవడానికి ఈ క్రమబద్ధీకరణ అనుమతించడం నిజానికి ప్రగతి శీలమైనది. భారతదేశంలోని విద్యాసంస్థలు మాత్రం ఫీజు నిర్ణాయక కమిటీల ఇష్టాలకు లోబడుతున్నప్పుడు, విదేశీ ఉన్నత విద్యాసంస్థలకు ఈ ప్రత్యేక గౌరవం ఎందుకు? ఫెమా నిబంధనలు ఉన్నప్పటికీ, పరిమాణాత్మకం కాని మొత్తాలను ఎల్లప్పుడూ సర్దుబాటు చేయవచ్చు. అలాంటప్పుడు, అకడమిక్ పరపతి ఆధారితమైన రుసుము చట్రాన్ని తప్పనిసరి చేయడం మరింత విశ్వసనీయమైన ఎంపిక.

విదేశీ ఉన్నత విద్యా సంస్థ అందించే కార్యక్రమాలు ఆన్‌లైన్, బహిరంగ మరియు దూరవిద్యా (ఓడీఎల్) విధానంలో అనుమతించబడవు అనే షరతు నిర్బంధపూరితంగా ఉంది. ఎమ్ఐటి, స్టాన్‌ఫోర్డ్, హార్వర్డ్ వంటి అగ్రశ్రేణి విద్యాసంస్థలు అద్భుతమైన ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లను కలిగి ఉన్నాయి. ఇటీవలి కాలంలో యూజీసీ అనేక ఓపెన్, దూరవిద్యా నిబంధనలను సడలించినప్పుడు, వాటిని మన విద్యార్థులకు ఎందుకు దూరంచేయాలి?

విశ్వవిద్యాలయాల ప్రపంచ ర్యాంకింగ్‌లను గుర్తించడానికి రెండు ముఖ్యమైన కొలమానాలు ఏవంటే... అంతర్జాతీయీకరణ, పరిశోధన. భారతీయ క్యాంపస్‌లలో విదేశీ విద్యార్థులు, అధ్యాపకులు వర్ధిల్లడాన్ని అంతర్జాతీయీకరణ అంటారు. ఒక ప్రముఖ ఫ్యాకల్టీ ఎక్కువ డబ్బు సంపాదించడం లేదా మెరుగైన పరిశోధనా సౌకర్యాల కోసం, లేదా తన పరిధిలోని అత్యుత్తమ వ్యక్తులతో పరస్పర సంభాషణ కోసం; అవకాశాలను అన్వేషించడం లేదా కొత్త ఉత్పత్తులు, ప్రక్రియలకు దారితీసే పేటెంట్లను, ఐపీఆర్‌లను తమ హోదాకు జతచేసుకోవడం కోసం పనిచేస్తారు. అవి సాధ్యం కాదని తెలిసినప్పుడు, మహా అయితే ఏదో ఒక వారం సందర్శన కోసం తప్ప, ఎవరూ బయటకు రారు. అప్పుడు విదేశీ ఉన్నత విద్యా సంస్థ ఎలా పని చేస్తుంది?

అధ్యాపకులు, సిబ్బంది నియామకంలో పూర్తి స్వయంప్రతిపత్తి ఈ క్రమబద్ధీకరణలో అత్యంత ముఖ్యమైన భాగం. మన సంస్థలలోని అత్యుత్తమ అధ్యాపకులు విదేశీ ఉన్నత విద్యా సంస్థలకు వలసవెళ్లే అవకాశం ఉండటం ఈ నిబంధనకు రెండో కోణం. బహుశా, చివరికి ఒక కొత్త సాధారణ స్థితి ఏర్పడవచ్చు. ఆ స్థితి మన విద్యా సంస్థలలో నాణ్యతను పెంచినట్లయితే, దానిని స్వాగతించాలి.

మన విద్యా సంస్థల ఫీజు కమిటీ సిఫార్సులు, అడ్మిషన్ల కోసం రాష్ట్ర లేదా కేంద్ర నిబంధనలు మొదలైన వాటికి కట్టుబడి ఉండాలి. అధ్యాపకులను ఎన్నుకోవడంలో, ఫీజులను నిర్ణయించడంలో ప్రవేశ నిబంధనలను ఏర్పర్చడంలో మన సంస్థలకు స్వయం ప్రతిపత్తిని ఎందుకు పొడిగించకూడదు? అవన్నీ అంతర్జాతీయ ర్యాంకింగ్ సంస్థలకు చెందిన అవే కొలమానాలపై పోటీ పడాలని భావిస్తున్నాం కదా!

ఏదైనా ప్రయోగం విషయంలో దాని విమర్శకులు దానికి ఉంటారు. విదేశాల్లోని మాతృసంస్థల్లో అయ్యేదానితో పోల్చినప్పుడు తక్కువ ఖర్చుతో, విదేశీ విద్యార్హతలతో భారతీయ విద్యార్థులు నాణ్యమైన విద్యను ఇక్కడే పొందేందుకు ఈ క్రమబద్ధీకరణ వీలు కల్పిస్తే, ఇది స్వాగతించాల్సిన విషయమే. అయితే ఐఐటీల వంటి మన ప్రథమశ్రేణి విద్యాసంస్థలను సాధారణంగా ఎంపిక చేసుకునే విద్యార్థులు కూడా ఈ కొత్త క్యాంపస్‌లలో చేరేలా ప్రభావితం అయితే, అది ఆందోళన కలిగించే అంశం అవుతుంది. అందుకే, నాణ్యతా ప్రమాణాలు ఎన్నో రెట్లు పెరిగినందున విద్యారంగానికి భారీ పెట్టుబడులు అవసరం. పరిశోధనా సౌకర్యాల్లో భారీ స్థాయి వృద్ధి అవసరం. ప్రభుత్వ నిధులను అలా ఉంచుతూనే, విదేశీ నిధులను అనుమతించడం, విజయవంతమైన వ్యవస్థలను అనుసరించడం మేలు.

ఎస్ఎస్ మంథా, ఏఐసీటీఈ (ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) మాజీ ఛైర్మన్; **అశోక్ ఠాకూర్**, కేంద్ర ప్రభుత్వ విద్యా శాఖ మాజీ కార్యదర్శి ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పరిస్థితి



ప్యూ రీసెర్చ్ సెంటర్ కొత్త అంచనాల ప్రకారం, యూఎస్‌లో 7,25,000 మంది భారతీయులు అక్రమంగా నివసిస్తున్నారు. అసలు సంఖ్య ఇంకా ఎక్కువ కూడా ఉండొచ్చు.

– మహమ్మద్ జుబేర్, జర్నలిస్ట్

తప్పదా?



ఉత్తరకాశీలోని సొరంగంలో చిక్కుకున్న ఆ 41 మంది చిట్టచివరికి బయటకు రాగానే, స్వాగతించడానికి 'ఆయన' అక్కడ ఉండి, వారి వెన్ను తడతాడేమో అన్న ఫీలింగ్ వస్తోంది.

– అతుల్ ఖత్రీ, కమెడియన్

జాగ్రత్త



తుర్కులకు (తుర్కియే) సమర్థమైన సైన్యం ఉంది. నెల రోజుల లోపలే తమ బలగాల సంఖ్యను 20 లక్షల సంఖ్యకు పెంచుకోగలరు. గమనిస్తూ ఉండండి.

– డగ్లస్ మాక్‌గ్రెగర్, యూఎస్ ఆర్మీ రిటైర్డ్ కల్నల్

బ్రాహ్మణ ఘనత



మీకు తెలుసా? ఉమ్మడి శకం 629లో భారత్‌కు హ్యూయన్ త్సాంగ్ ప్రయాణించక ముందే, సుయీ వంశ అధికారిక చరిత్ర (ఉమ్మడి శకం 610)... ఖగోళ శాస్త్రం, గణితం, రసాయన శాస్త్రం మీద బ్రాహ్మణులు రాసిన 12 పుస్తకాలను ఉపయుక్త గ్రంథ సూచిగా ఇచ్చింది. సుయీ వంశం చైనీస్ చరిత్రలో స్వర్ణయుగానికి పునాది వేసింది. (ఇక్కడ బ్రాహ్మణ అనేది పుస్తక శీర్షికల్లో భాగం కావడం విశేషం. ఉదా: పొలొమే సువాన్ ఫా– బ్రాహ్మణ గణితం; పొలొమే థియెన్ వెన్ చింగ్– బ్రాహ్మణ ఖగోళ కరదీపిక.)

– సావిత్రి ముముక్షు, డిజైనర్

రోజూ తినొచ్చు



ఒక్క ఖర్జూరం (8 గ్రా.) 23 కేలరీలను ఇస్తుంది. అది పొటాషియం, మ్యాగ్నీషియంలకు మంచి వనరు. రోజుకు 1–2 తినొచ్చు. స్థూలకాయులు, మధుమేహం ఉన్నవాళ్లు మాత్రం ఎక్కువ తినకుండా ఉంటే మంచిది.

– సుధీర్ కుమార్, న్యూరాలజిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

దశాబ్దాల విద్యాసుమ గంధం

స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో దేశవ్యాప్తంగా పాఠశాలల స్థాపనకు ప్రాధాన్యం ఇచ్చారు. గుంటూరు జిల్లా రేపల్లె తాలుకా చాట్రగడ్డ (మైనేనివారిపాలెం) గ్రామంలో 1953లో 7 ఎకరాల స్థలంలో స్థాపించిన పాఠశాల అందులో ఒకటి. దీనికి ప్రధాన సంకల్పం చేసింది– రాజర్షి వీరమాచనేని ఆంజనేయశాస్త్రి. వారు మైనేనివారి పాలెం, నల్లూరు, శింగుపాలెం, మొర్తోట తదితర గ్రామాల ప్రజలను ఉత్తేజపరచి మలయాళ స్వాముల వారు పెట్టిన ఆశ్రమం పేరుతో 'సనాతన వేదాంత నిష్కాశ్రమ పాఠశాల' నెలకొల్పారు. అప్పటికి మద్రాసు రాష్ట్రంలో ఈ ప్రాంతం ఉండేది. పాఠశాల ప్రారంభించటానికి కావలసిన ఉత్తర్వులు వెలగపూడి రామకృష్ణ (కేసీపీ) ఇప్పించారు. గ్రామస్థులే పాఠశాల నిర్మించి, కొంత కాలం నిర్వహిస్తేనే ప్రభుత్వపరమైన సహాయం ఇస్తామనడంతో చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు చందాలు ఇచ్చి రెండు అంతస్తుల భవనం నిర్మించుకొని 'టాగూర్ బిల్డింగ్స్' అని నామకరణం చేసుకొన్నారు. గ్రామం నుండే సన్యాసాశ్రమం తీసుకున్న ఏర్పేడు వ్యాసాశ్రమ రెండవ పీఠాధిపతి శ్రీ విమలానంద స్వాములు పాఠశాల భవనం అయిన టాగూర్ బిల్డింగ్స్‌పై 'యా విద్యా సా విముక్తియే' అని ఆశీర్వదించి, ప్రకటించారు.



సనాతన వేదాంత నిష్కాశ్రమ పాఠశాల

గత ఏడు దశాబ్దాలలో ఈ పాఠశాల దేశం గర్వించ దగ్గ నాయకులు, డాక్టర్లు, విద్యావేత్తలు, వ్యాపార వేత్తలు, ఇంజినీర్లు, సైనికాధికారులు వంటివారిని ఎంతోమందిని తయారుచేసింది. ఇక్కడ చదివిన ఎందరో విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా స్థిరపడ్డారు. కాలక్రమేణా ఈ పాఠశాలలో చేరే విద్యార్థులు తగ్గిపోయారు. ఇది తెలుగు మాధ్యమ పాఠశాల కావడం, ఇందులో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకే ఉండడం వల్ల పిల్లలు చేరడం లేదు. పెద్దలు పెట్టిన పాఠశాలను ఎలాగైనా ముందుకు తీసుకు వెళ్ళాలనీ, ఎల్‌కేజీ నుండి 12 వరకు ఆంగ్ల మాధ్యమంలో పాఠశాల నిర్వహిస్తేనే మనుగడ ఉంటుందనీ భావించారు. అయితే దానికి సరిపోయే వనరులు సనాతన వేదాంత నిష్కాశ్రమ సంఘానికి లేవని భావించి, నిర్వహణ భారాన్ని ఈ పాఠశాల ఆశయాలకు దగ్గరగా ఉన్న 'శ్రీసరస్వతీ విద్యామందిర్' వారికి మార్చిలో అప్పగించటం జరిగింది. ఈ ఏడాది జూన్ 10న ఎస్.వి.ఎస్.ఎ. శ్రీ సరస్వతీ విద్యామందిర్ పునఃప్రారంభమైంది. తొలి సంవత్సరంలో ఎల్‌కేజీ నుండి 5వ తరగతి వరకు తరగతులు ప్రారంభించగానే 105 మంది చేరారు. క్రమేణా 12వ తరగతివరకు నిర్వహింపబడుతుంది.

ఈ సందర్భంగా ఏడు దశాబ్దాలపాటు ఈ పాఠశాలలో విద్య నభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఈ నవంబర్ 26న ఉదయం పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నాం. అందరూ ఆహ్వానితులైన ఈ కార్యక్రమానికి దేశ విదేశాల నుండి ఎంతోమంది పూర్వ విద్యార్థులు వారి కుటుంబాలతో కలిసి పాల్గొననున్నారు.

– సనాతన వేదాంత నిష్కాశ్రమ విద్యాసంఘం
(నవంబర్ 26న పూర్వ విద్యార్థుల సమ్మేళనం)


పిల్లల్లో వైజ్ఞానిక జిజ్ఞాస పెంచాలి!

సందర్భం



డా॥ దేవరాజు మహారాజు

ఇంగ్లిష్ నేచురలిస్ట్ ఛార్లెస్ డార్విన్ తన జీవ పరిణామ సిద్ధాంతం 'ఆన్ ది ఆరిజిన్ ఆఫ్ స్పెసీస్' (ON THE ORIGIN OF SPECIES)ను 1859 నవంబర్ 24న ప్రకటించారు. ఈ ఆధునిక వైజ్ఞానిక కాలానికి ఆ సిద్ధాంతం ఎంత ముఖ్యమో గ్రహించడానికి, ఆ శాస్త్రవేత్త మీద ఉన్న గౌరవం ప్రకటించుకోవడానికి 24 నవంబర్‌ను 'ఎవల్యూషన్ డే'గా ప్రపంచ దేశాలన్నీ జరుపుకొంటున్నాయి. దీన్ని పెద్ద ఎత్తున మన దేశంలో కూడా జరపడం చాలా అవసరం. ఎందుకంటే వైజ్ఞానిక దృక్పథం దేశంలో బలపడాలని చెప్పిన భారత తొలి ప్రధాని నెహ్రూ స్థాయిని తగ్గించాలని ప్రయత్నిస్తున్న ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ చర్యల్ని తిప్పి కొట్టడానికి సామాన్య ప్రజలు వివేకవంతులై ఇలాంటి వైజ్ఞానిక కార్యక్రమాల్లో పాల్గొనడం తప్పనిసరి. జీవ పరిణామ సిద్ధాంతం (థియరీ ఆఫ్ ఎవల్యూషన్) పనికి రానిదని ప్రభుత్వం సిలబస్ నుండి తొలగిస్తోంది. భారత రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని ప్రవేశపెడతామంటోంది. ఇలాంటి వాటిని అడ్డుకోవాలంటే, ప్రగతిశీల భావాలు గల వారంతా వైజ్ఞానిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుపుకోవాలి.



'నిన్ను నువ్వు తెలుసుకో' అని దేవుణ్ణి ధ్యానిస్తూ కళ్ళు మూసుకోవడం కాదు, నువ్వెవరు? ఎన్ని పరిణామాలు జరిగి, నువ్వు ఇలా మారావు అన్నది తెలుసుకుంటే నీ కళ్ళు తెరుచుకుంటాయి. ఎన్నెన్ని మానవ జాతులు ఉద్భవించి అంతరించాయి. ఎన్ని వలసల తర్వాత నీ జాతి ఇప్పుడు నువ్వున్న ప్రాంతానికి చేరింది వంటి విషయాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలంటే, తప్పదు – జీవ పరిణామం గురించి పూర్తిగా తెలుసు కోవాలి. ఆ భగవంతుడి సృష్టిలో నీ పుటక ఒక భాగమని నువ్వింకా భావిస్తూ ఉంటే గనక, నీ మెదడ్లో చీకటి తొలగిపోలేదని అర్థం. చీకట్లోనే జీవితం బాగుందనుకునే వారితో మనకు పేచీ లేదు. జీవితంలో వెలుగులు కావాలనుకునేవారు తప్పక వైజ్ఞానిక స్పృహ పెంచుకుంటారు. జీవ పరిణామం గురించి తెలుసుకుంటారు. మత మౌఢ్యాన్ని చావు దెబ్బ తీసిన డార్విన్ పరిణామ సిద్ధాంతం వెలువడిన ఆ రోజును గుర్తు చేసుకుంటారు. ప్రతి సంవత్సరం 'ఎవల్యూషన్ డే' జరుపుకుంటారు.


అర్థవంతమైన వైజ్ఞానిక కార్యక్రమాలు విద్యాసంస్థల్లో గానీ, పౌర సమాజాల్లో గానీ, కుటుంబాల్లో గానీ ఏ ఒక్కటైనా నిర్వహిస్తున్నారా? లేదు కదా? అందుకే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సైన్సు కార్యకర్తలు, బాధ్యతగల పౌరులు, వివేకవంతులైన అధికారులు, మరీ ముఖ్యంగా మహిళలు పూనుకుని దేశంలో కొనసాగుతున్న విషమ పరిస్థితులను అర్థం చేసుకుని, ఎక్కడికక్కడ ఎవరికి వారు వైజ్ఞానిక దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలకు రూపకల్పన చేసుకోవాలి. ఉట్టి ఆలోచనలతో పని జరగదు. వాటిని ఆచరణలో పెట్టాలి. విద్యాసంస్థల్లో పని చేసే వారిపై బాధ్యత మరింతగా ఉంది. విద్యార్థులకు జీవపరిణామంపై, డార్విన్‌పై, సందర్భాన్ని బట్టి ఇంకా అనేక వైజ్ఞానిక అంశాలపై వ్యాస రచన / ఉపన్యాస పోటీలు పెడుతూ వారిలో వైజ్ఞానిక జిజ్ఞాస పెంచాలి. భావి భారత పౌరులు వారే గనక, మనం వారి మీదే శ్రద్ధ పెట్టాలి. వారిని హేతుబద్ధంగా ఆలోచింప జేయాలి. మానవవాదులుగా తీర్చిదిద్దుకోవాలి. చేస్తున్న కార్యక్రమాలతో మనం మరొకరికి స్ఫూర్తినిస్తూ ఉండాలి.

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత
(నేడు జీవ పరిణామ దినోత్సవం)

ఏది అధర్మం?

ధర్మం గురించి తెలుసుకోవటం ఎంత ముఖ్యమో, అధర్మం గురించి తెలుసుకోవటం కూడా అంతే ముఖ్యమని చెప్పాయి మన శాస్త్రాలు. రోగి స్వస్థత కోసం వైద్యుడు ముందుగా రోగ లక్షణాలు తెలుసుకొని వాటిని తొలగించటానికి ఏ విధంగా ప్రయత్నిస్తాడో, ఆ విధంగా ధర్మాచరణానికి ఆటంకం కలిగించే అధర్మం ఏమిటో తెలుసుకొని, దానిని అవశ్యం పరిహరించవలసిన విషయంగా మన వారు భావించారు. ఏది చెయ్యకూడదని పూజ్యులు మహాత్ములైన వారు నిర్ణయించారో, దానిని బుద్ధిపూర్వకంగా చెయ్యటం అధర్మమని పెద్దలు నిర్వచించారు.

అధర్మపరులు తాత్కాలికంగా భోగభాగ్యాలు అనుభవిస్తుండటం చూసి ధార్మికుడైనవాడు ఆశపడో, మోసపోయో తాను ఆ ఉచ్చులో చిక్కుకొనకూడదు. తాను తన ధర్మం విడనాడకూడదు. అధర్మాచరణ వల్ల ప్రాప్తించిన పాపం,



పక్వమైనపుడు ఆ పాపం అధార్మికుణ్ణి సమూలంగా నాశనం చేస్తుంది. ధర్మ కార్యం పుణ్యం, అధర్మకార్యం పాపం. పాప పుణ్యాలు ఈ జన్మకే పరిమితమైనవి కావు. వచ్చే జన్మలో కూడా వెంట వస్తాయి. 'ఆత్మావై పుత్ర నామాసి' అని వేదం చెప్తోంది. తానే పుత్రుడుగా జన్మించినందున, అతడు అప్పుడు జన్మించినా, పుత్రుడి రూపంలో అనుభవించేది తానే.

అధర్మవర్తనుడు తను చేసిన పాపం ఫలితాలను ఏ విధంగా అనుభవిస్తాడు అంటే, అతడు వ్యాధిగ్రస్తుడు కావచ్చు, అతడికి ధన నష్టం కలగవచ్చు, మతి స్థిమితం కరువు కావచ్చు, అతడిని దౌర్భాగ్యం వెన్నాడవచ్చు, సొంత మనుషులే పరాభవించవచ్చు, ఇట్లా అనేక విధాలుగా ఉండవచ్చు.

అధర్మజనితమైన పాపాల్లో మహాపాతకాల నుండి సామాన్య పాతకాల వరకు – భ్రూణ హత్య నుండి సరదా కోసం ఆడే అబద్ధాల వరకు – అనేక రకాలైన పెద్దా చిన్నవి ఉన్నవని శాస్త్రాల్లో చెప్పబడ్డవి. ఏ పాపమైనా అనుభవించనిదే తీరదన్నారు.

పాపాల్లో మళ్ళీ వ్యక్తిగతమైనవీ, దేశారిష్ట కారకమైనవీ ఉన్నాయంటారు. వ్యక్తిగతమైనవి అతడితో సరి. వాడి పాపం వాడినే కట్టి కుడుపుతుంది. దేశోపద్రవకారకమైనది అలా కాదు. అది దావానలంలా అందరినీ చుట్టుముడుతుంది. గ్రామానికీ, నగరానికీ, దేశానికీ అధిపతులుగా ఉన్నవారు తాము అధర్మం ఆచరించి, వారి వారి ప్రజల చేత ఆ అధర్మం ఆచరింపజేసినపుడు, ఆ అధర్మం వల్ల ఆ గ్రామానికీ, నగరానికీ, దేశానికీ అరిష్టం వాటిల్లుతుందని శాస్త్రం చెబుతోంది. ఉదాహరణకు రావణుడు 'సీతాపహరణం' అనే అధర్మం ఆచరించి, లంకలోని రాక్షసుల చేత కూడా అధర్మం ఆచరింపజేసినందున, రావణుడు నాశనం అవటమే కాక, వంశ నాశనం, లంకాదహనం వంటి అరిష్టాలు సంభవించాయి.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం: శ్రీ శోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.ఏకాదశి రా.10.22 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర సా.5.24 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** తె.4.43 నుండి 6.13 వరకు (తెల్లవారితే శుక్రవారం), **దుర్ముహూర్తం:** ఉ.9.55 నుండి 10.43 వరకు, తదుపరి ప.2.25 నుండి 3.13 వరకు, **అమృత ఘడియలు:** ప.12.54 నుండి 2.24 వరకు, ప్రబోధనైకాదశి ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.12, **సూర్యాస్తమయం:** 5.20.

క్లుప్తంగా...



బుధవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఏపీ, తెలంగాణ మాజీ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, ఆయన సతీమణి విమలా నరసింహన్‌ను రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మర్యాదపూర్వకంగా కలిశారు. వారి ఆరోగ్యం గురించి వాకబు చేశారు. ఈ సందర్భంగా వారిని సత్కరించారు.

3డీ ప్రింటెడ్ ఆలయం తెలంగాణకు గర్వకారణం

• ప్రారంభోత్సవంలో మంత్రి హరీశ్



ఆలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్: సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లి శివారులోని చర్విత మెడోస్‌లో నిర్మించిన 3డీ ప్రింటెడ్ ఆలయం తెలంగాణకు గర్వకారణమని ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. బుధవారం జరిగిన శ్రీపాద కార్యసిద్ధేశ్వర స్వామి దేవాలయ ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా 3డీ ప్రింటెడ్ ఆలయాన్ని నిర్మించడంతో తెలంగాణ ఖ్యాతి మరింత పెరిగిందన్నారు. కార్యక్రమంలో అప్సుజా ఇన్‌ఫ్రాటెక్ ఎండీ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖర్గేతో నిజాం మనువడు మీర్ నజఫ్ అలీఖాన్ భేటీ

• నిజాం చరిత్ర పుస్తకం బహూకరణ



సాక్షి, హైదరాబాద్: ఏడో నిజాం మనువడు నవాబ్ మీర్ నజఫ్ అలీఖాన్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశమయ్యారు. బుధవారం ఉదయం తాజ్‌కృష్ణా హోటల్‌లో ఖర్గేను కలిసిన ఆయన.. నిజాం పాలకుల చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పరిస్థితులు, రాజకీయాలపై ఇరువురు చర్చించినట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి.

ఏపీలోని నంద్యాల జిల్లా బనగానపల్లెలో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



బడుగుల విజయ నినాదం

ఏపీలో సామాజిక సాధికార బస్సు యాత్రలకు వెల్లువెత్తుతున్న ప్రజలు

- ఒంగోలు, విశాఖ దక్షిణ, బనగానపల్లెలో అడుగడుగునా బ్రహ్మరథం
- వేలాదిగా పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- బైక్‌లతో యువత ర్యాలీలు.. జనసంద్రాలను తలపించిన సభా ప్రాంగణాలు
- సీఎం జగన్ అండతో ఎదిగిన తీరును వివరించిన బడుగు, బలహీన వర్గాలు
- మళ్లీ జగనే సీఎం కావాలి అంటూ నినదించిన ప్రజలు

ఒంగోలు, విశాఖ దక్షిణ, బనగానపల్లెలో నిర్వహించిన సామాజిక సాధికార యాత్రలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వారు హాజరై తాము సాధించిన సామాజిక సాధికారతను చాటి చెప్పారు. బడుగులను చంద్రబాబు అవమానిస్తే.. సీఎం జగన్ చేయి పట్టుకొని అభివృద్ధి పథం వైపు నడిపిస్తున్నారని కొనియాడారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

24న శ్రీవారి ఆలయంలో కైశికద్వాదశి ఆస్థానం

తిరుమల: కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నవంబరు 24వ తేదీ శుక్రవారం శ్రీవారి ఆలయంలో సాలకట్ల కైశికద్వాదశి ఆస్థానం జరుగనుంది. ఈ ఉత్సవ నేపథ్యంలో స్వామివారికి ప్రాతఃకాలంలో నిర్వహించే సుప్రభాతం, తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు. తిరుమలలో జరిగే మరో అత్యంత ప్రముఖ ఉత్సవమైన చక్రతీర్థ ముక్కోటిని కూడా 24వ తేదీ, శుక్రవారం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అర్చకులు, పరిచారకులు మంగళవాయిద్యాలతో ఆలయం నుంచి ప్రదక్షిణంగా చక్రతీర్థానికి వెళతారు. అక్కడ వెలసిన శ్రీ చక్రత్తాళ్వారువారికి, శ్రీ నరసింహ స్వామి వారికి, శ్రీ ఆంజనేయస్వామి వారికి అభిషేకం, పుష్పాలంకారం, పూజలు చేస్తారు.

ఏపీలో తేలికపాటి వర్షాలు

సాక్షి, అమరావతి: కోసాంధ్ర తీరానికి ఆనుకుని బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం... ప్రస్తుతం ఆవర్తనంగా కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఏపీలో తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. కోస్తా జిల్లాల్లోని పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. మరో రెండు రోజులు రాష్ట్రమంతా ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే అండమాన్ సముద్రం, దాని పరిసరాల్లో ఈ నెల 25వ తేదీ నాటికి మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఇది 26వ తేదీకి అల్పపీడనంగా, 27వ తేదీకి వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపింది.

విలువల నిలయాలు.. సత్యసాయి విద్యాసంస్థలు



విద్యార్థికి పట్టా అందజేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. చిత్రంలో ఏపీ గవర్నర్ జస్టిస్ నజీర్

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఘనంగా శ్రీసత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవం
- కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్

సాక్షి, పుట్టపర్తి: మానవ సేవే మాధవసేవ అని బోధించిన శ్రీసత్య సాయి సేవలు ఆదర్శనీయమని రాష్ట్రపతి ద్రౌప తి ముర్ము అన్నారు. ప్రశాంతి నిలయంలోని సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం శ్రీసత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవం వైభవంగా జరిగింది. రాష్ట్రపతి ముఖ్య అతిథిగా, గవర్నర్ అబ్దుల్ నజీర్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. శ్రీసత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ చాన్సలర్ కె.చక్రవర్తి, వీసీ ప్రొఫెసర్ బి.రాఘవేంద్రప్రసాద్, మంత్రి ఉష శ్రీ చరణ్, శ్రీసత్యసాయి సెంటర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు ఎస్ఎస్ నాగానంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి రాష్ట్రపతి మాట్లాడుతూ సదా సత్యం పలకాలని, సదా ధర్మాన్ని ఆచరించాలన్న బాబా వాక్కులను నిజ జీవితంలో అలవర్చుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బాబా బోధించిన మానవతా విలువలు, ఆధ్యాత్మికత కలగలిపి ఆధునిక విజ్ఞానాన్ని అందించేందుకు చక్కటి విద్యా వ్యవస్థను నెలకొల్పారని కొనియాడారు. భారతీయ విద్యా విధానంలో అనాదిగా అమలవుతున్న గురుకుల విద్యా విధానానికి మెరుగులుదిద్దుతూ.. నేటి సమాజ అవసరాల మేరకు మార్పులు చేసి నూతన గురుకుల విధానాన్ని అమలయ్యేలా విద్యా వ్యవస్థలను సత్యసాయిబాబా రూపొందించారని చెప్పారు. ఫలితంగా సత్యసాయి విద్యాసంస్థలు విలువల నిలయాలుగా నిలిచాయన్నారు. పేద ప్రజలకు వైద్యం, విద్య, మంచినీరు వంటి ఎన్నో సేవలు అందించారని ప్రశంసించారు. బాబా సేవలను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని విద్యార్థులకు సూచించారు.

విలువలతో కూడిన విద్య: ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, ప్రేమ, సాధన అలవర్చుకుని జీవితంలో అభివృద్ధి చెంది దేశానికి సేవలు అందించాలని సూచించారు. శ్రీసత్యసాయిబాబా విద్యాసంస్థల్లో నేటి ఆధునిక విద్యతో పాటు సమగ్ర సమైక్యతను నెలకొల్పే ప్రాచీన కాల గురుకుల విద్యావ్యవస్థను కూడా పాటిస్తూ విలువలతో కూడిన విద్యనందిస్తున్నారని కొనియాడారు. విద్యార్థులందరూ ధర్మం, సత్యాన్ని, ధర్మో రక్షిత రక్షితః అనే సిద్ధాంతాన్ని పాటిస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరచిన శ్రీసత్యసాయిబాబా విద్యాసంస్థలకు చెందిన 21 మందికి రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకాలను అందజేశారు. కార్యక్రమం అనంతరం ట్రస్టు సభ్యులు ముఖ్య అతిథులను సన్మానించారు.

తెలంగాణలో అధికారంలోకి వస్తాం

• బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి

సూర్యాపేట: తెలంగాణలో ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ నాయకత్వంలో బీఎస్పీ అధికారంలోకి వస్తుందని బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం సూర్యాపేట మండలంలోని గాంధీనగర్‌లో బహుజన రాజ్యాధికార సభ నిర్వహించారు. ఈ సభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్.. అన్నీ సంపన్న వర్గాల కోసం నడుస్తున్న పార్టీలని అన్నారు. కానీ బీఎస్పీ ఒక్కటే బహుజన వర్గాల కోసం ప్రజల విరాళాలతో పనిచేస్తోందని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మేనిఫెస్టోగా పెట్టుకుని నడుస్తున్న ఏకైక పార్టీ బీఎస్పీ అని చెప్పారు. దేశంలో మిగిలిన పార్టీలన్నీ ఓట్ల ముందు తాయిలాలు ప్రకటిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నాయన్నారు. ఇది గమనించిన వట్టె జానయ్య యాదవ్ లాంటి వారు బహుజన జెండాను ఎత్తుకోవడం ఆహ్వానించదగిన పరిణామమని అన్నారు. వట్టె జానయ్యపై జరిగిన దాడి యాదృచ్ఛికం కాదని.. అది బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు జరిపించిన వ్యూహాత్మక దాడి అని ఆరోపించారు. 'మేము తక్కువగా చెప్పి.. ఎక్కువగా పనిచేస్తాం'అని పేర్కొన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ 1,300 మంది విద్యార్థుల ఆత్మబలిదానాలతో వచ్చిన తెలంగాణలో కేసీఆర్ కుటుంబం భోగాలు అనుభవిస్తోందన్నారు. అమరవీరుల కుటుంబాలు ఎక్కడ ఉన్నాయో కూడా కేసీఆర్‌కు తెలియకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో గడీల పాలనను అంతమొందించాలని పిలుపునిచ్చారు. సభలో సూర్యాపేట బీఎస్పీ అభ్యర్థి వట్టె జానయ్యయాదవ్, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతిని గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు. చిత్రంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ఒక్కరోజే 30,889 బస్తాల ధాన్యం

తిరుమలగిరి (తుంగతుర్తి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం భారీగా వస్తోంది. బుధవారం ఒక్కరోజే 30,889 బస్తాల ధాన్యం వచ్చింది. ఈ ధాన్యానికి దొడ్డు రకానికి గరిష్టంగా రూ.2,142, కనిష్టంగా రూ.1,759, సన్న రకానికి గరిష్టంగా రూ.2,512, కనిష్టంగా రూ.1,759 ధర పలికింది. ఈ సీజన్‌లో మార్కెట్‌కు ఇప్పటి వరకు 7,223 మంది రైతులు 5,71,449 బస్తాల ధాన్యం తీసుకొచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సీజన్‌లో అత్యధికంగా ధాన్యం వచ్చింది. మార్కెట్‌లో స్థలం సరిపోకపోవడంతో బాటల్లో కూడా రైతులు ధాన్యం రాశులు పోస్తున్నారు. ధాన్యం అధికంగా రావడంతో కాంటాలు, ఎగుమతులు ఆలస్యం అవుతుండటంతో గురువారం, శుక్రవారం సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు.

కాళేశ్వరం చూపించి ఓట్లడుగు

- నేను శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్ చూపించి అడుగుతా
- కేసీఆర్‌కు పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సవాల్
- కాంగ్రెస్‌కు కచ్చితంగా 80 సీట్లు వస్తాయని ధీమా

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/గజ్వేల్/ సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: దశాబ్దాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు చెక్కు చెదరకుండా ఉంటే.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇటీవల కట్టిన కాళేశ్వరం కూలిపోతోందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మేడిగడ్డ కుంగింది.. అన్నారం పగిలింది. కేసీఆర్.. నువ్వు కాళేశ్వరం ప్రాజెక్టు చూపించి ఓట్లడుగు.. నేను శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్ చూపించి ఓట్లడుగుతా. నీకు చేతనైతే రా..'అంటూ సవాల్ విసిరారు. 'నేను ఏకలింగాన్ని, బుక్కెడు బువ్వోన్ని'అంటూ గజ్వేల్‌కు వచ్చిన కేసీఆర్, ఇప్పుడు ఎట్లుండో ప్రజలకు తెలుసునని అన్నారు. బక్కోడ్ని అని చెప్పుకునే కేసీఆర్ రూ.లక్ష కోట్లు దిగమింగడంతో పాటు, 10 వేల ఎకరాలు ఆక్రమించుకున్నారని, వందల ఎకరాలున్న ఫామ్‌హౌస్ చుట్టూ కాళేశ్వరం కాల్వలు నిర్మించుకున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.లక్ష కోట్ల అవినీతి సొమ్ము కక్కిస్తామని అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని దర్పల్లి, సిద్దిపేట జిల్లా గజ్వే ల్, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ సభల్లో ఆయన ప్రసంగించారు.

అందుకే కామారెడ్డికి కేసీఆర్

'కాంగ్రెస్‌కు 20 సీట్లు కూడా రావని కేసీఆర్ అంటున్నారు. నిజామాబాద్ సాక్షిగా కేసీఆర్‌కు చెబుతున్నా.. కాంగ్రెస్ ఒక్క సీటు కూడా తగ్గకుండా 80 సీట్లు వస్తాయి. కేసీఆర్ ఓటమి భయంతో ఆగమవుతున్నారు. గజ్వేల్‌లో ఓడిపోతాననే భయంతోనే కామారెడ్డిలో పోటీ చేయడానికి వచ్చారు. కానీ కామారెడ్డిలోనూ ముఖ్యమంత్రికి అసలైన వేట తప్పదు. కన్యాకుమారి వెళ్లినా.. శంకరగిరి మాన్యాలకు వెళ్లినా పట్టుకొని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు..'అని రేవంత్‌రెడ్డి చెప్పారు.

అధికారంలోకి వస్తే అండగా ఉంటాం

'బక్కటోన్ని అని చెప్పుకునే కేసీఆర్ తిండిలో బకాసురుడు, పడుకుంటే కుంభకర్ణుడు. ప్రజాధనాన్ని లూటీ చేసి, భూములను కాజేశారు. నేను గజ్వేల్ వస్తున్నానని తెలిసి కొడంగల్‌కు పోయిన కేసీఆర్.. రేవంత్ నోరు తెరిస్తే కంపుకొడుతది అనడం విడ్డూరంగా ఉంది. మనమిద్దరం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేయించుకుంటే ఎవరి నోరు కంపు కొడుతుందో తెలుస్తుంది. నేను సుక్క ముట్టెటోన్ని కాదు.. నీకు సుక్క లేంది నడవదు.. ఇలాంటి మతిలేని మాటలు మాట్లాడొద్దు. కాంగ్రెస్ వస్తే మల్లన్నసాగర్ నిర్వాసితులకు అండగా ఉంటాం. పోడు భూములకు పట్టాలు ఇస్తాం. తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులిచ్చి సీసీరోడ్లు, డ్రైనేజీలు వంటి అభివృద్ధి పనులు చేపడతాం. గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు రుణమాఫీ చేస్తాం. నన్ను అసెంబ్లీకి పంపి ఇందిరమ్మ రాజ్యం వచ్చేలా చేయాలి. ఇచ్చిన హామీలు నెరవేర్చని కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలి. భూములు గుంజుకునే దోపిడీ దొరల రాజ్యాన్ని ప్రజలు సాగనంపాలి..'అని రేవంత్ విజ్ఞప్తి చేశారు.

వైఎస్ మాదిరిగా సంక్షేమం

'వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో దళితులు, గిరిజనులకు అసైన్డ్ భూములు పంపిణీ చేశారు. అలాగే వ్యవసాయానికి ఉచిత విద్యుత్, రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు.. ఇలా నిరుపేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. అదే మాదిరిగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తాం'అని రేవంత్ హామీ ఇచ్చారు.



గజ్వేల్ ప్రచార సభలో ప్రసంగిస్తున్న రేవంత్‌రెడ్డి

4.17 లక్షల ఎకరాల్లో యాసంగి పంటల సాగు

- అత్యధికంగా 1.59 లక్షల ఎకరాల్లో పప్పుధాన్యాలు
- ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ నివేదిక

సాక్షి, హైదరాబాద్: యాసంగి సీజన్‌లో ఇప్పటివరకు 4.17 లక్షల ఎకరాల్లో పలు రకాల పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ తెలిపింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 54.93 లక్షల ఎకరాలు కాగా, 7.60 శాతం విస్తీర్ణంలో సాగైనట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. గత యాసంగి సీజన్‌లో ఇదే సమయానికి 3.93 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా, అప్పటికంటే ఇప్పుడు విస్తీర్ణం కాస్త పెరిగింది. ఇప్పటివరకు సాగైన పంటల్లో అత్యధికంగా పప్పుధాన్యాల పంటలు సాగయ్యాయి. పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 4.21 లక్షల ఎకరాలు కాగా, అందులో ఇప్పటివరకు 1.59 ఎకరాల్లో సాగైంది. వాటిల్లో శనగ విస్తీర్ణం 1.44 లక్షల ఎకరాలైనట్లు వ్యవసాయశాఖ తెలిపింది. ఇక వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 2.77 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 1.21 లక్షల ఎకరాల్లో (43.65%) సాగైనట్లు పేర్కొంది. మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 5.11 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 86,494 ఎకరాల్లో మాత్రమే సాగైంది. జొన్న సాధారణ సాగు విస్తీర్ణం 1.02 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 8,797 ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది వరి అధికంగా సాగవుతుందని అంచనా వేస్తున్నారు. వరి సాధారణ సాగు లక్ష్యం 40.50 లక్షల ఎకరాలు కాగా, ఇప్పుడిప్పుడే నాట్లు పుంజుకుంటున్నాయని వ్యవసాయశాఖ వెల్లడించింది. ఇప్పటివరకు కేవలం 1,248 ఎకరాల్లోనే నాట్లు పడ్డాయని పేర్కొంది.

మంథనిలో బీఆర్ఎస్ X కాంగ్రెస్

- నన్ను అంతం చేయాలని చూస్తున్నరు: పుట్ట మధు
- నడిరోడ్డుపై నిల్చుంటా.. నన్ను చంపమనండి: శ్రీధర్‌బాబు
- ఇరు పార్టీల పరస్పర ఫిర్యాదులు

మంథని: ఎన్నికలు దగ్గరపడే కొద్దీ పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలో అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీల మధ్య పోరు ఘర్షణ వాతావరణానికి దారితీస్తోంది. మహాముత్తారం మండలం మీనాజీపేటలో మంగళవారం రాత్రి జరిగిన దాడి ఘటనపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మంథని ఆర్డీవో హనుమా నాయక్‌కు బుధవారం ఇరు పార్టీల నేతలు పరస్పరం ఫిర్యాదు చేశారు. ఆర్డీవోను కలిసిన అనంతరం మంథని బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధు మీడియాతో మాట్లాడుతూ తనను అంతమొందించేందుకు కుట్రలు చేస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. పుట్ట మధు.. నీ అంతు చూస్తాం.. నిన్ను చంపేస్తాం' అంటూ బీఆర్ఎస్ నాయకుల ఇళ్లపై దాడి చేయాలని ఓడేడ్ గ్రామ సర్పంచ్ బక్కారావు పిలుపు ఇవ్వడం వెనుక పెద్దకుట్ర దాగి ఉందన్నారు.

కాంగ్రెస్ నేతలకు ప్రాణభయం: శ్రీధర్‌బాబు

మంథని అసెంబ్లీ నియోజకవర్గాన్ని సున్నితమైన ప్రాంతంగా పరిగణించి, శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రత్యేక పోలీసు బలగాలను నియమించాలని, ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీధర్‌బాబు ఎన్నికల రిటర్నింగ్ అధికారి హనుమా నాయక్‌కు ఫిర్యాదు చేశారు. బక్కారావుపై జరిగిన దాడిని ఖండిస్తూ స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. 'మంథని చౌరస్తాలో నడిరోడ్డుపై నిల్చుంటా.. బీఆర్ఎస్ నేతలను నన్ను చంపమనండి' అని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంథనిలో గూండాయిజం, రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తున్న స్థానిక బీఆర్ఎస్ అభ్యర్థి గురించి మాట్లాడితే బక్కన్నకు పట్టిన గతే కాంగ్రెస్ నాయకులకు పడుతుందని సోషల్ మీడియాలో వార్నింగ్ ఇచ్చిన నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హామీలా, హిందుత్వా?



ఆసక్తికరంగా రాజస్థాన్ పోరు

ఏ పార్టీకీ కనిపించని 'వేవ్'	గెహ్లోత్ పథకాలపై ప్రజల్లో సంతృప్తి	దిగజారిన శాంతిభద్రతలపై ఆందోళన

ప్రచారానికి నేటితో తెర. **25**న పోలింగ్

ఎడారి రాష్ట్రం రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికల పోరు చివరి దశకు చేరుకుంది. ఇక్కడ పాలక కాంగ్రెస్, విపక్ష బీజేపీ హోరాహోరీగా తలపడుతున్నాయి. నెల రోజులకు పైగా రాష్ట్రవ్యాప్తంగా పోటాపోటీ ప్రచారంతో ఇరు పార్టీలూ హోరెత్తించాయి. బీజేపీ ప్రచారానికి స్వయంగా ప్రధాని మోదీయే సారథ్యం వహించి కాలికి బలపం కట్టుకుని సుడిగాలి పర్యటనలు చేశారు. కాంగ్రెస్ తరఫున ప్రచార భారాన్ని ప్రధానంగా సీఎం అశోక్ గెహ్లోతే మోశారు. మోదీ మేనియాకు ప్రతి ఐదేళ్లకోసారి ప్రభుత్వాన్ని మార్చే ఆనవాయితీ తోడై తాము అందలమెక్కుతామని బీజేపీ నమ్మకం పెట్టుకుంది. గెహ్లోత్ వరుసబెట్టి ప్రకటిస్తూ వచ్చిన జనాకర్షక పథకాలు ఆ ఆనవాయితీకి ఈసారి అడ్డుకట్ట వేసి తమను మరోసారి గెలిపిస్తాయని కాంగ్రెస్ భావిస్తోంది. అయితే పోలింగ్ తేదీ సమీపించినా ఓటరు నాడి మాత్రం ఎవరికీ అందడం లేదు. ఏ పార్టీకీ అనుకూలంగా స్పష్టమైన 'వేవ్' కనిపించడం లేదు. దాంతో ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇరు పార్టీలూ సర్వశక్తులూ ఒడ్డాయి. కాంగ్రెస్ ప్రధానంగా ఎన్నికల హామీలపై ఆధారపడగా బీజేపీ ఎప్పట్లాగే హిందుత్వ కార్డును వీలైనంతగా ప్రచారంలో పెట్టింది...

పథకాలకు థమ్సప్...

గెహ్లోత్ ప్రభుత్వ పనితీరుపై క్షేత్రస్థాయిలో పెద్దగా వ్యతిరేకత కన్పించకపోవడం విశేషం. సంక్షేమ పథకాలపై ప్రజల్లో బాగా సంతృప్తి ఉంది. సంక్షేమ పథకాలు పేదలను ఎంతగానో ఆదుకున్నాయని బీజేపీ మద్దతుదారులు కూడా అంగీకరిస్తుండటం విశేషం! చిరంజీవి బీమా యోజన లక్షల మంది పేద, మధ్య తరగతి కుటుంబీకులకు ఎంతో ఆదుకుందని సవాయ్ మధోపూర్‌లో పవన్ మీనా అనే పాన్ షాప్ యజమాని చెప్పుకొచ్చారు. ''నేను బీజేపీ మద్దతుదారును. కానీ ఈసారి కాంగ్రెస్ పాలనలో ప్రజలకు జరిగిన మంచి కొట్టొచ్చినట్టు కన్పిస్తూనే ఉంది'' అన్నారాయన. కాకపోతే ఇదంతా ఓట్ల రూపంలో బదిలీ అవుతుందా అన్నది చూడాలంటూ ముక్తాయించారు. 10 లక్షల ఉద్యోగాలతో పాటు తక్షణం కులగణన చేపట్టి, మైనారిటీలకు జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తామని కూడా కాంగ్రెస్ తాజా మేనిఫెస్టోలో చెప్పింది. ఇవన్నీ ఓటర్లను ఏ మేరకు ప్రభావితం చేస్తాయో చూడాల్సిందే.

శాంతిభద్రతలపై పెదవి విరుపు...

పథకాల సానుకూలతకు శాంతిభద్రతల విషయంలో జనంలో నెలకొన్న తీవ్ర అసంతృప్తి బాగా గండి కొట్టేలా కనిపిస్తోంది. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి మాత్రం దారుణంగా దిగజారిందని మెజారిటీ ప్రజలు వాపోతుండటం ప్రమాద ఘంటికేనంటున్నారు. ముఖ్యంగా ఇస్లాంను కించపరిచాడంటూ గతేడాది ఉదయ్‌పూర్‌లో ఓ టైలర్ షాప్ యజమానిని పట్టపగలే తల నరికి చంపిన తీరును ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నారు. దానికి తోడు మహిళలపై అకృత్యాలు ఎన్నడూ లేనంతగా పెరిగిపోయిన తీరుపైనా జనం గగ్గోలు పెడుతున్నారు. పథకాల ఫలాలు అందరికీ అందుతున్నా ప్రాణాలకే భద్రత లేకపోతే ఏం లాభమని కోటాలో బట్టల షాపు నడుపుతున్న వినోద్ చేసిన వ్యాఖ్యలు జనాభిప్రాయానికి అద్దం పట్టేవే. ''గెహ్లోత్ ప్రభుత్వం బాగానే పని చేసింది. కానీ మార్పు అవసరం. బీజేపీ వస్తే బాగుంటుంది'' అన్నారాయన. బీజేపీకి ఓటేయడం చాలా అవసరమని కోటాకు చెందిన అమృత్ చౌహాన్ అనే ఆటోడ్రైవర్ చేసిన వ్యాఖ్యలు కూడా ఈ ధోరణినే ప్రతిఫలించాయి. ''శాంతిభద్రతలను చక్కదిద్దాలంటే యూపీ తరహా పాలన కావాల్సిందే. అప్పుడే ప్రధాని మోదీ చెబుతున్న హిందూ రాష్ట్ర స్థాపన సాధ్యం. కాంగ్రెస్ కేవలం ఒక్క సామాజిక వర్గానికే కొమ్ము కాస్తూ వస్తోంది'' అని చౌహాన్ చెప్పుకొచ్చారు.

ఈసారి 199 సీట్లలోనే పోలింగ్!

రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి గురువారం సాయంత్రంతో తెర పడనుంది. పోలింగ్ శనివారం జరుగుతుంది. ఎన్నికల ఫలితాలు మరో నాలుగు రాష్ట్రాలతో కలిపి డిసెంబర్ 3న వెల్లడవుతాయి. అయితే రాష్ట్రంలో 200 అసెంబ్లీ స్థానాలకు గాను 199 స్థానాల్లో మాత్రమే పోలింగ్ జరగనుంది! కరణ్‌పూర్ అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి గుర్మీత్‌సింగ్ కున్నర్ మృతితో అక్కడ పోలింగ్ వాయిదా పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇలా 199 స్థానాల్లోనే పోలింగ్ జరుగుతుండటం రాష్ట్ర చరిత్రలో ఇది వరుసగా మూడోసారి కావడం విశేషం! బీఎస్పీ అభ్యర్థుల మృతి కారణంగా 2018లో, 2013 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇలాగే ఒక అసెంబ్లీ స్థానంలో పోలింగ్ నిలిచిపోయింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

తుది దశకు రెస్క్యూ ఆపరేషన్

57 మీటర్ల శిథిలాల గుండా 45 మీటర్ల డ్రిల్లింగ్ పూర్తి

మరో 12 మీటర్లు పూర్తయితే కార్మికులు బయటపడే అవకాశం

- నేడో, రేపో తీసుకొచ్చేందుకు అధికారుల ప్రయత్నాలు
- ముమ్మరంగా కొనసాగుతున్న 'ఉత్తర కాశీ' ఆపరేషన్

ఉత్తరకాశీ/న్యూఢిల్లీ: పది రోజులకుపైగా సిల్‌క్యారా సొరంగంలో చిక్కుకుపోయిన 41 మంది కార్మికులను సురక్షితంగా బయటకుతెచ్చే డ్రిల్లింగ్ పనులు తుది దశకు చేరుకున్నాయి. దేశ, విదేశీ నిపుణుల పర్యవేక్షణలో కొనసాగుతున్న సహాయక, డ్రిల్లింగ్ పనుల్లో భారీ పురోగతి కనిపిస్తోందని అక్కడి వర్గాలు వెల్లడించాయి. ఉత్తరాఖండ్‌లోని ఛార్‌ధామ్ ప్రాజెక్టులో భాగంగా సిల్‌క్యారా వద్ద కొండను తవ్వుతుండగా లోపల 57 మీటర్లమేర సొరంగం కూలిందని సహాయక బృందాలు అంచనావేస్తున్నాయి. ఇందులో ఇప్పటికే 39 మీటర్లమేర తవ్వగా బుధవారం సాయంత్రానికి మరో ఆరు మీటర్ల మేర డ్రిల్లింగ్ చేసి 'సహాయక' పైపును విజయవంతంగా జొప్పించారు. వీరి అంచనా ప్రకారం మరో 12 మీటర్లు తవ్వితే కార్మికులు చిక్కుకున్న చోటుకు పైపు చేరుకోవచ్చు. దాదాపు మీటరు వ్యాసమున్న ఈ స్టీల్ పైపులోంచి కార్మికులను బయటకు తీసుకురావాలని ప్రణాళిక సిద్ధంచేసిన సంగతి తెల్సిందే. కార్మికులను బయటకు రాగానే వారికి అత్యవసర ప్రథమ చికిత్స అందించేందుకు ఛాతి డాక్టర్లతో కూడిన 14 మంది వైద్య బృందాన్ని ఘటనాస్థలి వద్ద సిద్ధంగా ఉంచారు. 12 అంబులెన్సులను, 41 పడకల తాత్కాలిక ఆస్పత్రిని సిద్ధంచేశారు. మరీ అత్యవసరమనుకుంటే వారిని వెంటనే దగ్గర్లోని ఆస్పత్రికి ఆగమేఘాల మీద తరలించేందుకు హెలీకాప్టర్‌ను తెప్పించనున్నట్లు సమాచారం.

బగ్వాల్ పండుగ వారితోనూ చేసుకుందాం

''డ్రిల్లింగ్ విజయవంతంగా కొనసాగుతోంది. వారిని సురక్షితంగా బయటకు తీసుకొస్తాం. వారితో కలిసే స్థానిక బగ్వాల్ పండగ జరుపుకుందాం'' అని ప్రధాని కార్యాలయం మాజీ సలహాదారు భాస్కర్ ఖుల్బే ఘటనాస్థలి వ్యాఖ్యానించారు. దీపావళి పండగ తర్వాత స్థానిక గర్వాల్ ప్రాంతంలో బగ్వాల్ పండగ జరుపుకోవడం ఆనవాయితీ. అక్కడి బగ్వాల్‌ను ఈ ఏడాది గురువారం జరుపుకుంటున్నారు. మరోవైపు, రెస్క్యూ ఆపరేషన్ పురోగతిపై రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీతో ప్రధాని మోదీ బుధవారం మాట్లాడారు.

సొరంగంలో కూలింది ఎక్కడ ?

సిల్‌క్యారా బెండ్ నుంచి మొదలుపెట్టి బార్కోట్ వరకు కొండ కింద 4.531 కి.మీ.ల మేర సొరంగం తవ్వుతున్నారు. సిల్‌క్యారా వైపు నుంచి 2.340 కి.మీ.ల మేర సొరంగం తవ్వకం, అంతర్గత నిర్మాణం పూర్తయింది. సొరంగం ముఖద్వారం నుంచి దాదాపు 205–260 మీటర్ల మార్క్ వద్ద దాదాపు 57 మీటర్ల పొడవునా సొరంగం కూలింది. అదే సమయంలో ఆ మార్క్ దాటి సొరంగం లోపలి వైపుగా కార్మికులు పనిలో ఉన్నారు. అంటే దాదాపు రెండు కిలోమీటర్ల మేర విశాలమైన ప్రాంతంలో కార్మికులు చిక్కుకుపోయారు. 57 మీటర్ల వెడల్పైన శిథిలాలు న్నాయి. ఇంతే వెడల్పున శిథిలాల గుండా పైపును జొప్పించి వారిని బయటకు తెచ్చేందుకు యత్నిస్తున్నారు.




బుధవారం టన్నెల్‌లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది



41 మంది కార్మికులు బయటికి రాగానే వారికి తక్షణం చికిత్స అందించేందుకు ఉత్తర కాశీ జిల్లా ఆస్పత్రిలో సిద్ధమవుతున్న పడకలు

టన్నెల్‌లో ప్రస్తుత పరిస్థితి ఊహాచిత్రం



మళ్లీ ఓపెన్‌ఏఐలోకి సామ్ ఆల్ట్‌మన్



శాన్ ఫ్రాన్సిస్కో: కృత్రిమ మేధ(ఏఐ) రంగంలో సంచలనం సృష్టించిన చాట్‌జీపీటీ తయారీసంస్థ ఓపెన్‌ఏఐ మరోసారి వార్తల్లో నిలిచింది. సీఈవో బాధ్యతల నుంచి తప్పుకున్న సామ్ ఆల్ట్‌మన్‌ను తిరిగి అదే పదవిలోకి తీసుకుంటున్నట్లు ఓపెన్‌ఏఐ తాజాగా ప్రకటించింది. తనను తొలగించిన కంపెనీ బోర్డును పునర్‌వ్యవస్థీకరించాలని సామ్ పెట్టిన షరతుకు ఓపెన్‌ఏఐ ఒప్పుకున్నట్లు సమాచారం. ఇందుకు అనుగుణంగానే కొత్తగా బ్రెట్ టైలర్ నేతృత్వంలో నూతన బోర్డును ఏర్పాటుచేస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఇటీవల బహిష్కరణ తర్వాత సామ్‌ను మైక్రోసాఫ్ట్‌కు చెందిన నూతన అడ్వాన్స్‌డ్ ఏఐ పరిశోధనా బృందంలో చేర్చుకుంటున్నట్లు మైక్రోసాఫ్ట్ సారథి సత్య నాదెళ్ల ప్రకటించడం తెల్సిందే. సామ్‌ను మళ్లీ సంస్థలోకి తీసుకోవాలని వాటాదారుల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో అతని షరతులకు సంస్థ ఒప్పుకోకతప్పలేదని తెలుస్తోంది. సంస్థలోకి పునరాగమనాన్ని సామ్ ధ్రువీకరించారు. మళ్లీ కృత్రిమ మేధ విభాగంలో అవిశ్రాంతంగా పనిచేస్తానని ప్రకటించారు.

సరిహద్దుల్లో ఉగ్రకాల్పులు

రాజౌరీ/జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు కెప్టెన్‌లు, ఒక హవీల్దార్, ఒక జవాను వీరమరణం పొందారు. కాల్పులు జరుగుతున్న అటవీప్రాంతంలో నక్కిన ఇద్దరు ఉగ్రవాదులను తుదముట్టించేందుకు మరింతగా భద్రతా బలగాలు అక్కడకు చేరుకుంటున్నాయని సైన్యాధికారులు బుధవారం చెప్పారు. నక్కిన ఇద్దరు ఉగ్రవాదులు విదేశీయులని సైన్యం వెల్లడించింది. గులాబ్‌గఢ్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు దాక్కున్నారనే సమాచారంతో గాలింపు చేపట్టగా ధరమ్‌సాల్ పరిధిలోని బజిమాల్ సమీపంలో ఈ కాల్పుల ఘటన చోటుచేసుకుందని ఆర్మీ ట్వీట్‌చేసింది. ఈ ఘటనలో ఒక మేజర్, ఒక జవాను గాయపడ్డారు.

కెనడాకు మళ్లీ ఈ వీసా సేవలు

ఒట్టావా/న్యూఢిల్లీ: కెనడాతో దౌత్య వివాదం నేపథ్యంలో ఆ దేశస్థులకు నిలిపేసిన ఎలక్ట్రానిక్ వీసాల జారీ సేవలను కేంద్రం పునరుద్ధరించింది. ఒట్టావాలోని భారత హై కమిషన్ బుధవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో చేసిన పోస్ట్‌లో ఈ మేరకు వెల్లడించింది. చేసింది. కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాద నేత హర్దీప్‌సింగ్ నిజ్జర్ గుర్తు తెలియని వ్యక్తుల కాల్పుల్లో మరణించడం, అది భారత గూఢచారుల పనేనని ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించడం తెలిసిందే. దాంతో ఇరు దేశాల సంబంధాలు బాగా క్షీణించాయి.

కాల్పులకు విరామం

ఇజ్రాయెల్-హమాస్ ఒప్పందం

- నేటి నుంచి 4 రోజుల పాటు అమలు
- ఇజ్రాయెల్ మంత్రివర్గం ఆమోదముద్ర
- ఖతార్, ఈజిప్ట్, యూఎస్ మధ్యవర్తిత్వం
- హమాస్ చెర నుంచి 50 మందికి విముక్తి
- బదులుగా 150 మంది పాలస్తీనా ఖైదీల విడుదల!
- ప్రతి 10 మంది విడుదలకు ఒక్కో రోజు అదనపు విరామం



జెరూసలేం/ఐరాస: తాత్కాలికంగానైనా ప్రార్థనలు ఫలించాయి. ప్రపంచ దేశాల విన్నపాలు ఫలితమిచ్చాయి. తీవ్ర ప్రతీకారేచ్ఛతో గాజాపై ఆరు వారాలుగా వైమానిక, భూతల దాడులతో విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్ ఓ మెట్టు దిగొచ్చింది. అంతర్జాతీయ సమాజం విజ్ఞప్తి మేరకు తాత్కాలికంగా కాల్పుల విరమణకు ఎట్టకేలకు అంగీకరించింది. ఈ మేరకు ఒప్పందాన్ని ఇజ్రాయెల్ మంత్రివర్గం బుధవారం ఆమోదించింది. ''ఇజ్రాయెల్ నాలుగు రోజుల పాటు కాల్పులను పూర్తిగా నిలిపేస్తుంది. బదులుగా హమాస్ తన చెరలో ఉన్న 240 మందిపై చిలుకు బందీల్లో 50 మందిని విడిచిపెడుతుంది'' అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కార్యాలయం పేర్కొంది. బందీలందరినీ విడిపించేందుకు కట్టుబడి ఉన్నట్టు తెలిపింది. ఒప్పందంలో భాగంగా తమ జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనియన్లను విడుదల చేసేందుకు ఇజ్రాయెల్ అంగీకరించినట్టు సమాచారం. హమాస్ చెర నుంచి బయట పడేవారిలో అత్యధికులు మహిళలు, పిల్లలే ఉంటారని చెబుతున్నారు. ఇజ్రాయెల్ కూడా పాలస్తీనా మహిళలు, పిల్లలను విడిచి పెట్టనుందని ఖతర్ వెల్లడించింది. ఈజిప్ట్, అమెరికాతో పాటు ఖతర్ కూడా ఇరు వర్గాల చర్చలకు మధ్యవర్తిగా వ్యవహరించడం తెలిసిందే. నిత్యావసరాలతో సహా సర్వం నిండుకుని మానవీయ సంక్షోభంతో అల్లాడిపోతున్న గాజాకు ఈ నాలుగు రోజుల్లో అదనపు సాయాన్ని అనుమతించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించినట్టు ఖతర్ విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఒప్పందం మలి దశలో భాగంగా ముమ్ముందు ఇరువైపుల నుంచి మరింత మంది బందీలు విడుదలవుతారని చెప్పుకొచ్చింది. కాల్పుల విరమణ గురువారం ఉదయం పదింటి నుంచి అమల్లోకి రానుంది. యుద్ధాన్ని ఆపేది లేదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కుండబద్దలు కొట్టారు! నాలుగు రోజుల విరామం ముగియగానే గాజాపై దాడులు పునఃప్రారంభం అవుతాయని ఆయన స్పష్టం చేశారు. ''మేం ముట్టడిలో ఉన్నాం. హమాస్‌ను నిర్మూలించి మా లక్ష్యాలన్నింటినీ సాధించేదాకా యుద్ధాన్ని కొనసాగించి తీరతాం'' అని ప్రకటించారు. దీర్ఘకాలిక యుద్ధానికి సైన్యం మరింతగా సన్నద్ధమయ్యేందుకు విరామం ఉపయోగపడుతుంది తప్ప సైనికుల స్థైర్యాన్ని తగ్గించబోదని ఆయన అన్నారు. అయితే హమాస్ చెరలోని బందీల్లో ప్రతి 10 మంది విడుదలకు ప్రతిగా కాల్పుల విరామాన్ని ఒక రోజు చొప్పున పెంచేందుకు ఇజ్రాయెల్ సమ్మతించింది. కాల్పుల విరమణను ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సహా పలు దేశాధినేతలు స్వాగతించారు. ఇజ్రాయెల్‌పై అక్టోబర్ 7న హమాస్ ఇస్లామిక్ మిలిటెంట్లు మెరుపు దాడికి దిగడం తెలిసిందే. 1,200 మందికి పైగా ఇజ్రాయెలీలను హతమార్చడంతో పాటు 240 మందికి పైగా బందీలుగా గాజాకు తరలించారు. ఇజ్రాయెల్ ప్రతీకార దాడులకు దిగి గాజాపై ఆరు వారాలుగా క్షిపణులు, బాంబుల వర్షం కురిపిస్తోంది.

ఏం జరగనుంది...

- ఇజ్రాయెల్, హమాస్ రెండూ నాలుగు రోజుల పాటు కాల్పులను పూర్తిగా నిలిపేస్తాయి.
- ముందు తమ వద్ద ఉన్న బందీల్లోంచి 50 మంది మహిళలు, చిన్నారులను రోజుకు 12 మంది చొప్పున హమాస్ విడుదల చేస్తుంది.
- అనంతరం ఇజ్రాయెల్ కూడా తన జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనియన్లను విడుదల చేస్తుందని ఖతర్ ప్రకటించింది.
- బహుశా గురువారమే బందీల విడుదల ప్రక్రియ మొదలవ్వొచ్చని వైట్‌హౌస్ అభిప్రాయపడింది.
- ఈ నాలుగు రోజుల్లో గాజాకు అదనపు మానవీయ సాయాన్ని ఇజ్రాయెల్ అనుమతిస్తుంది.

ఇప్పట్లో మళ్లీ కాల్పులుండనట్టే...!

విరామానికి స్వస్తి చెప్పి ఇజ్రాయెల్ ఇప్పట్లో గాజాపై మళ్లీ దాడులకు దిగడం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ''50 మంది బందీలు విడుదలైతే మిగతా వారినీ విడిపించాలంటూ కుటుంబీకుల నుంచి ఇజ్రాయెల్ ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుంది. అందులోనూ హమాస్ తన చెరలో ఉన్న సైనికులను చిట్టచివరన గానీ వదిలిపెట్టదు. అప్పటిదాకా దాడులు మొదలుపెట్టేందుకు వారి కుటుంబాలు ఒప్పుకోకపోవచ్చు'' అని పరిశీలకులు అంటున్నారు. అదే సమయంలో హమాస్ దీన్ని తమ విజయంగా చెప్పుకుంటే అది నెతన్యాహూ సర్కారుకు ఇబ్బందికరంగా పరిణమించవచ్చు. మరోవైపు, గాజాపై ఇజ్రాయెల్ దాడులు బుధవారం కూడా తీవ్ర స్థాయిలో కొనసాగాయి. ఉత్తర గాజాలో జబాలియా శరణార్థి శిబిరం బాంబు దాడులతో దద్దరిల్లింది. హమాస్ కూడా రోజంతా ఇజ్రాయెల్‌పైకి రాకెట్ దాడులు కొనసాగించింది.

ప్రాంతీయ సంక్షోభంగా మారొద్దు: మోదీ

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్-హమాస్ పోరు ప్రాంతీయ సంక్షోభంగా రూపుదాల్చకుండా అడ్డుకోవాలని ప్రధాని మోదీ జీ20 దేశాధినేతలకు పిలుపునిచ్చారు. బుధవారం జీ20 శిఖరాగ్ర సదస్సు వర్చువల్ భేటీ సందర్భంగా జీ20 దేశాధినేతలనుద్దేశిస్తూ ప్రధాని మోదీ ప్రసంగించారు. '' ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించేది లేదు. ఉగ్రవాదం కారణంగా ప్రపంచంలో ఎక్కడ పౌరులు మరణించినా తీవ్రంగా ఖండించాల్సిందే. బందీలను వదిలేస్తామంటూ హమాస్ మిలిటెంట్లు ప్రకటించడం నిజంగా స్వాగతించాల్సిన విషయం. గాజాలో నిరంతర మానవతా సాయం అందించడం తప్పనిసరి. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం ప్రాంతీయ సంక్షోభంగా పరిణామం చెందకుండా చూడాల్సిన బాధ్యత మనందరిది. పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరత నెలకొనాలి' అని మోదీ వ్యాఖ్యానించారు. ' ఇటీవలి కాలంలో కృత్రిమ మేధ(ఏఐ) దుర్వినియోగమవడం ఆందోళకరం. ఈ విషయంలో భారత వైఖరి సుస్పష్టం. ఏఐ రంగం అంతర్జాతీయ క్రమబద్ధీకరణకు ప్రపంచదేశాలతో కలిసి పనిచేసేందుకు భారత్ సిద్ధంగా ఉంది'' అని మోదీ స్పష్టంచేశారు. ఉక్రెయిన్ యుద్ధంలో మాదిరి గాజా స్ట్రిప్‌లో అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడం తనను షాక్‌కు గురిచేసిందని భేటీ సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యాఖ్యానించారు. వర్చువల్ భేటీలో బ్రెజిల్, యూఏఈ, రష్యా, కెనడా, బంగ్లాదేశ్ దేశాధినేతలతోపాటు ఐరాస కమిషన్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సారథులు పాల్గొన్నారు.

నిజం మాట్లాడే సొంత నేతలనూ బహిష్కరిస్తుంది

రాజస్తాన్‌లో ఎన్నికల ప్రచార సభలో కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ విమర్శలు

జైపూర్: రాజస్తాన్‌లో ఎన్నికల ప్రచారసభల్లో అధికార కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ మరింతగా విమర్శనాస్త్రాలు సంధించారు. బిల్వాడా జిల్లాలోని కోట్రీ గ్రామంలో భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. ' కాంగ్రెస్ కుటుంబం ముందు ఎవరైనా నిజం మాట్లాడితే ఇక అంతే. సొంత పార్టీ నేతలు అని కూడా చూడకుండా నిర్దాక్షిణ్యంగా పార్టీ నుంచి బహిష్కరిస్తారు. ఒకప్పుడు రాజేశ్ పైలట్ ఆహార సమస్యపై కాంగ్రెస్ కుటుంబాన్నే సవాల్ చేశారు. దీంతో అప్పటి నుంచి రాజేశ్ పైలటే కాదు ప్రస్తుతం ఆయన కుమారుడు సచిన్ పైలట్ సైతం పార్టీ ఆగ్రహానికి గురికావాల్సి వచ్చింది. 1997లో పార్టీ అధ్యక్ష పదవికి సీతారాం కేసరికి పోటీగా ఎన్నికల్లో నిల్చున్నందుకు రాజేశ్ పైలట్‌పై పార్టీ కన్నెర్రజేసింది. ఇప్పుడు ముఖ్యమంత్రి పదవి కోసం అశోక్ గెహ్లోత్‌తో పోటీపడినా అధిష్టానం దీవెనలు సచిన్‌కు దక్కలేదు'' అన్నారు.

అసెంబ్లీ సాక్షిగా రేపిస్టులకు క్లీన్ చిట్

''అసెంబ్లీ సాక్షిగా రేపిస్టులకు రాష్ట్ర మంత్రులే క్లీన్‌చిట్ ఇస్తున్నారు. ఇలాంటి పాలనలో మన తల్లులు, కూతుళ్లు, అక్కాచెల్లెళ్లకు రక్షణ ఏది? ఈ ఐదేళ్లలో రాష్ట్రాన్ని దోచుకోవడంలో ఏ ఒక్క అవకాశాన్నీ కాంగ్రెస్ వదిలిపెట్టలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనకు ముగింపు పలకాల్సిన సమయమొచ్చింది. కమలానికి మీరు వేసే ఒక్కో ఓటు కాంగ్రెస్‌ను తుడిచిపెట్టేందుకు దోహదపడుతుంది'' అని మోదీ అన్నారు. అంతకుముందు దుంగార్‌పూర్ జిల్లాలోని సాగ్వారా పట్టణంలో ర్యాలీలో మోదీ ప్రసంగించారు. కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. మరోవైపు, మోదీ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీతో పాటు సచిన్ పైలట్ కూడా ఖండించారు. ఆయన సొంత పార్టీపై దృష్టి పెడితే మంచిదని సచిన్ సూచించారు.



మేమొస్తే రాజస్తాన్‌లో కులగణన

రాష్ట్రంలో ఎన్నికల ప్రచార సభలో రాహుల్ హామీ



జైపూర్: రాజస్తాన్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి అధికారంలోకి రాగానే రాష్ట్రవ్యాప్తంగా కులగణన చేపడతామని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. బుధవారం ధోల్‌పూర్, భరత్‌పూర్‌లలో జరిగిన ప్రచారసభల్లో రాహుల్ పాల్గొని ప్రసంగించారు. ' దేశ రక్షణ కోసం పాటుపడేందుకు సైన్యంలో చేరాలని కలలు కనే లక్షలాది మంది యువత ఆశలను మోదీ సర్కార్ అగ్నిపథ్ పథకం తెచ్చి చిదిమేసింది. ఈ ఎన్నికల్లో గెలిచాక రాష్ట్రంలో, సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు తర్వాత దేశవ్యాప్తంగా కులగణన చేపడతాం. దళితులు, వెనుకబడిన తరగతుల జనాభా వంటి సమగ్ర వివరాలు బహిర్గతంకావాలంటే కులగణన జరగాల్సిందే. మోదీ హయాంలో దేశవ్యాప్తంగా ప్రజా సంపద పంపిణీ ఏ విధానంలో జరుగుతోందనేది పెద్ద ప్రశ్నగా మారింది'' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

అప్పుడలా.. ఇప్పుడిలా

''తాను ఓబీసీ వర్గానికి చెందిన వ్యక్తినని మోదీ పదేపదే చెప్పుకునేవారు. నేను ఎప్పుడైతే కులగణన డిమాండ్ తెరపైకి తీసుకొచ్చానో అప్పటి నుంచి ఆయన మాట మార్చారు. దేశంలో ఒక్కటే కులం ఉందట. అది 'పేదకులమట'' అని రాహుల్ ఎద్దేవాచేశారు. 'ప్రజాధనం లూటీ చేయడంలో మోదీ, కుబేరుడు గౌతమ్ అదానీ, హోం శాఖ మంత్రి అమిత్ షా బిజీగా మారారు. ముందుగా ప్రధాని మోదీ టీవీల్లో ప్రత్యక్షమై హిందువుల, ముస్లింల గురించి ప్రసంగాలు దంచేస్తూ ప్రజల దృష్టి మరల్చుతారు. వెంటనే గౌతమ్ అదానీ వెనక నుంచి వచ్చి ప్రజల జేబుల్లోని సొమ్ము నొక్కేస్తారు. ఆ తర్వాత ప్రజా వ్యతిరేకత, ఆందోళన అణచివేసేందుకు లాఠీ పట్టుకుని అమిత్ షా సిద్ధంగా ఉంటారు. ఇపుడు దేశంలో ప్రభుత్వం ఇలాగే నడుస్తోంది. మోదీ అనుక్షణం చానెళ్లలో కనిపిస్తూనే ఉంటారు. ఎందుకంటే ఆ చానెళ్లకు అధిపతి అదానీ కదా. మోదీనే ప్రజాధనాన్ని అదానీకి ముట్టజెప్తారు. విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, సిమెంట్ కర్మాగారాలను ధారాదత్తం చేస్తారు. అదానీకి అనుగుణంగా చట్టాలు చేస్తారు. పెద్ద నోట్లను రద్దుచేస్తారు'' అని రాహుల్ విమర్శించారు.

గుంజీలు తీస్తూ విద్యార్థి మృతి

జాజ్‌పూర్(ఒడిశా): బడి ఆవరణలో స్నేహితులతో ఆడుకుంటున్న విద్యార్థికి టీచర్ వేసిన శిక్ష ప్రాణం మీదకు తెచ్చింది. నాలుగో తరగతి విద్యార్థి గుంజీలు తీస్తూ కుప్పకూలి ఆస్పత్రిలో కన్నుమూసిన విషాద ఘటన ఒరాలీ గ్రామం దగ్గర్లోని సూర్యనారాయణ్ నోడల్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో జరిగింది. రసూల్‌పూర్ బ్లాక్ విద్యాధికారి(బీఈఓ) నీలాంబర్ మిశ్రా తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం పదేళ్ల పిల్లాడు రుద్ర నారాయణ్ సేథీ బడి ప్రాంగణంలో మధ్యాహ్నం పూట మూడు గంటలకు తోటి విద్యార్థులతో ఆడుకుంటున్నాడు. అది క్లాసులు జరిగే సమయం కావడంతో ''క్లాస్ వదిలేసి ఏంటీ ఆటలు?'' అంటూ కోప్పడి అక్కడి టీచర్.. సేథీసహా ఐదుగురిని గుంజీలు తీయండని ఆదేశించారు. దీంతో గుంజీలు తీస్తూ సేథీ కొద్దిసేపటికి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని దగ్గర్లోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి, మెరుగైన వైద్యం కోసం కటక్‌లోని ఎస్‌సీబీ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రికి తీసుకొచ్చేలోపే చిన్నారి ప్రాణాలు కోల్పోయాడని వైద్యులు ధ్రువీకరించారు. ' చిన్నారి మరణానికి వీళ్లే కారకులు అంటూ ఎవ్వరూ మాకు ఫిర్యాదు చేయలేదు. కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని బీఈఓ నీలాంబర్ స్పష్టం చేశారు.

రంగారెడ్డీ అంటేనే ఢీ

రూరల్‌లో ఎవరికీ అంత ఈజీ కాదు


అనంతగిరి హిల్స్

గ్రామీణ నియోజకవర్గాల్లో ఈసారి బీఆర్‌ఎస్‌కు కాంగ్రెస్ నుంచి పోటీ

ఉమ్మడి రంగారెడ్డి గ్రామీణ నియోజకవర్గాల నుంచి
గౌరీభట్ల నరసింహమూర్తి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 14 నియోజకవర్గాలున్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల పరిధిలో ఎనిమిది సెగ్మెంట్లు ఉన్నాయి. రాజేంద్రనగర్, చేవెళ్ల, పరిగి, తాండూరు, వికారాబాద్, మేడ్చల్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం జీహెచ్‌ఎంసీ పరిధి చుట్టూ విస్తరించి ఉన్నాయి. గత ఎన్నికల్లో ఆరు చోట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించగా, కాంగ్రెస్ నుంచి గెలిచిన ఇద్దరూ బీఆర్‌ఎస్‌లో చేరిపోయారు. ఇప్పుడు ఆ ఎనిమిదికి ఎనిమిది చోట్ల కాంగ్రెస్ పార్టీ బీఆర్‌ఎస్‌ను ఢీకొంటోంది. రాజేంద్రనగర్, మహేశ్వరం, చేవెళ్లల్లో బీజేపీ పటిష్టంగా ఉండటంతో త్రిముఖ పోరు నెలకొంది. మిగతా చోట్ల బీఆర్‌ఎస్‌- కాంగ్రెస్‌ల మధ్య ద్విముఖ పోటీ కనిపిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల విషయంలో సానుకూలత మెండుగానే ఉన్నా, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై అసంతృప్తి కనిపిస్తోంది. ఎమ్మెల్యేల అనుచరుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. దీన్ని కాంగ్రెస్ పార్టీ ఎంతమేర తనకు అనుకూలంగా మలుచుకుంటుందనే విషయంపై ఫలితాల సరళి ఆధారపడ్డట్టు స్పష్టమవుతోంది.

చేవెళ్ల
త్రిముఖ పోటీలో గట్టెక్కేదెవరు?

గత ఎన్నికలకు భిన్నంగా చేవెళ్లలో త్రిముఖ పోటీ నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్యే కాలె యాదయ్య బీఆర్‌ఎస్ నుంచి మరోసారి పోటీ చేస్తూ హ్యాట్రిక్ విజయం కోసం యత్నిస్తున్నారు. గత ఎన్నికల్లో ఆయన చేతిలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఓడిపోయిన కేఎస్ రత్నం ఈసారి బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. కాంగ్రెస్ పార్టీ ఈసారి షాబాద్ మండలానికి చెందిన యువ నేత భీమ్ భరత్‌ను బరిలోకి దింపింది. కాలె యాదయ్య తీరు, ఆయన అనుచరులపై ఆరోపణలు, కుటుంబ సభ్యులకు ఎక్కువ పదవులు ఇప్పించుకోవటం వంటి అంశాలు బీఆర్‌ఎస్‌కు ప్రతికూలంగా మారాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధినే యాదయ్య నమ్ముకున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు, ఎమ్మెల్యేపై అసంతృప్తిని కాంగ్రెస్ పార్టీ తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తోంది. గణనీయ సంఖ్యలో ఉన్న ముస్లిం మైనారిటీ ఓట్లను తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ తీవ్రంగా యత్నిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో బీజేపీ కొంత బలంగా ఉండటం, గతంలో జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా పనిచేసిన రత్నంకు స్వతహాగా ఉన్న కేడర్ ఇప్పుడు క్రియాశీలంగానే పనిచేస్తోంది. దీంతో ఆయన కూడా గట్టి పోటీ ఇస్తుండటంతో త్రిముఖ పోటీ అనివార్యమైంది.

పరిగి
వారి మధ్యే పోరు

బీఆర్‌ఎస్ – కాంగ్రెస్‌ల నుంచి గత ఎన్నికల్లో పోటీ పడ్డ అభ్యర్థులే మళ్లీ ఈసారి బరిలో నిలిచారు. సిట్టింగ్ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డిని బీఆర్‌ఎస్ మరోసారి బరిలో దింపింది. సీనియర్ నేత హరీశ్వర్‌రెడ్డి తనయుడుగా ఆయనకు నియోజకవర్గంలో మంచి గుర్తింపు ఉంది. ఇటీవలే హరీశ్వర్‌రెడ్డి చనిపోవటంతో కొంత సానుభూతి ఉంటుందని ఆ పార్టీ భావిస్తోంది. ఇక సీనియర్ నేత, గతంలో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన టి.రామ్మోహన్‌రెడ్డిపై పార్టీ మరోసారి నమ్మకాన్ని ఉంచింది. బీజేపీ నుంచి మారుతీకిరణ్ పోటీలో ఉన్నారు. కానీ ఇక్కడ పోటీ మాత్రం బీఆర్‌ఎస్-కాంగ్రెస్ మధ్యనే ఉంది. ఈసారి రామ్మోహన్‌రెడ్డి గట్టిపోటీ ఇస్తున్నారు. ఎమ్మెల్యే పనితీరుపై ప్రజల్లో కొంత అసంతృప్తి ఉండటం, నియోజకవర్గ పరిధిలోని కుల్కచర్ల డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రావటం (ప్రస్తుత తాండూరు కాంగ్రెస్ అభ్యర్థి), మరికొందరు బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు కాంగ్రెస్‌లోకి రావటంతో పోటీ రసవత్తరంగా మారింది. కాంగ్రెస్ ముఖ్యనేత రేవంత్‌రెడ్డి పోటీ చేస్తున్న కొడంగల్ పరిగి నియోజకవర్గానికి పక్కనే ఉండటం కూడా ఆ పార్టీలో కొంత సానుకూలత కనిపించటానికి కారణమైంది. బీజేపీ అభ్యర్థి చీల్చే ఓట్లు అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఇబ్రహీంపట్నం
టఫ్ ఫైట్

గత ఎన్నికల్లో కేవలం 376 ఓట్లతో విజయం సాధించిన బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి నుంచి టఫ్ ఫైట్ ఎదురైంది. ఎమ్మెల్యేపై స్థానికంగా వ్యతిరేకత కనిపిస్తున్నా.. ఆయన మాత్రం ప్రభుత్వ పథకాలు, స్థానికంగా జరిగిన పురోగతిని వివరిస్తూ ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గత ఎన్నికల్లో అతి తక్కువ ఓట్లతో ఓడిపోయిన సానుభూతి, స్థానికంగా కాంగ్రెస్‌కు నమ్మకమైన ఓటు బ్యాంకు ఉండటం మల్‌రెడ్డి రంగారెడ్డికి కలిసిరానున్నాయి. అసైన్‌మెంట్ భూములను వెనక్కు తీసుకుంటున్న అంశం కొన్ని ప్రాంతాల్లో ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమవుతోంది. అంతర్గత రోడ్లు సరిగా లేకపోవటం, నిరుద్యోగ అంశంపై జనంలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఇలాంటి అంశాలను కాంగ్రెస్ అభ్యర్థి అందిపుచ్చుకుని ప్రచారంలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఇక్కడి నుంచి బీజేపీ అభ్యర్థిగా దయానంద్ గౌడ్ పోటీలో ఉన్నా.. పోటీ మాత్రం బీఆర్‌ఎస్-కాంగ్రెస్ మధ్యే కనిపిస్తోంది.

గ్రౌండ్ రిపోర్ట్
ఉమ్మడి రంగారెడ్డి

మేడ్చల్
మెరిసేది ఎవరో..?

మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డికి కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్‌యాదవ్ నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. ఓ పక్షం రోజుల క్రితం వరకు మల్లారెడ్డికి కొంత అనుకూల వాతావరణం ఉన్నా, పది రోజుల్లో బీఆర్‌ఎస్ నుంచి చెప్పుకోదగ్గ సంఖ్యలో నేతలు కాంగ్రెస్‌లోకి మారటం ఆయనపై ప్రభావాన్ని చూపుతోంది. బోడుప్పల్ నుంచి ఐదుగురు కార్పొరేటర్లు, ఘట్‌కేసర్ నుంచి ఐదుగురు కౌన్సిలర్లు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లారు. మేడ్చల్, శామీర్‌పేటల్లోని కొందరు సర్పంచులు, ఓ వైస్ ఎంపీపీ కూడా పార్టీ కండువా మార్చుకోవటం కాంగ్రెస్‌కి కలిసి వచ్చింది. ప్రజల్లో కాంగ్రెస్ పట్ల కొంత సానుకూల ధోరణికి ఈ నేతల మార్పులు తోడుకావటంతో కాంగ్రెస్‌లో ఉత్సాహం పెరిగింది. కానీ ప్రచారంలో ఇంకా జోరుపెంచాలి. ఇక మంత్రిగా తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను వివరిస్తూ మల్లారెడ్డి ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. మల్లారెడ్డి మాట తీరు, ఆయన వ్యవహారంపై ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. మల్లారెడ్డి అనుచరులపై ఉన్న ఆరోపణలు కూడా ఆయనకు కొంత ప్రతికూలంగా మారేలా ఉంది. ఇక్కడ బీజేపీ నుంచి దయానంద్ గౌడ్ పోటీలో ఉన్నా ప్రధాన పోటీ మాత్రం బీఆర్‌ఎస్-కాంగ్రెస్ మధ్యనే కనిపిస్తోంది.


మల్లారెడ్డి


వజ్రేష్ యాదవ్

తాండూరు
ఇద్దరి మధ్యనే తీవ్రపోటీ

గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచిన పైలట్ రోహిత్‌రెడ్డి ఆతర్వాత బీఆర్‌ఎస్‌లో చేరి ఇప్పుడు కారు గుర్తుపై అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఆయనపై బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌నే అంటిపెట్టుకుని ఉన్నా పార్టీ టికెట్ నిరాకరించింది. దీంతో ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలుస్తారన్న ప్రచారం జరిగింది. కానీ, ఎమ్మెల్సీగా ఉన్న ఆయనకు మంత్రి పదవి ఇచ్చి పార్టీ మారకుండా బీఆర్‌ఎస్ జాగ్రత్త పడింది. ఆయన తన సోదరుడు నరేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న కొడంగల్‌లో ప్రచారానికే పరిమితమయ్యారు. కుల్కచర్లకు చెందిన డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ తాండూరు అభ్యర్థిగా నిలబెట్టింది. గతంలో ఇది కాంగ్రెస్ పార్టీ స్థానం కావటం, ప్రభుత్వంపై స్వతహాగా ఉండే వ్యతిరేకత, ఎమ్మెల్యే అనుయాయులపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి కలిసి వస్తుందని కాంగ్రెస్ బలంగా నమ్ముతోంది. ఇక్కడి నుంచి పోటీకి బీజేపీ నేతలు సిద్ధపడ్డా, పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. ఆ పార్టీ నుంచి నేమూరి శంకర్‌గౌడ్ పోటీలో ఉన్నారు. దీంతో బీజేపీ నేతలు కొందరు కాంగ్రెస్‌కు అనుకూలంగా పనిచేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. బీఎస్పీ నుంచి చంద్రశేఖర్ ముదిరాజ్ పోటీ పడుతున్నారు. తాండూరు, బషీరాబాద్, పెద్దేముల్ మండలాల్లో కాంగ్రెస్ బలంగా కనిపిస్తోంది. స్థానికంగా అధిక సంఖ్యలో ఉన్న ముస్లిం మైనారిటీ ఓట్ల కోసం రెండు పార్టీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

వికారాబాద్
ద్విముఖ పోరు


గత ఎన్నికల్లో విజయం సాధించిన మెతుకు ఆనంద్‌ను మరోసారి బీఆర్‌ఎస్ బరిలో దింపగా, కాంగ్రెస్ పార్టీ కూడా గత అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్‌నే పోటీకి నిలిపింది. ఆ ఎన్నికల్లో దాదాపు మూడు వేల ఓట్ల తేడాతో ఓడిపోయిన కాంగ్రెస్ ఈసారి గట్టి పోటీనిస్తుండటంతో ఈ ఎన్నిక ఆసక్తిగా మారింది. మాజీ మంత్రి, స్థానికుడైన సీనియర్ నేత చంద్రశేఖర్ ఎన్నికలకు కొద్దిరోజుల ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి మారి జహీరాబాద్ నుంచి పోటీలో నిలిచారు. ఆయన కాంగ్రెస్‌లోకి రావటంతో ఆయన వెంట కాంగ్రెస్‌లోకి వచ్చిన వికారాబాద్ కేడర్ బలం ఇప్పుడు గడ్డంప్రసాద్‌కుమార్‌కు కలిసి రానుంది. స్థానికంగా బీజేపీ అభ్యర్థి బరిలో ఉన్నా.. పోటీ మాత్రం బీఆర్‌ఎస్-కాంగ్రెస్ మధ్యలోనే కేంద్రీకృతమైనట్టు కనిపిస్తోంది. ఎమ్మెల్యే ఆనంద్ పనితీరుపై కొన్ని ప్రాంతాల్లో అసంతృప్తి కనిపిస్తోంది. గడ్డం ప్రసాద్‌కుమార్ కాంగ్రెస్ హయాంలో మంత్రి హోదాలో వికారాబాద్‌ను పెద్దగా పట్టించుకోలేదన్న విమర్శ ఉండటాన్ని ఆనంద్ తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

రాజేంద్రనగర్
త్రిముఖ పోరులో గెలుపెవరిదో?

బీఆర్‌ఎస్ అభ్యర్థి, హ్యాట్రిక్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు ఈసారి గట్టి పోటీ ఎదురవుతోంది. మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముదిరాజ్‌ను కాంగ్రెస్ పార్టీ బరిలో నిలిపింది. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి బరిలో నిలిచి గెలుపు అంచుల వరకు వచ్చిన మజ్లిస్ పార్టీ ఈసారి ముస్లిమేతర అభ్యర్థి స్వామియాదవ్‌ను పోటీలో నిలిపింది. మజ్లిస్ అగ్రనేతలు స్థానికంగా ప్రచారంపై పెద్దగా ఆసక్తి చూపటం లేదు. ఇక ఈ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే జీహెచ్‌ఎంసీ డివిజన్ మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోక శ్రీనివాసరెడ్డిని బీజేపీ బరిలో నిలిపింది. నియోజవర్గ పరిధిలో మూడు జీహెచ్‌ఎంసీ డివిజన్లలో బీజేపీ కార్పొరేటర్లున్నారు. దీంతో బీజేపీ అభ్యర్థి గట్టిపోటీదారు మారిపోయారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉండి చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను నమ్ముకుని బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ పూర్తిగా కాంగ్రెస్ పార్టీ బలాన్ని, బీసీ సామాజిక వర్గాల అండనే నమ్ముకున్నారు. మజ్లిస్ నుంచి నాన్ మైనారిటీ నేత బరిలో ఉండటంతో ముస్లిం మైనారిటీ ఓట్ల కోసం కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు గట్టిగా ప్రయత్నిస్తున్నాయి.


సబితారెడ్డి


లక్ష్మారెడ్డి


శ్రీరాములు

మహేశ్వరం
ముక్కోణపు పోటీ

గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున గెలిచి తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరి మంత్రి పదవి దక్కించుకున్న సబితారెడ్డి ఈసారి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థిగా సీనియర్ నేత కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పోటీ చేస్తుండగా, బీజేపీ అభ్యర్థిగా శ్రీరాములు యాదవ్ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. మంత్రి సబిత, మిగతా ఇద్దరు అభ్యర్థుల నుంచి గట్టి పోటీనే ఎదుర్కొంటున్నారు. ఏడు నెలల క్రితంహస్తం గూటికి చేరిన బడంగ్‌పేట మేయర్ పారిజాత నరసింహారెడ్డికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తుందని భావించారు. కానీ అనూహ్యంగా కేఎల్ఆర్ దక్కించుకున్నారు. దీంతో స్థానికంగా పట్టున్న పారిజాత తీవ్ర అసంతృప్తికి గురైనా, అనంతరం కొంత సయోధ్యతో ప్రచారంలో పాల్గొంటుండటం కేఎల్ఆర్‌కు కలిసివచ్చే అంశం. సబితారెడ్డి కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరటం జనంలో కొంత అసంతృప్తికి కారణమైంది. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన తీగల కృష్ణారెడ్డి నుంచి సబితకు పూర్తిస్థాయి సహకారం అందటం లేదంటున్నారు. మరోవైపు, బీజేపీ అభ్యర్థి శ్రీరాములుయాదవ్ ఇక్కడ పెద్దసంఖ్యలో ఉన్న తన సామాజిక వర్గం ఓట్లపై గురిపెట్టారు. ఈ విషయంలో ఆయనకు సానుకూలత కనిపిస్తోంది. ఫలితంగా ఇక్కడ ముక్కోణపు పోటీ నెలకొంది.

సేమ్ నేమ్ బ్యాలెట్ గేమ్!



చాలా నియోజకవర్గాలలో ప్రధాన పార్టీల అభ్యర్థులకు పోటీగా నిలిచిన స్వతంత్రులు

సాక్షి, హైదరాబాద్: యాదృచ్ఛికమో..ఉద్దేశపూర్వకమో.. తెలియదు కానీ ఎన్నికలు ఏవైనా సరే.. ఇంటి పేరు సహా ఒకే పేరు ఉన్న వేర్వేరు అభ్యర్థులు పోటీ చేయడం రివాజుగా మారింది. పేరు మాత్రమే కాకుండా ఇంటి పేర్లు కూడా ఒకేలా ఉండటంతో ఓటర్లలో నిరక్షరాస్యులు, అవగాహన కొందరు ఓటర్లలో గందరగోళం నెలకొనే ప్రమాదం ఉందని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.ఈనెల 30న జరగనున్న శాసనసభ ఎన్నికలలో రాష్ట్రంలోని చాలా నియోజకవర్గాలలో ఈ సమస్య కనిపిస్తోంది.

ఎక్కువగా బీఆర్‌ఎస్ అభ్యర్థులను పోలిన వారే

ఎక్కువగా బీఆర్‌ఎస్ అభ్యర్థులను పోలిన పేర్లున్న వారే స్వతంత్రులుగా పోటీ చేస్తున్నారు. కొన్ని చోట్ల అలయెన్స్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ పార్టీ (ఏడీఆర్) పేరుతోనూ ఉన్నారు. దీంతో ప్రధాన పార్టీల నేతలు.. పోటీ చేసే పార్టీ గుర్తు, అభ్యర్థి ఫొటోతో పాటు పేరును కూడా తెగ ప్రచారం చేస్తున్నారు. ఓటర్లను గందరగోళానికి గురి చేయడమే లక్ష్యంగా ప్రత్యర్థి పార్టీలు కుట్ర చేస్తున్నాయని ఎన్నికల సంఘానికి సైతం ఫిర్యాదు చేశారు.

ఒకే పేరు కలిగి పోటీ పడుతున్న నియోజకవర్గాల్లో కొన్ని

- **ఎల్బీనగర్:** దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి (బీఆర్‌ఎస్), దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి (స్వతంత్ర), డి.సుధీర్‌రెడ్డి (స్వ)
- **మహేశ్వరం:** కె.లక్ష్మారెడ్డి (కాంగ్రెస్), కె.లక్ష్మారెడ్డి (జన శంఖారావం), పి.సబిత (బీఆర్‌ఎస్), ఎం.సబిత (స్వ)
- **మునుగోడు:** కె.ప్రభాకర్‌రెడ్డి (బీఆర్‌ఎస్), కె.ప్రభాకర్‌రెడ్డి (ఏడీఆర్)
- **మిర్యాలగూడ:** బి.లక్ష్మారెడ్డి (కాంగ్రెస్), బి.లక్ష్మారెడ్డి (స్వ)
- **అచ్చంపేట:** జి.బాలరాజు (బీఆర్‌ఎస్), జి.బాలరాజు (ఏడీఆర్)
- **దేవరకద్ర:** ఏ.వెంకటేశ్వర్ రెడ్డి (బీఆర్‌ఎస్), ఏ.వెంకటేశ్వర్‌రెడ్డి (స్వ)
- **గద్వాల:** సరిత (కాంగ్రెస్), జి.సరిత (నవతరం కాంగ్రెస్), సరిత (స్వ)
- **సనత్‌నగర్:** శ్రీనివాస్‌యాదవ్ (బీఆర్‌ఎస్), ఉప్పలపాటి శ్రీనివాస్ (యుగ తులసి)
- **జహీరాబాద్:** ఏ.చంద్రశేఖర్ (కాంగ్రెస్), చంద్రశేఖర్, ఎం.చంద్రశేఖర్, ఎడ్ల చంద్రశేఖర్ (స్వ)
- **ఇబ్రహీంపట్నం:** మంచిరెడ్డి కిషన్‌రెడ్డి (బీఆర్‌ఎస్), కె.కిషన్‌రెడ్డి (ఏడీఆర్)
- **ఉప్పల్:** బండారి లక్ష్మారెడ్డి (బీఆర్‌ఎస్), మన్నె లక్ష్మారెడ్డి (ఏడీఆర్)
- **పరిగి:** కొప్పుల మహేశ్‌రెడ్డి (బీఆర్‌ఎస్), బి.మహేశ్‌రెడ్డి (ఏడీఆర్)
- **కొడంగల్:** పట్నం నరేందర్‌రెడ్డి (బీఆర్‌ఎస్), ప్యాట నరేందర్ రెడ్డి (స్వ)
- **నారాయణపేట:** ఎస్.రాజేందర్‌రెడ్డి (బీఆర్‌ఎస్), కె.రాజేందర్ రెడ్డి (స్వ)
- **మహబూబ్‌నగర్:** వి.శ్రీనివాస్‌గౌడ్ (బీఆర్‌ఎస్), ఎం.శ్రీనివాసులు (స్వ)
- **కొల్లాపూర్:** బి.హర్షవర్ధన్ రెడ్డి (బీఆర్‌ఎస్), కె.హర్షవర్ధన్ రెడ్డి (స్వ)
- **హుజూర్‌నగర్:** ఎస్.సైదిరెడ్డి (బీఆర్‌ఎస్), టి.సైదిరెడ్డి (ఏడీఆర్)
- **ఖమ్మం:** పువ్వాడ అజయ్ (బీఆర్‌ఎస్), ఏ.అజయ్ (స్వ), కె.అజయ్ (స్వ)
- **ముషీరాబాద్:** ముఠాగోపాల్ (బీఆర్‌ఎస్), ఎం.గోపాల్ (ఏఐహెచ్‌సీపీ)

(నోట్: స్వతంత్రులు (స్వ),
అలయెన్స్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్)

ఎన్నికలు బహిష్కరిస్తూ తీర్మానం


బంగారుచెలక గ్రామంలో బ్యానర్

కొత్తగూడెంరూరల్: తమ సమస్యలు పరిష్కరించనందున నాలుగు గ్రామ పంచాయతీల ప్రజలు ఎన్నికలను బహిష్కరిస్తామంటున్నారు. ఈ మేరకు వారు బ్యానర్లు కూడా ఏర్పాటు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం కొత్త చింతకుంట, లక్ష్మీపురం, బొజ్జలగూడెం, బంగారుచెలక గ్రామస్తులు ఈ మేరకు తీర్మానం చేశారు. సర్వే నంబర్ 286, 381 అసైన్‌మెంట్ భూ హక్కుదారుల పేర్లను ధరణిలో చేర్చాలని, వ్యవసాయానికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని, గిరివికాస్ పథకంలో అర్హులైన రైతులందరికీ వ్యవసాయ బోర్లు మంజూరు చేయాలని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహలక్ష్మి పథకం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారానికి ఎన్నో రోజులుగా పోరాడుతున్నా ఎవరూ పట్టించుకోనందుకు నిరసనగా ఎన్నికలను బహిష్కరిస్తున్నామని వెల్లడించారు.



బరిగీసి.. బర్రెలక్క

యువతకు స్ఫూర్తినిస్తూ కొల్లాపూర్‌లో పోటీకి దిగిన శిరీష
ప్రముఖుల ప్రశంసలు, అండదండలు



నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తున్నా

'రాష్ట్రంలో నోటిఫికేషన్లు రాక, నియామకాల ప్రక్రియ సక్రమంగా లేక ఉద్యోగాలు పొందలేని నిరుద్యోగుల తరపున అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో నిలిచాను. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నాతో కలసి ప్రచారంలో ఉన్న మా తమ్మునిపై దాడిచేశారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా నిరుద్యోగుల తరపున పోరాటాన్ని కొనసాగిస్తాను. యువత రాజకీయాల్లోకి రావాలని కోరుతున్నా. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యావంతురాలుగా నాకు అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా.'

రాష్ట్రంలోని నిరుద్యోగుల తరపున అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు శిరీష. సోషల్‌మీడియాలో 'బర్రెలక్క'గా ప్రాచుర్యం పొందిన 26 ఏళ్ల యువతి కర్నె శిరీష. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీలో నిలవడంతో ఆమెకు వివిధ వర్గాల నుంచి విశేష మద్దతు లభిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు. ఇప్పటికే యానాం మాజీ మంత్రి, ఢిల్లీ ప్రత్యేక అధికార ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆమె ప్రచార ఖర్చుల కోసం రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఇతర ప్రాంతాల నుంచి నిరుద్యోగులు వచ్చి కొల్లాపూర్‌లో ఆమెకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

మద్దతుగా హోరెత్తిన ప్రచారం..

కొల్లాపూర్ నుంచి నామినేషన్ వేసిన శిరీష తాను నిరుద్యోగుల తరపున పోరాటం చేసేందుకే అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచినట్టు ప్రకటించారు. దీంతో క్రమంగా ఆమెకు సోషల్‌మీడియాతో పాటు రాష్ట్రంలోని యువత, నిరుద్యోగుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి నిరుద్యోగులు స్వచ్ఛందంగా ప్రచారం నిర్వహించేందుకు కొల్లాపూర్‌కు తరలివస్తున్నారు. ఎన్నికల ప్రచారం కొనసాగిస్తున్న ఆమె తమ్ముడు చింటూపై కొందరు యువకులు ఇటీవల దాడికి పాల్పడటంపై నిరుద్యోగ వర్గాలు మండిపడుతున్నాయి. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఈ ఘటనపై ఖండించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శిరీషకు మద్దతు ఇచ్చారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో ఉన్న శిరీషకు రక్షణ కల్పించాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు.

బర్రెలక్క పేరుతోనే ట్రెండింగ్..

'హాయ్ ఫ్రెండ్స్.. డిగ్రీలు ఎన్ని వచ్చినా నోటిఫికేషన్లు, ఉద్యోగాలు రావడం లేదు. అందుకే మా అమ్మకు చెబితే నాలుగు బర్లను కొనిచ్చింది. బర్లను కాయడానికి వచ్చిన ఫ్రెండ్స్' అంటూ ఏడాదిన్నర కిందట శిరీష చేసిన వీడియో సోషల్ మీడియాలో సంచలనమైంది. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం మరికల్ గ్రామానికి చెందిన కర్నె శిరీష బీకాం వరకు చదువుకుంది. తల్లి అనూరాధ ఓ చిన్న టిఫిన్ సెంటర్ నడుపుతూ శిరీషతో పాటు ఇద్దరు కుమారులను చదివించింది. చిన్న రేకులషెడ్డులో జీవనం సాగిస్తున్న ఆ కుటుంబానికి తల్లితో పాటు తానూ పెద్దదిక్కులా నిలవాలని భావించింది. ఆ మేరకు పోలీస్ కానిస్టేబుల్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమైంది. అయితే నోటిఫికేషన్లు రాలేదంటూ అప్పట్లో ఈమె చేసిన వీడియోపై పోలీసులు 2022లో పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఐపీసీ 505(2) సెక్షన్ కింద కేసు కూడా నమోదు చేశారు.

పాదం వెంకటేష్

ఫొటో పంపు.. పైసలు తీసుకో!

ప్రచారం చేస్తున్నారా? లేదా ? అని నిఘా



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు పెట్టిన ప్రతీ పైసాకు ఫలితం దక్కేలా జాగ్రత్త వహిస్తున్నారు. తమ నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఓటర్ల వద్దకు వెళ్లి ప్రచారం చేయాలని స్థానిక నాయకులు, కార్యకర్తలను పురమాయిస్తున్నారు. కొందరు ప్రచారం చేయకున్నా చేసినట్టు చెబుతూ అభ్యర్థుల జేబులకు చిల్లు పెడుతున్నారు. వీటిని నివారించేందుకు 'ఫొటో పంపు, పైసలు తీసుకో' అనే పద్ధతి అనుసరిస్తున్నారు. ప్రతిరోజూ ఎంతమంది వచ్చారో, ఫొటోలు, వీడియోలు తీసి వాట్సాప్ చేయాలనే నిబంధన విధిస్తున్నారు. వీటిని పార్టీ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేస్తున్నారు. ఉదాహరణకు ఓ వాడలో వంద మంది ప్రచారం నిర్వహించామని సంబంధిత ఇన్‌చార్జ్ చెబితే ఆ వంద మంది తప్పనిసరిగా ఫొటో, వీడియోల్లో కనిపించాలి. ఒకవేళ తక్కువ మంది కనిపిస్తే ఆ మేర డబ్బులు ఇవ్వడం లేదు. ఇక బైక్ ర్యాలీలు, ఆటోలు, ప్రచార రథాలు గ్రామాలు, పట్టణాల్లో తిరిగే సమయంలో మీటర్ రీడింగ్‌లను ఫొటో తీసి పంపి, రాత్రి వరకు ఎన్ని కిలోమీటర్లు తిరిగి ప్రచారం చేశారో లేదో చెక్ చేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక ఎన్నికల్లో తీసుకున్న డబ్బుల ప్రకారం తప్పనిసరిగా పనిచేయాలి వస్తోంది.



హంగ్ కోసం బీజేపీ యత్నం

'రాష్ట్రంలో హంగ్ అసెంబ్లీ కోసం బీజేపీ ప్రయత్నిస్తోంది. ఈసారి ఇక్కడ పప్పులు ఉడకడం లేదని పసిగట్టింది. దీంతో రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడాలని చూస్తోంది. దాని ఫలితంతో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందాలని భావిస్తోంది. వచ్చే ఐదేళ్లలో సంకీర్ణంతో బలోపేతం కావాలనుకుంటోంది. ప్రజలు మజ్లిస్‌కు 9, బీఆర్‌ఎస్‌కు 110 సీట్లలో సంపూర్ణ మద్దతు ఇచ్చి.. కేసీఆర్ మామకు అధికారం కట్టబెట్టాలి' అని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెప్పారు. బుధవారం టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

- సాక్షి, హైదరాబాద్

బీఆర్‌ఎస్, మజ్లిస్‌కు సంపూర్ణ మద్దతు ఇవ్వండి

- కాంగ్రెస్ అధికారంలో ఉంటే మత ఘర్షణలే..
- పీసీసీ అధినేత రేవంత్ రెడ్డి ఆనవాళ్లు ఆర్‌ఎస్‌ఎస్‌లో..
- మజ్లిస్ బలంగా ఉంది కాబట్టే.. తెలంగాణలో మైనార్టీ డిక్లరేషన్ తెచ్చారు
- పాఠ్యపుస్తకాల్లో గాంధీని అవమానపర్చి.. గాడ్సేను చేర్చారు
- కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతారు

మీట్ ది ప్రెస్‌లో ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ

కాంగ్రెస్‌తోనే బీజేపీ గ్రాఫ్ పెరుగుతోంది

కాంగ్రెస్ అసమర్థత వల్లే బీజేపీ గ్రాఫ్ పెరుగుతోంది. కేంద్రంలో వరుసగా గెలుస్తోంది. రాహుల్ గాంధీ నాయకత్వంలోనే ఎంపీల బలం 50కి పడిపోయింది. మోదీ ప్రధాని కావడానికి ఆయనే కారణం. తమ అసమర్థత కప్పిపుచ్చుకోవడానికి కోపమంతా మజ్లిస్‌పై ప్రదర్శిస్తున్నారు. ఓట్లు చీల్చుతున్నామని అపవాదు అంటకడుతున్నారు. అమేథీలో మజ్లిస్ పోటీ చేయకపోయినా స్మృతి ఇరానీ చేతిలో రాహుల్ ఓడిపోయారు. తాత ముత్తాత, నానమ్మ సీట్లను కూడా కాపాడుకోలేకపోయారు. కేరళలోని వయనాడ్‌లో ముస్లిం లీగ్ సహకారంతో 30 శాతం ముస్లిం ఓట్లతో రాహుల్ గెలిచారు. శివసేనతో అధికారం పంచుకున్నప్పుడు కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ ఎలా అవుతుంది. ఎంఐఎం, బీఆర్‌ఎస్ కోసం తలుపులు మూసేశామని రాహుల్ చెబుతున్నారు. ఇండియా కూటమిలో మేము ఎలా భాగస్వాములం అవుతాం.

అజహరుద్దీన్.. అసమర్థ రాజకీయవాది

అజహరుద్దీన్ మంచి క్రికెటరే.. కానీ, రాజకీయాల్లో అసమర్థుడు. యూపీలోని మొరాదాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ప్రజలు గెలిపిస్తే అక్కడ ఎలాంటి అభివృద్ధి చేయలేదు. ఆ తర్వాత రాజస్తాన్‌కు పంపిస్తే అక్కడ ఓడిపోయారు. ఆ తర్వాత తిరిగి ముఖం చూపించలేదు. సొంతగడ్డపై కేటీఆర్ ఆయనకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ బాధ్యతలు అప్పగిస్తే దాని స్థాయి దిగజార్చారు. ఆయన అవినీతిపై నాలుగు ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. ఎన్నికల్లో ప్రత్యర్థులు ఇద్దరు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారైతే తప్పేంటి? అసమర్థ నేత కాబట్టి ఆయనపై బలమైన మజ్లిస్ అభ్యర్థిని రంగంలోకి దింపాం.

కాంగ్రెస్ చీఫ్ పక్కా ఆర్‌ఎస్‌ఎస్‌వాది

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గతంలో ఏబీవీపీలో పనిచేశారు. కార్వాన్‌లో కిషన్ రెడ్డి పోటీ చేసినప్పుడు ఆయనకు మద్దతుగా గుడిమల్కాపూర్‌లో ప్రచారం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆయనను టీడీపీకి పంపిస్తే ఆ పార్టీ అడ్రస్ తెలంగాణలో గల్లంతైంది. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సూచనతో కాంగ్రెస్‌లో చేరారు. మోహన్ భగవత్ రిమోట్ కంట్రోల్‌తోనే గాంధీభవన్ పనిచేస్తోంది. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే. హైదరాబాద్‌లో మజ్లిస్ బలంగా ఉంది కాబట్టి తెలంగాణలో మైనార్టీ డిక్లరేషన్ ప్రకటించారు. కానీ కర్ణాటక, రాజస్తాన్, మధ్యప్రదేశ్, మిజోరం, ఛత్తీస్‌గఢ్‌లలో ఎందుకు ప్రకటించలేదో సమాధానం చెప్పాలి? అక్కడ ముస్లింలు లేరా..? లేక వారి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదా?

బీఆర్‌ఎస్‌తో ఎలాంటి పొత్తులేదు

బీఆర్‌ఎస్‌తో మజ్లిస్‌కు ఎలాంటి పొత్తు లేదు. ఫ్రెండ్లీ పార్టీ మాత్రమే. బీజేపీతో కలిసే ప్రసక్తే లేదు. కాంగ్రెస్, బీజేపీ మధ్య సంబంధం ఉంది. మేము ఎవరికీ బీ–టీమ్ కాదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తోంది కాబట్టి సమర్థిస్తున్నాం. బీజేపీతో కేసీఆర్‌కు సంబంధం ఉంటే.. తొమ్మిదిన్నరేళ్లలో మైనారిటీల కోసం పెద్దఎత్తున బడ్జెట్ కేటాయింపు జరిగేదా? 201 మైనార్టీ గురుకులాల ఏర్పాటు చేసేవారా? ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌తోపాటు ఏటా రూ.650 కోట్లు ముస్లింల విద్య కోసం ఖర్చు పెట్టేవారా? కేసీఆర్ మూడోసారి సీఎం అవుతారు. తొమ్మిదేళ్లలో రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొంది. క్రైంసా ప్రశాంతంగా ఉంది. కాంగ్రెస్ అధికారంలో ఉంటే మతఘర్షణలు జరుగుతాయి. మత సామరస్యం దెబ్బతీంటుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం కల్ల.

మతప్రాతిపదిక రిజర్వేషన్ కాదు

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అమలవుతున్న 4 శాతం రిజర్వేషన్లు మత ప్రాతిపదికన చేసినవి కావు. ముస్లిం సామాజిక వర్గంలో ఆర్థికంగా, విద్యాపరంగా వెనకబడిన వారికి మాత్రమే అమలు చేస్తున్నారు. అదీ పీఎస్ కృష్ణన్, మండల్ కమిషన్ రిపోర్టు ప్రకారం సుప్రీంకోర్టు ఆదేశాలతో రిజర్వేషన్ అమలవుతోంటే బీజేపీకి వచ్చిన ఇబ్బందేంటి? తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి మోదీ ప్రభుత్వానికి పంపితే మంజూరు చేయలేదు. బీజేపీ ఇప్పుడు దీన్ని రద్దు చేస్తామని చెబుతోంది. పాఠ్యపుస్తకాల్లో గాంధీని అవమానపర్చి.. గాంధీని చంపిన గాడ్సే గురించి చదివిస్తున్నారు.

పాలిటిక్స్ అంటే.. పకోడీలు వేయడమంత వీజీనే!

''పాలిటిక్స్ అంటే ఏదో అనుకుంటాంగానీ, అదీ పకోడీలు వేయడం లాంటిదే నాయనా'' అంటూ సెలవిచ్చారు స్వామీ ఎలక్షనానంద అలియాస్ స్వామీ సలక్షణానంద.

''పకోడీలకూ, ఎన్నికలకూ పోలికేమిటి స్వామీ?'' అడగనే అడిగాడు శిష్యుడు.

''చెబుతా విను. ఎన్నికలకు ముందుగా రూపొందించుకోవాల్సినవి తగిన వ్యూహాలు. వాతావరణం కాస్త ముసురుగా, ఇంకాస్త చలిచలిగా ఉందనుకో. క్లైమేటుకు తగ్గట్టు పకోడీలు బాగుంటాయని నిర్ణయించాలి. ఒకసారి మన అభ్యర్థి పకోడీ అని అనుకున్నాక, పచారీ సామన్లు ఏ కిరాణావాడి దగ్గర్నుంచి తేవాలి, ఎవడి దగ్గర అప్పుగా తేలిగ్గా దొరకడంతో పాటు డబ్బుకు ఎవడు నాల్రోజులాగుతాడు...ఇవన్నీ ఆలోచించినట్టుగానే... నియోజకవర్గంలోనూ పొలిటికల్ క్లైమేటు ఏమిటి, దానికి తగ్గట్టు ఏవర్గానికి చెందినవాణ్ణి నిలబడితే మంచిది... ఇలాంటివన్నీ వ్యూహాల్లో భాగాలు.



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

ఇక ప్రచార సాధనాల్నీ విస్తృతంగా వాడాలి. ఓసారి పకోడీల తయారీ మొదలవుతోందని తెలియగానే... భర్త మాటిమాటికీ కిచెన్ చుట్టే తిరుగుతుంటాడు. 'మంచింగ్ ఉంది కదా, మందో మాకో తెచ్చుకోవచ్చా?' అని అడుగుతుంటాడు. పిల్లలైతే 'అమ్మా... ఉల్లిపకోడీ చెయ్. పచ్చిమిర్చీ వేయ్. పంటికింద పసక్కుమనగానే, టేస్టు నషాళానికంటాలి' అంటూ ఉంటారు. ఇవన్నీ పబ్లిక్ డిమాండ్సు. వాటిలో మనకు పనికొచ్చేవి కొన్ని ఆమోదించాలి. ఇదంతా ప్రాపగాండా, ప్రచారమూ, పబ్లిక్‌లో క్రేజ్ పెంచుకోవడం కిందికి వస్తుందన్నమాట.

నెక్స్ట్ కొంత యాంటీ క్యాన్వాసింగ్ ఉంటుంది. అంటే ''శెనగపిండి ఆరోగ్యానికి మంచిదికాదు. నూనె వాడకంతో క్యాన్సర్లొస్తాయ్. హాయిగా ఏ వెజిటబుల్ సలాడయితే హెల్త్‌కు మంచిది'' ఇత్యాది కబుర్లన్నీ అత్తగారూ, ఆడపడుచుల్లాంటివాళ్లు చెబుతుంటారు. మనమంటే పడక... ప్రత్యర్థులూ, ప్రతిపక్షాలవాళ్లు చేస్తున్న దుష్ప్రచారంగా కొట్టిపారేయాలి.

ఈ ప్రచారాల్లో ఏది నిజమో ఏది కాదోనని, ఎటూ తేల్చుకోలేని మామగారిలాంటి అమాయకప్రాణులు అన్ని నియోజకవర్గాల్లోనూ కొందరుంటారు. వారితో...

''వనితల పలుకుల యందున...
అనిమిష లోకమున ఉన్న అమృతమటంచున్
జనులనుటె గాని... లేదట
కనుగొనగ నీయందే అమృతము గలదు పకోడీ''... అర్థాత్..

'అమ్మాయిల మాటల్లో, స్వర్గంలో అమృతముందని అంటారుగానీ, అసలమృతం ఉన్నది నీలోనే కదా ఓ పకోడీపడుచూ...' అంటూ సాక్షాత్తూ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారే, తోటి ఫ్రెండ్సుతో కలిసి పకోడీలు తింటూ అన్నారని చెప్పాలి. కావాలంటే... క్వార్టరు మామగారి ప్రైవేటుగదికి ఓ క్వార్టరు తరలిస్తే, ఆయనా హాయిగా గడిపేస్తారంటూ భర్త చేత చెప్పించాలి. (తానీ మాటలు స్వయంగా చెప్పలేదు కాబట్టి). గుర్తుందిగా... ఎటూ తేల్చుకోలేక ఊగిసలాడే జీవులకివి తాయిలాల్లాంటివన్నమాట.

అత్తలూ, ఆడపడుచుల మీద పైచేయి సాధించడానికి కిచెననే రాజకీయ క్షేత్రాన్ని ఎపిసెంటర్‌గా చేసుకుని, ఇల్లు అనే నియోజకవర్గంల పన్నే యుక్తుల్లాంటివాటినే... ప్రత్యర్థుల మీద పైచేయి కోసం ఎత్తుగడలుగా, పన్నాగాల రూపంలో పన్నాలి.

ఇక భర్తతో పచ్చిమిర్చీ తరిగించడం, నాలుక్కింద నలిగినప్పుడు తగినంత రుచి వచ్చేలా ఉల్లిపాయల్ని తగిన సైజులో కోయించడం, ప్రచారం ముగిశాక ఎన్నికల ముందు రోజున వేడి నూనెలోకి లేదా నేతిలోకి... పకోడీ పిండిని బుడుంగు బుడుంగుమంటూ మునిగేలా వేయించడమంత తేలిగ్గా ఎలక్షనీరింగు చేయాలి. ఇదెలా ఉండాలంటే, ఓనాడు పకోడీల తయారీ సమయంలో... చిలకమర్తి వారి కోరిక మేరకు సాక్షాత్తూ తిరుపతి వేంకట కవులు చెప్పినట్లుగా...

'శనగపిండి ఉల్లిపాయ చిన్ని మిర్చకాయలన్
జనిపి అందు అల్లమంత దొనిపి ముద్ద చేసినన్
అనల తప్తమైన నేతియందు వైచి వేచినన్
జను ''పకోడీ'' యను పేర చక్కనైన ఖాద్యమా'.... అన్నంత వీజీగా చేయాలి.


ఇలా పకోడీలు వేయడం, ఈ పనులన్నీ చేయడం మహిళలందరికీ బాగా తెలిసిన విద్య. కాబట్టి వాళ్లను పాలిటిక్స్‌లోకి విస్తృతంగా రానివ్వాలం''టూ ఉపదేశించారు స్వామీ ఎలక్షనానంద అలియాస్ స్వామీ సలక్షణానంద.

కారుకు తోడుగా 'రైతుబంధువులు'

- బీఆర్‌ఎస్ తరపున 1.61 లక్షల మంది రైతుబంధుసమితి సభ్యుల ప్రచారం
- ప్రజల్లోకి రైతుబంధు, రైతుబీమా ప్రయోజనాలు
- ఇప్పటివరకు రూ. 75 వేల కోట్లు రైతుల ఖాతాలో వేసినట్లు వెల్లడి
- సమన్వయం చేసుకుంటున్న రైతుబంధు సమితి అధ్యక్షులు

బొల్లోజు రవి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతుబంధు సమితి సభ్యులు ఇప్పుడు బీఆర్‌ఎస్‌కు ఎన్నికల్లో పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారు. బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా ఊరూరా రైతులను కలుస్తూ ఈ సమితులు పార్టీ గెలుపునకు వ్యూహరచన చేస్తున్నాయి. రైతుబంధు పంపిణీ, రైతుబీమా పథకంలో రైతులను చేర్పించడంలో కీలకంగా వ్యవహరించిన సమన్వయ సమితులు... ఇప్పుడు ఆయా సాయాలను గుర్తు చేస్తూ రైతులను పార్టీ వైపు తిప్పేందుకు పని చేస్తున్నాయి. విత్తనం వేసింది మొదలు పంట పండాక మార్కెట్లో గిట్టుబాటు ధర వచ్చే వరకు రైతులకు అండగా ఉండేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు సమితులను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ చెక్కుల పంపిణీ, రైతుబీమాలో రైతుల చేరిక వంటి సందర్భాల్లో ఈ సభ్యులు అంతా తామై వ్యవహరించారు. చెక్కుల పంపిణీకి, బీమా పథకంలో చేరికకు సంబంధించి ఎవరు నిజమైన రైతులో కాదో నిర్ధారించింది కూడా వీళ్లే. ఇంతలా గ్రామ స్థాయిలో రైతులతో మమేకమై పనిచేసిన ఈ సమితులు ఇప్పుడు రైతులకు అందిన లబ్ధిని వివరిస్తూ, ఓట్లుగా మలిచేందుకు కృషి చేస్తున్నాయి. ఇప్పటికే రైతుబంధు సొమ్ము రూ.75 వేల కోట్లు రైతులకు చెల్లించినట్లు వారు ప్రజల్లో ప్రచారం చేస్తున్నారు.



1.61 లక్షల మంది సభ్యులు...

రైతుబంధు సమితులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈ సమితుల్లోని సభ్యులు ప్రభుత్వపరంగా నామినేట్ పదవుల్లో ఉన్నట్టు. రాష్ట్రంలోని 10,733 గ్రామాల్లోనూ రైతు సమన్వయ సమితులు ఉన్నాయి. ఒక్కో గ్రామంలో 15 మంది చొప్పున అన్ని గ్రామాల్లోనూ 1.61 లక్షల మంది సభ్యులను నియమించారు. దాంతోపాటు ప్రతీ గ్రామానికి ఒక సమన్వయకర్త ఉంటారు. ఆపై 24 మందితో మండల సమన్వయ సమితులను ఏర్పాటు చేశారు. అలా అన్ని మండలాలకు 13,416 మందిని నియమించారు. ప్రతీ మండలానికి మళ్లీ ఒక మండల రైతు సమితి సమన్వయకర్తను నియమించారు. వీరందరితో కలిపి జిల్లా సమన్వయ సమితిని ఏర్పాటు చేశారు. ప్రతీ జిల్లాకు 24 మంది చొప్పున జిల్లా సమితి సభ్యులను నియమించారు. దీనికి జిల్లా సమన్వయకర్త ఉంటారు. అనంతరం రాష్ట్ర స్థాయిలోనూ సమన్వయ సమితి పనిచేస్తుంది. రాష్ట్ర రైతుబంధు సమితికి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య చైర్మన్‌గా నియమించి, కేబినెట్ హోదా కల్పించారు. అంతకుముందు దీనికి గుత్తా సుఖేందర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి చైర్మన్లుగా పనిచేశారు. నామినేట్ పదవులు కావడంతో వారంతా సుశిక్షితులైన సైన్యంగా బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేస్తున్నారని రైతుబంధు సమితి వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు వీరందరినీ సమన్వయం చేసుకుంటూ తాటికొండ రాజయ్య పర్యవేక్షిస్తున్నారు. ఒక అంచనా ప్రకారం ప్రతీ 32 మంది రైతులకు ఒక రైతు సమన్వయ సమితి సభ్యుడున్నారు. ఆయా రైతులందరినీ సమన్వయపరిచి బీఆర్‌ఎస్‌కు ఓటేసేలా వీరంతా కసరత్తు చేస్తున్నారు. కాగా, ప్రసుతం వీరికి రెమ్యునరేషన్ లేదు. వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నట్లు ఒక్కో సభ్యునికి నెలకు రూ.500 నుంచి రూ. వెయ్యి వరకు రెమ్యునరేషన్ రాబోయే రోజుల్లో ఇచ్చే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాల వారీగా రైతుబంధు సమితి సభ్యుల వివరాలు

జిల్లా	గ్రామాలు	సభ్యులు
ఆదిలాబాద్	1,755	26,325
నిజామాబాద్	912	13,680
కరీంనగర్	877	13,155
ఖమ్మం	757	11,355
మెదక్	1,352	2,0280
మహబూబ్‌నగర్	1,339	20,085
నల్లగొండ	1,144	17,160
రంగారెడ్డి	1,209	18,135
వరంగల్	1,388	20,820
మొత్తం	10,733	1,60,995

తొలి రోజు ఓటేసిన 9,174 మంది

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే ప్రక్రియ గురువారంతో మూడో రోజుకు చేరుకోనుంది. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 29,267 మంది ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించారు. మంగళవారం తొలి రోజు 9,174 మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. 80 ఏళ్లకు పైబడిన 17,105 ఓటర్లకు 6,226 మంది, 9964 మంది దివ్యాంగులకు 2884 మంది, అత్యవసర సేవల ఓటర్లు 2198 మందికి 64 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. బుధవారం రెండో రోజు జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వివరాలను గురువారం వెల్లడిస్తామని పేర్కొంది. ఈ నెల 26లోగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను ముగించాలని సీఈవో కార్యాలయం ఆదేశించింది.



మంచినీళ్లివ్వకుంటే ఎన్నికలు బహిష్కరిస్తాం

సుల్తానాబాద్ పట్టణవాసుల హెచ్చరిక



సుల్తానాబాద్(పెద్దపల్లి): తమకు తాగునీరు సరఫరా చేయకపోతే ఈనెల 30 జరిగే ఎన్నికలను బహిష్కరిస్తామని పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ఎస్సారెస్పీ క్వార్టర్ల సమీపంలోని గాంధీనగర్ కాలనీవాసులు హెచ్చరించారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీకి సుమారు 20 రోజుల నుంచి మంచినీరు రాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందంటూ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయడం లేదని, రెండ్రోజులకోసారి ట్యాంకర్‌తో డ్రమ్ము నీరందిస్తున్నారని తెలిపారు. ఈ నీరు ఎటూ సరిపోడం లేదని వాపోయారు. తాగునీటి సమస్య పరిష్కరించకుంటే తమ ప్రాంతంలోని 100 మంది వరకు ఎన్నికలు బహిష్కరిస్తామని తహసీల్దార్‌కు విన్నవించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు.

పోడు 'పట్టం' కట్టేదెవరికో

- పట్టాల పంపిణీ కలిసొస్తుందని బీఆర్‌ఎస్ లెక్కలు
- 2006లోనే అందించామని కాంగ్రెస్ ప్రచారం



ఈరగాని భిక్షం

ఏళ్ల తరబడి అడవిని నమ్ముకొని పోడు భూములను సాగుచేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు పంపిణీ చేసిన బీఆర్‌ఎస్ ఎన్నికల్లో లబ్ధిదారుల మద్దతు తమకే ఉంటుందని భావిస్తోంది. తమకే గంపగుత్తగా ఓట్లు పడుతాయని లెక్కలు వేసుకుంటోంది. అయితే తాము 2006లోనే పోడు భూములకు పట్టాలు ఇచ్చామని కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. ఆ తర్వాత పట్టాలు ఇచ్చే ప్రక్రియలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాలయాపన చేసిందని ఆరోపిస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లో పోడు పట్టాలు పొందిన గిరిజనులు ఏ పార్టీకి మద్దతు తెలుపుతారనేది రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

1,50,012 మంది రైతులు.. 4,05,601 ఎకరాలకు పట్టాల పంపిణీ

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని 4,14,353 మంది రైతులు తాము సాగు చేసుకుంటున్న 13.18లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు 56.6శాతం మంది గిరిజనులు 8.15లక్షల ఎకరాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ దరఖాస్తులను పరిశీలించి అటవీ హక్కుల చట్టం, మంత్రివర్గ ఉపసంఘం సూచనలతో అర్హులైన గిరిజన రైతుల జాబితాను రూపొందించారు. మొత్తంగా 26 జిల్లాల్లోని 1,50,012 మంది రైతులకు 4,05,601 ఎకరాలకుగానూ పట్టాలు పంపిణీ చేశారు. ఇందులో అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50,595మంది రైతులకు 1,51,195ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 24,972 మంది రైతులకు 70,434 ఎకరాలు కాగా.. అత్యల్పంగా పెద్దపల్లి జిల్లాలో ముగ్గురు రైతులకు ఎకరం భూమికి పట్టాలు అందించారు. అయితే పట్టాలు పొందిన గిరిజన కుటుంబాలన్నీ తమకే ఓటు వేస్తాయని, ఆ ప్రభావంతో ఏజెన్సీ ప్రాంతాల్లోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్ హయాంలోనే 3,31,070 ఎకరాలను ఇచ్చామంటున్న కాంగ్రెస్

ఇక కాంగ్రెస్ పార్టీ గతంలో తాము కూడా పట్టాలు పంపిణీ చేశామని, ముందుగా తమకే ఆ ఆలోచన వచ్చిందని ఆ పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2006లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తెలంగాణలోని హైదరాబాద్ మినహా ఉమ్మడి తొమ్మిది జిల్లాలు ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ, నిజామాబాద్, రంగారెడ్డి, వరంగల్ జిల్లాలకు చెందిన 99,486 మంది రైతులు సాగుచేసుకునే 3,31,070 ఎకరాలకు అటవీహక్కుల చట్టం ద్వారా భూ హక్కు పత్రాలు అందజేశారని గుర్తు చేస్తున్నారు. మిగిలిన రైతులకు కూడా పట్టాలు ఇచ్చేందుకు కాంగ్రెస్ సిద్ధమైందని, ఈలోపు తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం కావడం, బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడంతో జాప్యం జరిగిందని అంటున్నారు. పోడు పట్టాల పంపిణీలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో ఆంక్షలు పెట్టిందని, కాంగ్రెస్ హయాంలో మాత్రం నిజమైన రైతులకు పట్టాలు ఇచ్చిందని, ఎవరు ఎన్ని చెప్పినా.. గిరిజనుల మద్దతు కాంగ్రెస్‌కే ఉంటుందని, మా పార్టీ అభ్యర్థులే గెలుస్తారని నాయకులు ప్రచారం చేసుకుంటున్నారు.

గిరిజనేతరులు ఎటువైపో..

ఇక ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతర రైతులు ఏ పార్టీకి మద్దతు తెలుపుతారనేది ప్రధాన చర్చగా మారింది. ఉమ్మడి తొమ్మిది జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులతో సమానంగా గిరిజనేతరులు పోడు భూమిని సాగు చేసుకుంటున్నారు. అయితే దశాబ్దాల తరబడి వారు సాగుచేసుకుంటున్నా.. నేటి వరకు హక్కు పత్రాలు అందలేదు. గిరిజన చట్టాలను సవరించి పట్టాలు ఇస్తారని వారు భావించగా.. అది సాధ్యపడలేదు. పట్టాలు ఏమో కానీ కనీసం ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, రైతుబంధు, రైతుబీమా వచ్చి, తమ పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తే చాలని గిరిజనేతర రైతులు కోరుతున్నారు. కానీ ఇప్పటి వరకు దీనిపై ఏ పార్టీ స్పష్టత ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో గిరిజనేతరుల మద్దతు ఎటువైపో అన్నది ప్రశ్నార్థకంగా మారింది.



పోస్టల్ బ్యాలెట్‌తో జాగ్రత్త

అసెంబ్లీ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వారి ఓటుహక్కును వినియోగించుకుంటున్నారు. ఓటింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

10లో▸



ఘనంగా గంగాహారతి

ధర్మపురి: ధర్మపురి నృసింహస్వామి ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో గోదావరికి గంగాహారతి నిర్వహించారు. మహిళలు గోదావరిలో దీపాలు వదిలారు.

గరిష్టం/కనిష్టం
31.0/21.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కార్పొరేటర్, బ్యాంకర్ల వేధింపులు!

- కోర్టు ఆవరణలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి
- జిల్లాకేంద్రంలో ఘటన



కరీంనగర్‌క్రైం: వెంటాడుతున్న ఆర్థిక సమస్యలు, కార్పొరేటర్, బ్యాంకర్ల వేధింపులు భరించలేక ఓ వ్యక్తి జిల్లాకేంద్రంలోని ప్రధాన కోర్టు ఆవరణలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం శాభాష్‌పల్లి గ్రామానికి చెందిన నాయిని శ్రీనివాస్‌రెడ్డి (40) కరీంనగర్‌లోని సప్తగిరికాలనీలో భార్య, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఓ కేసు విషయంలో శ్రీనివాస్‌రెడ్డి బుధవారం కరీంనగర్ సబ్‌కోర్టుకు హాజరయ్యాడు. అదే సమయంలో వెంటతెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. కోర్టుసిబ్బంది గమనించి స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి స్నేహితులు మరో ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ చనిపోయాడు. కోర్టు సిబ్బంది టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కాగా.. కరీంనగర్‌లోని ఓ కార్పొరేటర్‌కు సుమారు రూ.40 లక్షల నగదు, కొంత బంగారం శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చాడని, తిరిగి ఇమ్మని అడిగితే ఇబ్బందులకు గురిచేయడంతో పాటు.. ఓ ప్రైవేటు బ్యాంకు సిబ్బంది కూడా వేధించడంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్‌లో వెల్లడించినట్లు తెలిసింది. పోలీసులు ఈ ఘటనపై లోతుగా విచారణ జరుపుతున్నారు.

నేడు రేణికుంటకు రేవంత్‌రెడ్డి రాక



తిమ్మాపూర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మానకొండూర్ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ తరఫున గురువారం ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు మండలంలోని రేణికుంటలో బహిరంగసభలో పాల్గొననున్నారు. సభ ఏర్పాట్లను పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి పరిశీలించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సభ ప్రారంభం కానుందని, విజయవంతం చేయాలని కోరారు.

క్వింటాల్ పత్తిధర రూ.6,800



జమ్మికుంట: పత్తిమార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.6,800 పలికింది. బుధవారం మార్కెట్‌కు 128 వాహనాల్లో 1,392 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.6,600, కనిష్ట ధర రూ.6,100 పలికింది. గన్నీ సంచుల్లో 14 మంది రైతులు 19 క్వింటాళ్ల పత్తిని తెచ్చారు. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,400, మోడల్ ధర రూ.6,200, కనిష్ట ధర రూ.5,800కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్లో సీసీఐసంస్థ 29 మంది రైతుల నుంచి 380.60 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. గరిష్ట ధర రూ.7,020, మోడల్ ధర రూ.6,950, కనిష్ట ధర రూ.6,739 పలికింది.

ఈటల వర్గం.. ఆగమాగం!



- రెండుచోట్లా గెలిస్తే హుజూరాబాద్‌కు రాజేందర్ రాజీనామా?
- ఆ తర్వాత తమ భవితవ్యమేంటని లీడర్ల ఆందోళన
- తుల ఉమ తరహాలో పట్టించుకోరేమోనని సందేహం
- ఇప్పటికే ఎంపీ సంజయ్, గంగాడి వర్గాలతో పెరిగిన దూరం

జంగ్ తెలంగాణ

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వర్గాన్ని ఓ ఆందోళన వెంటాడుతోంది. ఇటు హుజూరాబాద్, అటు గజ్వేల్‌లో పోటీ చేస్తున్న ఆయన రెండుచోట్లా గెలిస్తే.. పదవికి రాజీనామా తప్పదన్న ప్రచారమే ఇందుకు కారణం. వాస్తవానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తిరుగులేని నేతగా ఎదిగిన బీసీ నాయకుడు ఈటల రాజేందర్. తన అనుచరుల్లో ఈ రకపు ఆందోళనలు పెరిగేందుకు ఆయన వ్యవహారశైలి, రాజకీయ ఒడిదుడుకులే కారణమవుతున్నాయి.

ఈటల రాజేందర్ మనుషులను వాడుకొని వదిలేస్తారన్న ప్రచారాన్ని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ముమ్మరం చేశాయి. గతంలో సీఎం కేసీఆర్ సాయంతో తిరుగులేని నేతగా ఎదిగి న ఆయన, ఆ తర్వాత బీజేపీలో ఎంపీ బండి సంజ య్ సాయంతో గెలిచాడంటున్నాయి. గతంలో బీఆర్‌ఎస్‌లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలతో కేసీ ఆర్‌కు, హుజూరాబాద్ ఉప ఎన్నిక తర్వాత బండి సంజయ్‌కు వెన్నుపోటు పొడిచారని చెబుతున్నాయి. తన విజయంలో కీలక పాత్ర పోషించిన ఎంపీ సంజయ్‌ను పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పించడానికి ఈటల రాజేందరే కారణమని పేర్కొంటున్నాయి. ఆయనను నమ్ముకొని, బీజేపీలోకి వచ్చిన తుల ఉమకు పార్టీ టికెట్ ఇప్పించడంలోనూ విఫలమయ్యారని ఆమె అనుచరులు అంటున్నారు. ఆయన కేసీఆర్, సంజయ్‌ని వాడుకున్నట్లే.. తమనూ వాడుకొని, వదిలేశారని మండిపడుతున్నారు.

కౌశిక్‌రెడ్డి, ప్రణవ్‌తో గట్టి పోటీ..

గతంలో ఈటల రాజేందర్ హుజూరాబాద్‌లో ఏ ఒక్కరినీ బీఆర్‌ఎస్ నుంచి ఎదగనీయలేదని, అందుకే ఇంతకాలం గెలుస్తూ వచ్చాడని పలువురు అంటున్నారు. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి 2018లో ఆయనకు చెమటలు పట్టించారు. ప్రస్తుతం పాడితోపాటు కెప్టెన్ లక్ష్మీకాంతరావు అన్న మనవడు వొడితెల ప్రణవ్(కాంగ్రెస్) కూడా బరిలో ఉన్నారు. ఈ ఇద్దరూ అంగబలం, అర్థబలం దండిగా ఉన్న నేతలు. వీరిని ఢీకొట్టాలంటే వాస్తవానికి ఎంపీ బండి సంజయ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిల సాయం తప్పనిసరి. కానీ, వీరిద్దరితో ఈటలకు పొసగడం లేదన్న ఆరోపణలున్నాయి. వారు ఎక్కడా ఆయన ప్రచారంలో కనిపించకపోవడం గమనార్హం.



రాజ్‌నాథ్ ఎదుట కాంగ్రెస్‌పైప్రశంసలా?

ఇటీవల జమ్మికుంటలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో నిర్వహించిన సభలోనూ ఎంపీ సంజయ్ పాల్గొనలేదు. ఎక్కడా ఆయన ప్రస్తావన లేకపోయేసరికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. అదే వేదికపై ఈటల రాజేందర్ కాంగ్రెస్ నేతలపై ప్రశంసల వర్షం కురిపించారు. మాజీ మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ జెడ్పీటీసీ సభ్యుడు గంట రాములు యాదవ్, ఆయన సోదరులు తన గెలుపు కోసం పని చేశారని కీర్తించారు. ఈ మాటలకు వేదిక కింద ఉన్న బీజేపీ నాయకులు అవాక్కయ్యారు. తన కోసం ప్రచారం చేసిన ఎంపీ సంజయ్ పేరు ఎందుకు ఉచ్చరించడం లేదని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తన గెలుపు కోసం పని చేసిందని చెప్పి, బీజేపీ విజయాన్ని పలుచన చేశారని మండిపడుతున్నారు. ఏ వేదిక ఎక్కినా.. వ్యక్తిగత విషయాలు ప్రస్తావిస్తున్నారు తప్ప.. బీజేపీ సిద్ధాంతాలను, దేశభక్తి, ప్రధాని మోదీ, భారత్ మాతా, అద్వానీ, వాజ్‌పేయి అన్న పదాలు పలికేందుకు ఆయనకు మనసు రావడం లేదని విమర్శిస్తున్నారు. ఇటీవల జిల్లాలో తన కీలక అనుచరులుగా పేరొందిన వారంతా కాంగ్రెస్‌లో చేరడం చర్చకు దారితీసింది.

గెలిస్తే 6 నెలల్లో రాజీనామా

ఈటల రాజేందర్ హుజూరాబాద్ నియోజకవర్గంలో ఓటమి ఎరుగని నేత. 2004, 2008, 2009, 2010, 2014, 2018, 2021 మొత్తం ఏడుసార్లు అసెంబ్లీకి ఎన్నికైన ఏకైక నాయకుడు కావడం విశేషం. శాసనసభా పక్ష నేతగా, మంత్రిగా తన నియోజకవర్గాన్ని బాగానే అభివృద్ధి చేసుకున్నారు. హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల ఏర్పాటు, హుజూరాబాద్‌లో ప్రభుత్వ ఆస్పత్రి తదితరాలతో ఆయన స్థానికుల మనసు గెలుచుకున్నారు. 2021లో అనూహ్యంగా బీఆర్‌ఎస్ వీడి, బీజేపీ నుంచి ఉపఎన్నికలో విజయం సాధించి, రెండు తెలుగు రాష్ట్రాల దృష్టిని ఆకర్షించారు. ప్రస్తుతం ఆయన తన స్థానంతోపాటు సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లోనూ పోటీ చేస్తున్నారు. రెండు చోట్లా గెలిస్తే 6 నెలల్లో ఏదో ఒక స్థానానికి ఉప ఎన్నిక అనివార్యం. సీఎంపై గెలిచాక ఆ రికార్డును కాపాడుకునేందుకు అక్కడే ఉంటారు కానీ, అక్కడ రాజీనామా చేసి, హుజూరాబాద్‌కు ఎందుకు వస్తారన్న చర్చ జోరుగా సాగుతోంది. అలాంటప్పుడు రాజేందర్‌ను గెలిపిస్తే.. తమ భవితవ్యం ఏంటన్న ఆలోచన ఆయన కేడర్‌లో నిరుత్సాహం నింపుతోంది.

ముందే ఓట్ల పండుగ

- దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి నుంచే ఓటు
- జిల్లాలో 1,017మందికి అవకాశం
- మానకొండూర్‌లో ప్రారంభం
- నేటినుంచి మిగతా నియోజకవర్గాల్లో..

కరీంనగర్ అర్బన్: ఎన్నికల చరిత్రలో నూతన ఒరవడి. తొలిసారిగా ఇంటివద్ద నుంచే ఓటువేసే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని స్థితిలో ఉండే 80ఏళ్ల పైబడిన వృద్ధులు, 40శాతానికి పైగా వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఎన్నికల సంఘం ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించింది. దీని కోసం 12డీ ఫారం ద్వారా దరఖాస్తుల స్వీకరణ ఇటీవలే పూర్తికాగా జిల్లావ్యాప్తంగా 1,017మంది ఓటర్లను గుర్తించారు. నాలుగు నియోజకవర్గాల నుంచి 3,652 మంది దరఖాస్తు చేసుకోగా అర్హులను గుర్తించి జాబితా రూపొందించారు.

ఈనెల 27 వరకు..

ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగానికి దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 27వరకు పోలింగ్ ప్రక్రియ జరగనుంది. ఒక్కో నియోజకవర్గంలో ఓటర్లసంఖ్యను బట్టి రెండు నుంచి మూడు రోజుల పాటు పోలింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ తేదీల్లో ఒక్కో అభ్యర్థికి రెండుసార్లు అవకాశం ఇవ్వనున్నారు. ఒకసారి ఓటు వేసేందుకు వీలులేని వారికి మరో అవకాశం ఇస్తున్నారు. రెండు సార్లు కూడా ఓటు హక్కు వినియోగించుకోకపోతే ఇక ఆ ఓటు పోయినట్లే. సాధారణ పోలింగ్‌లోనూ ఓటు హక్కు వినియోగానికి అవకాశం ఉండదు.

ఓటు వేయించేందుకు ప్రత్యేక బృందాలు

ఓటర్లతో ఓటు వేయించేందుకు ప్రతీ నియోజకవర్గానికి ఆరు బృందాలు ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ముగ్గురు అధికారులు, వీడియోగ్రాఫర్, మైక్రో అబ్జర్వర్, పోలీస్ సిబ్బంది ఉంటారు. వీరు తమకు కేటాయించిన తేదీల్లో ఆయా సెక్టార్ల పరిధిలోని ఓటర్ల ఇంటి వద్దకు వెళ్లి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓటు వేయిస్తారు. ఓటు వేయడం కోసం ఓటరు వద్ద ఫారం 13ఏ (గులాబీ రంగు కవర్) అటెస్టేషన్ కోసం, ఫారం 13బీ బ్యాలెట్ పేపర్ (నీలం రంగు కవర్)లో వివరాలు పూర్తి చేసి కవర్లపై బ్యాలెట్ పేపర్ క్రమ సంఖ్య రాసి కవర్ సీ(పసుపు రంగు)లో పెట్టి సీల్ చేసి బ్యాలెట్ పెట్టిలో వేయిస్తారు.

స్పందన అరకొరే

ఎన్నికల సంఘం ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించగా స్పందన మాత్రం అరకొరే. అధికార యంత్రాంగ ప్రచార లేమి కారణమన్న వాదనలు వినిపిస్తుండగా మొత్తంగా దరఖాస్తు చేసుకున్నవారు 3652 కాగా ఇందులో అర్హులు 1017మందిగా తేల్చారు. మానకొండూరులో అత్యధికంగా 254మంది వృద్ధులు ఓటేయనుండగా దివ్యాంగులు 126మంది ఓటేయనున్నారు. కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాల్లో తక్కువ సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు.

మానకొండూర్‌లో ప్రారంభం

మానకొండూర్ నియోజకవర్గంలో ఇంటినుంచే ఓటుహక్కు వినియోగం బుధవారం ప్రారంభం అయ్యింది. గురువారంతో ముగుస్తుంది. జిల్లాలోనే నియోజకవర్గం నుంచి అత్యధికంగా 254మంది వృద్ధులు ఓటేయనుండగా దివ్యాంగులు 126మంది ఓటేయనున్నారు. బుధవారం దివ్యాంగులు 68 మంది, వృద్ధులు 107మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

ముందస్తుగానే పోస్టల్ బ్యాలెట్

పోస్టల్ బ్యాలెట్ ఉద్యోగులు ఓటేస్తున్నారు. కరీంనగర్ ఆర్వో పరిధిలో విధులు నిర్వహించేవారు ఓటింగ్‌లో పాల్గొంటున్నారు. బుధవారం పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా గురువా రం ఓటింగ్ ముగియనుంది. కాగా ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్స్ ఉన్న వారిని జాబితాలో వెరిఫై చేసి స్లిప్‌ను అందిస్తుండగా అక్కడే పక్కన గల కేంద్రంలో ఓటు వేస్తున్నారు. 400 మంది వరకు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నట్లు సమాచారం. అయితే ఇతర నియోజకవర్గాల్లో విధులు నిర్వహిస్తూ ఇక్కడే ఓటరుగా ఉన్నవారు, వేరే చోట ఓటరుగా ఉండి ఇక్కడే విధులు నిర్వహిస్తున్నవారి కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు

	వృద్ధులు	దివ్యాంగులు
కరీంనగర్	131	68
హుజూరాబాద్	166	117
చొప్పదండి	93	62
మానకొండూరు	254	126



వంకాయగూడెంలో ఇంటివద్దే ఓటేసిన వరలక్ష్మి

తనిఖీలు ముమ్మరం చేయండి



వన్‌టౌన్ పోలీసుస్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

- సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్ క్రైం/సైదాపూర్: పోలింగ్ సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేయాలని సీపీ అభిషేక్ మహంతి సూచించారు. బుధవారం కరీంనగర్ వన్‌టౌన్ పోలీసుస్టేషన్, సైదాపూర్ పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇరు పోలీస్‌స్టేషన్లలోని పలు రికార్డులు పరిశీలించారు. ఎన్నికల నేరస్తులు, రౌడీషీటర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవసరమైన ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్, రూట్ మార్చ్, వాహన తనిఖీలు నిర్వహించి ఓటర్లకు భద్రతాభావాన్ని కలిగించాలని అన్నారు. కోడ్‌ను ఉల్లంఘించి, ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలకు, వ్యక్తులకు అతీతంగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పక్కాగా అమలు చేయాలని అన్నారు. హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి, సీఐలు రవికుమార్, సంతోష్‌కుమార్, ఎస్సైలు స్వామి, ఆరోగ్యం, కళ పాల్గొన్నారు.

ఎన్నికలకు పక్కా ఏర్పాట్లు

- రెండ్రోజుల్లో ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ
- ఢిల్లీ ఉన్నతాధికారులతో వీసీలో జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: జిల్లాలో ఓటరు గుర్తింపు కార్డులు రెండు రోజుల్లోగా పంపిణీ పూర్తి చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం ఢిల్లీ నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ నిర్వహించిన వీడియో సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి పమేల సత్పతి పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డులు, ఓటరు స్లిప్పుల పంపిణీ, బ్యాలెట్ పత్రాల ముద్రణ, ఈవీఎం కమిషనింగ్, ఇంటి నుంచి ఓటు సేకరణ, పోలింగ్ సిబ్బంది శిక్షణ, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు, తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలోని 10,59,215 ఓటర్లలో ఇప్పటి వరకు 7,37,773మందికి ఓటరు స్లిప్పులు పంపిణీ చేశామని, మిగిలిన ఓటర్లకు త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. 1,09,509 కార్డులు పంపిణీ చేయడం జరిగిందని మిగతా ఓటరు గుర్తింపు కార్డులను రెండురోజుల్లోగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమాల ఉల్లంఘనలపై ఇప్పటివరకు జిల్లాలో 18 ఎంసీసీ ఫిర్యాదులు అందాయని వాటిలో ఆరు పరిష్కరించడం జరిగిందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి పవన్ కుమార్, కరీంనగర్ రిటర్నింగ్ అధికారి కుందారపు మహేశ్వర్, జీఎం డీఐసీ నవీన్ కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, డీపీవో వీరబుచ్చయ్య, డీఆర్‌డీవో శ్రీలత, సీపీవో కొమరయ్య పాల్గొన్నారు.



కమిషనింగ్‌ను పరిశీలిస్తున్న పమేలా సత్పతి

ఈవీఎం కమిషనింగ్ తనిఖీ

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈనెల 30న జరగనున్న నేపథ్యంలో బుధవారం కరీంనగర్ ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈవీఎం కమిషనింగ్ నిర్వహించారు. కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాల ఈవీఎం, బీయూ, సీయూ, వీవీపాట్‌ల కమిషనింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేల సత్పతి పరిశీలించారు. కరీంనగర్ నియోజకవర్గానికి చెందిన 975 బ్యాలెట్ యూనిట్లు, 487 కంట్రోల్ యూనిట్లు, 546 వీవీపాట్లను 33 టేబుల్స్ ద్వారా కమిషనింగ్ చేశారు. చొప్పదండికి చెందిన 408 బ్యాలెట్ యూనిట్లు, 408 కంట్రోల్ యూనిట్లు, 457 వీవీపాట్‌లను 31 టేబుల్స్ ద్వారా కమిషనింగ్ నిర్వహించామని తెలిపారు.

విద్యార్థులందరూ ఓటు వేయాలి

కరీంనగర్‌రూరల్: విద్యార్థులందరూ తప్పనిసరిగా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేల సత్పతి అన్నారు. బుధవారం కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించారు. హాస్టల్, మెస్‌ను పరిశీలించారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఓటుహక్కుపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా ఓటు వేయాలని సూచించారు.

లక్ష్యం.. వందశాతం

- స్వీప్ కష్టపడితే సాధ్యమే
- నోడల్ అధికారిగా రవీందర్
- 2018 ఎన్నికల్లో అత్యధికం మానకొండూరులో 85.29..
- అత్యల్పం కరీంనగర్‌లో 68శాతం పోలింగ్

2018 ఎన్నికల్లో కరీంనగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ 118 పోలింగ్ కేంద్రంలో కేవలం 33.91 శాతమే పోలింగ్ నమోదైంది. విద్యావంతులు, అన్ని తెలిసిన ప్రాంతంలో ఇంత అత్యల్పంగా పోలింగ్ నమోదవడం హేయం. కరీం'నగరం'లోనే పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే ఎన్నికల యంత్రాంగం యుద్ధప్రతిపాదికన చర్యలుండాలి.

కరీంనగర్ అర్బన్: కాలక్రమేణా సాంకేతికత అరచేతికి చేరింది. విశ్వ సమాచారం క్షణాల్లోనే చేరుతుండగా ఓటును నిర్లక్ష్యం చేయడం విడ్డూరం. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాల్సి ఉండగా పట్టనట్లు వ్యవహరించడం ఆందోళనకర పరిణామం. గత ఎన్నికల్లో పోలింగ్ శాతానికి భిన్నంగా శతశాతం ఓటింగ్ జరిగేలా ఉద్యమించాల్సిన తరుణమిది. 2018 వరకు జరిగిన ఎన్నికల సరళిని పరిశీలిస్తే ప్రతి ఎన్నికల్లో పోలింగ్‌శాతం క్రమేణా పెరుగుతుండగా 90శాతానికి చేరిన దాఖలాలు లేవు. పలు పోలింగ్ బూత్‌ల్లో వందశాతం పోలింగ్ నమోదు కాగా నియోజకవర్గం వారీగా వందశాతం పోలింగ్ జరిగేలా అటు ఎన్నికల యంత్రాంగంతో పాటు రాజకీయ పార్టీలు వ్యూహరచన చేస్తున్నాయి. ఇంకెందుకు ఆలస్యం.. పోలింగ్‌కు మరో ఏడు రోజులే మిగిలి ఉన్నందున ఒక్కొక్కరు పది మందిని పోలింగ్ కేంద్రానికి నడిపించేలా ఉద్యమిస్తే 100శాతం ఓటింగ్ సులభం.

కళాశాలల్లో అవగాహన సదస్సులు

అధికారులు ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. 30న జరిగే పోలింగ్ పండగలో ఓటరు సత్తా చాటాలని కోరుతున్నారు. విద్యార్థులతో అవగాహన సదస్సులు, వందలాది ర్యాలీలు, మానవహారాలు నిర్వహిస్తున్నారు. రద్దీ రోడ్లపై ట్రాఫిక్‌ను నిలిపివేసి విద్యార్థులతో ఫ్లాష్‌మాబ్ ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల అధికారుల సమక్షంలో సదస్సులు నిర్వహించగా జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి స్వయంగా పాల్గొని అవగాహన పెంపొందిస్తున్నారు. ఒక్కో విద్యార్థి పది మందిని ఓటు వేసేలా ప్రోత్సహించాలని కోరుతున్నారు. మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించి ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రచారం చేస్తున్నారు.

సందేశాత్మక 'స్ఫూర్తి'

ఓటు విలువను తెలియజెప్పేలా భారీ హోర్డింగులు ఏర్పాటు చేశారు. గత ఎన్నికల రోజుల్లో ఓటు వేసేందుకు బారులు తీరిన ఫొటోలతో పాటు ఓటు వేయకుంటే ఒనగూరె అనర్థాల్ని పేర్కొంటున్నారు. సెల్‌ఫోన్లకు ఓటు చైతన్యంపై సందేశాల్ని పంపుతున్నారు. ఓటు వేసేలా సన్నద్ధం చేసే రెండు, మూడు నిముషాల వీడియోలను సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. మైకుల ద్వారా ప్రత్యేక వాహనంలో ప్రచారం చేస్తున్నారు. సినిమా థియేటర్లలో ఓటు హక్కు వినియోగించుకోవాలనే ప్రచారాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు సహా పలు కూడళ్లలో ఈవీఎం, వీవీప్యాట్ నమూనాలతో భారీగా ప్రచార పోస్టర్లను ఏర్పాటు చేశారు. 30న ఓట్ల పండుగ పేరుతో జిల్లాలోని పలు ఆలయాలు సహా పలు ప్రదేశాల్లో మహిళల భాగస్వామ్యంతో అధికారులు దీపాలను వెలిగించారు.

జిల్లామొత్తంగా గత ఎన్నికల్లో పోలింగ్ శాతం ఇలా

1994:	64.3
1999:	65.5
2004:	70.29
2009:	71.75
2014:	77.54
2018:	77.93

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలిలా

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	థర్డ్‌జెండర్	మొత్తం
కరీంనగర్	1,77,893	1,77,117	44	3,55,054
హుజూరాబాద్	1,21,809	1,27,743	6	2,49,558
మానకొండూరు	1,08,846	1,12,766	1	2,21,613
చొప్పదండి	1,13,050	1,19,933	7	2,32,990
మొత్తం	5,21,598	5,37,559	58	10,59,215



తాజా జిల్లా గణాంకాలిలా

మొత్తం ఓటర్లు:	10,59,215
పురుషులు:	5,21,598
స్త్రీలు:	5,37,559
థర్డ్ జెండర్:	58
పోలింగ్ కేంద్రాలు:	1,338

2018 ఎన్నికల్లో పోలింగ్ శాతం

మానకొండూరు:	85.29
హుజూరాబాద్:	83.72
చొప్పదండి:	78.63
కరీంనగర్:	68

ఈసారి కొత్త ఒరవడి

ఎన్నడూ లేనివిధంగా ఈ సారి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది ఎన్నికల సంఘం. ఇంటి నుంచే ఓటు వేసేలా వృద్ధులు, దివ్యాంగులను భాగస్వాములను చేసింది. అచేతన స్థితిలో ఉన్న వృద్ధులు, కదలలేని దివ్యాంగుల వద్దకు ఎన్నికల సిబ్బంది వెళ్లి బ్యాలెట్ ద్వారా ఓటు తీసుకుంటున్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్‌ను ఈ సారి ముందుగానే అందిస్తున్నారు.

క్లుప్తంగా

బీజేపీ కార్యకర్తపై కేసు

కరీంనగర్ క్రైం: అనుమతి లేకుండా బీజేపీ అభ్యర్థి ప్రచార పోస్టర్‌ను బైక్‌కు అతికించుకొని తిరుగుతున్న ఆ పార్టీ కార్యకర్తపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్‌టౌన్ ఎస్‌ఐ స్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని వరుకోలుకు చెందిన బండారి ప్రశాంత్ హుస్నాబాద్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొమ్మ శ్రీరాం చక్రవర్తికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను తన ద్విచక్రవాహనానికి అంటించాడు. బుధవారం కరీంనగర్ బస్టాండ్ వద్ద ఎన్నికల అధికారులు అతన్ని ఆపారు. ఎలాంటి అనుమతి పత్రం లేకపోవడంతో ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

స్పాట్ అడ్మిషన్లకు ఆహ్వానం

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో బోటనీ, జువాలజీ పీజీ కోర్సుల్లో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీపీజీఈటీ(కామన్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్)–2023కు ఈ నెల 25వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్‌కు అవకాశం ఉందని, దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండుసెట్ల జిరాక్స్ కాపీలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.2,100తో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ రాదు కాబట్టి కోర్సు ఫీజుమొత్తం చెల్లించాల్సి ఉంటుందని, ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ కోసం పీజీ కో–ఆర్డినేటర్ స్వరూపరాణిని సంప్రదించాలని పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఇదులాపూర్ గ్రామానికి చెందిన బందారపు కుమార్(33) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కుమార్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 21న మద్యం తాగి ఇంటికి వచ్చాడు. బుధవారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఈక్రమంలో ఇంటి ఎదుట గుడిసెలో ఉరివేసుకుని మృతి చెందాడు. మద్యం మత్తులో తన భర్త ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. మృతుడికి భార్య లావణ్య, తల్లి లక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామగిరి(మంథని): రత్నాపూర్ పంచాయతీ రాంనగర్‌కు చెందిన పీట్ల కనకయ్య(47) అనే తాపీమేస్త్రీ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మంగళవారం రాత్రి పురుగుల మందు తాగగా.. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అనంతరం కరీంనగర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మరణించాడు. ఎస్సై రవి ప్రసాద్‌ను వివరణ కోరగా.. ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కొండాపూర్ వాసి..


గంగారెడ్డి (ఫైల్)

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం.. కోమటికొండాపూర్‌కు చెందిన రాయేడి గంగారెడ్డి(30) ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. ఇందుకోసం అప్పులు చేశాడు. అక్కడ ఆరోగ్యం సహకరించకపోవడంతో 3 నెలల క్రితం స్వగ్రామం వచ్చాడు. అప్పులు తీర్చే మార్గం లేక మానసికంగా బాధపడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 18న ఇంట్లో క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు మొదట మెట్‌పల్లిలోని ఆస్పత్రికి.. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం చనిపోయాడు. తండ్రి పెద్ద రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

మెట్‌పల్లిరూరల్: తాటిచెట్టుపై నుంచి పడి ఓ గీత కార్మికుడు గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. ఆత్మనగర్‌కు చెందిన చిలివేరి మల్లేశ్ బుధవారం తాటిచెట్టు ఎక్కి కిందికి దిగుతున్న క్రమంలో జారి పడ్డాడు. కింది భాగంలో ఉన్న తాటి మొద్దుపై పడటంతో ఆయన కాళ్లు, చేతులు, దవడ భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతున్నాడు.

'పోస్టల్ బ్యాలెట్'తో జాగ్రత్త

- సరిగా వేయకపోవడంతో తిరస్కరణకు గురవుతున్న ఓట్లు
- గెలిచే స్థానాల్లోనూ ఓటమిపాలవుతున్న అభ్యర్థులు
- ఈసారి అదనంగా 13 అత్యవసర సర్వీసులకు అవకాశం ఇచ్చిన ఈసీ



కరీంనగర్ అర్బన్: పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో తప్పులు అభ్యర్థులకు శాపంగా మారుతున్నాయి. గెలిచే స్థానాల్లోనూ పలువురు ఓటమిపాలైన సందర్భాలున్నాయి. అన్నీ తెలిసిన ఉద్యోగులే బ్యాలెట్‌ను సరిగా వినియోగించకపోవడంతో వారి ఓట్లు తిరస్కరణకు గురవుతున్నాయి. ఈ ఓటు ఎలా వేయాలో అవగాహన లేకపోవడమే దీనికి కారణం. గతంలో ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు, సైనికులకు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఉండేది. ప్రస్తుతం ఎన్నికల సంఘం అదనంగా 13 అత్యవసర సర్వీసులకు చెందినవారికి ఈ సౌకర్యాన్ని కల్పించింది. వీరితోపాటే వృద్ధులు, దివ్యాంగులు, కోవిడ్ తదితర వ్యాధుల బారిన పడినవారు కూడా 12డీ ఫాం నింపి, ఓటు వేయవచ్చు. దీంతో ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మరింత కీలకం కానున్నాయి. కరీంనగర్ జిల్లాలో అవి 3,402 ఉన్నాయి.

అదనపు సర్వీసులవారు వీరే..

ఎయిర్‌పోర్టు, ఎఫ్‌సీఐ, రైల్వే, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, ఆలిండియా రేడియో, విద్యుత్, అగ్నిమాపక శాఖ, వైద్యారోగ్య శాఖ, రోడ్డు రవాణా సంస్థ, సివిల్ సప్లయ్, బీఎస్‌ఎన్‌ఎల్, ఎన్నికల శిక్షణ కేంద్రాల్లో ఉండే ఉద్యోగులు, ఎన్నికల సంఘం గుర్తించిన మీడియా ప్రతినిధులు.

పోస్టల్ బ్యాలెట్ ఓటు ఎలా వేయాలంటే..

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేవారికి 12డి ఫాం ఇస్తారు. ఇందులో 13ఏ, 13బీ, 13సీ కవర్లతోపాటు ఎన్నికల అధికారికి పంపించే 13డీ కవరు కూడా ఉంటుంది. 13ఏలో ఉండే డిక్లరేషన్ ఫాంపై విధిగా సంతకం చేయాలి. అలాగే, గెజిటెడ్ అధికారి సంతకం చేయించాలి. బ్యాలెట్, సీరియల్ నంబర్లు వేయాలి. అనంతరం డిక్లరేషన్ ఫాంను 13ఏ కవర్‌లో పెట్టి, అతికించాలి. డిక్లరేషన్ ఫాంలో ఓటరు సంతకం లేకుంటే ముందుగానే తిరస్కరిస్తారు. 13బీ కవర్‌లో బ్యాలెట్ పేపర్ ఉంటుంది. ఇందులో అభ్యర్థులు, పార్టీల పేర్లు మాత్రమే ఉంటాయి. గుర్తులుండవు. ఓటరు నచ్చిన అభ్యర్థికి ఎదురుగా స్కెచ్ పెన్‌తో రైట్ గుర్తు పెట్టాలి. ఇద్దరు అంతకంటే ఎక్కువ మందికి టిక్ చేసినా, ఇద్దరు అభ్యర్థుల మధ్య మార్కు చేసినా, అస్పష్టంగా మార్కు చేసినా ఓటు చెల్లదు. టిక్ పెట్టిన తర్వాత బ్యాలెట్ పేపర్‌ను 13బీ కవర్‌లో పెట్టి, అతికించాలి. తర్వాత ఈ కవర్‌పై బ్యాలెట్ పేపర్ క్రమసంఖ్య రాయాలి. ఏ అభ్యర్థికి లేదా నోటాకు మార్కు చేయకుండా ఖాళీగా వదిలేస్తే ఓటు తిరస్కరణకు గురవుతుంది. పూర్తి చేసిన 13ఏ, 13బీ కవర్లను 13సీ కవర్‌లో పెట్టాలి. అనంతరం 13సీ కవర్‌ను అతికించాలి. దీన్ని 13డీ కవర్‌లో పెట్టాలి. అనంతరం 13డీ కవర్‌ను అతికించి, తపాలా శాఖ లేదా నేరుగా సంబంధిత నియోజకవర్గ ఎన్నికల అధికారికి పంపించాలి. ఇందుకు సంబంధించిన చిరునామా 13డీ కవర్‌పై రాసి ఉంటుంది.

2018 ఎన్నికల్లో ఇలా..

ఉమ్మడి జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అర్హులు : 15,650 మంది
జారీ చేసిన పోస్టల్ బ్యాలెట్లు : 9,454
చెల్లుబాటు అయినవి: 6,321
తిరస్కరణకు గురైనవి: 3,133

ప్రేమజంట ఆత్మహత్య

- రాజన్నసిరిసిల్ల జిల్లాలో విషాదం


సంధ్య (ఫైల్)


శ్రీధర్ (ఫైల్)

కోనరావుపేట/తంగళ్లపల్లి: పెళ్లికి పెద్దలు ఒప్పుకోరని భావించిన ప్రేమికులు క్రిమిసంహారక మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలో విషాదం నింపింది. పోలీసులు, గ్రామస్తుల వివరాలు.. కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన సామల లక్ష్మీనారాయణ–ఇందిర దంపతులు కొన్నేళ్లుగా సిరిసిల్లలోని టెక్స్‌టైల్ పార్క్‌లో నివసిస్తున్నారు. వీరికి కూతురు, కుమారుడు శ్రీధర్(20) ఉన్నాడు. శ్రీధర్ ఐటీఐ సెకండియర్ చదువుతున్నాడు. వీరి ఇంటి పక్కనే ఒబులాపూర్‌కు చెందిన చెల్ల రాజు–రేణుక దంపతులు కొంతకాలంగా నివసిస్తున్నారు. వీరి కూతురు సంధ్య (17) ఇంటర్ సెకండియర్ చదువుతుంది. సంధ్య, శ్రీధర్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లికి పెద్దలు ఒప్పుకోరని భావించిన ఇద్దరు రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకొచ్చారు. ఇదిలా ఉండగా సంధ్య కనిపించడం లేదని మంగళవారం తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో యువతి బంధువులు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలోనే బుధవారం సాయంత్రం మామిడిపల్లి–కనగర్తి గ్రామాల మధ్య మూలవాగులో ఇద్దరు మృతిచెంది ఉన్న విషయాన్ని గొర్లకాపరుల ద్వారా గ్రామస్తులకు తెలిసింది. వారి పక్కన గడ్డిమందు డబ్బా పడి ఉండడంతో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారని భావిస్తున్నారు. వీరి ఫోన్, బ్యాగ్ వేములవాడలోని సాయిరక్ష దాబా సమీపంలో లభించాయి. సిరిసిల్లరూరల్ సీఐ సదన్‌కుమార్, కోనరావుపేట, తంగళ్లపల్లి ఎస్సైలు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అంత్యక్రియలయ్యాక.. పోస్టుమార్టం

- మృతురాలి కూతుళ్ల ఫిర్యాదుతో పోలీసుల చర్యలు

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని మొలంగూర్ పంచాయతీ పరిధి గూడాటిపల్లికి చెందిన భోజ లక్ష్మి(55) రెండు రోజుల క్రితం మృతిచెందగా అంత్యక్రియలు పూర్తయ్యాయి. కానీ, ఆమె కూతుళ్ల ఫిర్యాదుతో పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. వివరాల్లోకి వెళ్తే.. లక్ష్మి అనారోగ్యంతో బాధ పడుతుండగా కుటుంబసభ్యులు ఈ నెల 16న వరంగల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 19న మృతి చెందింది. కుటుంబసభ్యులు ఆమె మృతదేహానికి అదేరోజు తమ వ్యవసాయ పొలంలో అంత్యక్రియలు నిర్వహించారు. అయితే, లక్ష్మి మృతి విషయంలో అన్న మహేశ్, వదినపై అనుమానాలున్నాయని మృతురాలి కూతుళ్లు కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం తహసీల్దార్ అనుపమ సమక్షంలో లక్ష్మి మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం చేయించినట్లు పేర్కొన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

తిమ్మాపూర్(మానకొండూర్): బైండోవర్ ఉల్లంఘించిన తిమ్మాపూర్ మండలంలోని మల్లాపూర్‌కు చెందిన పొనగంటి అజయ్‌కి రూ.లక్ష జరిమానా విధించినట్లు కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఆగస్టు 10న అజయ్‌పై ఎల్‌ఎండీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అదే నెల 11న పోలీసులు అరెస్టు చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అతన్ని తిమ్మాపూర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అయితే, అజయ్ గత 31న మళ్లీ నేరం చేశాడు. ఈ మేరకు ఎల్‌ఎండీ పోలీస్‌స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. అతన్ని బుధవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయగా రూ.లక్ష జరిమానా విధించారు. బైండోవర్ అయిన వ్యక్తులు ఆరు నెలల్లోపు ఏదైనా క్రిమినల్ చర్యల్లో పాల్గొన్నా, ప్రజాశాంతికి భంగం కలిగేలా వ్యవహరించినా ఆరు నెలల జైలుశిక్ష అనుభవించాలి లేదా రూ.లక్ష జరిమానా చెల్లించాల్సి ఉంటుందని ఏసీపీ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని జగదాంబ తండాలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందాడు. పెద్దమ్మ స్టేజీ నుంచి గంభీరావుపేటకు వస్తున్న డీసీఎం వ్యాన్ గంభీరావుపేట నుంచి పెద్దమ్మ స్టేజీ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో బైక్‌పై వస్తున్న రాజస్థాన్‌కు చెందిన ముగ్గురిలో ఒకరు పింటూసింగ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పింటూసింగ్ వ్యాపారం నిమిత్తం రాజస్థాన్ నుంచి వచ్చి వేములవాడలో ఉంటున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాద స్థలాన్ని పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హరిదాస్‌నగర్‌కు చెందిన వ్యక్తి..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని హరిదాస్‌నగర్‌కు చెందిన ఎక్కలదేవి మల్లేశం(31) బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. హరిదాస్‌నగర్‌కు చెందిన మల్లేశం తన సొంత పని కోసం మంగళవారం సాయంత్రం బైక్‌పై ఎల్లారెడ్డిపేటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా పదిర శివారులోని బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న ప్యాసింజర్ ఆటో బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కావడంతో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మల్లేశం చికిత్స పొందుతూ ఆస్పత్రిలో బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌కు చెందిన ప్యాసింజర్ ఆటోడ్రైవర్ గొట్టం దేవయ్య అజాగ్రత్తగా, అతివేగంగా నడిపి ఒకరి మృతికి కారణమయ్యాడు. పనిమీద బయటకు వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెంది శవమై ఇంటికి రావడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుని తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు దేవయ్యపై కేసు నమోదు చేసి, ఆటోను సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


సర్వం కోల్పోయి విలపిస్తున్న రాజవ్వ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన జాగిరి రాజవ్వకు చెందిన ఇల్లు బుధవారం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు, బియ్యం, బట్టలు, వంట సామగ్రితోపాటు రూ.10వేల నగదు కాలిబూడిదయ్యాయి. ఇల్లు కాలుతున్న సమయంలో పక్క గదిలో ఉన్న పక్షవాతంతో బాధపడుతున్న శ్రీనివాస్ త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. బాధితురాలు రాజవ్వ భర్త అనారోగ్యంతో గతంలో మృతిచెందాడు. పక్షవాతంతో మంచంపట్టిన కొడుకు శ్రీనివాస్‌తో కలిసి ఆ ఇంట్లో ఉంటుంది. శ్రీనివాస్‌ను ఇంట్లో ఉంచి ఇంటికి తాళం వేసి కిరాణ వస్తువుల కోసం రాజవ్వ బయటకెళ్లిన సమయంలో ఈ సంఘటన జరిగింది. ఇంట్లో నుంచి మంటలు ఎగిసిపడడంతో చుట్టుపక్కల వారు పోగై మంటలను ఆర్పినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. రాజవ్వ బయట నుంచి వచ్చే సరికి ఇల్లు కాలి బూడిదైంది. భర్త చనిపోయి, కొడుకు పక్షవాతంతో మంచంపట్టడంతో పుట్టెడు దుంఖంతో ఉన్న వారిని విధి పగబట్టింది. నిలువనీడ కోల్పోయిన రాజవ్వ రోడ్డున పడింది. రాజవ్వ కుటుంబాన్ని ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువకుడి అదృశ్యం

కరీంనగర్ క్రైం: నగరానికి చెందిన ఒక యువకుడు అదృశ్యమైనట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌కు చెందిన గడిపే శ్రవణ్‌కుమార్ హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. 15 రోజుల కింద కరీంనగర్ వచ్చి, వివాహం చేసుకుంటానని తల్లికి చెప్పాడు. జీవితంలో స్థిరపడిన తర్వాత చేస్తామని ఆమె సర్ది చెప్పడంతో ఒకే అన్నాడు. ఈ నెల 17న ఉదయం నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రూ.42.75 లక్షలు సీజ్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో చేపట్టిన తనిఖీల్లో రూ.1.62 కోట్లు స్వాధీనం చేసుకోగా, ఆధారాలు చూపించడంతో రూ.1.19 కోట్లు తిరిగి ఇచ్చేశామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బుధవారం తెలిపారు. సరైన ఆధారాలు చూపని కారణంగా రూ.42.75 లక్షలు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సీ–విజిల్ యాప్ ద్వారా 171, 1950 టోల్‌ఫ్రీ ద్వారా 1,475 ఫిర్యాదులు అందాయని తెలిపారు.

ఒడ్డెలింగాపూర్ చెక్‌పోస్టు వద్ద రూ.లక్ష పట్టివేత


పట్టుకున్న నగదుతో పోలీసులు

రాయికల్: ఒడ్డెలింగాపూర్ చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఓ వ్యక్తి రూ.లక్ష నగదు ఎలాంటి రశీదు లేకుండా తీసుకెళ్తుండగా జప్తు చేసి జగిత్యాలలోని గ్రీవెన్స్‌సెల్‌కు అప్పగించినట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

మద్యం స్వాధీనం

కథలాపూర్: మండల కేంద్రం నుంచి మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ వైపు అక్రమంగా మద్యం తరలిస్తుండగా బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా తనిఖీలు చేస్తుండగా.. కథలాపూర్‌కు చెందిన అజయ్ రూ.8,200 విలువైన మద్యం తీసుకెళ్తూ కనిపించాడన్నారు. మద్యం స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో బుధవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. కొద్ది రోజులుగా కొత్త బస్టాండ్‌తో పాటు పలు ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం కొత్త బస్టాండ్‌లో మృతిచెంది ఉండటంతో పట్టణ పోలీసులు మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. వయస్సు 50– 55 సంవత్సరాలుంటుందని పోలీసులు తెలిపారు.

విద్యార్థిని బలవన్మరణం

కోరుట్లరూరల్: పట్టణంలోని బిలాల్‌పురాకు చెందిన అస్రిన్ బేగం(14) అనే విద్యార్థిని బుధవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. షేక్‌హైదర్–సుల్తానా బేగం దంపతుల కూతురు అస్రిన్ బేగం స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతోంది. 5రోజులుగా పాఠశాలకు వెళ్లటం లేదు. తల్లి పాఠశాలకు వెళ్లమని మందలించింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రెండు బైక్‌లు ఢీ : ఇద్దరికి గాయాలు

వేములవాడరూరల్: నాగయ్యపల్లి వద్ద రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డట్లు వేములవాడరూరల్ ఎస్‌ఐ మారుతి తెలిపారు. వేములవాడ నుంచి సనుగుల గ్రామానికి వెళ్తున్న నర్సయ్య ఎదురుగా వస్తున్న నాగయ్యపల్లి వద్ద మరో బైక్‌ను ఢీకొన్న సంఘటనలో గాయపడ్డారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

'అల్ఫోర్స్'లో ఎస్జీఎఫ్ స్విమ్మింగ్ పోటీలు


స్విమ్మింగ్‌లో పోటీ పడుతున్న క్రీడాకారులు

కొత్తపల్లి (కరీంనగర్): క్రీడల్లో స్విమింగ్‌కు ప్రత్యేక స్థానం ఉందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, స్విమ్మింగ్ సీనియర్ కోచ్ చంద్రశేఖర్ అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో నిర్వహించిన ఎస్జీఎఫ్ జోనల్ స్థాయి స్విమింగ్ పోటీలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీరోజు స్విమ్మింగ్ చేయడం ద్వారా రోజంతా హుషారుగా ఉంటామని తెలిపారు. పాఠశాలలో అన్ని వసతులతో స్విమింగ్ పూల్ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి క్రీడాకారులకు జోనల్ స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 200 మందికి పైగా వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు, టీం కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య' విద్యార్థినికి అభినందన


సహర్షను అభినందిస్తున్న ఏజీఎం రాజు

కరీంనగర్: పట్టణంలోని విద్యారణ్యపురిలో గల శ్రీ చైతన్య కరీంనగర్ ఐపీఎల్ పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థిని వొడ్నాల సహర్షను విద్యాసంస్థల ఏజీఎం రాజు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ అభినందించారు. ఆమె ఈ నెల 3 నుంచి 13 వరకు శ్రీలంక, బ్యాంకాక్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ సెస్టోబాల్ పోటీల్లో మన దేశ జట్టుకు ప్రాతినిధ్యం వహించిందని తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మల్లంపాటి శ్రీధర్‌తో కలిసి బుధవారం పాఠశాలలో విద్యార్థినిని సత్కరించారు. కార్యక్రమంలో శ్రీవిద్య, సదాశివరెడ్డి, ప్రవీణ్, శ్రీకాంత్‌రెడ్డి, మధుకర్, కిషన్‌రెడ్డి, రాంప్రసాద్, బాబు, సుప్రజ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రౌద్రం కవితా సంపుటి ఆవిష్కరణ


కవితా సంపుటి ఆవిష్కరిస్తున్న ఈశ్వర్

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ యాస, భాషకు పట్టం కడుతూ ఏకు తిరుపతి కవిత్వం రాయడం అభినందనీయమని రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ తాటిపల్లి ఈశ్వర్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ప్రెస్ భవన్‌లో తిరుపతి రాసిన రౌద్రం కవితా సంపుటిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉత్తర తెలంగాణ భూభాగంలోని సహజ వనరులను పాలకులు దోపిడీ చేస్తున్నారని అన్నారు. భూమి, నీరు, ఖనిజ సంపదను స్థానిక ప్రజలకు అందుబాటులో లేకుండా కుట్రలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బండ శ్రీనివాస్, పల్లెల వీరాస్వామి, బొంత వెంకట మల్లయ్య, ప్రొఫెసర్ నతానియల్, ఆంజనేయులు, మార్వాడి సుదర్శన్, మాల మాదిగ ఉపకులాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ కర్రె రవీందర్, రాష్ట్ర కార్యదర్శి ఎక్కిరాల రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో వ్యక్తికి జైలు

కరీంనగర్ క్రైం: దివ్యాంగురాలైన బాలిక(12)పై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఓ వ్యక్తికి 20 ఏళ్ల జైలుశిక్షతోపాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి అదనపు జిల్లా సెషన్స్, పోక్సో కోర్టు జడ్జి శ్రీవాణి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. చిగురుమామిడి మండలంలోని పీచుపల్లిలో నివాసం ఉంటున్న దంపతులు కూలీ పని చేస్తూ జీవిస్తున్నారు. వీరికి ముగ్గురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. పెద్ద కూతురు కాలేజీకి వెళ్తుండగా, పెద్ద కొడుకు, రెండో కూతురు హాస్టల్లో ఉంటున్నారు. చిన్న కొడుకు స్కూల్‌కు వెళ్తుండగా, చిన్న కూతురు పుట్టుకతోనే దివ్యాంగురాలు కావడంతో ఇంట్లోనే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన నేరచరిత్ర కలిగిన పీచు శేఖర్ రెడ్డి అలియాస్ రమేశ్(35)కు ఆ కుటుంబంతో పరిచయం ఉంది. దివ్యాంగ బాలికపై అతని కన్నుపడింది. గత ఫిబ్రవరి 6న దంపతులు బ్యాంకు పనిపై వెళ్లారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఇంట్లో బాలిక ఒంటరిగా ఉండటాన్ని గమనించిన శేఖర్ రెడ్డి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రులు రావడాన్ని గమనించి, అక్కడినుంచి పారిపోయాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిగురుమామిడి పోలీసులు శేఖర్ రెడ్డిపై కేసు నమోదు చేయగా సీఐలు శశిధర్ రెడ్డి, రమేశ్ దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు కోర్టులో ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి అతనికి శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు.

ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తికి..

జగిత్యాలజోన్: వ్యవసాయ మోటార్ వద్దకు విద్యుత్ తీగను నిర్లక్ష్యంగా తీసుకెళ్లి ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ బుధవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం.. పెగడపల్లి మండలం వెంగళాయిపేటకు చెందిన పిట్టల విద్యాధర్ చేపల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మ్యాక వెంకయ్యపల్లి ఊర చెరువును లీజుకు తీసుకొని చేపలు పెంచుతున్నాడు. 2019 సెప్టెంబర్ 30న భారీ వర్షాలతో చెరువులోని చేపలు కిందికి కొట్టుకుపోతున్నాయనే సమాచారమందింది. విద్యాధర్‌తో పాటు అతని అన్న పిట్టల కరుణాకర్, అదే గ్రామానికి చెందిన కొలిపాక తిరుపతి, అంగలి సంతోష్, ఐతరవేని నర్సయ్య, ఆత్మకూరి అంజయ్య, ఆత్మకూరి హరీష్ తమ మోటార్ సైకిళ్లపై చెరువు వద్దకు వెళ్లి వలలు వేశారు. తిరిగి సాయంత్రం 6.30 గంటల సమయంలో చెరువు కట్టపై నుంచి ఇంటికి వస్తున్నారు. మ్యాక వెంకయ్యపల్లికి చెందిన మ్యాక బ్రహ్మానందరెడ్డి తన పొలానికి చెరువు నుంచి నీరందించేందుకు విద్యుత్ మోటార్ ఏర్పాటు చేసి, విద్యుత్ తీగను చెరుకు కట్ట రోడ్డు మధ్యలో నుంచి తీసుకెళ్లాడు. ఈ తీగకు మోటార్ సైకిల్ తగిలి తీగ తెగింది. బైక్‌పై ఉన్న విద్యాధర్, తిరుపతి విద్యుత్ షాక్‌కు గురై చనిపోయారు. బ్రహ్మానందరెడ్డిపై చర్య తీసుకోవాలని పెగడపల్లి పోలీసులకు విద్యాధర్ భార్య ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ బి.జీవన్ కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ కె.కిశోర్ కేసును దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు ఎం.కిరణ్‌కుమార్, కె.విద్యాసాగర్ బలమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో.. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం బ్రహ్మానందరెడ్డికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

కేసీఆర్ బీమా.. ప్రతీ ఇంటికి ధీమా



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్



కొత్తపల్లిలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్, హాజరైన ప్రజలు

- మళ్లీ అధికారంలోకి రాగానే రూ.5వేల పింఛన్
- కాంగ్రెస్, బీజేపీలు ఒకే తాను ముక్కలు
- మంత్రి, కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్

కరీంనగర్: 'కేసీఆర్ బీమా ప్రతీ ఇంటికి ధీమా' అని ఈ పథకం కింద అర్హులైన వారందరికీ రూ.5 లక్షల సాధారణ బీమా చేయనున్నట్లు బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం నగరంలోని 39, 57, 58 డివిజన్‌లలో మేయర్ సునీల్‌రావుతో కలిసి ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాకముందు కరీంనగర్‌లో రోడ్లు ఎలా ఉండేవి ఇప్పుడు ఎలా ఉన్నాయో గమనించాలన్నారు. నగరంలో కొనసాగుతున్న ఈ అభివృద్ధి మరింత ముందుకు సాగాలంటే కేసీఆర్‌ను గెలిపించుకోవాలన్నారు. బీజేపీ రాష్ట్రంలో ఎక్కడా గెలిచేది లేదన్నారు. అలాంటి పార్టీకి ఓటు వేసి వృథా చేసుకోవద్దని సూచించారు. అసమర్థ ఎంపీ ఉండడం వల్ల కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా నిధులు తీసుకురాలేకపోయారని దుయ్యబట్టారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులిద్దరూ ఒక్కటై మైనార్టీల ఓట్లను చీల్చాలని చూస్తున్నారని విమర్శించారు. వారి కుట్రలను తిప్పి కొట్టే విధంగా మైనార్టీలంతా కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కేసీఆర్ బీమా పథకం రైతుబీమా తరహాలోనే సహజ మరణం పొందిన వారికి కూడా రూ.5లక్షలు సాయం చేయనున్నట్లు తెలిపారు. అలాగే రేషన్ కార్డు ఉన్నవారికి సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. అన్ని సామాజిక పెన్షన్లు రూ.5 వేలకు పెంచనున్నట్లు తెలిపారు. సౌభాగ్య లక్ష్మి పథకం కింద అర్హులైన ప్రతీ మహిళకు రూ.3 వేల గౌరవ వేతనం ఇస్తామని వెల్లడించారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు కొండపల్లి సరిత సతీశ్, ఆర్‌టీఏ మెంబర్ తోట శ్రీపతిరావు, నాయకులు కొత్త జైపాల్‌రెడ్డి, మొగిలోజు వెంకట్, కొత్త అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రామాలాడి సంజయ్ ఎంపీగా గెలిచాడు

కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ డ్రామాలాడి గెలిచాడని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఢిల్లీకి, ఆంధ్రా నాయకులకు గులాములని, వారి మాయమాటలు నమ్మి మోసపోతే తెలంగాణ అంధకారం అవుతుందని తెలిపారు. కొత్తపల్లి మండలకేంద్రంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. గుండె నొప్పి అని చెప్పి దొంగ డ్రామాలు ఆడి ఎంపీ అయిన బండి సంజయ్ గెలిచిన తర్వాత నాలుగున్నరేళ్లుగా పత్తా లేకుండా పోయి మళ్లీ ఎన్నికలు రాగానే ఓట్ల కోసం వస్తున్నాడని విమర్శించారు. బీజేపీ అధ్యక్షుడిగా కోట్ల రూపాయలు వసూలు చేసి అవినీతి సొమ్ముతో గెలిచేందుకు ఓట్లు అభ్యర్థిస్తున్నాడని అన్నారు. కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, బీఆర్ఎస్ నాయకులు వాసాల రమేశ్, జమీలొద్దీన్, బండ గోపాల్‌రెడ్డి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే దళితులకు ఆత్మగౌరవం

బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సీఎం కేసీఆర్ దళితుల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేశారని, రానున్న ఎన్నికల్లో మాలల మద్దతు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకే ఉంటుందని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్, కన్వీనర్ నల్లాల కనుకరాజు, వర్కింగ్‌చైర్మన్ తాళ్లపల్లి రవి అన్నారు.



గంగుల కమలాకర్‌కు పూలమాల వేస్తున్న మహిళలు

బుధవారం మీసేవ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా తమ సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్ పార్టీకే అందిస్తున్నామని వెల్లడించారు. మెజారిటీ మాల సంఘాలు ఏకమై జేఏసీగా ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ కారు గుర్తుకే ఓటెయ్యాలంటూ మాలలను చైతన్యవంతులను చేస్తున్నామని అన్నారు. గంగుల కమలాకర్ నాయకత్వంలో కరీంనగర్ నియోజకవర్గం చాలా అభివృద్ధి చెందిందని కొనియాడారు. అంతర్జాతీయ స్థాయిలో నగరాన్ని డెవలప్ చేశారని గుర్తుచేశారు. మాలల సమస్యలను బీఆర్ఎస్ ప్రభుత్వం నెరవేరుస్తామన్నందుకే పూర్తి మద్దతు ప్రకటించామని అన్నారు. ఈ సమావేశంలో మాల సంఘం నాయకులు రావుల అంజయ్య, మందాల భాస్కర్, మద్దెల రాజేందర్, సిగిరి శోభ, నర్సింగరావు, మద్దునాల రవీందర్, గంటల మహేందర్, శీలం పుష్పలత, గంటల రేణుకలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

జీవితాన్ని ఫణంగా పెట్టి పోరాడిన



బహూకరించిన ఖడ్గంతో బండి సంజయ్



బండి సంజయ్ ఎన్నికల ప్రచార సభకు హాజరైన జనం

- బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు భూకబ్జాదారులు
- అవినీతి, అభివృద్ధి, ఆస్తులపై చర్చకు రావాలి
- కరీంనగర్ బీజేపీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్ కుమార్

కరీంనగర్‌టౌన్: బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులిద్దరూ భూకబ్జాదారులేనని.. కాంగ్రెస్ అభ్యర్థిపై బ్లాక్ మెయిల్, చీటింగ్ కేసులుంటే.. గంగుల కమలాకర్‌పై అక్రమ సంపాదన, ఈడీ కేసులున్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం కరీంనగర్‌లోని రేకుర్తి, మంకమ్మతోట ప్రాంతాల్లో నిర్వహించిన కార్నర్ మీటింగుల్లో మాట్లాడారు. నాల్గో సారి గెలిచేందుకు గంగుల కమలాకర్ డబ్బులను నమ్ముకున్నాడని ఎద్దేవా చేశారు. ఒక్కో ఓటుకు రూ.10 వేల ఇచ్చేందుకు సిద్ధమయ్యాడని అన్నారు. రూ.10 వేలు తీసుకోండి పువ్వు గుర్తుకు ఓటేయండని కోరారు. గంగుల కమలాకర్ రేషన్ కార్డుల మంత్రి అయి ఉండి ఒక్క రేషన్ కార్డు ఇయ్యలేదన్నారు. బండి సంజయ్‌ను తిడితే ప్రజలు ఓట్లు వేయరని హితవు పలికారు. ప్రజల కోసం కొట్లాడి, నమ్మకంగా పనిచేస్తేనే ఓట్లు అడిగే హక్కు ఉంటుందన్నారు. కరీంనగర్ నగర అభివృద్ధి మొత్తం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరిగిందని తెలిపారు. రేషన్ బియ్యం కూడా కేంద్రమే ఇస్తుందని, కానీ మోదీ ఫొటో పెట్టకుండా కేసీఆర్ ఫొటో పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. తీగలగుట్టపల్లి బ్రిడ్జి వద్ద రోజూ ట్రాఫిక్ జామ్ అవుతుందని నేను కొట్లాడి రూ.153 కోట్లు తీసుకొస్తే వారు ప్రారంభోత్సవాలు చేసుకొని కొబ్బరికాయలు కొడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ జమచేయకుండా రెండేళ్లు జాప్యం చేసిందని తెలిపారు. నన్ను ఎంపీగా గెలిపించాక రూ.9 వేల కోట్ల నిధులు తీసుకువచ్చానని స్పష్టం చేశారు. నేను ఎమ్మెల్యేను కాదు.. మంత్రిని కాదు.. నా ప్రభుత్వం లేదు. నేనెలా డబ్బులు సంపాదిస్తానో గంగుల చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి పురమల్ల శ్రీనివాస్ పేపర్లో ఆడ్ ఇచ్చిండు. అన్ని 420 కేసులు ఉన్నాయన్నారు. ఇలాంటి వారికి ఎలా ఓటేస్తారని అన్నారు. ల్యాండ్ కబ్జాల కేసులు గంగుల కమలాకర్‌పై ఉన్నాయన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులిద్దరికీ జాగల పంచాయితీ ఉందన్నారు. నాపై కేసీఆర్ 74 కేసులు పెట్టిండని తెలిపారు. ఇవి కేవలం ప్రశ్నించినందుకు, ప్రజల తరఫున కొట్లాడినందుకే నాపై కేసులు పెడుతున్నారని అన్నారు. మీరు నాకు ఓటేస్తే మీ కోసం కొట్లాడి మీ విలువ కాపాడిన. నాపై ఎన్ని కేసులు పెట్టినా నా పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. ఏ రోజు నా కుటుంబం కోసం పనిచేయలే. కేవలం ప్రజల కోసమే పనిచేస్తున్నానని తెలిపారు. దయచేసి మీకోసం కోట్లాడేందుకు, ప్రశ్నించేందుకు పనిచేస్తున్న నాకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

భూకబ్జాదారులకు బుద్ధి చెప్పాలి

కరీంనగర్‌రూరల్: కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు పురుమల్ల శ్రీనివాస్, మంత్రి గంగుల కమలాకర్ లపై భూకబ్జా, బ్లాక్‌మెయిలింగ్, అక్రమ సంపాదన, ఈడీ కేసులున్నాయని కరీంనగర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. నేనెక్కడా భూకబ్జాలు, అక్రమ దందా చేయలేదని, ప్రజల కోసం పోరాడితే సీఎం కేసీఆర్ 74 కేసులు పెట్టి వేధిస్తున్నారని



మహిళలతో సెల్ఫీ దిగుతున్న బండి సంజయ్

ఆరోపించారు. బుధవారం కరీంనగర్ మండలం చేగుర్తి, నల్లగుంటపల్లి, దుర్శేడ్ గ్రామాల్లో బీజేపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భూకబ్జాదారులైన బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఎంపీగా చేసిన అభివృద్ధిపనులు, మంత్రి అవినీతి, అక్రమదందాలపై చర్చించేందుకు గంగుల కమలాకర్ ముందుకు రావాలని సవాల్ చేశారు. నల్లగుంటపల్లిలో దళితబంధు కింద బీఆర్ఎస్ నాయకులు 30శాతం కమీషన్ వసూలు చేశారన్నారు. సీఎం కేసీఆర్ రైతుబంధు పేరిట మిగితా సబ్సిడీలను నిలిపివేస్తే, ప్రధాని మోదీ ఎరువులపై సబ్సిడీతో ఎకరానికి రూ.20వేల లాభం చేస్తున్నట్లు తెలిపారు. బీజేపీ అధికారంలోకి వస్తే క్వింటాల్‌కు రూ.3,100, పంటల బీమా అమలు చేస్తామని అన్నారు. భూ కబ్జాదారులకు కాకుండా ప్రజల కోసం పోరాడే బీజేపీకి ఓటేసి గెలిపించాలిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్, శివారెడ్డి, సంతోష్‌కుమార్, ప్రవీణ్, మల్లేశం, సత్యం, ఓదెలు, యుదిష్టర్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు.. దుర్వాసన

- పెద్ద మోరీతో అరి గోస
- ఏళ్లుగా ఇళ్లల్లోకి డ్రెయినేజీ నీరు
- పుష్కరకాలంగా దొరకని పరిష్కారం
- ముకరాంపుర విమానం కాలనీవాసుల అవస్థలు
- సమస్య తీర్చినోళ్లకే మద్దతంటున్న స్థానికులు

సాక్షి పీపుల్స్ ఎజెండా

ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా పన్నెండేళ్ల నుంచి ఆ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. తాము పడుతున్న తిప్పలను తప్పించండంటూ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగి ఆ కాలనీవాసులు విసిగి వేసారిపోయారు. ఈ ఎన్నికల వేళ అయినా తమ సమస్యకు పరిష్కారం దొరుకుతుందేమోనని ఆశతో ఉన్నారు. సమస్య పరిష్కరించినోళ్లకే తాము మద్దతునిస్తామంటున్నారు. – కరీంనగర్ కార్పొరేషన్

సమస్య ఇదీ..

నగరంలోని ముకరాంపుర విమానం వీధి నివాసితులు ప్రక్కనే ఉన్న పెద్దమోరీతో ఏళ్లుగా కష్టాలు పడుతున్నారు. ఇళ్లల్లోని మురుగునీరు డ్రైనేజీలకు వెళ్లడం సాధారణం, కానీ డ్రైనేజీ నీరు ఇళ్లలోకి వచ్చే అసాధారణ దుస్థితి ఇక్కడ నెలకొంది. కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారి వద్ద ఉన్న ఈ పెద్ద మోరీ ఈ కాలనీవాసులను కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. ముఖ్యంగా వర్షాకాలం వచ్చిందంటే మురుగునీటితో కూడిన వరద ఈ వీధిని, వీధిలోని ఇళ్లను ముంచెత్తుతోంది. విద్యానగర్, భాగ్యనగర్, మంకమ్మతోట, జ్యోతినగర్ తదితర ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ఈ పెద్ద డ్రైనేజీలో ఎప్పుడూ మురుగునీరు ప్రవహిస్తూ ఉంటాయి. మోరీలో సిల్ట్ తీయకపోవడం, సైడ్‌వాల్స్ పూర్తిగా కూలిపోవడం, చెట్ల కొమ్మలు విరిగిపడడంతో నీరు నిలిచిపోయి ఇళ్లవైపు మళ్లుతున్నాయి. ఇళ్ల నుంచి మురుగునీరు ఈ పెద్ద మోరీ లోకి వెళ్లాల్సి ఉండగా, డ్రైనేజీ నిలిచిపోయినప్పుడు అవే పైప్‌ల ద్వారా మురుగునీరు ఇళ్లలోకి వస్తున్నాయి. ఫలితంగా కాలనీవాసులు దుర్వాసన భరించలేకపోతున్నారు. క్రిమికీటకాలు, చెత్తాచెదారంతో ఇళ్లు అపరిశుభ్రంగా మారి, రోగాల బారిన పడుతున్నారు. ఈ ప్రధాన వీధి ఓ వైపు 55వ డివిజన్‌లో, మరో వైపు 60వ డివిజన్‌లో ఉండడం కూడా సమస్యగా మారినట్లు స్థానికులు వాపోతున్నారు.



కాలనీకి సమస్యగా మారిన పెద్ద డ్రైనేజీ



సమస్య తెలుపుతున్న కాలనీవాసులు

పరిష్కారం ఇదీ..

- వాణినికేతన్ పాఠశాల నుంచి సిరిసిల్ల రోడ్డు వద్ద ఉన్న మోరీ వరకు డ్రైనేజీని పునర్నిర్మిస్తే శాశ్వత పరిష్కారం లభించనుంది.
- రెండు వైపులా సైడ్ వాల్స్ నిర్మించడంతో పాటు, డ్రైనేజీపై శ్లాబ్ నిర్మించాలని కాలనీవాసులు ఎప్పటినుంచో కోరుతున్నారు.
- రోడ్డుకు అవతలి వైపు ఇరుకుగా ఉన్న డ్రైనేజీని విస్తరించడమే కాకుండా, రోడ్డు కింద ఉన్న నాలుగు పైప్‌లను క్లీన్‌చేస్తే మురుగునీరు వెళ్లిపోయే అవకాశం ఉంటుంది.
- అలాగే సిల్ట్‌ను ఎప్పుడో సంవత్సరానికి ఒకసారి, పైపైన కాకుండా, ఎప్పటికప్పుడు తొలగిస్తే మురుగునీరు నిలిచిపోయే అవకాశం ఉండదు.

ఇంటి గోడలు కూలుతున్నాయి



డ్రెయినేజీకి రెండు వైపులా ఉన్న సైడ్‌వాల్స్ శిథిలావస్థకు చేరి, కూలి మోరీలోనే పడిపోతున్నాయి. చెట్ల కొమ్మలు కూడా విరిగి అందులో పడుతుండటంతో మురుగునీరంతా ఇక్కడే నిలిచిపోతున్నాయి. ఫలితంగా ఏళ్ల క్రితం కట్టుకున్న మా ఇంటి గోడలు కూడా కూలుతున్నాయి. ఎప్పటికీ మురుగునీరు నిలుస్తుండటంతో దోమలు తయారై, రోగాల బారిన పడుతున్నాం.

– సీహెచ్ రాజేశ్వర్, స్థానికుడు

ఇళ్లు వదిలి పోతున్నారు



పెద్ద మోరీ సమస్యతో మా వీధిలోని చాలా మంది ఇళ్లు విడిచిపెట్టి పోతున్నారు. సొంత ఇళ్లను హాస్టళ్లకి కిరాయికి ఇస్తున్నారు. కిరాయిదారులేమో ఖాళీ చేసి పోతున్నారు. ఈ డ్రైనేజీ పేరుకుపోవడంతో దోమలు విపరీతంగా ఉంటాయి. డెంగీ వ్యాధులు కూడా సోకిన సందర్భాలున్నాయి. ఎక్కడెక్కడో చనిపోయిన పందులు కూడా తీసుకువచ్చి ఇందులో వేస్తున్నారు.

– జి.రాజేందర్, స్థానికుడు

డ్రైనేజీ పునర్నిర్మించాలి



డ్రైనేజీకి రెండు వైపులా ఉన్న గోడలను పునర్నిర్మించాలి. చెట్లు, పొదలను పూర్తిగా తొలగించాలి. క్రమం తప్పకుండా డ్రైనేజీ నిర్వహణ చేయాలి. సిల్ట్ ఎప్పటికప్పుడు తీస్తే మురుగునీరు నిలవదు, ఇళ్లల్లోకి కూడా రావు. రోగాల బారిన పడకుండా ఉంటాం. వర్షాకాలంలో డ్రైనేజీలోని మురుగునీరు మా ఇళ్లల్లోకి వస్తున్నాయి. ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి. శాశ్వత నిర్మాణాలతో సమస్యను పరిష్కరించాలి.

– డాక్టర్ బి.శ్రీనివాస్, స్థానికుడు

కనీస నిర్వహణ లేదు



ఈ డ్రైనేజీకి కనీస నిర్వహణ లేదు. సిల్ట్, మట్టి పెల్లలు, చెట్టు కొమ్మలు డ్రైనేజీలో పేరుకుపోయి నిలిచిన నీటిని తొలగించడం లేదు. ఫెన్సింగ్‌లేకపోవడంతో చెత్తాచెదారాన్ని ఇందులోనే వేస్తున్నారు. చిన్న వానకే మురుగునీరు ఇళ్లల్లోకి వస్తున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న మురుగునీరు ఇందులోనే నిలిచిపోవడంతో అవి ఇళ్లల్లోకి రివర్స్‌లో వస్తున్నాయి. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– ఎ.మునీందర్, స్థానికుడు

పైప్‌లు శుభ్రం చేయడం లేదు



సిరిసిల్ల రోడ్డుపై ఉన్న మోరీ కింద ఉన్న పైప్‌లను శుభ్రం చేయడం లేదు. నాలుగు పైప్‌లు ఉండగా, అందులో చెత్తాచెదారం, మట్టి పేరుకుపోయి బ్లాక్ అయ్యాయి. కేవలం ఒక్క పైప్ గుండా మాత్రమే మురుగునీరు బయటకు పోతున్నాయి. మిగిలిన మూడు పైప్‌లైన్‌లలో పేరుకు పోయిన చెత్తను తొలగించడం లేదు. పైప్‌లను క్లియర్ చేస్తే కొంతైనా సమస్య పరిష్కారమవుతుంది.

– ఎం.చంద్రమౌళి, స్థానికుడు

సమస్య పరిష్కరించినోళ్లకే మద్దతు



ఏళ్ల తరబడి మా సమస్యను పరిష్కరించమని అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నాం. ఇది రెండు డివిజన్‌లకు నడుమ ఉండడం కూడా సమస్యగా మారింది. ఎవరూ పట్టించుకోవడం లేదు. సంవత్సరానికి ఒకసారి సిల్ట్ తీస్తున్నారు. పూర్తిగా తొలగించడం లేదు. స్మార్ట్ సిటీ పేరిట వందల కోట్ల రూపాయలు వస్తున్నాయి, ఈ మోరీకి నిధులు కేటాయించలేకపోతున్నారు. మా సమస్య పరిష్కరించినోళ్లకే ఈ ఎన్నికల్లో మద్దతు ఇస్తాం.

– ఎ.కొండయ్య, స్థానికుడు

ఆధ్యాత్మికం — సీతారాముల కల్యాణం



నగరంలోని కట్టారాంపూర్ అభయాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న తృతీయ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం సీతారామచంద్రస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సుదర్శన హోమం, వేదపారాయణ శాస్త్రోక్తంగా జరిపారు. ఈ కార్యక్రమంలో ఈవో నాగారపు శ్రీనివాస్, అర్చకులు కొమ్మెర రవిశర్మ, తాడూరి సుగుణాకర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు. కాగా గురువారం ఉదయం 10.30 గంటల నుంచి ఉత్సవ మూర్తులకు స్నపనం, అలంకారం, జరుపనున్నట్లు ఈవో నాగారపు శ్రీనివాస్ తెలిపారు. – కరీంనగర్‌కల్చరల్

నగరంలో వాహన తనిఖీలు

కరీంనగర్ క్రైం: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకునే ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా కరీంనగర్‌లోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు వీధుల్లో బుధవారం పోలీసులు, స్పెషల్ యాక్షన్ టీం ఆధ్వర్యంలో ఫూట్ మార్చ్, వాహన తనిఖీలు చేపట్టారు. గీతాభవన్ చౌరస్తా, గవర్నమెంట్ ఉమెన్స్ డిగ్రీ కళాశాల, కాశ్మీర్ గడ్డ, గోదాం గడ్డ, సప్తగిరికాలనీ పలు వీధుల్లో వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులను పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్, దర్పన్ అప్లికేషన్ ద్వారా తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీలు నరేందర్, టూ టౌన్ సీఐ రాంచందర్‌రావు, హెడ్‌క్వార్టర్ నుంచి స్పెషల్ యాక్షన్ టీంలు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు


ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

చొప్పదండి: రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ప్రలోభాలకు లొంగకుండా, ఎవరికీ భయపడొద్దని కరీంనగర్‌రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు కోరారు. పట్టణంలో బుధవారం బీఎస్ఎఫ్, పోలీసులతో కవాతు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై మార్కెట్ చౌరస్తాలో మాట్లాడారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముందస్తుగా బైండోవర్ అయిన వారు ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు రవీందర్, ఇంద్రసేనారెడ్డి, రాజ్‌కుమార్, ఎస్ఐలు ఉపేంద్రచారి, తిరుపతి, అభిలాశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై అవగాహన

శంకరపట్నం: మండలంలోని కరీంపేట, గద్దపాక గ్రామాల్లో బుధవారం బీఎస్ఎఫ్, పోలీసులు కవాతు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎస్సై లక్ష్మారెడ్డి గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: విద్యుత్ పనుల్లో భాగంగా గురువారం కరీంనగర్‌లోని 11కేవీ సంతోష్‌నగర్ ఫీడర్‌లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు న్యూ లేబర్ అడ్డా, సెయింట్ జాన్ స్కూల్ ఏరియా, శివ థియేటర్ ఏరియా, భాగ్యనగర్, జ్యోతినగర్‌లలో విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంతర్జాతీయ విద్యావేత్తల సదస్సుకు ప్రసాదరావు

కరీంనగర్: ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రంలో ఈనెల 26న వివిధ దేశాల విద్యావేత్తలతో నిర్వహించే సదస్సుకు కరీంనగర్‌కు చెందిన పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇ.ప్రసాద్‌రావుకు ఆహ్వానం అందింది. సదస్సుకు దక్షిణ ఆసియా ఖండం నుంచి 25 మంది ప్రముఖ విద్యావేత్తలను ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఈ విద్యావేత్తల బృందం విక్టోరియాలోని యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్, ఇంటర్నేషనల్ చాంబర్ ఆఫ్ కామర్స్, విక్టోరియా యూనివర్సిటీ, మోనష్ యూనివర్సిటీ, స్వీన్ బర్న్ యూనివర్సిటీ, లట్రోబ్ యూనివర్సిటీ, ఆర్ఎంఐటీ యూనివర్సిటీ, డీకిన్ యూనివర్సిటీ, బ్లాక్ బర్న్ హైస్కూల్ సందర్శించనున్నారు. తదుపరి విక్టోరియన్ ఎడ్యుటెక్ కంపెనీస్ ఇంటర్నేషనల్ చాంబర్‌లో జరిగే సమావేశంలో పాల్గొంటారు. పర్యటనలో భాగంగా విక్టోరియన్ గవర్నమెంట్, దక్షిణ ఆసియా విద్యావేత్తలు, ఆస్ట్రేలియా యూనివర్సిటీలు, దక్షిణ ఆసియా విద్యాసంస్థల పార్ట్‌నర్‌షిప్ అవకాశాలను అన్వేషిస్తారు. ఈమేరకు పారమిత పాఠశాలల అధినేత ఇ.ప్రసాదరావుకు పాఠశాలల డైరెక్టర్లు, ప్రసూన, రాకేశ్, రశ్మిత, అనుకర్‌రావు, వినోదరావు, వీయూఎం. ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవితప్రసాద్, శ్రీకర్, రితేష్ మెహత, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణతో పాటు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.



ప్రసాదరావు

విద్యార్థుల క్షేత్ర సందర్శన



గోపాల్‌పూర్‌లో వరిపొలంలో విద్యార్థులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌లోని పారమిత పాఠశాల నాల్గో తరగతి విద్యార్థులు క్షేత్రపర్యటనలో భాగంగా బుధవారం గోపాల్‌పూర్ గ్రామాన్ని సందర్శించారు. వరి, పత్తి తదితర పంటలు సాగు చేసే విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏ భూముల్లో ఏ పంటలు పండుతాయనని, చెక్‌డ్యామ్‌ను పరిశీలించి నీటిలో నివసించే జీవరాశులను తెలుసుకున్నారు. ఇంటర్ డిసిప్లినరీ లర్నింగ్‌లో భాగంగా నేర్చుకున్న విషయాలను నోట్‌బుక్‌లో రాసుకున్నారు. పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులను క్షేత్రపర్యటనకు తీసుకెళ్లినట్లు ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్, చైర్మన్ ఇ.ప్రసాద్‌రావు తెలిపారు.



పారా ఆర్చర్ శీతల్‌కు స్వర్ణం, రజతం

ఆసియా పారా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు నాలుగు స్వర్ణాలు, నాలుగు రజతాలు, ఒక కాంస్యంతో కలిపి మొత్తం తొమ్మిది పతకాలు లభించాయి. ఆసియా పారా గేమ్స్‌లో రెండు స్వర్ణాలు నెగ్గి అందరి ప్రశంసలు అందుకున్న శీతల్ దేవి ఆసియా చాంపియన్‌షిప్‌లోనూ రాణించింది. రెండు చేతులు లేకున్నా తన కాళ్లతో విల్లు ఎక్కుపెట్టి బాణాలు సంధించే శీతల్ ఈ టోర్నీలో మిక్స్‌డ్ టీమ్ విభాగంలో రాకేశ్‌తో కలిసి స్వర్ణం... వ్యక్తిగత విభాగంలో రజత పతకం సాధించింది. వ్యక్తిగత విభాగం ఫైనల్లో శీతల్ దేవి 'షూట్ ఆఫ్'లో సింగపూర్ ప్లేయర్ నూర్ సియాదా చేతిలో ఓడిపోయింది.

గిల్ 'టాప్ ర్యాంక్' పదిలం

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ శుబ్‌మన్ గిల్ తన టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో గిల్ 826 రేటింగ్ పాయింట్లతో తొలి స్థానంలో కొనసాగుతున్నాడు. పాకిస్తాన్ ప్లేయర్ బాబర్ ఆజమ్ 824 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. భారత స్టార్స్ కోహ్లి, రోహిత్ శర్మ ఒక్కో స్థానం మెరుగుపర్చుకున్నారు. కోహ్లి 791 పాయింట్లతో మూడో ర్యాంక్‌లో, రోహిత్ 769 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో నిలిచారు.



శ్రీకాంత్ పరాజయం



షెన్‌జెన్: చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత అగ్రశ్రేణి క్రీడాకారులు కిడాంబి శ్రీకాంత్, లక్ష్య సేన్, ప్రియాన్షు రజావత్‌లకు నిరాశ ఎదురైంది. ఈ ముగ్గురూ తొలి రౌండ్‌ను దాటలేకపోయారు. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 24వ ర్యాంకర్ శ్రీకాంత్ 15–21, 21–14, 13–21తో ప్రపంచ చాంపియన్ కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలయ్యాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో 17వ ర్యాంకర్ లక్ష్య సేన్ 19–21, 18–21తో ప్రపంచ ఏడో ర్యాంకర్ షి యు కి (చైనా) చేతిలో... 30వ ర్యాంకర్ ప్రియాన్షు 17–21, 14–21తో 13వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో పరాజయం పాలయ్యారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో రితూపర్ణ–శ్వేతపర్ణ (భారత్) ద్వయం 15–21, 9–21తో షు జియాన్ జాంగ్–యు జెంగ్ (చైనా) జోడీ చేతిలో ఓడిపోయింది.

ప్రాంజల శుభారంభం



బెంగళూరు: మహిళల ప్రపంచ టెన్నిస్ టూర్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి యడ్లపల్లి ప్రాంజల శుభారంభం చేసింది. బుధవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో 24 ఏళ్ల ప్రాంజల 6–1, 6–0తో భారత్‌కే చెందిన వన్షిత్‌పై నెగ్గింది. ఏడాదిన్నర తర్వాత మళ్లీ అంతర్జాతీయ టోర్నీలో ఆడుతున్న ప్రాంజల ఈ మ్యాచ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది.

బ్రెజిల్ తొలిసారి...

రియో డి జనీరో: ఫుట్‌బాల్ ప్రపంచకప్–2026 దక్షిణ అమెరికా జోన్ క్వాలిఫయింగ్ పోటీల్లో ఐదుసార్లు విశ్వవిజేత బ్రెజిల్ జట్టుకు పరాజయం ఎదురైంది. మెస్సీ సారథ్యంలోని ప్రస్తుత ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా 1–0 గోల్ తేడాతో బ్రెజిల్ జట్టును ఓడించింది. ఆట 63వ నిమిషంలో నికోలస్ ఒటామెండి హెడర్ షాట్‌తో గోల్ సాధించి అర్జెంటీనా విజయంలో కీలకపాత్ర పోషించాడు. స్వదేశంలో ప్రపంచకప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో బ్రెజిల్ జట్టు ఓడిపోవడం ఇదే తొలిసారి.

మళ్లీ కొత్తగా మొదలు...

నేటి నుంచి భారత్, ఆస్ట్రేలియా టి20 సిరీస్

విశాఖలో తొలి పోరు	టీమిండియా కుర్రాళ్ల సత్తాకు పరీక్ష	రాత్రి 7 గంటల నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

వరల్డ్‌కప్ ఫైనల్లో ఓటమి తర్వాత నాలుగు రోజులకే ఆస్ట్రేలియాతో మరో పోరులో భారత్ ఆడాల్సి వస్తుందని ఎవరైనా ఊహించారా? కానీ ఇప్పుడు ఇరు జట్లు మళ్లీ తలపడేందుకు సిద్ధమయ్యాయి. 2023లో భారత గడ్డపై ఆస్ట్రేలియా రెండు వేర్వేరు సందర్భాల్లో రెండు వన్డే సిరీస్‌లు, ఒక టెస్టు సిరీస్ ఆడగా... వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో, ఇటీవల వన్డే వరల్డ్‌కప్ తొలి మ్యాచ్, చివరి మ్యాచ్‌లో ఈ రెండు టీమ్‌లు 'ఢీ'కొన్నాయి. ఈ నేపథ్యంలో ఏకంగా ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్ జరగబోతోంది. స్టార్ ఆటగాళ్లు కాకుండా ఎక్కువ మంది కుర్రాళ్లతోనే టీమిండియా బరిలోకి దిగుతుండగా, ఆసీస్ కూడా పలువురు కీలక ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చింది.



స్టొయినిస్, హెడ్, అబాట్

సాక్షి, విశాఖపట్నం: వన్డే వరల్డ్‌కప్ తర్వాత భారత్, ఆస్ట్రేలియా టి20 సమరానికి సన్నద్ధమయ్యాయి. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు వైఎస్‌ఆర్–ఏసీఏ–వీడీసీఏ మైదానంలో జరిగే తొలి టి20లో ఇరు జట్లు తలపడనున్నాయి. మామూలుగా అయితే ఈ టి20 సిరీస్‌కు పెద్దగా ప్రాధాన్యత లేదు. అయితే వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్‌కు ముందు ఈ ఫార్మాట్‌లో ఇరు జట్లు మొత్తం 11 టి20 మ్యాచ్‌లు మాత్రమే ఆడనున్నాయి. ఈ సిరీస్ మ్యాచ్‌లు కూడా అందులో భాగమే కాబట్టి రెండు టీమ్‌లూ తుది కూర్పులపై దృష్టి పెట్టాయి. మాజీ క్రికెటర్, జాతీయ క్రికెట్ అకాడమీ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ ఈ సిరీస్‌కు తాత్కాలిక కోచ్‌గా వ్యవహరించనున్నాడు.

కొత్త కెప్టెన్ ఆధ్వర్యంలో...

ప్రస్తుత సిరీస్‌కు ముందు భారత జట్టు బలహీన వెస్టిండీస్, ఐర్లాండ్‌లతోనే టి20 సిరీస్‌లు ఆడింది. మరోవైపు ఏమాత్రం పోటీ లేని ఆసియా క్రీడల్లో కూడా పాల్గొని స్వర్ణం సాధించింది. ఈ నేపథ్యంలో వరల్డ్‌కప్ ఆడిన ఆటగాళ్లలో ముగ్గురినే భారత్ ఈ సిరీస్ కోసం ఎంపిక చేసింది. కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ తొలిసారి బాధ్యతలు చేపట్టగా... ఇషాన్ కిషన్, వన్డే ప్రపంచకప్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడని ప్రసిధ్ కృష్ణ టీమ్‌లో ఉన్నారు. ఓపెనర్‌గా ఇషాన్ కిషన్ సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నా... ఇప్పటికే యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్ రూపంలో ఇద్దరు ఓపెనర్లు ఉన్నారు. వీరిలో ఎవరిని పక్కన పెడతారనేది చూడాలి. మిడిలార్డర్‌లో హైదరాబాద్ ప్లేయర్ ఠాకూర్ తిలక్ వర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్ చెలరేగాలని పట్టుదలగా ఉన్నారు. చివరి నిమిషంలో గాయంతో అనూహ్యంగా ప్రపంచకప్‌కు దూరమైన అక్షర్ పటేల్ ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగడం ఖాయం. రవి బిష్ణోయ్ రూపంలో లెగ్‌స్పిన్నర్ జట్టుకు అందుబాటులో ఉన్నాడు.

సీనియర్లు అండగా...

కమిన్స్, వార్నర్ వంటి స్టార్లకు ఆస్ట్రేలియా విశ్రాంతినిస్తూ ఈ సిరీస్ నుంచి తప్పించినా... ప్రస్తుతం ఆసీస్ టీమ్ కూడా బలంగానే ఉంది. వన్డే వరల్డ్‌కప్ టీమ్‌లో ఉన్న ఏడుగురు ఈ సిరీస్ కోసం భారత్‌లోనే ఆగిపోయారు. ఫైనల్ ఆడిన స్మిత్, ఇన్‌గ్లిస్ ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగే అవకాశం ఉండగా... ట్రవిస్ హెడ్, మ్యాక్స్‌వెల్, ఆడమ్ జంపా విశ్రాంతి తీసుకోనున్నారు. స్మిత్ ఓపెనింగ్ చేసే అవకాశం ఉంది. టిమ్ డేవిడ్, స్టొయినిస్ చూపించే విధ్వంసం భారత జట్టుకు అనుభవమే. బౌలింగ్‌లో బెహ్రెన్‌డార్ఫ్‌కు భారత గడ్డపై అనుభవం ఉంది. తన్వీర్ సంఘా ఏకైక స్పిన్నర్‌గా ఆడతాడు.



సూర్యకుమార్

పిచ్, వాతావరణం

వైజాగ్ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. ఇక్కడ జరిగిన 3 టి20ల్లోనూ చెప్పుకోతగ్గ స్కోర్లు నమోదయ్యాయి. మ్యాచ్ రోజు కొన్ని చిరుజల్లులకు అవకాశం ఉన్నా... ఆటకు ఇబ్బంది ఉండకపోవచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), ఇషాన్ కిషన్, యశస్వి/రుతురాజ్, తిలక్ వర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, అర్‌్షదీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ, ముకేశ్ కుమార్.

ఆస్ట్రేలియా: మాథ్యూ వేడ్ (కెప్టెన్), స్మిత్, షార్ట్, హార్డీ, ఇన్‌గ్లిస్, స్టొయినిస్, టిమ్ డేవిడ్, సీన్ అబాట్, ఎలిస్, బెహ్రెన్‌డార్ఫ్, తన్వీర్ సంఘా.

26 భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఇప్పటి వరకు 26 టి20 మ్యాచ్‌లు జరిగాయి. 15 మ్యాచ్‌ల్లో భారత్, 10 మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా గెలిచాయి. ఒక మ్యాచ్ రద్దయింది. స్వదేశంలో ఆస్ట్రేలియాతో 10 మ్యాచ్‌లు ఆడిన భారత్ 6 మ్యాచ్‌ల్లో గెలిచి, 4 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

3 విశాఖపట్నంలో భారత జట్టు ఇప్పటి వరకు మూడు అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో రెండింటిలో (2016లో శ్రీలంకపై; 2022లో దక్షిణాఫ్రికాపై) గెలిచి, ఒక మ్యాచ్‌లో (2019లో ఆస్ట్రేలియా) చేతిలో ఓడిపోయింది.

మళ్లీ కేకేఆర్ చెంతకు గంభీర్

టీమ్ మెంటార్‌గా నియామకం

కోల్‌కతా: ఐపీఎల్‌లో సారథిగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు రెండు టైటిల్స్ అందించిన మాజీ కెప్టెన్ గౌతమ్ గంభీర్ ఇప్పుడు మరోసారి ఆ జట్టుతో కలిసి పని చేయనున్నాడు. 2024 సీజన్ నుంచి కేకేఆర్ టీమ్‌కు గంభీర్ మెంటార్‌గా వ్యవహరించనున్నట్లు ఫ్రాంచైజీ ప్రకటించింది. టీమ్ కోచ్ చంద్రకాంత్ పండిత్‌తో కలిసి అతను పని చేస్తాడని పేర్కొంది. బాలీవుడ్ హీరో షారుఖ్ ఖాన్ సహ యజమానిగా ఉన్న నైట్‌రైడర్స్ జట్టుకు గంభీర్ 2011 నుంచి 2017 వరకు ఏడు సీజన్ల పాటు కెప్టెన్‌గా ఉన్నాడు. ఈ సమయంలో కోల్‌కతా జట్టు ఐదుసార్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించగా... 2012, 2014లలో విజేతగా నిలిచింది. భారత క్రికెట్ జట్టు రెండు వరల్డ్‌కప్ విజయాల్లో (2007 టి20, 2011 వన్డే) కీలకపాత్ర పోషించిన గంభీర్, గత రెండు సీజన్లుగా లక్నో సూపర్ జెయింట్స్‌కు మెంటార్‌గా వ్యవహరించాడు.



ఐపీఎల్ ట్రోఫీతో షారుఖ్, గౌతమ్ గంభీర్ (ఫైల్)

రాజస్తాన్‌కు అవేశ్... లక్నోకు దేవదత్






కొత్త ఐపీఎల్ సీజన్‌కు ముందు జరిగే 'ట్రేడింగ్'లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్, రాజస్తాన్ రాయల్స్ జట్లు పరస్పరం ఆటగాళ్లను మార్చుకున్నాయి. లక్నో తరఫున ఆడిన పేస్ బౌలర్ అవేశ్ ఖాన్‌ను రాజస్తాన్ రాయల్స్ తీసుకుంది. అతనికి బదులుగా రాజస్తాన్ టీమ్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ లక్నో సూపర్ జెయింట్స్‌తో జట్టుతో చేరాడు. రెండు సీజన్లపాటు (2022, 2023) లక్నో తరఫున ఆడిన అవేశ్ ఖాన్ 22 మ్యాచ్‌ల్లో బరిలోకి దిగి 26 వికెట్లు పడగొట్టాడు. రెండు సీజన్లపాటు రాజస్తాన్ రాయల్స్ జట్టుకు ఆడిన దేవదత్ 28 మ్యాచ్‌ల్లో బరిలోకి దిగి మూడు అర్ధ సెంచరీలతో కలిపి మొత్తం 637 పరుగులు సాధించాడు. మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తమ ఇద్దరు ఆటగాళ్లు మనీశ్ పాండే, సర్ఫరాజ్ ఖాన్‌లను విడుదల చేసింది.

సినిమా

నో ప్రాబ్లమ్... రానివ్వండి!



'తండేల్'లో నాగచైతన్య

"నటుడిగా ఇంకా చాలా పాత్రలు చేయాలి.. నటనపరంగా ఇంకా ఎదగడానికి కృషి చేస్తూనే ఉంటాను. ఇన్నేళ్ల కెరీర్‌లో జయాపజయాలు చూశాను. అన్నింటినుంచీ ఏదో ఒకటి నేర్చుకున్నాను. అయితే నటుడిగా సంతృప్తి దక్కలేదు. ఇంకా చాలా సాధించాలి" అని హీరో నాగచైతన్య అన్నారు. నేడు (నవంబర్ 23) ఈ హీరో బర్త్‌డే. నాగచైతన్య హీరో అయి పద్నాలుగేళ్లు అవుతోంది. ఇక ఈ పుట్టినరోజు స్పెషల్ ఏంటంటే.. 'దూత' సిరీస్‌తో తొలిసారి వెబ్ వరల్డ్‌లోకి అడుగు పెడుతున్నారు. ఆ విశేషాలు, ఇంకా ఇతర విశేషాలను నాగచైతన్య ఈ విధంగా పంచుకున్నారు.

ముందుగా బర్త్‌డే స్పెషల్ గురించి..

బర్త్‌డే గ్రాండ్‌గా జరుపుకోవడం ఉండదు. ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో స్పెండ్ చేద్దామనుకుంటున్నా. నేను చేసిన ఫస్ట్ వెబ్ సిరీస్ 'దూత' ట్రైలర్ విడుదలవుతోంది. అలాగే చందు మొండేటి డైరెక్షన్‌లో చేసే సినిమాకి 'తండేల్' టైటిల్ ఫిక్స్ చేసి, లుక్ రిలీజ్ చేశాం. నా బర్త్‌డే స్పెషల్స్ ఇవే.

'దూత' సిరీస్ గురించి..

డిసెంబర్ 1 నుంచి ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది. వెబ్ సిరీస్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వస్తోంది. అందుకే మంచి వెబ్ సిరీస్ చేయాలనుకున్నాను. నాకు విక్రమ్ కె. కుమార్ చేసిన సూపర్ నేచురల్ థ్రిల్లర్ '13 బి, 24', కొంతవరకూ ఆ తరహాలో ఉన్న 'మనం' వంటివి చాలా ఇష్టం. '24' సినిమా లాంటి కాన్సెప్ట్ అయితే సిరీస్ చేద్దామనుకున్నాను. విక్రమ్ ఆ తరహాలో 'దూత' లాంటి యూనిక్ కాన్సెప్ట్‌తో వచ్చారు. అయితే వెబ్ సిరీస్ అని చెప్పలేదు. కానీ ఈ కాన్సెప్ట్‌ని రెండున్నర గంటల్లో చెప్పలేం. అందుకే సిరీస్‌గా చేశాం. సినిమాకీ, సిరీస్‌కీ నటనపరంగా వ్యత్యాసం లేదు. కానీ టెక్నికల్‌గా నాకో కొత్త అనుభవం. 'దూత'కి సీజన్ 2, సీజన్ 3 ఐడియాలు ఉన్నాయి.

చందు మొండేటి డైరెక్షన్‌లో చేసే 'తండేల్' సినిమా కోసం ఎక్కువ టైమ్ కేటాయిస్తున్నారు...

మా టీమ్ మొత్తానికి ఇది స్పెషల్ ప్రాజెక్ట్. రెగ్యులర్ షూటింగ్‌ని డిసెంబర్‌లో ఆరంభిస్తాం. కానీ ఆరేడు నెలలుగా ఈ సినిమాతోనే ట్రావెల్ అవుతున్నా. ఈ చిత్రంలో నేను మత్స్యకారుడి పాత్ర చేస్తున్నాను. శ్రీకాకుళం బ్యాక్‌డ్రాప్ కాబట్టి అవగాహన కోసం శ్రీకాకుళంలోని ఓ గ్రామానికి వెళ్లాం. శ్రీకాకుళం స్లాంగ్ నేర్చుకుంటున్నా. ఫిషర్‌మేన్‌గా కనిపించడం కోసం ఫిజికల్‌గా మేకోవర్ అయ్యాను. అలాగే ఫిషర్‌మేన్ బాడీ లాంగ్వేజ్ కోసం మూడు నెలలు కృషి చేశాను. ఎప్పుడెప్పుడు షూటింగ్‌కి వెళదామా అని వేచి చేస్తున్నా.

ఇంతకుముందు ఏ సినిమాకీ ఇంత వర్కవుట్ చేయలేదు కదా..

'తండేల్' పెద్ద స్పాన్ ఉన్న కథ. అందుకే షూటింగ్ ఆరంభించక ముందే ఎక్కువ టైమ్ కేటాయించాను. చందుతో పాటు నిర్మాతలు అల్లు అరవింద్‌గారు, 'బన్నీ' వాసుగారు ఈ కథను చాలా నమ్మారు. నా కెరీర్‌లో పెద్ద బడ్జెట్ మూవీ అవుతుంది. కథ కొంత భాగం ఇండియా, కొంత పాకిస్తాన్‌లో జరుగుతుంది.

ఓ వ్యక్తిని స్ఫూర్తిగా తీసుకుని చందు మీ క్యారెక్టర్‌ని క్రియేట్ చేశారట...

అవును. నేనా వ్యక్తిని కలిసి, మాట్లాడాను. ఓ ఫిషర్‌మేన్ లైఫ్‌లో జరిగిన కొన్ని ఘటనలను సినిమాటిక్‌గా చూపించనున్నాం.


అక్కినేని ఫ్యామిలీకి ప్రేమకథలు లక్కీ.. 'తండేల్' ప్రధానంగా ప్రేమకథా చిత్రం కదా..

అవును. ఈ చిత్రంలో అద్భుతమైన ప్రేమకథ ఉంది. ఈ మధ్యకాలంలో నేను చేసిన చిత్రాల్లో ప్రేమ పార్ట్ అంతగా లేదు. ఆ విషయాన్ని ఫీలయ్యాను. అందుకే ఈసారి ప్యూర్ లవ్‌స్టోరీ చేద్దామనుకున్నాను. 'తండేల్' అలాంటి చిత్రమే.

ఇక ఈ మధ్య ఓ హీరోయిన్‌తో మిమ్మల్ని లింక్ అప్ చేసి వార్తలు వస్తున్నాయి.. ఏమంటారు?

రానివ్వండి... నో ప్రాబ్లమ్ (నవ్వుతూ). ఇలాంటి వాటి గురించి ఏం చెప్పినా.. ఎంత చెప్పినా ఆగవు. ఇక పర్సనల్ స్పేస్‌లో నేను చాలా హ్యాపీగా ఉన్నాను. ఏదైనా చెప్పాల్సినది జరిగితే నేనే చెబుతాను.

హీరోల కష్టం అర్థమైంది - తేజ్ బొమ్మదేవర



"ప్రేమ, వినోదం, థ్రిల్.. ఇలా అన్ని వాణిజ్య అంశాలతో రూపొందిన చిత్రం 'మాధవే మధుసూదన'. మంచి కథ. తెలుగులో ఓ కొత్త జానర్‌లా అనిపిస్తుంది'' అన్నారు తేజ్ బొమ్మదేవర. ఆయన హీరోగా, రిషికా లోక్రే హీరోయిన్‌గా నటించిన చిత్రం 'మాధవే మధుసూదన'. బొమ్మదేవర శ్రీదేవి సమర్పణలో బొమ్మదేవర రామచంద్ర రావు స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ మూవీ రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా తేజ్ బొమ్మదేవర మాట్లాడుతూ– ''బీబీఏ పూర్తి చేసి, విదేశాలకు వెళ్లి ఎంబీఏ చేద్దామనుకున్నా. అయితే కరోనా వల్ల ఆగిపోయాను. మా నాన్న రామచంద్ర రావు ఆ సమయంలో 'మాధవే..' కథను రెడీ చేసుకున్నారు. భిక్షు మాస్టర్ వద్ద నటనలో శిక్షణ తీసుకుని, ఈ సినిమా చేశాను. హీరోలు వేదికలపై మాట్లాడుతూ అప్పుడప్పుడు తడబడుతుంటే ఏదో అనుకునేవాణ్ని. కానీ వారి కష్టం ఎలా ఉంటుందో నాకు అర్థం అయింది. హీరోగానే కాదు.. ఎలాంటి పాత్రలు వచ్చినా చేస్తాను'' అన్నారు.

ఎక్స్‌ట్రార్డినరీ సాంగ్



నితిన్, శ్రీలీల

ఎక్స్‌ట్రార్డినరీ లెవల్‌లో డ్యాన్స్ చేశారు నితిన్. వక్కంతం వంశీ దర్శకత్వంలో నితిన్, శ్రీలీల జంటగా నటిస్తున్న చిత్రం 'ఎక్స్‌ట్రా: ఆర్డినరీ మ్యాన్'. రాజశేఖర్ ఓ కీలక పాత్రధారి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ శివార్లలో జరుగుతోంది. ఓ భారీ సెట్‌లో 300 మందికి పైగా ఫారిన్ డ్యాన్సర్స్‌తో జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో నితిన్, శ్రీలీలపై ఓ మాస్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ పాటతో ఈ సినిమా చిత్రీకరణ పూర్తవుతుందని, మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయని యూనిట్ పేర్కొంది. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్యా మూవీస్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై ఎన్. సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 8న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: హ్యారిస్ జైరాజ్.

నటుడికి సంతృప్తి అనేది ఉండదు - శ్రీకాంత్



"ఈ మధ్య కాలంలో నేను పూర్తి స్థాయి పాత్ర చేసిన చిత్రం 'కోట బొమ్మాళి'. నటనకి చాలా స్కోప్ ఉన్న పాత్ర. అంతకు ముందు నేను చేసిన సినిమాల్లో పాటలు, ఫైట్స్.. ఇలా వాణిజ్య అంశాలు ఉన్నాయి. 'కోట బొమ్మాళి'లో చక్కటి ఫ్యామిలీ డ్రామా కూడా ఉంటుంది" అని శ్రీకాంత్ అన్నారు. రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ జంటగా శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో గీతా ఆర్ట్స్ 2 బ్యానర్‌పై 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా శ్రీకాంత్ చెప్పిన విశేషాలు.

- 'కోట బొమ్మాళి' వైవిధ్యమైన కథ. ఎక్కడైనా క్రిమినల్స్‌ని పోలీసులు వెంటాడి పట్టుకుంటారు. ఈ సినిమాలో పోలీసులే పోలీసులను వెంటాడటం ఆసక్తిగా ఉంటుంది. రాజకీయ నాయకులు పోలీసులను ఎలా వాడుకుంటారు? దాని వల్ల పోలీసులకు ఎదురైన ఇబ్బందులు ఏంటి? తమ ఓట్ల కోసం కులాలను, మతాలను రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకుంటారు? అనేది ఈ చిత్రం ప్రధాన కథాంశం. ఈ సినిమాలో ఎలాంటి పొలిటికల్ సెటైర్ ఉండదు. అయితే ప్రస్తుతం వ్యవస్థలో జరుగుతున్నది చూపించాడు దర్శకుడు తేజ.
- ఓ మధ్య తరగతి హెడ్ కానిస్టేబుల్ ఇంట్లో ఎలాంటి వాతావరణం ఉంటుందన్నది ఈ మూవీలో ఆసక్తిగా ఉంటుంది. నేను హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ పాత్ర చేశాను. నా పాత్ర, రాహుల్, శివాని.. మా ముగ్గురి పాత్రల మధ్య కథ తిరుగుతుంటుంది. మా పై అధికారి వరలక్ష్మి మమ్మల్ని పట్టుకోవడానికి వేసే ఎత్తులకు నేను వేసే పై ఎత్తులు ఆసక్తిగా ఉంటాయి.
- దాదాపు 32 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో పాత్రలు చేశాను. ఎన్ని చేసినా ఓ నటుడికి సంతృప్తి ఉండదు.. ఇంకా వైవిధ్యమైన పాత్రలు చేయాలనే ఆరాటం ఉంటుంది. ప్రస్తుతం రామ్‌చరణ్‌తో 'గేమ్ చేంజర్', ఎన్టీఆర్‌తో 'దేవర', మోహన్‌లాల్, మా అబ్బాయి రోషన్ నటిస్తున్న 'వృషభ' సినిమాల్లో కీ రోల్స్ చేస్తున్నాను.

అడ్డా డేట్ ఫిక్స్



ఉపేంద్ర, సావిత్రి


కంచర్ల ఉపేంద్ర, సావిత్రీ కృష్ణ జంటగా ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఉపేంద్ర గాడి అడ్డా'. కంచర్ల అచ్యుతరావు నిర్మించిన ఈ సినిమాని డిసెంబర్ 1న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. తెలుగు నిర్మాతల మండలి అధ్యక్షుడు, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్ ఈ మూవీ ట్రైలర్‌ను విడుదల చేశారు. కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ– ''తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో డిసెంబర్ 1న సినిమాను రిలీజ్ చేయబోతున్నాం'' అన్నారు. ''మాస్, వినోదానికి సందేశాన్ని మిళితం చేసి ఈ సినిమా తీశాం. ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది'' అన్నారు కంచర్ల ఉపేంద్ర, ఆర్యన్ సుభాన్ ఎస్‌కే.

మాకు అన్ని పార్టీల మద్దతు ఉంటుంది - వీజే సన్నీ

''నాకు వినోదాత్మక చిత్రాలంటే చాలా ఇష్టం. 'సౌండ్ పార్టీ' సినిమా ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది. సినిమా చూసిన ప్రేక్షకులు నిరుత్సాహపడరు. ఎన్నికల టైమ్‌లో వస్తున్న మా 'సౌండ్ పార్టీ'కి అన్ని పార్టీల మద్దతు ఉంటుంది (నవ్వుతూ)'' అని హీరో వీజే సన్నీ అన్నారు. సంజయ్ శేరి దర్శకత్వంలో వీజే సన్నీ, హ్రితికా శ్రీనివాస్ జంటగా నటించిన చిత్రం 'సౌండ్ పార్టీ'. జయ శంకర్ సమర్పణలో రవి పొలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీశ్యామ్ గజేంద్ర నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా వీజే సన్ని మాట్లాడుతూ– ''బిగ్ బాస్ 5' సీజన్ తర్వాత నేను చేసిన బెస్ట్ ప్రాజెక్ట్ 'సౌండ్ పార్టీ'. తండ్రీ కొడుకుల మధ్య ఉండే స్నేహం, త్వరగా డబ్బులు సంపాదించడం కోసం వారిద్దరూ ఏం చేశారు? అనేది ఈ సినిమాలో ఆసక్తిగా ఉంటుంది. సంజయ్ శేరిగారు నాకు చెప్పిన కథని అలాగే తెరపైకి తీసుకొచ్చారు. ప్రయోగాత్మక పాత్రలతో ప్రేక్షకులకు మరింత దగ్గర కావాలన్నదే నా లక్ష్యం'' అన్నారు.



కిల్లర్.. కిల్లర్...



ధనుష్

ధనుష్ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్, ప్రియాంకా మోహన్, సందీప్ కిషన్ కీలక పాత్రలు చేస్తున్నారు. టీజీ త్యాగ రాజన్ సమర్పణలో జి. శరవణన్, సాయి సిద్ధార్థ్ నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని తొలి పాట 'కిల్లర్.. కిల్లర్...'ని విడుదల చేశారు. ఈ పాటకి రాకేందు మౌళి సాహిత్యం అందించగా, హేమచంద్రతో కలసి ధనుష్ స్వయంగా పాడారు. ''1930–40 నేపథ్యంలో రూపొందుతోన్న పీరియాడికల్ ఫిల్మ్ 'కెప్టెన్ మిల్లర్'. ధనుష్ కెరీర్‌లో అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కుతోంది. 2024 సంక్రాంతికి తెలుగు, తమిళ,, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

మధ్యతరగతి నేపథ్యంలో...

నటుడు రాజా రవీంద్ర ప్రధాన పాత్రలో పద్మారావు అబ్బిశెట్టి (పండు) దర్శకత్వం వహించిన చిత్రం 'సారంగదరియా'. చల్లపల్లి చలపతిరావు ఆశీస్సులతో ఉమాదేవి–శరత్ చంద్ర నిర్మించారు. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్‌ని హీరో రాజ్ తరుణ్ విడుదల చేసి, ''సినిమా మంచి విజయం సాధించాలి'' అన్నారు. ''త్వరలో మూవీ విడుదలకి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు శరత్ చంద్ర. ''ఒక మధ్యతరగతి కుటుంబంలో జరిగిన కొన్ని ఘర్షణలతో ఈ కథ ఉంటుంది'' అన్నారు పద్మారావు అబ్బిశెట్టి. ఈ చిత్రానికి సంగీతం: ఎం. ఎబెనెజర్ పాల్, కెమెరా: సిద్ధార్థ స్వయంభు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అరుణాచల మహేశ్.



'సారంగదరియా' పోస్టర్

సాక్షి బిజినెస్
గురువారం
23-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
92	28
66,023	19,812

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	14,296	▲	96
డోజోన్స్	35,285	▲	197
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,469	▼	12
డాక్స్	15,958	▲	57
షాంఘై	3,044	▼	24
నికాయ్	33,452	▲	98

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,616	▲	366
బంగారం (99.5 స్వచ్ఛత)	61,369	▲	366
వెండి (కిలో)	73,465	▲	736

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.48	84.75
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	102.53	106.11
€	యూరో	ఒకటి	88.92	92.02
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.85	55.59
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.57	54.69
S$	సింగపూర్ డాలర్	ఒకటి	54.31	56.78
SAR	సౌదీ రియాల్	[illegible]	21.27	22.11
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	22.76	24.59
¥	చైనా యువాన్	[illegible]	10.49	12.49

ఒడిదుడుకులున్నా స్వల్పలాభాలు

19,800 స్థాయి పైకి నిఫ్టీ



ముంబై: ట్రేడింగ్‌లో తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు బుధవారం స్వల్పలాభాలతో గట్టెక్కాయి. అధిక వెయిటేజీ టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు ఒకశాతం రాణించి సూచీలను నష్టాల నుంచి గట్టెక్కించాయి. అయితే విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల పరిణామం లాభాలను పరిమితం చేశా యి. ఇంట్రాడేలో 398 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 92 పాయింట్లు పెరిగి 66,023 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 122 పాయింట్ల రేంజ్‌లో ట్రేడైంది.28 పాయింట్ల లాభంతో 19,812 వద్ద నిలిచింది. స్వల్ప లాభంతో మొదలైన సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో ఊగిసలాటకు లోనయ్యాయి. విద్యుత్, ఆటో, ఐటీ, ఎఫ్ఎంసీజీ, క్యాపిటల్ గూడ్స్, ఇంధన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. కమోడిటీ, ఫైనాన్షియల్, టెలికం, బ్యాంకుల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

హైదరాబాద్‌లో యూఎస్‌టీ కొత్త సెంటర్ ప్రారంభం



ముంబై: డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్స్ సంస్థ యూఎస్‌టీ హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ టెక్ పార్క్‌లో కొత్తగా అధునాతన సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ప్రస్తుతం ఈ సెంటర్‌లో 2,000 మంది పైచిలుకు సిబ్బంది ఉండగా.. వచ్చే మూడేళ్లలో 4,000కు పెంచుకోనున్నట్లు సంస్థ సీఈవో కృష్ణ సుధీంద్ర తెలిపారు. 1,18,000 చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ సెంటర్‌లో టెలికం, హైటెక్, రిటైల్, బీమా తదితర రంగాలకు సంబంధించి పరిశోధన కార్యకలాపాలు నిర్వహిస్తారు. కొత్త సెంటర్ ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ మొదలైన సాంకేతికతలపై దృష్టి పెడుతుందని సుధీంద్ర వివరించారు. కంపెనీకి దేశీయంగా ఇది నాలుగో డెవలప్‌మెంట్ సెంటర్. యూఎస్‌టీకి భారత్‌లో 15,000 మంది, అంతర్జాతీయంగానూ దాదాపు అదే స్థాయిలో ఉద్యోగులు ఉన్నారు.

ఐపీవో.. హాట్ కేక్!



ఇన్వెస్టర్ల క్యూ...
- తొలి రోజే ఓవర్‌సబ్‌స్క్రిప్షన్

దేశీ స్టాక్ మార్కెట్లు హెచ్చుతగ్గులు చవిచూస్తున్నప్పటికీ ఇటీవల ప్రైమరీ మార్కెట్లు కొత్త ఇష్యూలతో కళకళలాడుతున్నాయి. ఇన్వెస్టర్లు పెట్టుబడులకు ఆసక్తి చూపుతుండటంతో పలు కంపెనీలు లిస్టింగ్ బాట పడుతున్నాయి. తాజాగా టాటా టెక్నాలజీస్, గాంధార్ ఆయిల్ రిఫైనరీ, ఫ్లెయిర్ రైటింగ్ ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూలు ప్రారంభంకాగా.. తొలి రోజే అధిక స్థాయిలో స్పందన లభించడం గమనార్హం! వివరాలు ఇలా...

టాటా టెక్నాలజీస్




న్యూఢిల్లీ: ఇంజనీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ డిజిటల్ సర్వీసుల టాటా గ్రూప్ కంపెనీ టాటా టెక్నాలజీస్ ఐపీవో తొలి రోజే అధిక సబ్‌స్క్రిప్షన్‌ను సాధించింది. ఇన్వెస్టర్లు క్యూ కట్టడంతో ప్రారంభమైన వెంటనే భారీగా బిడ్స్ దాఖలయ్యాయి. షేరుకి రూ. 475–500 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూకి 6.5 రెట్లు అధికంగా స్పందన నమోదైంది. కంపెనీ 4.5 కోట్లకుపైగా షేర్లను ఆఫర్ చేయగా.. 29.43 కోట్లకుపైగా షేర్ల కోసం దరఖాస్తులు లభించాయి. వెరసి 24న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 3,043 కోట్ల వరకూ అందుకోనుంది. టీసీఎస్(2004) తదుపరి రెండు దశాబ్దాలకు టాటా గ్రూప్ నుంచి వస్తున్న ఐపీవోకాగా.. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 4 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 11.7 రెట్లు, రిటైలర్ల నుంచి 5.4 రెట్ల చొప్పున బిడ్స్ దాఖలయ్యాయి. ఇష్యూలో భాగంగా మంగళవారం(21న) యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 791 కోట్లు సమీకరించిన విషయం విదితమే. మొత్తం 6.08 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా.. వీటిలో మాతృ సంస్థ టాటా మోటార్స్ 4.63 కోట్ల షేర్లను ఆఫర్ చేస్తోంది.

ఫ్లెయిర్ రైటింగ్



పెన్నులు, స్టేషనరీ ప్రొడక్టుల తయారీ కంపెనీ ఫ్లెయిర్ రైటింగ్ ఇండస్ట్రీస్ ఐపీవో తొలి రోజే పూర్తి సబ్‌స్క్రిప్షన్‌ను సాధించింది. షేరుకి రూ. 288–304 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూకి 2.17 రెట్లు అధిక స్పందన నమోదైంది. కంపెనీ 1.44 కోట్లకుపైగా షేర్లను ఆఫర్ చేయగా.. 3.13 కోట్లకు పైగా షేర్లకు దరఖాస్తులు వచ్చాయి. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 53%, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 2.78 రెట్లు, రిటైలర్ల నుంచి 2.86 రెట్లు చొప్పున బిడ్స్ దాఖలయ్యాయి. ఇష్యూలో భాగంగా రూ. 292 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. మరో రూ. 301 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ గ్రూప్ సంస్థలు విక్రయానికి ఉంచాయి. 24న ముగిసే ఇష్యూ ద్వారా రూ. 501 కోట్ల వరకూ అందుకోనుంది.

గాంధార్ ఆయిల్



ప్రైవేట్ రంగ కంపెనీ గాంధార్ ఆయిల్ రిఫైనరీ(ఇండియా) ఐపీవో తొలి రోజే అధిక సబ్‌స్క్రిప్షన్‌ను సాధించింది. షేరుకి రూ. 160–169 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూకి 5.5 రెట్లు అధికంగా స్పందన నమోదైంది. కంపెనీ 2.12 కోట్లకుపైగా షేర్లను ఆఫర్ చేయగా.. 11.72 కోట్లకుపైగా షేర్ల కోసం దరఖాస్తులు లభించాయి. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 1.3 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 7.7 రెట్లు, రిటైలర్ల నుంచి 6.9 రెట్ల చొప్పున బిడ్స్ దాఖలయ్యాయి. 24న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 501 కోట్లవరకూ అందుకోనుంది. ఇష్యూలో భాగంగా రూ. 302 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి అదనంగా 1.17 కోట్లకుపైగా షేర్లను విక్రయానికి ఉంచింది.

ఏపీలో ఈప్యాక్ ప్రీఫ్యాబ్ ప్లాంటు ప్రారంభం..

రూ. 198 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు



న్యూఢిల్లీ: ప్రీ–ఇంజనీర్డ్ స్ట్రక్చర్స్ తయారీ సంస్థ ఈప్యాక్ ప్రీఫ్యాబ్ తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో తమ కొత్త ప్లాంటును ప్రారంభించినట్లు వెల్లడించింది. తిరుపతి జిల్లా తడ వద్ద 24 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్లాంటును రూ. 198 కోట్లతో ఏర్పాటు చేసినట్లు వివరించింది. దీని వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 87,000 మెట్రిక్ టన్నులుగా ఉంటుందని పేర్కొంది. కంపెనీకి దీనితో పాటు రాజస్తాన్‌లోని ఘిలోత్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో రెండు ప్లాంట్లు ఉన్నాయి. వీటి మొత్తం వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 1,00,000 మెట్రిక్ టన్నులు. కొత్త ప్లాంటు కూడా అందుబాటులోకి రావడంతో మొత్తం వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 1,87,000 టన్నులకు చేరినట్లయింది. ప్రీ–ఇంజనీర్డ్ స్ట్రక్చర్లకు డిమాండ్ పెరుగుతుండటంతో దేశీ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ మార్కెట్లపైనా మరింతగా దృష్టి పెడుతున్నట్లు సంస్థ డైరెక్టర్ (మధ్యప్రాచ్యం, ఆఫ్రికా) నిఖిల్ బోత్రా తెలిపారు.

బ్యాంకింగ్ స్థిరత్వమే ఆర్‌బీఐ లక్ష్యం..

- వ్యక్తిగత రుణ నిబంధనల కఠినతరంపై గవర్నర్ స్పష్టీకరణ
- రూపాయి విలువలో భారీ ఒడిదుడుకులు లేవని వ్యాఖ్య

ముంబై: క్రెడిట్‌కార్డ్‌సహా అన్‌సెక్యూర్డ్ వ్యక్తిగత రుణ మంజూరు నిబంధనలను కఠినతరం చేస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఇటీవల తీసుకున్న నిర్ణయం.. బ్యాంకింగ్ వ్యవస్థ స్థిరత్వానికి ఉద్దేశించిన ''ముందస్తు'' చర్యని గవర్నర్ శక్తికాంతదాస్ పేర్కొన్నారు. వ్యక్తిగత రుణ మంజూరీల విషయంలో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల రిస్క్ కేటాయింపులను 25 శాతం పెంచుతూ ఆర్‌బీఐ కీలక నిబంధనలు తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. వార్షికంగా ఈ రుణ విభాగం 30 శాతం పెరుగుదల దీనికి నేపథ్యం. ఆర్‌బీఐ నిర్ణయంతో బ్యాంకింగ్, ఎన్‌బీఎఫ్‌సీలు అన్‌సెక్యూర్డ్ వ్యక్తిగత రుణ మంజూరీల విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. మూలధనంపై కూడా ఈ నిర్ణయ ప్రభావం ఉంటుందన్న విశ్లేషణలు ఉన్నాయి. ఇక ఇతర వర్ధమాన దేశాల కరెన్సీలతో పోల్చితే భారత్ మారకపు విలువలో ఒడిదుడుకులు చాలా తక్కువగా ఉన్నట్లు గవర్నర్ తాజాగా వివరించారు. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్– ఐబీఏ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ– ఫిక్కీ ఇక్కడ ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహిస్తున్న ఎఫ్‌ఐబీఏసీ 2023 (ఫిక్కీ బ్యాంకింగ్ సమావేశాలు–2023) వార్షిక సమావేశాన్ని ఉద్దేశించి గవర్నర్ శక్తికాంత దాస్ ప్రారంభోపన్యాసం చేశారు. గవర్నర్ ఈ సందర్భంగా ఏమన్నారంటే...

- బ్యాంకింగ్ వ్యవస్థ సవాళ్లను తట్టుకుంటూ సుస్థిరంగా కొనసాగుతోంది. వ్యవస్థ గురించి ఆందోళన చెందడానికి తక్షణ కారణం ఏదీ లేదు. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల పనితీరు ఎంతో మెరుగ్గా ఉంది. అయితే మొండిబకాయిలుగా మారే ఖాతాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఈ ప్రమాదకర ధోరణిని ముందే గుర్తించాలి.
- వ్యక్తిగత రుణ నిబంధనలను కఠినతరం చేస్తూ ఇటీవల తీసుకున్న ఫలితాల గురించి ఇప్పుడే ఏమీ చెప్పలేం. రుణదాతలు తమ రిస్క్ మేనేజ్‌మెంట్ పద్ధతులను పటిష్ఠం చేసుకోవాలి.
- బ్యాంకింగ్ వ్యవస్థ నుండి ఎన్‌బీఎఫ్‌సీ పెద్ద రుణ గ్రహీతగా ఉంది. రెండింటి మధ్య లోతైన అనుసంధానం ఉంది. ఈ నేపథ్యంలో బ్యాంకింగ్ వ్యవస్థ ఎన్‌బీఎఫ్‌ల రుణ పరిణామాలను నిరంతరం మదింపు చేయాలి.
- రిటైల్ ద్రవ్యోల్బణం దిగిరావడం ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధానం తగిన ఫలితాలు ఇస్తోందన్న విషయం తెలియజేస్తోంది. అయితే ద్రవ్యోల్బణం కట్టడికి ఆర్‌బీఐ అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇది ఆర్‌బీఐకి 'అర్జునుడు లక్ష్యంపై గురి పెట్టడం లాంటిది'.

వడ్డీరేట్ల విషయంలో హేతుబద్ధత పాటించాలి: వడ్డీ రేట్లు క్రమబద్ధీకరించబడినప్పటికీ, కొన్ని నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు–మైక్రో ఫైనాన్స్ సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు–ఎంఎఫ్‌ఐ) అధిక నికర వడ్డీ మార్జిన్‌లను పొందుతున్నట్లు కనిపిస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ పేర్కొన్నారు. ఈ సంస్థలు తమ వడ్డీ రేట్లను నిర్ణయించేటప్పుడు రుణగ్రహీతల స్థోమత, తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలని దాస్ సూచించారు.

అన్‌సెక్యూర్డ్ రుణాల్లో నెమ్మది: ఖారా

అన్‌సెకూర్డ్ రుణ మంజూరీల విషయంలో ఆర్‌బీఐ నిబంధనల కఠినతరం ప్రభావం ఎస్‌బీఐపై కొంచెం ప్రతికూల ప్రభావం చూపుతుందని బ్యాంకింగ్ ఎస్‌బీఐ చెర్మన్ దినేష్ కుమార్ ఖారా పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి 'అధిక రిస్క్ కేటాయింపుల' ప్రభావం డిసెంబర్ త్రైమాసికంలో ఎస్‌బీఐ నికర వడ్డీ మార్జిన్‌లపై 0.02–0.03 శాతం మేర ఉంటుందని అన్నారు. అయితే తదుపరి త్రైమాసికంలో పరిస్థితి మెరుగుపడుతుందన్న భరోసాను వెలిబుచ్చారు. వ్యక్తిగత రుణాలపై వడ్డీరేట్లు కూడా పెరుగుతాయని స్పష్టం చేశారు.



ఎఫ్‌ఐబీఏసీ 2023 నివేదికను ఆవిష్కరిస్తున్న గవర్నర్ శక్తికాంత దాస్, ఇతర ప్రముఖులు.

భవిత

నేషనల్ ఫెర్టిలైజర్స్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీలు

జాబ్స్ ఇన్ఫో

భారత ప్రభుత్వానికి చెందిన అతిపెద్ద ఎరువుల ఉత్పత్తి సంస్థ నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్).. పలు పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. దీనిలో భాగంగా నోయిడాలోని ఎన్ఎఫ్ఎల్ దేశ వ్యాప్తంగా ఉన్న యూనిట్లు, కార్యాలయాల్లో 74 మేనేజ్‌మెంట్ ట్రైనీ ఉద్యోగాలకు నియామక ప్రక్రియ చేపట్టనుంది. డిగ్రీ, సీఏ, ఎంబీఏ విద్యార్హతలు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు డిసెంబర్ 1తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సమర్పించాలి.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 74(విభాగాల వారీగా.. మేనేజ్‌మెంట్ ట్రైనీ (మార్కెటింగ్)–60, ఎఫ్ అండ్ ఏ–10, లా–04 పోస్టులు)

అర్హతలు

- **మేనేజ్‌మెంట్ ట్రైనీ(మార్కెటింగ్):** ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు రెండేళ్ల ఫుల్ టైమ్ ఎంబీఏ/పీజీడీబీఎం/పీజీడీఎం మార్కెటింగ్/అగ్రి బిజినెస్ మార్కెటింగ్/రూరల్ మేనేజ్‌మెంట్/ఫారిన్ ట్రేడ్/ఇంటర్నేషనల్ మార్కెటింగ్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో పాసవ్వాలి.
- **మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఎఫ్ అండ్ ఏ):** ఈ పోస్టులకు సీఏ/ఐసీడబ్ల్యూఏ/సీఎంఏ ఉత్తీర్ణులవ్వాలి.
- **మేనేజ్‌మెంట్ ట్రైనీ లా:** ఈ ఉద్యోగాలకు మూడేళ్ల ఎల్ఎల్‌బీ లేదా బీఎల్ డిగ్రీ/ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఫుల్‌టైమ్ ఎల్ఎల్‌బీ లేదా బీఎల్ డిగ్రీ 60% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులు 50% మార్కులు పొందాలి.
- ఎన్ఎఫ్ఎల్ ఉద్యోగులు కరస్పాండెన్స్/పార్ట్ టైమ్ డిగ్రీ/డిప్లొమా 50 శాతం మార్కులతో పాసైనా సరిపోతుంది.

వయసు

31.10.2023 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. గరిష్ఠ వయోపరిమితిలో ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం

ఆఫ్‌లైన్ ఓఎంఆర్ విధానంలో నిర్వహించే అర్హత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. పరీక్షలో మొత్తం 150 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో 100 ప్రశ్నలు సంబంధిత అకడమిక్ సబ్జెక్టుల నుంచి అడుగుతారు.జనరల్ ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ అండ్ జనరల్ నాలెడ్జ్/అవేర్‌నెస్‌కు సంబంధించిన 50 ప్రశ్నలు ఉంటాయి. నెగిటివ్ మార్కుల విధానం లేదు.

పర్సనల్ ఇంటర్వ్యూ

ఓఎంఆర్ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను 1:5 నిష్పత్తిలో ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఈ వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. ఈ సమాచారాన్ని అభ్యర్థికి ఎస్ఎంఎస్‌తోపాటు ఈమెయిల్ ఐడీకి తెలియజేస్తారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులకు సెకండ్ ఏసీ రైల్వే/బస్ ఛార్జీలను చెల్లిస్తారు.

తుది ఎంపిక

ఓఎంఆర్ టెస్ట్, ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా కేటగిరీల వారీగా అభ్యర్థుల తుది జాబితాను రూపొందిస్తారు. ఆఫ్‌లైన్ ఓఎంఆర్ బేస్డ్ టెస్ట్‌కు–80 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకు 20 శాతం మార్కులు కేటాయించారు. అభ్యర్థులు రెండింట్లోనూ 50 శాతం మార్కులు సాధించాలి.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 01.12.2023
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 3, 4 డిసెంబర్ 2023
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.nationalfertilizers.com

స్టార్టప్ ఆఫర్స్‌కు..'సై'!

క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్.. ఐటీ సంస్థల్లో కొలువులు.. లక్షల్లో ప్యాకేజీలు! ఇంజనీరింగ్ విద్యార్థుల దృష్టంతా ప్లేస్‌మెంట్స్‌పైనే ఉంటుంది. మూడో ఏడాది నుంచే క్యాంపస్ డ్రైవ్స్‌లో విజయానికి సన్నద్ధమవుతుంటారు! కానీ.. ఈ ఏడాది టెక్ కంపెనీల్లో ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్స్ తగ్గొచ్చనే అంచనా అభ్యర్థులకు ఆందోళనకు గురిచేస్తోంది!! మరోవైపు స్టార్టప్స్ టాలెంట్ కోసం క్యాంపస్‌లకు వెళ్లనున్నట్లు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో.. ఈ ఏడాది క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ ట్రెండ్స్, స్టార్టప్ ఆఫర్స్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై విశ్లేషణ..

» ఎంఎన్‌సీల ఫ్రెషర్స్ హైరింగ్‌పై అనుమానాలు
» ఐటీ సంస్థల్లోనూ ఫ్రెషర్స్ నియామకాల్లో తగ్గుదల
» స్టార్టప్ సంస్థల ఆఫర్స్ పెరగనున్నట్లు అంచనా
» స్టార్టప్స్‌లో చేరికపై అభ్యర్థుల్లో సందిగ్ధత

ఐటీ దిగ్గజాల వెనుకంజ

ఈ ఏడాది క్యాంపస్ డ్రైవ్స్‌లో ఫ్రెషర్స్ హైరింగ్స్‌కు ఐటీ సంస్థలు వెనుకంజ వేస్తున్నట్లు ఆయా కంపెనీల ప్రకటనల ద్వారా స్పష్టమవుతోంది. అంతర్జాతీయ స్థాయిలో నెలకొన్న ప్రతికూల ఆర్థిక పరిస్థితులే ఇందుకు ప్రధాన కారణంగా చెప్పొచ్చు. ఐటీ దిగ్గజ సంస్థలుగా పేరొందిన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ తదితర సంస్థలు ఫ్రెషర్స్ హైరింగ్ దాదాపు ఉండకపోవచ్చనే విధంగా ఇప్పటికే సంకేతాలిచ్చాయి. ఇన్ఫోసిస్ సంస్థ.. ఈ ఏడాది క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ ద్వారా ఫ్రెషర్స్ నియామకాలు ఉండవని స్పష్టం చేసింది. హెచ్‌సీఎల్‌లో గత ఆర్థిక సంవత్సరంలో 28 వేల మంది ఫ్రెషర్స్‌ను ఈ సంస్థ నియమించుకోగా.. ఈ ఏడాది ఆ సంఖ్య పది వేలకు మించే అవకాశంలేదు. ఇదే తీరు ఇతర ఐటీ కంపెనీల్లోనూ కనిపిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బెంచ్ ట్యాలెంట్ ఎక్కువగా

ఇప్పటికే ఆయా సంస్థల్లో బెంచ్‌పైన ఉన్న నిపుణులతోపాటు గతేడాది ఆఫర్ లెటర్లు అందుకొని.. శిక్షణ పూర్తి చేసుకున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంది. దీంతో వీరితోనే మానవ వనరుల కొరతను పూడ్చుకోవాలని కంపెనీలు భావిస్తున్నట్లు చెబుతున్నారు. అదే విధంగా కంపెనీల్లో అట్రిషన్ రేటు కూడా గత ఏడాదితో పోల్చితే బాగా తగ్గిందని.. ఇది కూడా ఫ్రెషర్స్ నియామకాలపై ప్రభావం చూపుతుందనే వాదన వినిపిస్తోంది.

స్టార్టప్ ఆఫర్స్

- ఒకవైపు ఐటీ సంస్థల్లో.. నియామకాల్లో అనిశ్చితి నెలకొన్న పరిస్థితుల్లో స్టార్టప్ సంస్థలు మాత్రం ఆఫర్లు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్ చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నాయి.
- ఫిక్కి–రాండ్ స్టాండ్ నివేదిక ప్రకారం–ఈ ఏడాది స్టార్టప్ సంస్థలు మానవ వనరుల సంఖ్య పెంచుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపాయి. ఈ సంస్థల్లో గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం 30శాతం మేరకు నియామకాలు పెరగనున్నాయి.
- పలు స్టార్టప్ సంస్థలు ఎంబీఏ కళాశాలలు, ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్స్, రాష్ట్ర స్థాయిలోని యూనివర్సిటీల్లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్ చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి.

విద్యార్థుల్లో సందిగ్ధత

ఐటీ కంపెనీల్లో నియామకాలు తగ్గుతూ..స్టార్టప్ సంస్థల్లో పెరిగే అవకాశం కనిపిస్తోంది. దీంతో స్టార్టప్ ఆఫర్స్‌ను అంగీకరించాలా వద్దా అని విద్యార్థులు తర్జనభర్జన పడుతున్నారు. స్టార్టప్స్‌లో వేతనాలు తక్కువగా ఉండడం, ఆ సంస్థల సక్సెస్‌పై సందిగ్ధతే ఇందుకు కారణంగా చెప్పొచ్చు. ఒకవేళ స్టార్టప్ సంస్థ విజయం సాధించకపోతే అది తమ కెరీర్‌కు ప్రతికూలంగా మారుతుందని ఆందోళన చెందుతున్నారు.

మరికొందరు భిన్నంగా

స్టార్టప్ ఆఫర్లపై కొంత మంది అభ్యర్థులు వెనకంజ వేస్తుంటే.. మరికొందరు మాత్రం స్టార్టప్ ఆఫర్లను అందుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. స్టార్టప్ సంస్థల్లో చేరితే తమ సృజనాత్మకతను, నైపుణ్యాలను ప్రదర్శించేందుకు వీలవుతుందని వీరు భావిస్తున్నారు. నూతన ఉత్పత్తుల రూపకల్పన, రీసెర్చ్, ఇన్నోవేషన్ పరంగా సదరు స్టార్టప్స్ తమకు అవకాశం కల్పిస్తాయని అంచనావేస్తున్నారు. అందుకే వేతనం తక్కువైనా.. స్టార్టప్ ఆఫర్లు అందుకునేందుకు సిద్ధమవుతున్నారని నిపుణులు పేర్కొంటున్నారు.

అవగాహనతో మేలు

స్టార్టప్ ఆఫర్స్‌ను ఆమోదించే క్రమంలో అభ్యర్థులు ముందుగా సదరు సంస్థ పనితీరు, మార్కెట్ పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలి. అక్కడ పనిచేస్తున్న మానవ వనరుల సంఖ్యను తెలుసుకోవడం ద్వారా సదరు స్టార్టప్ గమనంపై ఒక అంచనా వచ్చేందుకు ఆస్కారం లభిస్తుంది. వీలైతే అక్కడ పని చేస్తున్న సిబ్బందిని సంప్రదించి వాస్తవ పరిస్థితులు తెలుసుకునే ప్రయత్నం చేయాలి.

పని సంస్కృతి

స్టార్టప్ కంపెనీలో ఆఫర్‌కు ఆమోదం తెలిపే ముందు.. అక్కడి పని వాతావరణంపై స్పష్టత పొందాలి. తమకు పని వాతావరణంలో ఇన్నోవేషన్ పరంగా స్వేచ్ఛ ఉంటుందా లేదా అనేది తెలుసుకోవాలి. ఒకవేళ అలాంటి సంస్కృతి తక్కువగా ఉందంటే ఆ ఆఫర్‌కు 'నో' చెప్పడమే మేలని నిపుణులు సూచిస్తున్నారు. వాస్తవానికి అధికశాతం స్టార్టప్స్‌లో సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం లభిస్తుందని చెబుతున్నారు. కొన్ని సంస్థల్లో మాత్రం నిర్దేశిత నమూనాలో పని విధానాలు ఉంటాయని పేర్కొంటున్నారు.



జాబ్ ట్రెండ్స్

ఆర్థిక ప్రయోజనాలు

స్టార్టప్ ఆఫర్స్‌ను ఆమోదించే క్రమంలో అభ్యర్థులు తమకు అందించే ప్యాకేజ్ గురించి ముందుగానే తెలుసుకోవాలి. కొన్ని స్టార్టప్ సంస్థలు భారీగా ప్యాకేజీ ప్రకటించినా.. అందులో 40 నుంచి 50 శాతం మాత్రమే నగదు రూపంలో అందిస్తున్నాయి. మిగతా మొత్తాన్ని ఈక్విటీలు, స్టాక్ ఆప్షన్స్ కేటాయింపు వంటి విధానాలను అనుసరిస్తుంటాయి. కాబట్టి అభ్యర్థులు తమ వాస్తవ అవసరాలు, కంపెనీలు అందించే ప్యాకేజీ తీరుతెన్నుల గురించి తెలుసుకోవాలి. నగదు రూపంలో అందించే మొత్తం తమ అవసరాల మేరకు ఉందని భావిస్తేనే సదరు ఆఫర్‌ను అంగీకరించడం మేలు.

స్టార్టప్ సవాలే

స్టార్టప్ సంస్థలంటే అప్పుడే ప్రారంభించిన కంపెనీలు. ప్రొడక్ట్స్, సర్వీస్‌ల గురించి లక్ష్యాలు నిర్దిష్టంగా ఉన్నప్పటికీ.. వాటి అమలు, కార్యాచరణ ప్రాథమిక దశలోనే ఉంటాయి. వీటికి వాస్తవ రూపమిచ్చి పనిచేయడం సవాల్‌తో కూడుకున్న వ్యవహారం. కంపెనీలు తాము ఆఫర్ ఇచ్చిన అభ్యర్థుల నుంచి ఎంతో ఆశిస్తాయి. కాబట్టి ఆమేరకు వాస్తవ ఆసక్తి ఉంటేనే స్టార్టప్ సంస్థల ఆఫర్‌ను ఆమోదించాలి. దీంతోపాటు తమ స్కిల్ సంస్థ ఆఫర్ చేస్తున్న జాబ్ ప్రొఫైల్‌కు సరితూగుతుందో లేదో ముందుగానే పరిశీలించుకోవాలి.

బాలికల చదువుకు భరోసా

» ఏఐసీటీఈ ప్రగతి స్కాలర్‌షిప్‌లకు ప్రకటన విడుదల
» ఎంపికైతే ఏటా రూ.50వేలు ఉపకార వేతనం
» డిప్లొమా, ఇంజనీరింగ్ విద్యార్థినులు అర్హులు



స్కాలర్‌షిప్స్

ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక చేయూతలేక చాలా మంది అమ్మాయిలు చదువులకు దూరమవుతున్నారు. ఇటువంటి విద్యార్థినులు ఉన్నత విద్యను కొనసాగించేలా ఆర్థిక భరోసాను ఇస్తూ అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) స్కాలర్‌షిప్‌లను ఇస్తోంది. ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్ పేరిట ఏటా అర్హులైన విద్యార్థినులకు రూ.50వేల ఉపకార వేతనాన్ని అందిస్తోంది. డిప్లొమా, ఇంజనీరింగ్ చదువుతున్న వారు ఈ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు.

- మొత్తం స్కాలర్‌షిప్‌ల సంఖ్య: 10,000. డిప్లొమా స్థాయిలో 5000 మందికి, ఇంజనీరింగ్ స్థాయిలో 5000 మందికి చొప్పున వీటిని అందిస్తారు.

తెలుగు రాష్ట్రాలకు

దేశ వ్యాప్తంగా అందించే ఈ స్కాలర్‌షిప్‌లకు రాష్ట్రాలవారీ కోటా ఉంటుంది. దీని ప్రకారం–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డిప్లొమా చదివే 318 మందికి, తెలంగాణలో 206 మందికి వీటిని అందిస్తారు. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో ఏపీ నుంచి 566 మందిని, తెలంగాణ నుంచి 424 మందిని ఈ స్కాలర్‌షిప్స్ కోసం ఎంపిక చేస్తారు. ఈ స్కాలర్‌షిప్స్ కూడా రిజర్వేషన్ ప్రకారం అందిస్తారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేటాయింపులు చేస్తారు.

అర్హతలు

- ఏఐసీటీఈ గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో డిప్లొమా లేదా బీటెక్ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి.
- ఆయా కోర్సుల్లో ఫస్ట్ ఇయర్ లేదా లేటరల్ ఎంట్రీలో సెకండ్ ఇయర్‌లో చేరినవాళ్లే ఈ స్కాలర్‌షిప్ దరఖాస్తుకు అర్హులు.
- ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలకు మాత్రమే దరఖాస్తుకు అవకాశం ఉంటుంది.
- తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.8 లక్షలకు మించి ఉండరాదు. ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను జతచేయాల్సి ఉంటుంది.

ఏటా రూ.50వేలు

ఈ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైన విద్యార్థినులకు ఏటా రూ.50 వేలను అందిస్తారు. డిప్లొమా వారికి మూడేళ్ల పాటు, ఇంజనీరింగ్ కోర్సులు చదువుతున్నవారికి నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం చెల్లిస్తారు. లేటరల్ ఎంట్రీలో చేరిన డిప్లొమా కోర్సుల విద్యార్థినులకు రెండేళ్లు, లేటరల్ ఎంట్రీ ఇంజనీరింగ్‌లో చేరితే మూడేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందుతుంది. ఈ మొత్తం నేరుగా విద్యార్థిని బ్యాంకు ఖాతాలోనే జమ చేస్తారు. దీన్ని ఫీజు, వసతి, పుస్తకాలు, కంప్యూటర్ తదితర ఖర్చుల కోసం వెచ్చించుకోవచ్చు. అకడమిక్స్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా తర్వాతి ఏడాది వీటిని కొనసాగిస్తారు.

ఎంపిక ఇలా

డిప్లొమా అభ్యర్థులైతే పదోతరగతిలో సాధించిన మెరిట్ మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు. ఇంజనీరింగ్‌లో చేరినవారైతే ఇంటర్‌లో సాధించిన మార్కులను పరిగణలోకి తీసుకుని ఈ స్కాలర్‌షిప్‌లకు ఎంపిక చేస్తారు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 31.12.2023
- **వెబ్‌సైట్:** https://scholarships.gov.in

క్లుప్తంగా...

ఆన్‌లైన్‌లో ముక్కోటి టికెట్లు ప్రారంభం

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరిగే ముక్కోటి ఉత్సవాల సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, ఇతర పూజల టికెట్ల ఆన్‌లైన్ విక్రయాలను ఈఓ రమాదేవి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 23న ఉత్తర ద్వార దర్శనం వీక్షణానికి సంబంధించి రూ.2 వేలు, రూ.వేయి, రూ.500, రూ.250 విలువైన సెక్టార్ టికెట్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకునే భక్తులు డిసెంబర్ 13 నుంచి 23వ తేదీ ఉదయం 5 గంటల వరకు సీఆర్‌ఓ కార్యాలయం వద్ద ఒరిజినల్ టికెట్లు పొందవచ్చని చెప్పారు. ఈ ఏడాది ముందుగానే టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చామని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

రాజన్న హుండీ ఆదాయం రూ.1.07 కోట్లు

వేములవాడ: వేములవాడ రాజన్నకు 15 రోజుల హుండీ ఆదాయం రూ.1,07,48,515 నగదు, బంగారం 227 గ్రాములు, వెండి 6.600 కిలోలు సమకూరినట్లు ఈవో కృష్ణప్రసాద్ బుధవారం తెలిపారు. స్వామి వారి ఓపెన్‌స్లాబ్‌లో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య హుండీ ఆదాయాన్ని లెక్కించామన్నారు. ఏఈవోలు ప్రతాప్ నవీన్, శ్రీనివాస్, జయకుమారి, హరికిషన్, కరీంనగర్ ఏసీ చంద్రశేఖర్, ఆలయ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతోపాటు రాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ఐవీఎఫ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా రాజమౌళి గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్ వారిరువురికి నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆర్య వైశ్యలను ఏకం చేస్తామన్నారు. వాణిజ్య, ఉద్యోగ, రాజకీయ, పేద వైశ్యులను ఆదుకోవడానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

హైటెక్స్‌లో అంతర్జాతీయ పౌల్ట్రీ ఇండియా ప్రారంభం

దేశ, విదేశీ సంస్థల ఉత్పత్తుల ప్రదర్శన

మాదాపూర్ (హైదరాబాద్): మాదాపూర్‌లోని హైటెక్స్‌లో బుధవారం అంతర్జాతీయ పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్ 15వ ఎడిషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో 400కు పైగా ఎగ్జిబిటర్లు పాల్గొన్నారు. దేశ విదేశీ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నాయి. అత్యాధునిక, యంత్ర పరికరాలను స్టాల్స్‌లో అందుబాటులో ఉంచారు. ఇది దక్షిణాసియాలో అతి పెద్ద పౌల్ట్రీ ఎక్స్‌పో అని నిర్వాహకులు వెల్లడించారు. పౌల్ట్రీ రైతులకు కావలసిన పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచారు. మూడు రోజుల పాటు ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు.

కృష్ణా ట్రిబ్యునల్ విచారణ జనవరి 22కు వాయిదా

ట్రిబ్యునల్ నూతన విధి విధానాలపై ఏపీ పిటిషన్

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి కేంద్రం నోటిఫై చేసిన విధివిధానాలపై అభ్యంతరం తెలుపుతూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ట్రిబ్యునల్ వాయిదా వేసింది. ఏపీ ప్రభుత్వ పిటిషన్‌ను బుధ, గురువారాల్లో జస్టిస్ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ విచారించాల్సి ఉంది. బుధవారం విచారణ సందర్భంగా స్టేట్‌మెంట్ ఆఫ్ కేసు వివరాలు అందజేయాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలను ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 22కు వాయిదా వేసింది. మరోవైపు కేంద్రం నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు తెలుపుతూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ ఈ నెల 29న విచారణకు రానుంది.

'రౌండ్ టేబుల్ ఇండియా' కృషి శ్లాఘనీయం

పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): ఎలాంటి కల్మశం, కపటం లేని చిన్నపిల్లలు దేవుడి లాంటి వారని, వారికి చేసే ఏ సేవైనా దేవుడికి చేసినట్లేనని హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య అన్నారు. బుధవారం రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'తారే జమీన్ పర్' కార్యక్రమంలో భాగంగా మానసిక వికలాంగులైన పిల్లలకు బసేరా హోటల్‌లో అద్భుతమైన వంటకాలతో విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పెయింటింగ్ పోటీలో చిన్నారులు అద్భుతమైన చిత్రాలను ఆవిష్కరించారు. రౌండ్ టేబుల్ చైర్‌పర్సన్ విక్రాంత్ మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా రోజూ సగటున ఒక తరగతి గదిని నిర్మించామని చెప్పారు.

క్లోన్డ్ వేలి ముద్రలతో దందా

- రిజిస్ట్రేషన్ పత్రాల నుంచి ఫింగర్ ప్రింట్స్ తస్కరణ
- ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ విధానం దుర్వినియోగం
- బ్యాంకు ఖాతాల నుంచి రూ.10 లక్షలు స్వాహా
- ముఠా గుట్టు రట్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు



సాక్షి, హైదరాబాద్: భూ దస్తావేజుల నుంచి లభించిన వివరాల ఆధారంగా క్లోన్డ్ వేలిముద్రలు తయారు చేసి, ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం (ఏఈపీఎస్)ను దుర్వినియోగం చేసి బ్యాంకు ఖాతాల నుంచి రూ.10 లక్షల మేర టోకరా వేసిన ముఠా గుట్టును హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు రట్టు చేశారు. తొమ్మిది మంది నిందితులున్న ఈ గ్యాంగ్‌లో ఆరుగురిని అరెస్టు చేశామని, మిగిలిన వారికోసం గాలిస్తున్నామని సంయుక్త పోలీసు కమిషనర్ డాక్టర్ గజరావ్ భూపాల్ తెలిపారు. డీసీపీ డి.కవిత, ఏసీపీ ఆర్‌జీ శివమారుతీలతో కలిసి ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు.

జైలు నుంచి వచ్చి.. స్నేహితులకు చెప్పి

ఏపీలోని ప్రకాశం జిల్లా కంబంకు చెందిన ఎం.యువరాజు గతంలో వేలిముద్రల్ని క్లోన్ చేసి, వాటి ద్వారా ఏఈపీఎస్ విధానంలో బ్యాంకు ఖాతాల్లోని నగదు కాజేసి అరెస్టయ్యాడు. జైలు నుంచి బయటకు వచ్చాక ఈ స్కామ్ ఎలా చేయాలో తన స్నేహితుడైన కంబం వాసి రఫీకి చెప్పాడు. ఇతడు అసాధారణ్, ఉదయ్‌కిరణ్‌తో కలిసి హైదరాబాద్‌లో ఓ రూమ్‌లో ఉంటున్నాడు. వీరంతా కలిసి ఆ దందా చేద్దామని నిర్ణయించుకున్నారు. క్లోన్డ్ వేలిముద్రలు చేయడానికి అవసరమైన నమూనాలు, ఆధార్ నంబర్లు యువరాజే ఇచ్చాడు. కంబం వాసి నరేంద్రకు అక్కడ మీ సేవ కేంద్రం నిర్వాహకుడితో స్నేహం ఉంది. తరచూ ఆ సేవా కేంద్రంలో కూర్చునే ఇతగాడు అక్కడి కంప్యూటర్‌లో ఉన్న దాదాపు 2,500 భూ రిజిస్ట్రేషన్ పత్రాల సాఫ్ట్‌కాపీలను పెన్‌డ్రైవ్‌లో కాపీ చేసుకుని యువరాజు, రఫీకి ఇచ్చాడు. అసాధారణ్ త్రయం క్లోన్డ్ వేలిముద్రలు తయారీకి అవసరమైన మిషన్, ఇతర సామగ్రిని ఆన్‌లైన్‌లో ఖరీదు చేసింది. స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో ఆధార్ కార్డు కాపీతోపాటు వేలిముద్రల్నీ డాక్యుమెంట్‌లో పొందుపరుస్తారు. వీరు తమ వద్ద ఉన్న 2,500 దస్తావేజుల సాఫ్ట్‌కాపీల నుంచి ఆధార్ నంబర్లు, వేలిముద్రల్ని సంగ్రహించి క్లోన్డ్ వేలి ముద్రలు తయారు చేశారు. ఏఈపీఎస్ విధానంలో డబ్బు డ్రా చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించిన ప్రైవేట్ సంస్థల్లో ఏదో ఒక దాని నుంచి మర్చంట్ ఐడీ తీసుకోవాల్సి ఉంటుంది. ఆధార్ అనుసంధానించి ఉన్న బ్యాంకు ఖాతాదారుడు పరిమిత మొత్తాలు ఈ మర్చంట్స్ వద్దే డ్రా చేసుకుంటారు. ఇలా డ్రా చేయడానికి బ్యాంకు ఖాతా నంబర్, ఓటీపీ తదితరాలు అవసరం లేదు.

నిరుద్యోగికి ఎర వేసి మర్చంట్ ఐడీ

వీరికి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన కె.శ్రీను తారసపడ్డాడు. శ్రీను ఫినో పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ నుంచి మర్చంట్ ఐడీ తీసుకునేలా అసాధారణ్ ప్రేరేపించాడు. శ్రీను తన పేరుపై ఐడీ, బయోమెట్రిక్ మిషన్ తీసుకుని అసాధారణ్‌కు ఇచ్చాడు. ఫినో పేమెంట్స్ వెబ్‌సైట్‌లో మర్చంట్ ఐడీని నమోదు చేసి, ఉపకరణం ద్వారా శ్రీను వేలి ముద్రను తనిఖీ చేసి ఏఈపీఎస్‌లోకి ఎంటర్ అయ్యారు. అక్కడ ఖాతాదారు ఆధార్ నంబర్‌ను పొందుపరిచి, వేలిముద్ర రీడింగ్ చేస్తే నిర్ణీత మొత్తం అతడి ఖాతా నుంచి మర్చంట్ ఖాతాలోకి వస్తుంది. మర్చంట్ తన వద్ద ఉన్న మొత్తం నుంచి ఖాతాదారుడికి తక్షణం చెల్లించేస్తాడు. ఫినో పేమెంట్స్ సైట్‌లోకి ఎంటర్ అయిన తర్వాత అసాధారణ్ త్రయం తమ వద్ద ఉన్న ఆధార్ నంబర్లు, క్లోన్డ్ వేలి ముద్రలు వినియోగించి రూ.10 లక్షల్ని మర్చంట్ ఖాతాలుగా యాడ్ చేసిన తరుణ్, శివకృష్ణలకు బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించింది. ఆపై ఏటీఎం కార్డులు వినియోగించి ఆ మొత్తాలు డ్రా చేసుకుని అంతా పంచుకుంటున్నారు.

సహకరించిన ఎథికల్ హ్యాకర్

అసాధారణ్ త్రయానికి ఓ దశలో సాంకేతిక సమస్యలు రావడంతో తమ స్నేహితుడైన ఎథికల్ హ్యాకర్ మహ్మద్ ఇయాజ్ సాయం తీసుకుంది. ఆ సమస్యను పరిష్కరించి వీరికి సహకరించిన హ్యాకర్ ఏటీఎం కేంద్రాల నుంచి డబ్బు డ్రా చేసుకుని వచ్చాడు. తాము శ్రీనుకు జారీ చేసిన మర్చంట్ ఐడీ ద్వారా మోసపూరిత లావాదేవీలు జరుగుతున్నట్లు బ్యాంకుల నుంచి ఫినో పేమెంట్స్ సంస్థకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఈ సంస్థ సైబర్‌క్రైమ్ ఠాణాలో కేసు పెట్టింది. ఇన్‌స్పెక్టర్ ఎస్.సీతారాములు నేతృత్వంలో ఎస్సై వై.యాదగిరితో కూడిన బృందం దర్యాప్తు చేసింది. రఫీ, యువరాజు, తరుణ్ మినహా మిగిలిన ఆరుగురినీ అరెస్టు చేసింది. వీరి నుంచి ల్యాప్‌టాప్‌లు, ఇతర ఉపకరణాలు స్వాధీనం చేసుకుంది.

రెండోరోజూ కొనసాగిన ఐటీ సోదాలు

- పత్తి వ్యాపారుల ఇళ్లు, వ్యాపార సముదాయాల్లో తనిఖీలు
- రూ. 10 కోట్లకుపైగా నగదు, భారీగా బంగారం స్వాధీనం



మిల్లులో సోదాలు చేస్తున్న ఐటీ అధికారులు

సాక్షి, ఆసిఫాబాద్/జమ్మికుంట: రాష్ట్రంలో వరుసగా రెండో రోజూ పలువురు కాటన్‌మిల్లుల వ్యాపారుల ఇళ్లపై ఆదాయపన్ను (ఐటీ) దాడులు కొనసాగాయి. ప్రధానంగా ఆసిఫాబాద్, జమ్మికుంట, కాగజ్‌నగర్‌కు చెందిన పత్తి వ్యాపారులే లక్ష్యంగా బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన దాడుల్లో ఆదాయపన్ను పరిధిలో చూపని బంగారు ఆభరణాలు, ఆస్తులు కొనుగోళ్ల వ్యవహారం బట్టబయలైనట్లు తెలుస్తోంది. వివిధ లావాదేవీలకు సంబంధించిన రశీదు, ఖాతా పుస్తకాలను అధికారులు వెంట తీసుకెళ్లినట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. మొత్తంగా ఈ తనిఖీల్లో రూ. 10 కోట్లకుపైగా నగదుతోపాటు భారీ మొత్తంలో బంగారాన్ని ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలియవచ్చింది. ముఖ్యంగా ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన పత్తి వ్యాపారి రఫీక్ ఇంట్లో స్వాధీనం చేసుకున్న దాదాపు రూ.9 కోట్లను అధికారులు బ్లాక్‌మనీగా గుర్తించినట్లు సమాచారం. ఈ నగదును రఫీక్ ఖాతాలో ఎవరు జమ చేశారని అధికారులు ఆరా తీస్తున్నారు. పత్తి కొనుగోళ్ల సందర్భంలో క్యాష్ కట్టింగ్ పేరిట (రైతుల నుంచి రూ.100కు రూ.1.50 పైసలు వ్యాపారి పట్టుకుంటారు) రైతుల వద్ద వసూలు చేసిన డబ్బునే ఆయన ఇలా ఇంట్లో దాచినట్లుగా తెలుస్తోంది. అలాగే కాగజ్‌నగర్‌లో కాటన్‌మిల్లు వ్యాపారి కాసం శ్రీనివాస్‌కు చెందిన బ్యాంక్ లాకర్‌లో కిలోకిపైగా బంగారు ఆభరణాలతోపాటు రూ. లక్షల నగదు బయటపడటంతో వాటిని సీజ్ చేసినట్లు తెలుస్తోంది. మరో వ్యాపారి చిలువేరి గంగన్న ఇళ్లు, జిన్నింగ్ మిల్లు తనిఖీల్లో లెక్కల్లో చూపని రూ.80 లక్షల నగదును ఐటీ అధికారులు స్వాధీనం చేసుకొని బ్యాంక్‌లో డిపాజిట్ చేసినట్లు సమాచారం. మరోవైపు జమ్మికుంటలోని ఆదిత్య కాటన్ మిల్లు వ్యాపార భాగస్వాముల ఇళ్లలో అధికారులు సోదాలు నిర్వహించి ఆర్థిక లావాదేవీలు, స్థిరాస్తి కొనుగోళ్లు, మార్కెట్‌లో ప్రస్తుతం వాటి విలువ, కొనుగోళ్ల సమయంలో చెల్లించిన సొమ్ము ఎంత అనే విషయాలపై ఆరా తీసినట్లు తెలిసింది.

రూ.4.18 కోట్ల నగదు పట్టివేత

నాచారంలో రూ.కోటీ 20 లక్షలు
షాహినాయత్‌గంజ్‌లో రూ.98 లక్షలు
హయత్‌నగర్‌లో రూ.2 కోట్లు స్వాధీనం

మల్లాపూర్/అబిడ్స్/హయత్‌నగర్ (హైదరాబాద్): ఎన్నికల కోడ్ అమలులో భాగంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా నగరంలో వివిధ ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో రూ.4.18 కోట్ల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను పోలీసులు బుధవారం మీడియాకు వివరించారు. నగరంలోని అలకాపురి స్నేహపురి కాలనీకి చెందిన బండి సుధీర్‌రెడ్డి, శరత్‌లు హబ్సిగూడకు చెందిన లక్ష్మారెడ్డి వద్ద నుంచి రూ.1.20 లక్షలు తీసుకుని కారులో (టీఎస్08 ఎఫ్‌వై8796) భువనగిరికి తీసుకెళ్తున్నారు. అదేసమయంలో వీరి కారును ఆపి పోలీసులు తనిఖీ చేయగా ఈ నగదు బయటపడింది. అదేవిధంగా షాహినాయత్‌గంజ్ పోలీసులు చేసిన తనిఖీల్లో రెడ్‌హిల్స్ ప్రాంతానికి చెందిన రిజ్వాన్ అనే వ్యక్తి తన కారులో రూ.98 లక్షల నగదుతో పట్టుబడ్డారు. ఇక బుధవారం రాత్రి పెద్దఅంబర్‌పేట్‌లోని సదాశివ వెంచర్ నుంచి కారులో భారీగా చౌటుప్పల్‌కు డబ్బులు తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించగా...సదాశివ వెంచర్ నుంచి వచ్చిన ఫార్చునర్ కార్లలో (టీఎస్13 టీఆర్ 7153) (ఏపీ23ఏజీ 3719) రూ.2 కోట్ల నగదు బయటపడింది. కార్లలో ప్రయాణిస్తున్న సురభి రమేశ్, మహేందర్, నిమ్మ విజయ్‌కుమార్ రెడ్డి, సురకంటి మహేందర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా పట్టుబడ్డ నగదుకు సరైన ఆధారాలు చూపకపోవడంతో ఈ మొత్తాలను స్వాధీనం చేసుకుని కార్లను సీజ్ చేశారు. వీరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం తరలింపు

చౌటుప్పల్‌కు తరలిస్తున్న నగదుకు సంబంధించి సురకంటి మహేందర్‌రెడ్డి చౌటుప్పల్‌లో ఓ ప్రాపర్టీ కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని పోలీసులకు చెబుతున్నట్లు సమాచారం.

ఉప్పల్ స్టేడియం నిర్మాణంలో అక్రమాలపై ఈడీ ఆరా

గడ్డం వినోద్ సహా పలువురు హెచ్‌సీఏలో పని చేసిన వారి ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉప్పల్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణంలో రూ. 20 కోట్ల అవినీతి ఆరోపణలపై దర్యాప్తులో భాగంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు, బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్‌తోపాటు హెచ్‌సీఏ మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ క్రికెటర్ శివలాల్ యాదవ్, మాజీ కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ ఇళ్లు, కార్యాలయాలపై మంగళవారం సోదాలు చేపట్టినట్లు ఈడీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ వ్యవహారంపై ఏసీబీ నమోదు చేసిన మూడు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొంది. ఎస్ఎస్ కన్సల్టెంట్స్ ప్రైవేటు లిమిటెడ్, ఆ కంపెనీ ఎండీ సత్యనారాయణ నివాసంలోనూ తనిఖీలు నిర్వహించినట్లు వివరించింది. ఈ సోదాల్లో మనీలాండరింగ్ కింద పలు అక్రమాలను గుర్తించామని, లెక్కల్లో చూపని రూ. 10.39 లక్షల నగదుతోపాటు డిజిటల్ పరికరాలు, పలు కీలక పత్రాలతోపాటు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ వెల్లడించింది. గడ్డం వినోద్ నివాసాన్ని ఆయన సోదరుడు, మాజీ ఎంపీ వివేక్‌కు సంబంధించిన పలు కంపెనీలు కార్యాలయాలుగా వినియోగిస్తున్నట్లు సోదాల్లో గుర్తించామని ఈడీ పేర్కొంది.

వీలైనంత దగ్గరగా జేఈఈ పరీక్ష కేంద్రం

- దరఖాస్తులోని స్థానికత ఆధారంగా కేటాయింపు
- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కసరత్తు
- రాష్ట్రంలో 18 కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశం
- ముందుగా దరఖాస్తు చేసేవారికి సెంటర్ కేటాయింపులో ప్రాధాన్యత



సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్స్ పరీక్ష కేంద్రాలను ఈసారి శాస్త్రీయంగా ఏర్పాటు చేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్ణయించింది. సాధ్యమైనంత వరకూ అభ్యర్థి నివాసానికి సమీపంలో ఉండే కేంద్రాన్ని కేటాయించేందుకు వీలుగా కసరత్తు చేపట్టింది. దరఖాస్తులో పేర్కొన్న స్థానికతను ఇందుకు కొలమానంగా తీసుకుంటున్నారు. గూగుల్ మ్యాప్ ఆధారంగా అక్కడికి సమీపంలోని పరీక్ష కేంద్రాన్ని గుర్తిస్తున్నారు. అన్ని రాష్ట్రాల నుంచి పరీక్షా కేంద్రాలకు సంబంధించిన సమాచారం సేకరిస్తున్నారు.

ఒక కేంద్రంలోనే ఎక్కువ మందికి అవకాశం

జేఈఈ మెయిన్స్ పరీక్ష జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 మధ్య ఉంటుంది. తొలి విడత పరీక్షకు దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 30తో ముగుస్తుంది. తుది గడువు నాటికి ఎన్ని దరఖాస్తు లు అందు తాయి? ఎన్ని పరీక్ష కేంద్రాలుంటాయి? ఎన్ని సెషన్లుగా పరీక్ష పెట్టాలనేదానిపై డిసెంబర్ మొదటి వారంలో ఓ స్పష్టత వస్తుంది. అయితే ఈసారి ఒక్కో పరీక్ష కేంద్రంలో ఎక్కువ మంది పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ మేరకు అదనపు గదుల ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తున్నట్టు ఎన్‌టీఏ వర్గాలు తెలిపాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రంలో 18 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసే వీలుంది. హైదరాబాద్‌లో ఎక్కువ కేంద్రాలు ఉంటాయి. ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒక కేంద్రం ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ముందుగా దరఖాస్తు చేసే వారికి పరీక్ష కేంద్రం కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని ఎన్‌టీఏ భావిస్తోంది. సాధారణంగా హైదరాబాద్‌లోని పలు పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు ప్రాధాన్యత ఇస్తారు. ఈ నేపథ్యంలో వీరిని రంగారెడ్డి, హైదరాబాద్‌లోని కేంద్రాలకు కేటాయించి, ఇంకా మిగిలితే సమీపంలోని జిల్లా కేంద్రాల్లో సర్దుబాటు చేయాలని భావిస్తున్నారు. ప్రతి సంవత్సరం మారుమూల జిల్లా కేంద్రంలోని అభ్యర్థులకు కూడా హైదరాబాద్ వంటి దూర ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలు కేటాయించే వాళ్ళు. దీనివల్ల అసౌకర్యంగా ఉంటోందని అన్ని జిల్లాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

ఇబ్బందుల పరిష్కారానికి ప్రత్యేక యంత్రాంగం

జేఈఈ పరీక్ష సమయంలో ఎదురయ్యే ఇబ్బందులపై ఈసారి దృష్టి పెట్టబోతున్నారు. పలు కేంద్రాల్లో కంప్యూటర్లు ఆగిపోవడం, లేదా ఇతర సాంకేతిక సమస్యలు ఎదురవుతున్న ఉదంతాలున్నాయి. దీనివల్ల గంటల తరబడి పరీక్ష ఆలస్యమవుతోంది. అప్పటికే ఇతర కేంద్రాల్లో పరీక్ష పూర్తవుతుంది. దీనిపై పరీక్ష కేంద్రం అధికారులు నిర్ణయం తీసుకోలేని పరిస్థితి ఉంటోంది. గత ఏడాది మూడు చోట్ల సాంకేతిక సమస్యలు తలెత్తాయి. విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. అధికారులు ఎన్‌టీఏను సంప్రదించి, నిర్ణయం తీసుకోవడానికి చాలా సమయం పట్టింది. ఈ టెన్షన్ కారణంగా విద్యార్థులు సరిగా పరీక్ష రాయలేదనే విమర్శలున్నాయి. దీన్ని దూరం చేసేందుకు ఈసారి జిల్లా స్థాయిలో యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తక్షణ దిద్దుబాటు చర్యలు చేపట్టడంతో పాటు అవసరమైతే పరీక్ష వాయిదా వేసే అధికారం జిల్లా అధికారులకే ఇవ్వాలనే యోచనలో ఉన్నారు.

బోగస్ సంస్థతో వివేక్ రూ.100 కోట్ల లావాదేవీలు!

- విశాక ఇండస్ట్రీస్, విజిలెన్స్ సంస్థ మధ్య అనుమానాస్పద లావాదేవీలు
- వాస్తవ వ్యాపార ఉద్దేశం లేకుండా నగదు బదిలీకే విజిలెన్స్ బ్యాంకు ఖాతా వాడకం
- వివేక్ ఇల్లు, కార్యాలయాల్లో సోదాలపై ఈడీ ప్రకటన

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మాజీ ఎంపీ, చెన్నూరు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేకానంద్ దంపతులతోపాటు వారి కంపెనీ విశాక ఇండస్ట్రీస్ లిమిటెడ్... విజిలెన్స్ సెక్యూరిటీ సర్వీసెస్ అనే బోగస్ సంస్థతో రూ. 100 కోట్లకుపైగా అనుమానాస్పద లావాదేవీలు చేపట్టిందని తమ సోదాల్లో గుర్తించామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) బుధవారం వెల్లడించింది. ఎటువంటి వాస్తవ వ్యాపార ఉద్దేశం లేకుండానే నగదు బదిలీకి విజిలెన్స్ సెక్యూరిటీ సర్వీసెస్ బ్యాంకు ఖాతాను వివేక్ కుటుంబం ఉపయోగించిందని పేర్కొంది. వివేక్ ఇళ్లతోపాటు ఆయా సంస్థల కార్యాలయాల్లో చేపట్టిన తనిఖీల్లో డిజిటల్ పరికరాలు, అనుమానాస్పద, లెక్కల్లో చూపని రూ. కోట్ల లావాదేవీలకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. అలాగే విజిలెన్స్ సెక్యూరిటీ సర్వీసెస్‌తోపాటు దాని మాతృ సంస్థ అయిన యశ్వంత్ రియల్టర్స్ ప్రధాన షేర్లు ఫెమా నిబంధనలకు విరుద్ధంగా విదేశీ పెట్టుబడుల రూపంలో ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించామని ఈడీ వివరించింది. పన్ను లేని ఓ దేశంలో వివేక్ ఏర్పాటు చేసిన ఓ సంస్థ సైతం ఫెమా నిబంధనలను ఉల్లంఘించిందని గుర్తించామని తెలిపింది. విశాక ఇండస్ట్రీస్ లిమిటెడ్, విజిలెన్స్ సెక్యూరిటీ సర్వీసెస్ మధ్య రూ. 8 కోట్ల లావాదేవీలపై తెలంగాణ పోలీసుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం వివేక్ ఇల్లు, కార్యాలయాల్లో సోదాలు చేపట్టిన ఈడీ... బుధవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.

సంస్థ ఆవిర్భావం నుంచి రూ. 200 కోట్ల లావాదేవీలు

విజిలెన్స్ సెక్యూరిటీ సర్వీసెస్ తన తాజా బ్యాలెన్స్ షీట్‌లో వివిధ కార్యకలాపాల ద్వారా రూ. 20 లక్షల ఆదాయం ఆర్జించినట్లు పేర్కొందని.. అలాగే ఆస్తుల కింద రూ. 64 కోట్ల దీర్ఘకాలిక రుణాలు, అడ్వాన్సులను చూపిందని ఈడీ వివరించింది. ఆ సంస్థ ఆవిర్భావం నుంచి దాని బ్యాంకు ఖాతా ద్వారా రూ. 200 కోట్లకుపైగా లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని తెలిపింది. తమ దర్యాప్తులో విజిలెన్స్ సెక్యూరిటీ సంస్థను వివేక్ పరోక్షంగా నియంత్రిస్తున్నట్లు తేలిందని స్పష్టం చేసింది. ఆ సంస్థ సూచించిన చిరునామాలో లేనందున దాన్ని బోగస్ సంస్థగా తేల్చినట్లు వెల్లడించింది.

వరల్డ్ టాప్ రెస్టారెంట్లలో హైదరాబాదీ రెస్టారెంట్

ఫలక్‌నుమా ప్యాలెస్‌లోని అదా రెస్టారెంట్‌కు చోటు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచస్థాయి రెస్టారెంట్లతో పోటీపడుతూ హైదరాబాద్‌కు చెందిన ఓ రెస్టారెంట్ వరల్డ్ టాప్ లిస్ట్‌లో చోటుదక్కించుకుంది. రెస్టారెంట్స్ పనితీరును మదింపు చేసి ర్యాంకులు అందించే ఫ్రాన్స్‌కు చెందిన లా లిస్టె అనే సంస్థ 2024కుగాను ప్రకటించిన ప్రపంచంలోని అత్యుత్తమ 1,000 రెస్టారెంట్ల జాబితాలో భారత్ నుంచి ఎంపికైన 10 రెస్టారెంట్లలో నగరంలోని ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ఉన్న అదా రెస్టారెంట్ సైతం ఉంది. ప్రపంచ జాబితాలో చోటుదక్కించుకున్న టాప్-10 భారత రెస్టారెంట్లలో అదా రెస్టారెంట్ 100కుగాను 84 స్కోర్‌తో మూడో స్థానంలో నిలిచింది. ఢిల్లీలోని ఇండియన్ యాక్సెంట్ 95 స్కోర్‌తో తొలి స్థానంలో, బెంగళూరులోని కరావళి 86 స్కోర్‌తో రెండో స్థానంలో నిలిచాయి. ఈ జాబితాలో యాట్చా (ముంబై), దమ్ పుక్త్ (ఢిల్లీ), జామవర్-లీలా ప్యాలెస్ (బెంగళూరు), లీ సర్క్యూ సిగ్నేచర్-ద లీలా ప్యాలెస్ (బెంగళూరు), మెగూ-లీలా ప్యాలెస్ (ఢిల్లీ), బుఖారా-ఐటీసీ మౌర్య (ఢిల్లీ), జియా (ముంబై) కూడా ఉన్నాయి. అదా రెస్టారెంట్ గతంలోనూ ఎలైట్ ట్రావెలర్స్ అనే సంస్థ ఎంపిక చేసిన ప్రపంచ టాప్-100 రెస్టారెంట్స్ జాబితాలో చోటుదక్కించుకుంది. హైదరాబాదీ వంటకాలకు చిరునామాగా, నిజాం కాలం నాటి రుచులను వండి వడ్డించే అదా రెస్టారెంట్ గత కొంతకాలంగా సంపన్నుల జిహ్వాచాపల్యాన్ని తీరుస్తోంది.

ప్రపంచ తొలి స్థానంలో ఏడు రెస్టారెంట్లు..

వరల్డ్ టాప్-1000లో 99.5 స్కోర్‌తో వివిధ దేశాలకు చెందిన 7 రెస్టారెంట్స్ తొలిస్థానం సాధించాయి. అవి ఏమిటంటే లీ బెర్నార్డిన్ (అమెరికా), గయ్ సెవోయ్ (ఫ్రాన్స్), ఎల్ఎన్‌క్లూమ్ (ఇంగ్లండ్), లా వేగ్ దోర్ (ఫ్రాన్స్), స్వార్జ్‌వాల్డ్‌ట్యూబ్ (జర్మనీ), సూషీ సైటో (జపాన్), లంగ్ కింగ్ హీన్ (హాంకాంగ్).

డిసెంబర్‌లోగా నదుల అనుసంధానం డీపీఆర్

కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుపై భాగస్వామ్య రాష్ట్రాలన్నీ సూత్రప్రాయంగా సమ్మతి తెలిపిన నేపథ్యంలో కేంద్రం, ఆయా రాష్ట్రాల మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకునే ప్రక్రియను వేగిరం చేస్తున్నట్లు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబాశ్రీ ముఖర్జీ తెలిపారు. డిసెంబర్ చివరిలోగా ప్రాజెక్టు డీపీఆర్‌ను ఖరారు చేసి అన్ని రాష్ట్రాల నుంచి అభిప్రాయాలు, సలహాలు సేకరిస్తామన్నారు. బుధవారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా నిర్వహించిన నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) పాలకవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ ఈ సమావేశంలో పాల్గొని ఈ ప్రాజెక్టులో భాగంగా ఆల్మట్టి జలాశయం నుంచి కర్ణాటకకు 16 టీఎంసీల కృష్ణా జలాల మళ్లింపుపై అభ్యంతరాలను తెలుపుతూ ఇప్పటికే లేఖ రాయడాన్ని గుర్తు చేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక అంశాలపై చర్చించేందుకు విజయవాడలో ఏపీ అధికారులతో సమావేశం నిర్వహించాలని ఏపీ చీఫ్ ఇంజనీర్ (అంతర్రాష్ట్ర విభాగం) కె.శ్రీనివాసరావు చేసిన విజ్ఞప్తిపై దేబాశ్రీ ముఖర్జీ సానుకూలంగా స్పందించారు. గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టు ద్వారా కర్ణాటక, పుదుచ్చేరికి కేటాయింపులను పెంచాలని అక్కడి అధికారులు కోరారు. గోదావరి-కావేరి ప్రాజెక్టులో భాగంగా కాకుండా ప్రత్యేక ప్రాజెక్టుగా బెడ్తి-వార్ధా అనుసంధానం ప్రాజెక్టును పరిగణించాలని కర్ణాటక విజ్ఞప్తి చేసింది.

'కృష్ణా' గెజిట్‌పై స్పందించండి..

- ఏపీ, తెలంగాణకు కృష్ణా ట్రిబ్యునల్-2 ఆదేశం
- తదుపరి విచారణ జనవరి 22, 23, 24 తేదీల్లో..

సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ కోసం అదనపు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్(విధివిధానాలు) జారీ చేస్తూ గత నెల 8న కేంద్ర జలశక్తి శాఖ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌పై విచారణను వాయిదా వేయాలని ఏపీ చేసిన విజ్ఞప్తిని జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్-2 తోసిపుచ్చింది. ఉమ్మడి ఏపీ రాష్ట్రానికి కృష్ణా ట్రిబ్యునల్-1 గంపగుత్తగా కేటాయించిన 811 టీఎంసీలను.. అంతర్రాష్ట్ర నదీ వివాదాల చట్టం-1956 కింద ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు పునః పంపిణీ చేసేందుకు కేంద్రం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌పై బుధవారం ఢిల్లీలో కృష్ణా ట్రిబ్యునల్-2 విచారణ జరిపింది. గెజిట్ నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు తెలియజేస్తూ తాము సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్ ఈ నెల 29న విచారణకు రానుందని, ఈ నేపథ్యంలో విచారణను నాలుగు వారాలు వాయిదా వేయాలని ట్రిబ్యునల్‌కు ఏపీ విజ్ఞప్తి చేసింది. మరోవైపు విచారణను కొనసాగించాలని తెలంగాణ వాదనలు వినిపించింది. రెండు పక్షాల వాదనలు విన్న తర్వాత .. గెజిట్ నోటిఫికేషన్‌పై తమ స్పందనలను తెలియజేస్తూ ఆరు వారాల్లోగా స్టేట్‌మెంట్లను సమర్పించాలని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 22, 23, 24 తేదీలకు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

శశికళ పదవీ విరమణపై నిర్ణయం తీసుకోండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శశికళ స్వచ్ఛంద ఉద్యోగ విరమణపై నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పోస్టును శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని స్పష్టం చేసింది. 'వైద్య విద్యా డైరెక్టర్ పోస్టులో శాశ్వత నియామకం చేపట్టకపోవడం తెలంగాణ మెడికల్ ఎడ్యుకేషన్ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16, 21ను ఉల్లంఘించడమే. 2021, డిసెంబర్ 7 నుంచి ఇన్‌చార్జి డీఎంఈగా రమేశ్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం జారీచేసిన జీవో 699ను కొట్టివేయాలి. ప్రమోషన్ల ద్వారా డీఎంఈ పోస్టులో శాశ్వత నియామకం చేపట్టాల్సి ఉండగా, తెలంగాణ ప్రభుత్వం ఆ మేరకు చర్యలు తీసుకోవడం లేదు. వెంటనే డీఎంఈ లేదా ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నన్ను నియమించేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలి' అంటూ వనపర్తి ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగేంద్ర కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. శశికళ పదవీ విరమణపై నిర్ణయం తీసుకోవడంతోపాటు డీఎంఈ పోస్టును సృష్టించి శాశ్వత నియామకం చేపట్టాలని ఆదేశించి విచారణను వాయిదా వేసింది.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కుమారుడు పునీత్‌కు ఊరట

ఎలాంటి కఠినచర్యలు వద్దంటూ హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో నమోదైన కేసులో బీఎస్పీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కుమారుడు పునీత్‌పై అరెస్టు సహా ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఎస్ పునీత్, షబ్బీర్, షేక్ చాంద్, తిరుపతి, ముస్తాఫీజ్, అర్షద్, బబ్లూ, ఉస్మాన్ మరికొందరు తన వాహనాన్ని ఆపారని, తనను చంపేందుకు ప్రయత్నించారని, రూ.25 వేలు తీసుకున్నారని పేర్కొంటూ కాగజ్‌నగర్‌కు చెందిన డ్రైవర్ అలీమ్ ఖాన్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఈనెల 13న ఫిర్యాదు చేశారు. 'ఎలాంటి ముందస్తు విచారణ చేపట్టకుండానే నాపై కేసు నమోదు చేశారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా నా తండ్రి కాగజ్‌నగర్ నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. నామినేషన్ రోజు బీఎస్పీ వారిపై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేశారు. దీనిపై బీఎస్పీ కార్యకర్త హలీమ్ ఖాన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. ఆ తర్వాత మాపై కేసు నమోదైంది. పోలీసు విచారణను వెంటనే నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలి' అని కోరుతూ ఆర్ఎస్ పునీత్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పి.మాధవీదేవి బుధవారం విచారణ చేపట్టారు. ఈ కేసులో ఏ-1గా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఉన్న విషయం తెలిసిందే. ఆయన్ను కూడా అరెస్టు చేయవద్దని గత వారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.